# ఆచార్య యన్.జి. రంగా

(Life and Works of Prof. N.G. Ranga)




విజయవాడ చల్లపల్లి బంగళా కూడలిలో ఆచార్య రంగా గారి కాంస్య విగ్రహం
12-07-1957 న S K పాటిల్ గారు ఆవిష్కరించారు

రైతు బంధు

# ఆచార్య రంగా

(Life and works of prof. N.G.Ranga)




( 1900 – 1995)

గొర్రెపాటి వెంకటసుబ్బయ్య

పునర్ముద్రణ, ప్రచురణ

డా. జెక్కంపూడి సీతారామారావు

2017

Acharya Ranga

**The Life and Works of Prof. N.G. Ranga**

## ఆచార్య రంగా

ఆచార్య గోగినేని రంగనాయకులు జీవితం – కృషి

రచన: కీ.శే. గొర్రెపాటి వెంకటసుబ్బయ్య

ప్రథమ ముద్రణ . 1948

అనుబంధం: డా. నాగభైరవ ఆదినారాయణ

ద్వితీయ ముద్రణ . నవంబర్ 2017

ప్రచురణ. డా. జెక్కంపూడి సీతారామారావు

ప్రజ్ఞా రీజన్సీ, 4/1. అశోక్ నగర్,

గుంటూరు – 522 007

చరవాణి. 98494 97739

యూనికోడ్ డి.టి.పి. : గుంటుపల్లి శిరీష,

అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయం, బృందావన్ గార్డెన్స్, గుంటూరు – 6

వెల. రు. **150**/– ప్రతులు. 1000.

Electronic Book: Free Download

Kinige.com telugumaata.com

ఈ గ్రంథవిషయాలను

మూల విధేయంగా ఎవరైనా ఉపయోగించుకొనవచ్చును.

ముద్రణ. శ్రీలక్ష్మి ప్రింటర్స్, గుంటూరు. ఫోన్. 0863 – 2230643

# మనవి

రాజకీయంగా, సామాజికంగా మచ్చలేని జీవితం గడిపిన మహోన్నతుడు ఆచార్యరంగా గారు. వారు రైతు లోకానికి మేలు కలిగే విధంగా రైతు ఉద్యమాలను నడిపారు. పార్లమెంటులో రైతులను గూర్చి, రైతాంగకష్టాలను గూర్చి ప్రసంగించే వారు. రైతులకు నష్టం కలిగించే రష్యా ముద్రగల సహకార వ్యవసాయాన్ని, దానిని ప్రవేశపెట్టిన నాటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ విధానాలను వ్యతిరేకించారు. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై రైతులకోసం, దేశం కోసం దూరదృష్టిగల ప్రసంగాలు చేశారు. అటువంటి ఆచార్య రంగాగారి జీవితం ఆదర్శనీయం.

అంతటి గొప్పనాయకుడు రంగాగారి జీవితచరిత్రను కృష్ణా జిల్లా, ఘంటసాలకు చెందిన బహుగ్రంథకర్త, గొర్రెపాటి వెంకట సుబ్బయ్య గారు గ్రంథస్థం చేసి, శ్రీమతి భారతీదేవి రంగా గారికి అంకితం ఇచ్చారు. బహుళ ప్రజాదరణ పొందిన ఆనాటి గ్రంథ ప్రతులు ప్రస్తుతం లభ్యం కావడం లేదు. ఆ గ్రంథాన్ని ఈ తరానికి అందజేయాలని నా చిరకాల ఆకాంక్ష. ఈ గ్రంథాన్ని స్వల్పమైన మార్పులతో తెలుగు పాఠకలోకానికి నివేదిస్తున్నాను.

దేశీ ప్రచురణలకర్త, శ్రీ బొందలపాటి శివరామకృష్ణయ్య గారి మనుమరాలు శ్రీమతి సుజాత గారు ఈ పుస్తక పునర్ముద్రణకు అనుమతి ఇచ్చారు. వారికి నా ధన్యవాదములు.

గొర్రెపాటి వారు 1948 వరకు జరిగిన చరిత్రను మాత్రమే వ్రాశారు. డా.నాగభైరవ ఆదినారాయణగారు తదనంతర రంగా గారి జీవితాన్ని రచించారు. దానిని అనుబంధంగా చేర్చాను.

ఈ గ్రంథముద్రణను వివిధ దశలలో పర్యవేక్షించిన సాహితీ ప్రియులు డా.వెన్నిసెట్టి సింగారావు గారు.

వీరికి నా హృదయపూర్వక ధన్యవాదములు.

**డా. జేక్కంపూడి సీతారామారావు**

# వి న్నపం

మహాపురుషుల చరిత్రలు మనకు మార్గదర్శకాలు. అందుచేత అవశ్య పఠనీయములు. కనుక అట్టివారి చరిత్రల ఆవశ్యకత అధికంగా కలదు.

మనలో అనేకులు మహాపురుషులు లోగడ జన్మించిరి, ఇంతేకాదు నేటికిని కలరు. కాని వారి చరిత్రలు చెప్పుకోతగిన రీతిగా వ్రాసినవారు లేరు.

కీ.శే. కొమఱ్ఱాజు లక్ష్మణరావు, కోపల్లె హనుమంతరావు, త్రిపురనేని రామ స్వామి చౌదరి, ముట్నూరి కృష్ణారావు వంటి మహామహులచరిత్ర అసలే వ్రాసుకో లేక పోయాము. మన పూర్వులు చరిత్ర వ్రాయలేదని నిందిస్తూ కూడ.

కారణం లేకపోలేదు. మహాపురుషుల నభిమానించి, అందుకై ప్రత్యేక కృషి చేయు కుతూహలం కలవారు లేకపోవుటే. “మహాపురుషులు అరుదు, వారిని గుర్తించు వారంతకంటె అరుదు.”

“Johnsons are rare, Boswells are even rarer.” అని కార్లైయిలు అన్న వాక్యము సత్యము.

నాయకులను గురించి చరిత్రలు కొన్ని కలవు కాని అవి సమగ్రంగా లేవు “ఉత్తమ జీవిత చరిత్ర రచన, ఉత్తమజీవితము వలె అరుదు” అన్నాడు కార్లైయిలు (A well-written life is almost rare. a well spent one is rarar. )

ఇంతకు తానెవరి చరిత్ర వ్రాయ తలచాడో, ఆయనకు రచయితకు అధిక సంబంధం వుండి, గ్రంథ రచనకు, అర్హత, అభిరుచి వుండాలి. అప్పుడా గ్రంథం అధికంగా రాణించగలదు.

విఖ్యాత ఆంగ్లకవి జాన్సను చరిత్ర ఆయన శిష్యుడగు, బాస్వల్‌చే రచింప బడి నేటివరకు ప్రఖ్యాతి గాంచుటకు కారణం నేను చెప్పినదే.

ఆచార్య రంగా చరిత్ర నేను వ్రాయతలచాను. కాని నేను ఆయన శిష్యుడను కాను, సహచరుడనూ కాను, అనుచరుడను అంతకంటే కాను.

అయితే అనేక నాయకులుండగా ఆయనను పఠించుటకు కారణం ఏమని పాఠకులు ప్రశ్నించవచ్చును. నేను కర్షకుడనగుటే. తానుగాని ఒరుని తానెట్లు గుర్తింపగలడు నరుడు? ఆయన కర్షకలోకానికి చేసిన, చేయుచున్న మహత్తర సేవ, నాచేత కలం పట్టించింది, అదే నన్ను ఆయన భక్తునిగా చేసింది.

రామకృష్ణ పరమహంసను వివేకానందస్వామి ఎట్లా అర్థం చేసుకొని ప్రపంచానికి తన గురువగు పరమహంస గొప్పతనాన్ని వెల్లడి చేశాడో, మహాత్ముని

మహదేవ్ దేశాయి ఎట్లా గుర్తించి గుణగానం చేశాడో, అట్లాగే ఆచార్య రంగాను నేను గుర్తించి లోకానికి వెల్లడించ తలచాను.

జీవితచరిత్ర రాయుట కష్టము. సజీవులైనవారి చరిత్ర మరీ కష్టము. అందులో రాజకీయ నాయకుల చరిత్ర సంగతి చెప్పనక్కర లేదు. విశేషించి నా పద్ధతి మరింత కష్టదశను, క్లిష్టదశను తెచ్చునది, కష్టమైనా, పదుగురకు ప్రయోజనమని తలచాను.

ఆచార్య రంగాతో నాకు అధిక సంబంధం లేకపోయినా, ఆయనతో పరిచయం లేకపోలేదు. ఇంతేకాక ఈ గ్రంథ రచనా కాలంలో ఆయనను ఆనేక సార్లు, అప్రయత్నంగా కలుసుకొనుటకూడ తటస్థించింది.

ఎవరేది రాసినా అది ఆయన స్వీయచరిత్రే అగుతుందన్నాడు ఒక ఆంగ్లకవి. ఆ కారణాన ఆచార్య రంగా రాసిన అన్ని గ్రంథాలు, వ్యాసాలు చాలా జాగ్రత్తగా చదివాను. ఆయనను గురించి ఇతరులు వ్రాసినవి కూడ చదివాను. ఇంతేగాక ఆయనను గురించి అధికంగా విన్నా, భోగట్టా చేశా, తెలుసుకున్నాను. కనుక ఆయనతో సన్నిహిత సంబంధం లేదన్న సంగతి నాకు వర్తించదు.

నా అధ్యయనము, ఆలోచన, ఆలకింపు, తర్జనభర్జన, మథన ఈ గ్రంథ రూపేణ వచ్చింది. ఇది నా ప్రతిభకన్న పరిశ్రమను, దక్షత కంటె దీక్షను, అధికంగా ద్యోతకం చేయగలదని అనుకొంటున్నాను.

నేను ప్రథమంలో అనుకొన్నట్లే, ఆంధ్రదేశం ఆచార్య రంగాను అధికంగా రైతు నాయకుని గానే ఎరుగును. ఆయన బహుతోముఖమైన ప్రతిభ, సేవ ఎరుగదు. దానిని తెలుపుటకే నేను ఆదిలో దీక్ష పూనితిని. అటు తర్వాత అంతకంటే అధికమైన ఆంకాంక్ష నాలో కలిగింది. ఆ వేదన, తన ఈ జీవిత చరిత్ర ద్వారా పాఠకులను ప్రబోధం చెయ్యాలని. ఇదే ఇతర జీవితచరిత్రలకును దీనికిని గల భేదము. ఇంతేకాదు, గ్రీసు దేశపు వేదాంతి సోక్రటీసు శిష్యుడగు ప్లేటో తన గురువు చరిత్ర రాసి, దానిలో తాను అంతర్లీనుడైనట్లే, నేనుకూడ ఇందులో ఇమిడివున్నానని విన్నవిస్తున్నాను.

నా నూతనపద్ధతిని పాఠక ప్రపంచమెంతవరకు పరిగ్రహించునో!అయినా, చేమకూర వెంకన్న వలె "ఏ గతి రచించిరేని సమకాలము వారు మెచ్చరు" అని నేను నిందించను. దీనిని రాసింది నేటికాలపు వారికే. వారికి ఉపయోగపడకపోతే నా సంవత్సరకృషి వృథాఅయిందని తలుస్తాను. పాఠక లోకం ఆమోదంపొందితే

అధికంగా ఆనందిస్తాను, నా పంటా పండిందని పొంగి పోతాను.

కాని నా పరిశ్రమయందు పాఠకులకు సానుభూతి వుంటే గాని నేను కృతార్థుడను కాలేను.

ఆచార్యరంగా చరిత్ర ఏవిధంగా రాసినా, ఆంధ్రదేశంలో ఆదరం పొంద గలదని ఆశ అధికంగా కలదు. నా రచనను బట్టి కాకపోయినా వస్తు గౌరవాన్ని బట్టయినా వన్నెకెక్కగలదని విశ్వసిస్తున్నాను.

ఈ పుస్తకం మూడు సంవత్సరాలక్రితం ఆరంభిపబడి, దాదాపు రెండేళ్ల నుండి, అనివార్యములగు కారణాంతరాల చేత ఆలస్యంగా అచ్చుపడి నేటికి లోకంలో పడింది.

ఈ లోగా దేశంలో అనేక మార్పులు వచ్చినవి. అంతమాత్రంచేత యీ గ్రంథం అవసరం కొరత పడదని విన్నవిస్తూ యీ కాల విలంబన గమనించ వలసిందని కోరుతున్నాను.

నా ప్రియమిత్రుడు, కాంగ్రెసు కార్యకలాపాల్లో కాకతీరినవాడు, ఆంధ్ర కాంగ్రెసు వారిలో అన్ని విధాల మధ్యమార్గమును అనుసరించుచున్న ప్రముఖుడగు శ్రీయుత గొట్టిపాటి బ్రహ్మయ్యగారు యీ గ్రంథానికి పరిచయం రాయుట తన భాగ్యంగా గ్రహించుట ఆయన వినయాన్ని సూచించును. ఆయన వ్రాసిన పరిచయం ఆయనకు నాయందు గల ప్రేమను ఆచార్య రంగా యందు గల ఆదర అభిమానములను అధికంగా ద్యోతక పరుచును.

పండిత శ్రీయుత కావూరి వెంకట్రామయ్య చౌదరిగారు యీ గ్రంథం సాంతంగా విని అమూల్యములగు సలహాలిచ్చుటే గాక, తమ అభిప్రాయాన్ని కూడా ఇచ్చారు. ఇందుకు వీరిద్దరకు కృతజ్ఞతాపూర్వక వందనములర్పిస్తున్నాను.

ఘంటశాల, **గొర్రెపాటి వెంకటసుబ్బయ్య**

3-6-1948.

# పరిచయం



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు
**కీ॥శే॥ గొట్టిపాటి బ్రహ్మయ్య గారు**
ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ కౌన్సిల్ చైర్మన్

నా సహచరుడు, ప్రియమిత్రుడు శ్రీ గొర్రెపాటి వెంకటసుబ్బయ్యగారు గ్రంథకర్తగా, చరిత్రకారుడుగా ప్రసిద్ధిగన్నాడు. ఆయనకు ప్రత్యేకత కలదు. ఆయన వ్రాయు వ్యక్తి చరిత్ర ఆ వ్యక్తికి సంబంధించినంతవరకే కాదు, ఆయన సమ కాలికులను గూర్చి, ఆనాటి ఆంధ్రదేశమును గూర్చిన చరిత్ర. శైలి సులభమైనది, వ్రాయు పద్ధతి చదువరులను ఆకర్షించునట్టిది. పూర్వకవుల, చరిత్రకారుల, పత్రికాధిపతుల అభిప్రాయములను తన వాదనను పోషించుటకు క్రోడీకరించును. పుస్తకపఠనముతో తృప్తిచెందక చదివిన దాని వలన ఎంతో కొంత నేర్చి అనుష్ఠించు నట్లు చదువరుల ప్రోత్సహించును.

ఈయన రైతు, వ్రాయునది రైతు రంగా చరిత్ర, పరిచయం చేయునది కూడా రైతు అగుట న్యాయం కదా? అట్టి అవకాశం నాకు కలుగజేసిన గ్రంథకర్త గారికి కృతజ్ఞతా పూర్వకవందనములు.

ప్రథమంగా శ్రీ రంగా గారిని నేను 1926 సం. బెజవాడలో కమ్మ మహాజన సభ విషయనిర్ధారణ సభలో చూచితిని. ఆనాడు ఆయన సూటు, బూటు, హ్యాటులలో ఉండెను. తిరిగి 1930 ఉప్పు సత్యాగ్రహపు ఉద్యమపు రోజులలో

బరంపూర్ జైలు నుండి నెల్లూరు జైలుకు పయనించుచూ, బెజవాడ రైల్వే ప్లాట్‌ఫారమ్ మీద కలుసుకొంటిని. అప్పుడాయన ఢిల్లీ శాసనసభా సభ్యుడు, జాతీయవాది, కాంగ్రెసు రాజకీయాలలో జోక్యము లేదు. శాసనసభల ద్వారా ప్రజాసేవ చేయు తత్పరత కలిగి యుండెను. 1930 గుంటూరు రాజకీయ సభల సందర్భమునను, రైతు మహాజన సందర్భమునను స్నేహమేర్పడెను.

1931 లో కృష్ణా జిల్లాలో రైతు సంఘము లేర్పరచుచూ, గ్రామముల వెంట బండ్లపై పయనించితిమి. రీ సెటిల్‌మెంట్ ఆందోళన ఆంధ్రదేశమున ఆయన నాయకత్వముననే నడచెను. రైతు నాయకునిగా, రైతు ఉద్యమమున ఆయనకు ప్రథమ  జైలు ప్రాప్తి అప్పుడే.

ఆయనది రైతు లోకము. రైతే తన సర్వస్వము. రైతు ఉద్ధరణయే ఆయన గమ్యస్థానం. ఆ రంగాయే నన్ను ఆకర్షించెను. 1937 దాకా ఆయన సహచరునిగా రైతు సంఘములందు పనిచేసితిని. ఆయనది అనుకరణ కాదు, స్వంత వరవడి. ఒక్కోసారి ఉత్సాహ, ఉద్రేకములతో కార్యరంగమునందు దుమికిన వాడు కాదు. అమాంతముగా నాయకత్వమునకు ఎగిరిన వాడునూ కాదు. క్రమంగా, ప్రజాసేవ చేయుచూ, తాను స్వయంగా సృష్టించుకున్న వాతావరణంలో తన అనుచర బృందంలో తన ప్రణాళికలను క్రమబద్ధంగా అమలు పరచుచూ పిల్లల కోడిలా వర్తించి, పల్లె ప్రజల ప్రేమకు పాత్రుడాయెను.

రాజకీయ రంగమున ఢక్కాముక్కలు తింటూ విమర్శించుతూ, విమర్శింపబడుతూ,  సింహావలోకన చేసుకుంటూ, తప్పులు దిద్దుకొనుచూ, స్వయంకృషి వల్ల నేడు ఆంధ్ర నాయకుడాయెను.

అహర్నిశలు తిరుగుచూ, చదువుచూ, వ్రాయుచూ, ప్రజల కష్టసుఖములు తనవిగా భావించుచూ , ప్రజాసేవ చేయు ఆంధ్రనాయకుడాయన  ఒకడే. ఆయనకు విశిష్ఠతకలదు. ప్రతి ఊరునందు ఆయనను ప్రేమించి, అనుసరించు వ్యక్తులుగలరు. ఆంధ్రులలో ఏ నాయకునికి లేని అనుచరబృందం ఆయనకు కలదు. ఆయనది సుగ్రీవసేన. ఆయన మాట వారికి సుగ్రీవాజ్ఞ.

"ముందు వచ్చిన చెవుల కంటే వెనుక వచ్చిన కొమ్ములు వాడి" అను సామెత ఆయన యెడ సార్ధకత చెందినది. 1920 నుండి, అంతకంటే ముందు నుండి కాంగ్రెసు రాజకీయాలలో తిరుగుచున్న వారు కలరు. అప్పటినుండి నేటి వరకు కాంగ్రెసు ఆజ్ఞలను రామాజ్ఞగా పాలించిన వారునూ కలరు. రంగా గారు మొదటి నుండియూ లెఫ్టిస్ట్. కాంగ్రెసు ప్రధాన నాయకులకు విధేయుడైన అనుచరుడు కాదు. పైపైచ్చు వ్యతిరేక పక్షమున నుండి యెంతో కొంత పెద్దల ఆగ్రహమునకు గురి ఆయెను.

వేసంగి పాఠశాలలను పెట్టి కాంగ్రెసులో తిరుగుబాటుదార్లను సృష్టించు చున్నాడు అను కీర్తిని గడించుకొనెను. కమ్యూనిష్టు జెండాను చేత బట్టెను. నేటి కమ్యూనిష్టులలో కొంతమంది, సోషలిష్టులలో కొంతమంది ఆయన శిష్యవర్గమే. అట్టి రంగా నేడు ఆంధ్రలోకమున విఖ్యాతి గాంచిన హెచ్చు అనుచర బృందం గల నాయకుడు.

ఆయనకు నేటి సోషలిష్టు పంథా నచ్చదు. కమ్యూనిష్టులకు, ఎర్రజెండాకు ఆయన బద్ధవిరోధి. ఆయన శుద్ధ గాంధీ భక్తుడు. గాంధీ సూక్తులకు నవ్యభాష్య కారుడు. గాంధీ మతము శాస్త్రబద్ధంగా సర్వమతములకంటే ఉత్కృష్టమైనదని రుజువుచేసెను. ఇదంతయూ స్వానుభవమున కలిగిన విజ్ఞానము. కవ్వముతో తరచి నిగ్గు తీసిన వెన్న ముద్ద.

ఆయన మహాశక్తిమంతుడు. పాదరసం వంటి బుద్ధి సూక్ష్మం కలవాడు. అనేక సంస్థలు ఆయన సృష్టి. సృష్టించుటయే కాదు, పాలించుటలో కూడా ఆయనది అందెవేసిన చేయి. నాటి రంగాను, నేటి రంగాను గ్రంథకర్త విశదీ కరించెను. స్వయంకృషి వలన, సేవాధర్మ నిరతి వలన, త్యాగబుద్ధి వలన పరిణత చెందిన రంగా ఆంధ్రనాయకుడుగా రాణించుట మనం చూచుచున్నాము. ఆత్మ విశ్వాసముతో రంగాను అనుకరించి, స్వయంకృషి వల్ల రాణించుట నేర్చుకొన వలసినదిగా గ్రంథకర్త ప్రబోధము.

ఘంటశాల, **గొట్టిపాటి బ్రహ్మయ్య**

2–6–48

## అభిప్రాయము

"ఆచార్య రంగా" చరిత్ర యంతయూ ఆమూలాగ్రముగ పఠించితిని.

శ్రీవెంకటసుబ్బయ్య గారు క్రొంగొత్త పోకడలతో వినూత్న ప్రకరణాలతో, మహానాయకుల తారతమ్యాలతో చరిత్ర నడిపించెను. ప్రతి ప్రకరణము పాఠకులకు సమగ్రవిషయము బోధించి, నూతన విజ్ఞానవంతులుగా చేయును. ఇది చారిత్రక విషయమునే కాక పలువిధంబులగు సంస్థల, మహానాయకుల జీవిత విశేషములు తెలుపుచున్నది. ఈయన గద్యరచన యనన్య సామాన్యమై అతిసరళమై, అలంకార భూయిష్ఠమై శబ్దగాంభీర్యయుతమై యొప్పారుచూ, విసుగు జనింపక నూతన విజ్ఞానానుభవం కలిగించుచూ కల్పవృక్షము వలె సర్వవిషయ ఫలప్రదాయినియై యలరారినది.

విజ్ఞాన కాంక్షియగు ప్రతి యువకుడును, ప్రతి యువతియు రామాయణాది గ్రంథము వలె అనవరతము చదువదగు విజ్ఞాన సర్వస్వము. చిరకాల పఠనార్హమైన యీ గ్రంథరాజము శ్రీ వేంకటసుబ్బయ్య గారి ముప్పదేండ్ల సాహిత్య విజ్ఞాన విమర్శనా పటిమకు సాక్ష్యము. ఈ గ్రంథరాజమాంధ్ర పాఠకుల ఆదరాభి మానములు చూరగొను ననుటలో ఆవంతయైనను సంశయముండదు.

*ఉభయ భాషాప్రవీణ, సీనియర్ తెన్గు పండిట్*

**కావూరి వెంకటరామయ్య చౌదరి,** అవనిగడ్డ

## మంచి ప్రయత్నం

ఆచార్య రంగా రైతు కుటుంబంలో పుట్టి, రైతునాయకుడై, రైతాంగం బాగోగులకై కృషిచేసి జీవితపర్యంతం రైతుల శ్రేయస్సుకొరకే పాటుపడ్డారు. మహాత్మాగాంధీ ఆశీస్సులను కూడా పొందారు.

స్ఫూర్తిదాయకమైన వారి జీవితచరిత్రను గొర్రెపాటి వెంకటసుబ్బయ్య గారు 1948లో వివరంగా రచించారు. దాదాపు 65 సం||ల తరువాత డా|| నాగభైరవ ఆదినారాయణ గారు రంగా గారి శేష జీవితాన్ని రచించారు. పై రెండు గ్రంథాల ఆధారంగా డా.జెక్కంపూడి సీతారామారావు గారు ఈ గ్రంథాన్ని సరళీకరించి ప్రచురించారు. ఒక ఆదర్శనాయకుని జీవితాన్ని చిరస్థాయిగా ఉంచటానికి డాక్టరు గారి ప్రయత్నం ప్రశంసనీయం. వారికి అభినందనలు. **– డా|| వెనిశెట్టి సింగారావు, Ph.D.**

# విషయక్రమము


వంశ వృత్తాంతం

బాల్యము.

సంస్కృత విద్యాప్రచారం



వెంకయ్య గొప్ప ఉపాధ్యాయుడు

త్యాగరాయ శెట్టిగారి తోడ్పాటు

రైతుపత్రికస్థాపన,ఇంగ్లాండుప్రయాణం

విద్యాభ్యాసం

ఆక్సుఫర్డులో అధ్యయనం

కర్షకమూర్తి

మహాత్మునితో సంబంధం

కుటుంబ జీవితం

జైలు జీవితం



పచ్చయప్ప కళాశాలలో ప్రధానాచార్యత్వం

వక్త

నిర్మాణ నిపుణుడు

ప్రచారకుడు

అసమాన ఆందోళనకారుడు

ఎడ్జరన్‌మెంటుల్లో అద్వితీయుడు

మన నీటి సరఫరా–రైళ్లు

నూతన నిర్మాణాలు

రైతుకూలీ ప్రజారాజ్యం

వీరపూజా ప్రచారం



రైతాంగ విద్యాలయం

వయోజనవిద్య

సాహిత్య సేవ

మాలపల్లి విమర్శ

వ్యాసాలు



రైతు భజనావళి
ఆంధ్రరాష్ట్ర రైతు సంఘం
జమీందారిరైతు ఉద్యమం
రీసెటిల్మెంట్ ఆందోళన
రైతురక్షణ సంఘం
రైతు కూలీ సామరస్యం
ద.భా.కర్షకకార్మిక సమ్మేళనం (వ్యవసాయకూలీ)
కాంగ్రెసులో రైతు సేవ
అఖిల భారత కిసాన్ సభ
అధ్యక్షోపన్యాసం
రైతులు–జమీందారులు.
మహాత్మాగాంధి స్వయంసహాయం
అడవుల సంరక్షణ– ఆచార్యుని అఖండ కృషి
చేనేత వారికి చేయూత
చేతిపనులకు ప్రోత్సాహం
క్షామ బాధితులకు సహాయం
ఆదిమవాసులకు అండ
మహిళోద్యమం
విద్యార్థి  ఉద్యమం
హరిజన సేవ
ఆచార్యరంగా హరిజనులకై చేసిన సేవ
గ్రామ పునర్నిర్మాణం
గ్రామీణ ప్రజల వ్యవస్థల సమాఖ్య
కేంద్ర శాసనసభలో రైతులకు సేవ
కిసాన్ కాంగ్రెస్
ప్రపంచ ఉత్పత్తిదారుల సభ
లండనులో జరిగిన సభ ఆశయాలు
ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు ఆధ్వర్యం



# వంశ వృత్తాంతము

ఆచార్య రంగా నేటి హిందూమతమును అనుసరించి కమ్మ వంశస్తులు. కమ్మవారు అనగా వ్యవసాయదారులు. కమ్మ, కాపు, వెలమ, రెడ్లు, కాకతీయ యుగాంతరం వరకు చతుర్ధాన్వయులుగా వ్యవహరింపబడిరి. ఆచారవ్యవహారాలు ఆలోచించినా శరీరసౌష్టవము పరిశీలించినా, వృత్తి విషయము కనుగొన్నా ఈ నాలుగు జాతులు మొట్టమొదట ఒకటేనని స్పష్టపడును. వీరి ఇంటిపేరు గోగినేని. కమ్మవారిలో యింటిపేరులు సాధారణముగా మూడు విధాల ఉండునని అనుకొనుటకు ఆధారములు కలవు.

1. విక్రమసూచకములు– కత్తి, కడియాల, నాగభైరవ, కిలారి మొదలగునవి
2. గ్రామనామములు– నిమ్మగడ్డ, వడ్లపూడి, నూతక్కి ...
3. పౌరుష నామములు – కంఠంనేని, సూరపనేని ...

దీనిని బట్టి గోగినేని నామమును పౌరుషనామముగా పరిగణించవచ్చు. 'నేని' శబ్దాంతములన్ని పౌరుష నామములే. వీరి వంశము వారి ప్రథమ నివాసస్థలం గోగినేనిపాలెము. ఇది ఆంధ్రుల ప్రథమరాజధానియగు శ్రీకాకుళమునకు శివారు (కృష్ణాజిల్లా దివి తాలూకా.) ఆచార్యరంగా ముత్తాత నాగయ్య మంచి విద్యావంతుడు. ఆయన తహశీలుదారుగా పనిచేసెను. ఆ సందర్భములోనే గుంటూరు జిల్లా బాపట్ల తాలూకాలోని నిడుబ్రోలుకు ఒకసారి వచ్చెను. అచ్చటి పరిస్థితులన్నియు గమనించి వాస యోగ్యమని తలచి బంధువర్గముతోను అనుచర బృందముతోను నిడుబ్రోలులో స్థిరనివాస మేర్పరచు కొనెను.

ఆ నాగయ్యకు నలుగురు పుత్రులు కలిగిరి. కాని వారిలో మిగిలినది యిద్దరే. వారు యిద్దరు విభక్తులైరి. ఆయన పెద్దకుమారుడు వెంకటరమణయ్య ఆదర్శరైతు. (ఆచార్యరంగా తాత) ఆయన బంజరు భూములు అనేకము సాగులోనికి తెచ్చుటే కాక కొత్తకొత్తపైరులను వాడకము లోనికి తెచ్చెను. ఆ కాలములో ఎవరూ సాధించని తోటలను వేసి, బావులను త్రవ్వించి పురుషప్రయత్నముచే ఆదాయమును ఆర్జించు నూతనపద్ధతి నవలంభించెను. అప్పటికి ఆయనకు 150 ఎకరములు ఉండెను. ఆయనకు చదువు సంధ్యలు లేక పోయినా వడ్డీసడ్డీ వ్యాపారములు చేస్తూ వుండేవాడు. ఆ డబ్బు కక్కుర్తి కాలములో అందరు అధిక వడ్డీలకు యిస్తూవుంటే

ఆయన స్వల్పవడ్డీలకే యిస్తూ అందరి మన్ననలు పొందుతూ వుండే వాడు. పాలేళ్లకు, కూలీలకు యిచ్చే జీతభత్యాలలో కూడా అందరికంటె అధికముగా యిస్తూ వారియెడ దయాదాక్షిణ్యములు కలిగి 'మంచి మారాజు' అనిపించుకున్న మహానుభావుడు. ఇందుచే వెంకటరమణయ్య అంటే ఆ చుట్టుప్రక్కల వారందరకు ఎక్కువ గౌరవము, అభిమానము వుండేవి.

వెంకటరమణయ్యకు నాగయ్య జన్మించెను. ఆయనకు చదువు సంధ్యలు లేవు. గొడ్డు గోదా అంటే బహుయిష్టము. పశువులను బాగా మేపే వాడు. నాణ్యమైన నందివంటి ఎడ్లు ఆయన చేతిలో వుండేవి. వ్యవసాయపు పనిపాటలలో ఆయన బాగా పేరు పొందాడు. కళ్లకు గంతలు కట్టుకొని వంకర టింకర లేకుండా తిన్నగా తీర్చినట్లు దున్నగలిగేవాడు. వీరి స్త్రీలు కూడా పొలంలో పనిపాటలు చేసేవారు. అది వారి మర్యాదకు లోపమని ఎన్నడు తలచలేదు. వారు మంచి ఆస్తిపరులు. వీరు వెళ్లి పాటు పడితేకాని జరగదనే అవసరంలేదు. అయినా ఆచార్యరంగా తల్లి, పెత్తల్లి మొదలగువారు అంతా కూడా వ్యవసాయపు పనిపాటలలో బాగా రాటు తేలినవారే. వీరి తాతలనాటి నుంచి వీరికి ఒక గొర్రెలమంద కూడా వుండేది. వాటివలన లాభమేకాక, వాటి ఎరువుల వలన ఎక్కువ పంటలు పండేవి.

ఆచార్యరంగా వంశీయులు వ్యవసాయపు పనిపాటలలో ప్రఖ్యాతి చెందిన వారేకాక, ప్రజోపయోగకరంగా నూతులు, చెరువులు, త్రవ్వించుటే కాక సత్రములు మున్నగునవి కట్టించుటచే కూడా ప్రఖ్యాతిగాంచారు.

## బాల్యము.

ఆచార్య రంగా 1900 సం.నవంబరు 7వ తారీఖున నిడుబ్రోలులో జన్మించెను. నిడుబ్రోలు. ( పొడవైన పట్టణం) పెద్ద పట్టణం. నిడుబ్రోలు, చేబ్రోలు, సనదుప్రోలు (చందోలు) ప్రాచీన గ్రామములు. ఆయనకు రంగనాయకులు అని నామకరణం చేసిరి. ఆయన బాల్యావస్థలో విశేషములు అట్టే తెలియవుకాని ఏడాది వయస్సులో నున్నప్పుడు అన్నప్రాశన జరిగినదట. ఆ కాలమున నగలు, నాణెములు ఒకవైపున, తాటిఆకుల పుస్తకాలు మరో వైపునా యుంచి, ఆయనను వదలి పెట్టిరట. ఆయన ఏమి పట్టుకొనునో అని ఆయన తాత రమణయ్య ఆయన

బంధువర్గమంతా చుట్టూ కూర్చొనియుండగా తళతళలాడే బంగారు నగలను కాని తెల్లగా మెరిసే రూపాయలను కాని బాల్య చాపల్యముచే పట్టుకొనక సరాసరి తాటాకుల పుస్తకాలే పట్టుకొనుట చూసి వారంతా ఆశ్చర్యపడి ఆ పసిపాప ఆ పుస్తకాలు పట్టుకొనుట వలన అతను భావి జీవితములో అధిక విద్యావంతుడగునని వారంతా అభిప్రాయ పడ్డారట. అందరికంటె అధికముగా రంగాతల్లి తనకొడుకు ఎంతో విద్యావంతుడు అగునని సంతోషించెను.

ఆచార్య రంగా తల్లియగు అచ్చమాంబకు తనకుమారుని ఎంతో విద్యావంతుని చెయ్యాలనే కుతూహలము వుండేది. దానికి కారణము లేకపోలేదు. ఆమె తమ్ముడు మినహా ఆమె, అక్కచెల్లెండ్రు, తల్లిదండ్రులు అంతా నిరక్షరాస్యులే. ఇటూ ఆమె అత్తవారి తరపున నాగయ్య మినహా అందరూ విద్యావిహీనులే అందుచేత మళ్లా ఆచార్య రంగాను ముత్తాత వంటి విద్యావంతుని చెయ్యాలని ఆమెకు అభిలాష అధికంగా వుండేది. వారు నిరక్షరాస్యులు అన్నమాటే కాని ఆచార వ్యవహారాలలో, మాట మన్ననలలో, ఆత్మాభిమానగౌరవాలలో తక్కువవారు కాదు. నాగరిక లక్షణాలన్నీ వారికి వున్నవి. వారేకాక పల్లెలలో వుండేవారంతా కూడా నాటికి నేటికి నిరక్షరాస్యులే. అయినా వారికి మన భారత భాగవత, రామాయణ, వీరగాథలు అన్నీ విదితములే. వారికి వ్రాయుట చదువుట రాదన్నమాటే కాని యితర విషయములలో ఎందునా తీసిపోరు. మన గృహములే గురుకులాలు !

అచ్చమాంబ తన కుమారునకు విద్యరావాలని ఎంత ఆదుర్దా పడేవారో ఆమె కుమారుడు అంత విముఖత పొందేవాడు. ఆ స్కూల్లోనుంచి యీ స్కూల్లోకి ఈ బళ్లోనుంచి ఆ బళ్లోకి, పిల్లి పిల్లను తిప్పినట్లు తిప్పింది. ఆ పిల్లవాడిని బళ్ళు మార్చటమే కాని చదువు సంధ్యలు అబ్బేవి కావు. బడి ఎగగొట్టి ఆయన పొలాలకు పోయేవాడు. ఇంటికి వచ్చిన తర్వాత బళ్లోకి పోనందుకు అమ్మ ఆయనను కొట్టి కొరతను వేసేది. కొడుకు చదువుకొనుటలేదని చింత తప్పితే కొడుతూ వున్నాననే ఆలోచనే ఆమెకు వుండేదికాదు. కొడుకును బాధపెడుతూ, అతను చదువుకోలేదని తాను బాధపడుతూ 1910 లో ఆమె పరమపదించినది. ఆ తల్లికి తన కుమారుడు అధిక విద్యావంతు డయ్యాడని చూచుకునే ప్రాప్తి లేకుండాపోయింది పాపము !

ఆ తల్లి అంత బాధపెట్టినా, ఆయన బడికి వెళ్ళకుండావుండటానికి కారణ మేమిటో కనుగొన్నవారేలేరు. ఆ కాలములో అధికంగా ప్రభుత్వ పాఠశాలలు లేవు. వీధి బడులే ఎక్కువ. ఆ బడిలో ఒకడే ఉపాధ్యాయుడు. వారికి బోధనాపద్ధతులు బొత్తిగా తెలియవు. 'దండం దశగుణం భవేత్' అది ఒక్కటే తెలుసు వారికి. ఆ కాలములో చదువు అంటే అంతా కంఠతా పట్టుటే. గద్యం, పద్యం ఎక్కములు, తదితరములు. ఈ కంఠోపాఠము చెయ్యని విద్యార్థులందరు కఠినముగా శిక్షింపబడేవారు. ఆచార్య రంగాకు అధిక జ్ఞాపకశక్తివున్నా యీ బండ వల్లె వేయుట చేతయ్యేది కాదు. అంతే గాక ఆ పాఠశాలలు యే వసారాలోనో, ఏ గొడ్ల సావిడిలోనో వుంటూ చాలా అసహ్యంగా వుండేవి. ఈ బండ వల్లె వేయుట, అనారోగ్యప్రదేశంలో బడియుండుట, పంతులు పెట్టే యమయాతన పడలేక ఆయన బడికి దొంగయ్యేవాడు. ఈ అమానుష చర్యలు అన్నీ ఆయన కోమల హృదయానికి కఠోరముగా వుండి విద్యాభ్యాసమునకు విముఖత కలిగించేవి. అంతేకాని ఆయనకు విద్య యందు అభిమానము లేక కాదు. ఆ పాఠశాల పద్ధతులు ఆయనకు నచ్చకపోవుటచే 10 వ ఏటివరకు ఆయన చదువు వానకాలపు చదువే అయ్యింది.

పిల్లలు యింటిదగ్గర అల్లరిచేస్తారని కొందరు, త్వరగా చదువు రావాలని మరి కొందరు 4 వ ఏట కూడా నేడు పాఠశాలకు పంపుచున్నారు. ఈ పాఠశాలల్లో వారు ప్రయోజనమును పొందేది ఏమిటి? నేటికి కూడా కొన్ని పాఠశాలలు యమకూపాల్లాగే ఉన్నవి. గాలి, వెలుతురు వుండదు. క్రింద తేమ, చవుడు నానా కశ్మలంగా వుంటుంది. మరికొన్నిచోట్ల పిల్లలు విశ్రాంతిగా కూర్చుండేందుకు కూడా జాగా దొరకదు. నేటి రైలు పెట్టెల్లాగే వున్నవి. పాఠాశాల ప్రదేశం మంచి గాలీ వెలుతురు కలిగి ఆరోగ్యప్రదేశంగా వుంటూ తోటా, దొడ్డి వుండి కన్నులపండువుగా పిల్లలకి ఆకర్షణీయముగా ఉండాలి కాని బందెలదొడ్డిలా ఉండకూడదు, అలా ఉంటే ఆ పిల్లల ఆరోగ్యమునకు, అభివృద్ధికి చాలా భంగకరము.

నేటి విద్యావిధానంలో లోపాలన్నీ గ్రహించే మన మహాత్ముడు వార్ధా విద్యా విధానము ప్రవేశపెట్టాడు. ఇందులో ప్రకృతిని పరికించుట, వ్యవసాయము తదితర చేతి పనులు నేర్చుకొనుట వుండుటచే మనజాతికి, దేశానికి అభివృద్ధికరమై మానవుని శారీరక మానసిక ప్రవృత్తులనే కాక ఆధ్యాత్మిక తేజస్సును కూడా ప్రకాశింపచేయునదే విద్యయని మహాత్ముని నిర్వచనము. విద్య వలన భుక్తి, రక్తి,

యుక్తి, ముక్తి. ఇవన్నీ మహాత్ముని వార్ధా విధానములో వున్నవి. ఈ విధానమువల్ల పిల్లలు ఎట్టి విసుగు చెందరు. ఇది స్వయంపోషకమైనది కూడా. మన ప్రభుత్వము యీ విధానము తప్పక అమలులో పెట్టగలదు.

పెదతల్లి మంగమ్మ ఆయనకు వ్యవసాయ గురువు. ఆయన బాల్యములో విద్యా జ్ఞానము పొందనందుకు మనము విచారపడనవసరములేదు. ఆయన భావి జీవితానికి ఆధారభూతమైన విద్య ఎంతో ప్రకృతి పాఠశాలలో పొందాడు. ఆ నాల్గుగోడల మధ్య సంపాదించే విద్యకన్న ప్రకృతిపాఠశాలలో పొందిన విద్యను గురించే ఆనందము. ఆయన అందరివలె ఆ పాఠశాలనే అంటి పెట్టుకొని యుంటే, ఆయన రైతునాయకుడు అయ్యే వాడా అని అనిపిస్తుంది. ఈ ప్రకృతి ఆరాధనకు అవకాశము కలిగించినది ఆమెయే. ఆమెకు బాల్యముననే వైధవ్యము ప్రాప్తించుటచే సంతానహీనురాలు అయ్యెను. అందుచేత తన చెల్లెలు బిడ్డనే తనబిడ్డగా భావించుకునేది. కడుపున కన్న వారికంటె కళ్లను కన్నవారికి ప్రేమ ఎక్కువ కదా! రంగాను ఆయన ముత్తాత నాగయ్య వంటి విద్యావంతుని చెయ్యాలని తల్లికి, తాత రమణయ్య వంటి ఆదర్శ రైతును చెయ్యాలని పెదతల్లి మంగమ్మకు వుండేది. ఆందుచేత చెల్లెలు ఆయనను కొట్టి బడికి పంపిస్తూ ఉంటే, కొట్టకుండా, తిట్టకుండా ఏదోవిధాన ఆయనను మంగమ్మ పొలము తీసుకు వెళ్లేది. ఆమె వల్ల ఆయన ఆ పచ్చనిపొలాలలో, పంటలతో, పైరులతో, పశువులతో, గొడ్ల కాపరులతో ఆడుచు, పాడుచు, పరుగెత్తుచు ఆ ప్రకృతిచిత్రాలను పరికిస్తూ యుండేవాడు. ఈవిధముగా ఆయనకు ప్రకృతియందు ఎక్కువ ప్రేమ కలిగినది. అదే అనంతరము ఆయన అభివృద్ధికి ఆధారమయినది.

ఆ మంగమ్మ మంచితనాన్ని గురించి ఎంతైన చెప్పవచ్చు. ఆమె గొడ్డును బిడ్డను ఏకరీతిగా చూచేది. పాడీ పంట అంటే పరమ సంతోషము. పొలములో పాటుపడే రైతు అంటే అధిక అభిమానము, జీతగాళ్లంటే అత్యంత కనికరము. పెట్టుపోతల్లో కూడా పెద్దచెయ్యే. ఎద్దు ఏడ్చిన వ్యవసాయము, పాలేరేడ్చిన పంట పనికిరాదనేది. ఆమెకు కాయకష్ట గౌరవము (Dignity of labour) ఎక్కువ. ఆమె యెంత పుష్టిగా వుండేదో అంత తుష్టిగా కూడా వుండేది. ఆమె నిజంగా భూదేవిబిడ్డ. అలాగే ఆ భూమాత యందు యెక్కువ మక్కువ కలిగింది.

మన ఆచార్యునకు రైతునాయకునకు కావలసిన పునాదులు వేసింది మంగమ్మ తల్లి. కాని అచ్చమాంబకు ఆయనను అధిక విద్యావంతుని చెయ్యాలనే పట్టుదల. ఆమె అవసాన సమయమున, తన కుమారులు ముగ్గురుని కూడా విద్యావంతులను చెయ్యవలసినదని తన అక్కగారగు మంగమ్మ చేత ప్రమాణము చేయించుకొని ఆమె పరలోకయాత్ర చేసెను.

తల్లి పోయిన తర్వాత ఆచార్యునిలో చాలా మార్పు వచ్చింది. క్రమపద్ధతిని పాఠశాలకు పోవుట అభ్యాసమాయెను. మరణించిన మాతృదేవత యొక్క మహత్తర కాంక్ష మన్నించవలెననే మక్కువ మన ఆచార్యునిలో ఎక్కువ ఆయెను. దీనికితోడు పరిచితుడైన ఒక రైల్వేమేస్త్రీ, రామాయణములోని అనేక గాధలు వినిపించి, ఆయనకు విద్యయందు అభిరుచి కలిగించాడు.

ఆయన తల్లి మరణానంతరము ఒక సంవత్సరమునకు విద్యయందు అభిరుచి అధికమై పాఠశాలకు సక్రమముగా పోవు అలవాటు కలిగెను. అందువల్ల ఆయన ఆ పాఠశాలలోని విద్యార్థులందరిలోకి ప్రథముడు, ప్రముఖుడు కూడ అయ్యెను. ఆ పాఠశాల ఉపాధ్యాయుడు, విద్యార్థులు కూడా ఆయన స్థితి గమనించి ఆశ్చర్య చకితులైరి. వారింటిల్లిపాదికి కూడా అది ఒక అపూర్వఘటనగా కనిపించెను. ఒకానొక పూర్ణిమ రాత్రి వారంతా ఆరుబయట కూర్చునివుండగా "రంగా బాగుగా చదువుటేకాక, తన తమ్ములను కూడా అధికశ్రద్ధతో బడికి తీసుకొనిపోవుట చూచు భాగ్యము తల్లికి లేకపోయెకదా" అని ఆయన మేనమామ విలపించెను. సమీపమున వున్న మంగమ్మ మొదలగు వారుకూడా కన్నీరు కార్చారు. అచ్చమాంబవలె తమ సంతానాన్ని విద్యావంతులను చెయ్యాలని తల్లులందరికి కలిగితే రైతు కూలీ ప్రజారాజ్యము మనకు ఎందుకు రాదు?

1910 సంవత్సరంలో ఆయనలో ఒక గొప్ప పరిణామము కలిగింది. ఆయన మేనమామ రామస్వామి ఒక గ్రంథాలయాన్ని స్థాపించాడు. దానికి అప్పుడప్పుడు ఆయన పుస్తకాలు తెప్పించేవాడు. మంచి అందమైన క్యాలికో బైండులు గల పుస్తకాల కట్ట ఒకటి ఆయనకు వచ్చింది. అట్టి పుస్తకాలు ఎన్నడు రంగా చూచియుండలేదు, వాటిని చూడటంతోనే వాటిపై దృష్టి ఆయనకు కలిగెను. అంతట ఆయన పెదతల్లి దగ్గరకు పోయి, ఆ పుస్తకాలలో ఒకటి యిప్పించమని కోరెను. రేపు వెళ్లి గ్రంథాలయములో తీసుకోవచ్చునని ఆయన మేనమామ జవాబు

చెప్పెను, భాండాగారాధిపతిగా జంపాని ఆంజనేయులు ( గురువు, మిత్రుడు, రంగా గారి వివాహ బాధ్యుడు) గారుండేవారు. ఆ వూళ్లో పిల్లలందరకు ఆయనంటే ఎంతో గౌరవము. మరునాడు ఎంతో ఆతురతతో గ్రంథాలయానికి వెళ్లి ఒక పుస్తకము యివ్వమని ఆయన అడిగెను. నీకేమి పుస్తకము కావాలని ఆ పుస్తక భాండాగారాధికారి అడిగెను. ఆ కొత్త పుస్తకములన్నీ ముందువేసి ఎర్రని అట్టతో ఆకర్షణముగానున్న రాణి సంయుక్త నవలపై ఆయన దృష్టి పడెను. ఆ పుస్తకమును తీసుకొని పరుగెత్తుకొని పొలమునకు పోయి, తదేక దీక్షతో చదువసాగెను. అందలి కథ ఇంపుగాను, శైలి సొంపుగాను ఉండుటచే, ఆయన తన్మయుడై చదువ సాగెను. ఆటూ యిటూ తిరిగే అబ్బాయి, కదలక మెదలక పుస్తకము చదువుచుండుట చూచి ఆ తల్లి ఆశ్చర్య చకితురాలు అయ్యెను. రంగా మరియొక పుస్తకము యివ్వమని ఆ భాండాగారాధిపతిని అనేటప్పటికి ఈ పుస్తకం అంతా పూర్తి చేసితివా? అయినచో అందలి కథ చెప్పుము అనెను. పూసగ్రుచ్చినట్లు ఆ కథ అంతా చెప్పేటప్పటికి, ఆయన విస్మితుడాయెను. అప్పుడాయన మేనమామ కూడా అక్కడే వుండెను. అరే!ఈ అల్లరివాడు ఇంతవాడు అవుతాడని నేను అనుకోలేదే అనెను.

1913 సంవత్సరంలో ఆయన మేనమామ పోయినాడు. ఆయన తాలూకు లక్ష రూపాయిల ఆస్తి వీరికి దక్కినది. మాతృహీనులగు మేనల్లుళ్లను తన స్వంతబిడ్డలుగా చూచుటచే, ఎవరినీ పెంచుకొనలేదు. ఆయన అట్టే విద్యావంతుడు గాక పోయినా గ్రంథాలయములవల్ల జాతీయాభిమానము హెచ్చునని స్వగ్రామంలో గ్రంథాలయాన్ని స్థాపించిన దేశాభిమాని. ఆయన తండ్రివంటి ధార్మికుడు, తల్లివంటి ఉద్రేకుడు. ఆ ఆస్థి సంక్రమించుటచేతనే, మన ఆచార్యుడు ఆంగ్లదేశమునకు విద్యా భ్యాసమునకు అరుగుటకు అవకాశము కలిగినది.

ఆ సంవత్సరమే ఆంధ్రోద్యమము ఆరంభమాయెను ఆంధ్రోద్యమము యొక్క ఆదర్శము ఆంధ్రసంస్కృతిని పునరుద్ధరించుట, సాహిత్యమును పెంపొందించుట, సంఘ సంస్కరణ, ఆంధ్రరాష్ట్రనిర్మాణము. ప్రథమాంధ్రమహాసభ బాపట్లలో 1913 లో జరిగెను. ఆసభకు ఆంజనేయులుగారు వెళ్లిరి. అక్కడ జరిగిన వృత్తాంత మంతయూ ఆంజనేయులు గారు రంగాకు వివరించెను. అంతేకాక ఆయన తన శిష్యునకు వంగ విభజనను గురించియు, అరాజకోద్యమమును గురించియు

యింపుగా వివరించెడు వాడు. వంగదేశ విభజనోద్యమ ఫలితమే ఆంధ్రోద్యమము. ఆ సభ వృత్తాంతము వినిన తర్వాత తనను తీసుకొని పోనందుకు ఆయన చాలా విచారించెను. ఆ సంవత్సరమే పంచమ జార్జి చక్రవర్తి పట్టాభిషేకము జరిగెను. ఇందువల్ల ఆంగ్ల దేశముతో హిందూదేశ సంబంధము, సామ్రాజ్యములో దాని స్థానము. ఆయనకు తెలియవచ్చెను.

అందుచేత మరల మన మాతృదేశాన్ని స్వతంత్రభూమిగా ఎట్లు చేయ నగునో విన్నవించుమని ఆంజనేయులుగారిని అడిగెను. మన ప్రాక్తన జీవితము, చరిత్ర, సంస్కృతి మొదలగునవి తెలుసుకొనవలసియుండునని ఆయన సమాధానం ఇచ్చెను. అంతట ఆచార్య రంగా సంస్కృతాంధ్ర వాఙ్మయములు చదవసాగెను.

ఆయన మేనమామ పోయిన తర్వాత ఆయనచే స్థాపింపబడిన గ్రంథాలయము మన ఆచార్యుని ఆధిపత్యము క్రిందకు వచ్చెను. తనతో పాటు బడికి పోక తిరిగే పిల్లలందరిని సమకూర్చి తాను చదివిన గ్రంథజాలములోని కథలు వినిపింపసాగెను. ఆయన ఆధ్వర్యం క్రింద దేశాభిమానుల అధ్యయన తరగతి ఒకటి ఆరంభమాయెను.

1911-1913 మధ్యకాలంలో ఆయనకు విద్యయందు, వ్యవసాయము నందు సమముగానే కుతూహలముండెను. ఆ కాలంలో ఆంధ్రసాహిత్యంలోను చరిత్ర, భూగోళం, గణితాలలోకూడా మెట్రిక్యులేషన్ విద్యార్థికి గల జ్ఞానము కలదు. దీని కంతకు కారణము, విద్యయందుగల అపరిమిత అనురాగమే. అటుల విద్యా భిమానము కలిగి కూడా ఆ కాలములో ఆయన తల్లితో కలిసి పొలమునకుపోయి వ్యవసాయ సంబంధమైన కార్యకలాపములు కడు జాగరూకతతో పరికించెడువాడు.

1913 వ సంవత్సరములో ఇంక తానేమి చెప్పదగినది లేదని గురువు ఆంజనేయులు గారు ఆయనను ఆంగ్ల విద్యాభ్యాసానికి పురిగొల్పెను. కాని ఆయన పెదతల్లి అందులకు అంగీకరించలేదు. ఆయనకు అవసరమైన విద్య అబ్బెననియు, యిక వ్యవసాయపనులలో జోక్యము కలుగజేసికో వలెననియు ఆమె అభిప్రాయము. ఆమె అంగీకరింపక పోవుటచే, తన తండ్రివద్దకుపోయి తన అభిలాష వెలిబుచ్చెను. ఆ సమయములో ఆయనకు వ్యవహారములో గ్రామకరణముతోను, రెవిన్యూ ఇన్స్పెక్టరు తోను ఒక వివాదము ఏర్పడెను. దానిని పురస్కరించుకొని ఆయనకు కొంత అక్రమము చేసిరి. తాను విద్యావంతుడు కానందువలన యీ ఆక్రమము

జరిగినదని గ్రహించి, తన కుమారునకు ఆంగ్లవిద్యాభ్యాసము కలుగజేసినచో కోర్టు వ్యవహారములు తెలిసి, భావి కాలం లో అట్టి నష్టములు కలుగకుండునని భావించి ఆయన అనుమతించెను.

ఆయన ప్రైవేటుగా ఆంగ్ల విద్యాభ్యాసము చేసి స్వగ్రామములోని ఆంగ్ల పాఠశాలలో 1914 వసంవత్సరములో ప్రవేశించెను. ఇంగ్లీషులోను, సైన్సులోను మినహా మిగతా అన్ని విషయములలోను ఆ పాఠశాలలోని విద్యార్థులకంటే ఉపాధ్యాయులు కొందరికంటేకూడా అధికముగా ఉండుటచే ఆ తరగతిలో ప్రథముడుగా ఆయన ఎన్నుకో బడెను. ఆయన విద్యాభ్యాస సమయంలో ఉపాధ్యాయులందరు ఆయనను అధికంగా ప్రేమించేవారు. 1915వ సంవత్సరంలో ఆయన ఒక అసాధారణ విద్యార్ధిగా  పరిగణింపబడు చుండెడి వాడు. 1916 నుండి పాఠశాలలో పేరుకు విద్యార్ధిగా పరిగణింపబడినప్పటికీ, ఆయన ఒక సహచరుడు గను, స్ధానిక నాయకుడుగను, పరిగణింపబడు చుండెడి వాడు. పాఠశాలకు సంబంధించిన ఆయన అసాధారణ సంబంధము కొంతమంది విదార్ధులకు, ఉపాధ్యాయులకు ఆయన యెడల కొంత వ్యతిరేకభావం కలిగించెను. కాని అది కొద్దికాలమునకే  అంతరించెను. అనంతరము ప్రతివారితోను ఆయనకు పరిచయము కలిగెను. విశేషముగా ఆంధ్రోపాధ్యాయులతో ఆయనకు అధిక పరిచయము కలిగెను. అందునా రావెళ్ల వెంకయ్యగారితో అత్యధికము.

ఆయనతండ్రి, ఆంజనేయులుగార్ల అనుమతితో 1915 సం.లో గ్రంథాలయ పునరుద్ధరణచేసి వారి స్వంత సావిట్లో ఉంచెను. అందు  చాలామంది యువకులు సభ్యులుగా చేరిరి. అనుదినము  అధికసంఖ్యాకులు అచ్చటకు చదువు కొనుటకు వచ్చెడి వారు. అప్పటికి జరిగే ప్రపంచయుద్ధము యువకులలోను, వృద్ధులలోను కూడా కనువిప్పు కలిగించింది.

1916 సం.లో ఆ గ్రామములోని విద్యావంతుల రైతాంగము యొక్క, బ్రాహ్మణుల సహాయం కూడా ఆయన పొందుటచే  మారుమూలనున్న గ్రంథాలయాన్ని, గ్రామం మధ్యకు మార్చెను. అక్కడ ప్రతివారము సభలు, సమకాలీన సమస్యలను గూర్చి ప్రతి మాసము చర్చలు జరుపుచుండెడివారు. అనుదినము వార్తలు యితరులకు కూడా చెప్పుటయు జరిగెడిది.



1917 వ సం.లో ఆచార్యరంగా జీవితం అనేక కారణాల వల్ల ప్రాముఖ్యం చెందింది. ఆయన అభ్యసించు పాఠశాలలో ప్రకృతి అధ్యయన భాగము (Nature Study Group) చర్చాసంఘము నెలకొల్పుటకు ఆయన నాయకత్వము వహించెను. ఆధునిక ఆంధ్రదేశపిత యగు కందుకూరి వీరేశలింగం గారి (రంగాగారు పరోక్షగురువుగా భావించినవారు.) గ్రంథము లన్నియు ఆయన అత్యధిక శ్రద్ధతో చదివి, ఆయనయందు గౌరవాభి మానములు కలవాడాయెను. ఆయన రచనలు రంగా గారిలో ఎంతో మార్పు కలుగ జేసెను. ఆయన వలెనే దేశసేవ చేయవలెనని సంకల్పము కలిగెను. ఆయనను గురించి ఆ కాలమున40 పుటల వ్యాసమును ఆంగ్లమున వ్రాసెను.

1917–1920 మధ్య గ్రంథాలయోద్యమం, కట్న వ్యతిరేకోద్యమం, స్త్రీ పునర్వివాహోద్యమం, స్వరాజ్య ఉద్యమం పురోహితుల అక్రమచర్యలను గురించి, ప్రతి సంవత్సరము జరుపు జాతరల బహిష్కరణల గురించి పరిసర ప్రాంతాలలో ఆయన ప్రచారమును సాగించెను. వట్టి ప్రచారమేకాక గ్రంథాలయాలు, రాత్రి పాఠశాలలు వయోజన విద్యాకేంద్రములు స్థాపించుచూ ఆంగ్ల విద్యాభ్యాసమునకై తమ తనయులను పంపవలసినదిగా పెద్దలను కోరుచుండెడి వారు. ఆయన ప్రచారమునకు ప్రయోజనము కలిగెను. అధికముగా విద్యార్థులు పాఠశాలకు రాసాగిరి. అహర్నిశలు ఆయన పని చేయసాగెను. నూతనంగా వచ్చిన విద్యార్థులకు తాను పాఠములు చెప్పి పై తరగతులలో ప్రవేశింప జేసెడివాడు.వేయేల? యీనాటి విద్యార్థి వుద్యమం ఆయన ఆరంభించెను. 1914–17 మధ్య ఆయన ఆ విధంగా సాంఘిక సేవ, నిరక్షరాస్యతా నిర్మూలనము, మొదలగు కార్యములు చేయుట అద్భుతజనకములు.మన విద్యార్థులందరు యీ విధంగా ఉత్సాహంతో చేసిన, మన దేశ దశ మరొక విధంగా మారకయుండునా?

ఈ కాలములోనే ఆయన ఆంధ్రోద్యమములో అధిక కృషి చేసెను. ఆయన మిత్ర బృందమంతయు యిందుకు ఆమోదము చూపెను. ఆ కాలములో మద్రాసు గవర్నరు పెంట్లెండు ప్రభువు విద్యార్థులు రాజకీయ సభలలో జోక్యం కలుగజేసుకో రాదని ఒక శాసనం జారీచేసెను కాని ఆయన ఆనిబిసెంటు ప్రవాసమును గురించి ఆక్షేపించు సభలలో పాల్గొనుటయే కాక నెల్లూరులో జరిగిన ఆంధ్ర మహాసభకు

అరిగెను. ఆ సభా సందర్భములో ఆంధ్రోద్యమ నాయకులైన నరసింహేశ్వరశర్మ, మోచర్ల రామచంద్రరావు, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య (చీరాల పేరాల ఉద్యమ నిర్మాత.), కొండా వెంకటప్పయ్య, డాక్టరు పట్టాభి, ముట్నూరు కృష్ణారావుగార్లతో పాటు ప్రపంచప్రసిద్ధుడైన కోడిరామమూర్తి నాయుడు గారిని కూడా దర్శించి సంభాషించెను. ఆ సభా సందర్భములో సమావేశమైన శాసన సభ్యులు, పత్రికాధిపతులు. ప్రచురణకర్తలు, రాజకీయవేత్తలు, కాంగ్రెసు ప్రముఖులు మున్నగు వారితో సంభాషణ ఆయనలో ఒక గొప్ప ఉత్తేజమును కలిగించెను.

నెల్లూరునుండి ఆయన స్వస్థలమును చేరగనే బ్రాహ్మణేతర ఉద్ధరణకై ఒక పార్టీ స్థాపింపబడినదన్న సంగతి విని ఆయన ఆశ్చర్యచకితుడు అయ్యెను. దాని ప్రాముఖ్యాన్ని గురించి ఆయన మొట్టమొదట విముఖత కలిగియుండెను. పాఠశాల లోని ఉపాధ్యాయులు, కర్షక విద్యార్థులు, బ్రాహ్మణేతరులు అయినంత మాత్రమున వారియెడల సవతితల్లి ప్రేమ చూపుట, ఆయన గ్రామ గ్రంథాలయ కార్యదర్శి అయిన కరణము కర్షక సభ్యులను అవజ్ఞత చేయుట, తన బ్రాహ్మణాధిక్యత కనబరుస్తూ ప్రవర్తించుట, చిరకాలము నుండి బ్రాహ్మణులు ఎక్కువ, బ్రాహ్మణే తరులు తక్కువ అని వ్యాపించియున్న ఉచ్చ, నీచభావములే ఆయనను బ్రాహ్మణేతర ఉద్యమ అభిమానిగా చేసినవి. ఆయన ఆదర్శము అప్పటికీ వీరేశలింగము గారి ఆదర్శమే. కులాలను నిర్మూలించి సమత్వము స్థాపించవలెననే ఆకాంక్షతోనే బ్రాహ్మణేతర ఉద్యమంలో ఆయన చేరుటకు కారణము. దానివల్ల అస్పృశ్యతా నివారణ, స్త్రీ పురుషులకు సమాన హక్కులు, పురోహితవర్గము గుత్తగొన్న వేద పురాణము లన్నియు అందరు చదువవచ్చుననే అభిలాష, తద్వారా ప్రజలలో సాంఘిక రాజకీయ చైతన్యము కలుగునని విశ్వాసము.

ఆయన ప్రథమ గుంటూరు మండల బ్రాహ్మణేతర సభకు అరిగెను. ఆ సభలో బ్రాహ్మణేతరులకు శాసనసభలో కొన్ని స్థానములు యిచ్చిన కాని స్వరాజ్యం యివ్వరాదను వాదనను ఖండించెను. కాంగ్రెసులీగు ప్రణాళికను చేకొని ఆయన పరిసర ప్రాంతాలలో వేలకొలది సంతకములు చేయించి రైతాంగమునకు స్వరాజ్యము వల్లనే తమ కష్టములు గట్టెక్కునని బోధించెను. బెజవాడలో జరుగు ఆంధ్రమహాసభకు ఆయన వెళ్లెను. ఆ సభలో బ్రాహ్మణ, అబ్రాహ్మణ సమస్య

బయలుదేరెను. కొన్ని విధి నిషేధా లతో బ్రాహ్మణేతరులు తమ తీర్మానములు తీసుకొనివచ్చిరి. జాతీయవాదులు వాటిని ఆమోదింపకపోవుటచే, సభనుండి వెళ్లిపోయిరి. ఆయన, ఆయన స్నేహితులు ఎట్టి విధి నిషేధాలు లేక స్వరాజ్య ఆవశ్యకతను గమనించిన వారగుటచే, బ్రాహ్మణేతరులతో వారు కలసి పోలేదు.

## సంస్కృత విద్యాప్రచారము

రంగా తదితరబృందం కర్షకావళిలో ఆంగ్ల విద్యాభ్యాసం చేయించుటతో పాటు సంస్కృత విద్య నేర్చుకొనుట గూడ సాగింప జొచ్చిరి. ఇందుకుగాను తెలుగులో ప్రబంధ పురాణాదులను, సంస్కృత భాషను చదువుటకు వయోజన తరగతులను ప్రారంభించిరి. బ్రాహ్మణు లెవరు ఇందులకు అంగీకరింపక పోవుటచే అధిక కష్టము మీద బ్రాహ్మణేతరులను సమకూర్చగలిగిరి. ఇట్టి సంఘర్షణ పురస్కరించుకొనే అమృతలూరి (తెనాలి తాలూకా) రైతాంగం 1909–10లో ఒక సంస్కృత పాఠశాల పెట్టెను. అందు అనేకమంది విద్యార్థులు విద్యనభ్యసించి నేడు వివిధ ప్రాంతాలలో విద్య గరపుచున్నారు.ఆ బడి నేటికిని అభివృద్ధికరంగా నుండుట సంతోషదాయకము.

ఈ విధముగా విద్యాప్రచారము చేయుటేగాక, రైతాంగ యువజనుల్లో ఉత్సాహము, పౌరుషము ఉద్దీప్తమగుటకుగాను ఆటపాటలు, పండుగ పర్వములు ప్రారంభించిరి. (రైతాంగ పండుగలగు వూడ్పు, కోత, గోపూజాదులు) యీ ప్రజాస్వామిక సంస్కరణ సందర్భములో బ్రాహ్మణులు వారితో కలసి రాకపోవుటచేత కులసభలు చేయువారితో కలసి మెలసి పనిచేయక తప్పినది కాదు. అందుచేత 5వ రాష్ట్రీయ కమ్మ మహాసభ 1919లో నిడుబ్రోలులో జరిపిరి.

## వెంకయ్య గొప్ప ఉపాధ్యాయుడు

ఆ పాఠశాలలో ఆయన జ్ఞాపకశక్తిని బట్టి రావెళ్ల వెంకయ్య (ఆంగ్లోపాధ్యాయులు) అను ఉపాధ్యాయుడు ఆయన భావి జీవితానికి అభివృద్ధికరమైన పంథా చూపెట్టిన ప్రముఖుడుగా తలచును. ఆయన చాల మంచివాడు. బహునిరాడంబర జీవి, జాతీయవాది, సంస్కర్త, జన్మతః రైతు. పల్లెప్రజల నిరాడంబర జీవితానికి అలవడుటే కాక వీరేశలింగంగారి సంస్కరణ భావము ఆయనలో శల్యగతమగుటచే వెంకయ్య ప్రకృతి ఆరాధన, నిరాడంబరత,

జాతీయత, ఆయనను అతిగా ఆకర్షించినవి. అందుచేత వారు ఉభయులు పరస్పర ప్రేమానుబద్ధులై ప్రాణస్నేహితులైరి. ప్రతి సాయంకాలము పాఠశాలానంతరము జాతీయ సమస్యలను గురించి చర్చించు చుండెడి వారు. ఆచార్య రంగా తన బాల్యంలోని ప్రకృతి ఆరాధనను గురించి ఆయనతో అధికంగా చెప్పుచుండే వాడు. ఆయన మన రంగాకు ఆంగ్లకవులగు వర్డ్సువర్తు. షెల్లీ, కీట్సుల కవితా మాధురిని వారి ప్రకృతి ప్రేమలను గూర్చి చెప్పుచు ఆయనలో ఇమిడియున్న ప్రకృతి ప్రేమను మరింత పెంపుజేసెను.

మద్రాసులోని గోఖలే మందిరమును తెరచుచు పి.సి.రాయ్ గారు గోఖలే గారి గొప్పతనము హిందూదేశపు అర్థశాస్త్రాన్ని తన అరచేతిలో పెట్టుకొనుట చేతనే ఆయనకు ఆధిక్యత కల్గినదని, ఆయన చెప్పినట్లు వెంకయ్య క్లాసులో చెప్పెను. ఆసాయంకాలం పాఠశాలానంతరం దాదాభాయినౌరోజి రమేశ చంద్రదత్తుకూడ అర్థశాస్త్రం ద్వారా భారతదేశానికి చేసిన సేవ ఆయన బహు విధాల ప్రస్తుతించెను. వారి అడుగుజాడలలో తాను నడచెదనని తన శిష్యుడు చెప్పగా గురువగు వెంకయ్య గ్రామజనాభా తయారు చేయవలసినదని చెప్పెను. తదనుగుణంగా తన మిత్ర బృందాన్ని వెంటనిడుకొని, వారి సాయముతో ఆ పనిని పూర్తిచేసెను. ఈ కార్య నిర్వహణతో ఉపాధ్యాయులలో, సహచరులలోను. ఆయనయందు అధిక ఆదరము కలిగెను.

నిడుబ్రోలులో 1918-19 సంవత్సరములలో రీసర్వే ప్రారంభమైనది. ఆ సర్వేయర్లతో ఆచార్య రంగా స్నేహముచేసి ఆ లెక్కలన్నిటికి నకళ్లు వ్రాసెను. అలా వ్రాయుట వల్ల అనేక ఆక్రమణలను ఆయన కనుగొనెను. వాటిని పురస్కరించుకొని జిల్లా కలెక్టరుతోను సర్వే జనరల్ తోను వ్యవహారము నడిపెను. దాని పర్యవసానం వల్ల ఆ ఆక్రమణల గురించి కరణము యొక్క నడవడిని గురించి విచారణలు జరిపి అందు అనేక ఆక్రమణలు రద్దు చేయబడి కరణమునకు హెచ్చరిక (warning) యివ్వబడెను. ఈ కార్యకలాపము వల్ల కరణాలంటే గడగడలాడే ఆ పరిసర గ్రామ రైతాంగంలో చైతన్యం కలిగింది. కరణాల భయం పోయెను. ఆయన బాల్యములో చేసిన జనాభాలెక్కలపని, యీసర్వే ప్లానులు తయారుచేయుట ఆందోళనా కార్యము

ఆయనకు అనంతరం అధిక ప్రయాసతో  కూడుకున్న ధనాగారపు లెక్కలు ప్రజల ఆర్థిక పరిస్థితుల పరిశోధనలకు ప్రయోజనము కలిగించెను.

ఆంజనేయులు, వెంకయ్యల ప్రోత్సాహంచే ఆయన విద్యార్థిగానే రాజకీయ సంబంధమైన ఆంధ్ర, ఆంగ్ల గ్రంథములనేకములు చదిచెను. ఆయన ఆంగ్లభాష అభ్యసించకముందే ఆంగ్లేయ రాజ్యాంగనిర్మాణ చరిత్ర, రాజ్యాంగనిర్మాణములు, నానాదేశ రాజ్యాంగ నిర్మాణము మహాపురుషుల జీవితములు, కాంగ్రెసు అధ్యక్షుల జీవిత చరిత్రలు, బిపిన్ చంద్రపాలు ఉపన్యాసములు, ప్లూటార్కు రచయిత జీవితములు ప్లేటో రిపబ్లిక్కు మొదలయిన గ్రంథములు ఆంధ్రములో చదివెను. ఇవన్నియు చదువుటే కాక పురాణములు, చరిత్రలు కూడ చదివి, అందులో గల అంశముల మీద ఆంజనేయులుతో చర్చలు చేయుచుండెడువాడు. ఆంధ్రభారతము ఆయన అభిమాన గ్రంథముగా చదువుటచే ఆధునిక రాజ్యాంగ వ్యవహారములు ఆర్థంచేసికొనుటకు ఆయనకెంతో సహాయకారి అయ్యెను. బాల్యములో భాష, భావము రెండూ నేర్చుకొనుట విద్యార్ధులకు చాలా కష్టభూయిష్టమైన కార్యము. సాధారణ విద్యార్థులు యెవ్వరు పొందజాలని రాజకీయ విజ్ఞానమును ఆలస్యముగా ఆంగ్ల భాషాభ్యాసమునకు అరుదెంచిన మన ఆచార్యుడు యీవిధముగా అభ్యసించి ఆరితేరెను. ఇది ఆయన భావి జీవితమునకెంతో ఉపయోగపడెను.

1919 సంవత్సరము నాటికే రామకృష్ణ పరమహంస, రామతీర్థ, వివేకానంద ఉపన్యాసాలు ఆంధ్ర,ఆంగ్లాలలో చదువుటచే ఆర్యసంస్కృతి ప్రభావం ఆయనలో అధికముగా ప్రజ్వరిల్లెను. ఆయన హిందూమతము ఏది? అది మనలో అనేకులు అనుభవములో పెట్టనిది, మన పురోహితులు చెప్పనిది, మన సాధారణ జనము గమనించనిది. ఇదంతా ఆయనకు యెప్పుడు బోధపడినదంటే ఆయన విద్యార్థిదశలో ప్రచారానికి బయలుదేరినపుడు. ఆయన పరిసర గ్రామాలలో ప్రవేశించి అస్పృశ్యత పనికిరాదని, హరిజనులను ఇతర పౌరులవలె, సమభావంతో చూడవలెనని, స్త్రీలను పురుషులతో సమానముగా గౌరవ మర్యాదలతో చూడవలెనని ప్రబోధము చేసినపుడు. ప్రజానీకము దీనినేమీ పాటించలేదు. పాఠశాలలకు విద్యార్థులను పంపమన్నప్పుడు గ్రంథాలయాలకు చందాలు యివ్వ మన్నప్పుడు వారు తోడ్పడిరి. కాని సంస్కరణ విషయములో ససేమిరా అనిరి. రాజా రామ్‌మోహనరాయ్‌చే స్థాపింపబడిన బ్రహ్మ సమాజమునందు వీరేశలింగంగారి

ప్రభావంచే ఆయనకభిమానం కలిగెను. వేదాలు అపౌరుషేయములను మాట ఆయనకు నమ్మరానిదిగా వుండెను. రామతీర్థుని బోధలుకొన్ని ఆయన అనువాదం చేసెను. అవి కొన్ని తెలుగు పత్రికలలో ప్రచురింపబడెను.

చంపరాన్ నీలితోటల తెల్ల యజమానుల దుండగములకు వ్యతిరేకముగా మహాత్మాగాంధి సత్యాగ్రహం ప్రారంభించినపుడు యీ తెల్లదొరతనం పారద్రోలుటకై రైతాంగం యేల ప్రయత్నించరాదనెడి భావం, ఆయన రైతాంగ హృదయంలో ఉదయించెను.

కెయిరా రైతాంగం మహాత్ముని నాయకత్వంలో ప్రభుత్వం రెమిషన్ యివ్వ నప్పుడు పట్టుదలతో పన్నుల నివారణకు ప్రయత్నించినపుడు ఆయనకు పట్టరాని ఆనందము కలిగెను.

దీని అనంతరమే ఆ పరిసర గ్రామములలో దక్షిణాఫ్రికాలో మహాత్మునితో సంబంధంగల ఒక రైతుతో ఆయనకు పరిచయము గలిగెను.ఆ రైతువల్ల మహాత్ముని చరిత్ర, ఆయన ప్రజాసేవకై పడ్డ పలు కష్టములు, ప్రజలను సక్రమపద్ధతిని నడుపుటలో గాంధిమహాత్ముని కిటుకు ఆయన బాగా బోధపరచు కొనెను. దీని అనంతరమే (1920) రైతాంగానికి జరిగిన అక్రమాన్ని గురించి ప్రభుత్వంతో పోరాడి రైతాంగమునకు సహాయము చేయుటకు ఒక సందర్భము సమకూడెను. ఆయన గ్రామమునకు సమీపముననేయున్న మాచవరం రైతాంగం పల్లపు సాగుకు పలుకష్టాలు పడుచుండిరి. వారు సాగుచేయు కాలువకు పై భాగాన రాతిలో కట్టబడిన అనేక డాములు వుండుటచే, వారికి నీరు సక్రమముగా వచ్చెడిది కాదు. ఈ కష్టనివారణకై వారు అష్టకష్టములుపడి అనేక మంది ఆఫీసర్లను కూడా తీసుకొనివచ్చిరి. కాని ప్రయోజనము లేకపోయెను. ఈ సంగతి వారివల్ల విని ఆయన ఆ కార్యములో ప్రవేశించి కొన్ని అర్జీలను పంపుటే కాక, స్వయంగా రైతాంగాన్ని ఇంజనీరు వద్దకు తీసికొనిపోయి వారి కష్టనష్టములు తెలిపి, ఆ ఇంజనీరువల్ల ఆ సంవత్సరమునకు ప్రత్యేక నీటిసదుపాయము చేయ సాయపడెను. ఈ ప్రథమ విజయము ఆయన భావి జీవితానికి యెంతో ప్రోత్సాహకారియాయెను.

1918 వ సంవత్సరములో ఆయన వ్యాసరచన ప్రారంభించెను. అది బ్రాహ్మణేతరులగురించి. బ్రాహ్మణాధిక్యం పోవాలని ప్రయత్నించు బ్రాహ్మణేతరులు

అందరు అంటరానితనము రూపుమాపి, సమాన ప్రతిపత్తిని నెలకొల్పు ఆవశ్యకతను గూర్చి ఆయన యెంతో ఉత్తేజకరంగా వ్రాసెను.

ఆయన బ్రాహ్మణేతరోద్యమములో పాల్గొనినను ఆయన హృదయంలో జాతీయ తత్వమే వెల్లివిరిసి యున్నదను సంగతి వేరే వివరించ నక్కరలేదు. జస్టిస్ పార్టీ బ్రాహ్మణేతరులలో ఆత్మగౌరవమును, కొంత చైతన్యమును కల్గించి, విశేషించి బ్రాహ్మణేతర విద్యావంతుల ఉద్యోగములకు ఉపయోగపడినా దేశస్వాతంత్ర్యానికి ప్రతిబంధకముగా వుండుటచేత ఆయనకు అది నచ్చకపోయెను. కొంతమంది బ్రాహ్మణేతరులకు ఉద్యోగములు వచ్చినప్పటికి రైతాంగమునకు ఒరుగున దేదియు లేదనియు కులమతాల నతిక్రమించి జాతీయభావం అభివృద్ధిపొందిననే తప్ప రైతాంగానికి కష్టనివారణ కలుగదని ఆనాడే భావించిన జాతీయవాది ఆయన.

## త్యాగరాయ శెట్టిగారి తోడ్పాటు

1920 సంవత్సరములో ఆయన స్కూలు ఫైనల్ ఉత్తీర్ణుడాయెను. ఆ సంవత్సరమే ఆయనకు వివాహమయ్యెను. ఆయన ఆంగ్లదేశమునకు విద్యాభ్యాసమున కేగుటా లేదా అనునదే తటపటాయింపుగా నుండెను. ఇంతలో ఆయన కాకినాడ, విశాఖపట్టణము, కలకత్తా, మద్రాసు నగరములకు అరిగివచ్చెను. అనంతరం గుంటూరులోని ఆంధ్ర క్రిస్టియన్ కాలేజీలో 1920 జులై లో చేరెను. ఆయనకు ఆ కాలములో జుట్టు వుండటం, కట్టు, కదలిక, పల్లెటూరితనంగా వుండుట కొందరు విద్యార్థులకు పరిహాసాస్పదముగానుండెను. కాని విద్య ఇతర విషయాలలో వీరేశలింగ, వివేకానంద బోధలవల్ల వారినందరి నతిక్రమించిన వాడుగా నుండెను. గాంధిమహాత్ముని సత్యాగ్రహము, ఆయన పెదతల్లి మంగమ్మ ద్వారా కలిగిన భూమాత యందు మక్కువ, ఆంజనేయులు రైతాంగ సంస్కృతిలో కల్గించిన మమత ఆయనలో హత్తుకు పోయెను. ఈ విధంగా వేష భాషలలో విహరించుచు విద్యాభ్యాసము గావించునపుడు ఆయన ఇంగ్లాండున కరగుటకు అవకాశము కలిగెను. ఆ కాలంలో పాసుపోర్టు పొందుట చాల ప్రయాసకరమైన సంగతి. మద్రాసులో ఆయనకు పరిచయస్తులెవరు లేరు. 1919 సంవత్సరము మద్రాసులో జరిగిన బ్రాహ్మణేతర మహాసభకు ఆయన వెళ్ళెను. అప్పటికే డాక్టరు నాయర్ జీవిత చరిత్ర వ్రాసెను. ఆ సమావేశ సందర్భములో త్యాగరాయ సెట్టితో

ఆయనకు కొందరు పరిచయము కలుగచేసిరి. ఆ పరిచయాన్ని పురస్కరించుకొని పాసు పోర్టు ఆయన ద్వారా పొంద ప్రయత్నించుటకు ప్రయాణమై మద్రాసునకు పోయెను. ఆయన త్యాగరాయ సెట్టిని సమీపించి ఆయన సహాయమును కోరెను. ఆయన యేమి చదివెదవని యడుగగా తనతండ్రికి ఐ. సి. యస్. చదువవలెనని పట్టుదల గలదనియు, తనకు రాజకీయ శాస్త్రం చదివి, బారిష్టరై రాజకీయాల్లో ప్రవేశించాలని ఉన్నదని ఆయనతో వివరించెను. త్యాగరాయ సెట్టి ఆయనకు తగిన ఆస్తికలదని తెలిసిన పిమ్మట ఆయన రాజకీయములో ప్రవేశించుటే మంచిదని ప్రోత్సహించెను. అంతేగాక 20 సంవత్సరముల యీడుగల ఆయన హైస్కూలు విద్యకంటే అధికంగా పొందకపోవుట పల్లెటూరివారి దురదృష్టమని ఆయన చాలా విచారపడెను. ఆంగ్లవిద్యలో వయస్సును బట్టి తాను వెనుకబడినా, ఆంగ్ల విద్యాభ్యాసమునకు ముందు ఆంధ్రములో తాను అధిక కృషి చేయుటచేతను మత సాంఘిక, రాజకీయ విషయములలో కొంతమంది పట్టభద్రులకంటె తానేమియు తక్కువవాడనుకానని త్యాగరాయసెట్టితో ఆయన తెల్పెను. అందు మీదట త్యాగరాయ సెట్టి నేను కూడ పూర్వము పల్లెటూరు వాడినే, నేను నిన్ను యెక్కువ ప్రేమించుచున్నాను. నీవు విద్యాభ్యాసము చేసి పల్లీయుల ఉద్ధరించవలసినదని నేను కోరుతున్నాను. నేనీ మద్రాసు కార్పొరేషనుకు అధ్యక్షుడనైనప్పటికిని గ్రామ సేవకంటె అధికమైనది లేదని నేను చెప్పుచున్న సంగతి నీ వెప్పుడు మరువవద్దని ఆయన ప్రోత్సహించెను.

ఆ మద్రాసు ప్రథమ పరిపాలనకర్తచే పల్లెప్రజల సేవా విషయములో ప్రస్తుతింప బడుట ఆయనకు పట్టరాని సంతోషము కలిగెను. ఆ మహామహుని వాక్య పరిపాలనమే యీ నాటికి ఆయనకు ఆనందప్రదమైనది.

## రైతు పత్రిక స్థాపన, ఇంగ్లాండు ప్రయాణము, విద్యాభ్యాసము

("రైతు పత్రిక" ఈ పత్రిక బాధ్యతను త్రిపురనేని రామస్వామి గారు స్వీకరించారు)

ఆయనకు అనేక ప్రజా కార్యములలో సహాయము చేసిన రెడ్లు, తెలగాలు, నిడుబ్రోలులో జరిగిన కమ్మ మహాసభకు ఆర్థిక సహాయము చేయకపోవుటను బట్టి తనబోటి రైతు నాయకుడు యిట్టి కులతత్వ సభలలో ప్రధానపాత్ర వహించుట

పొరపాటని ఆయన గ్రహించెను. చిలుకూరి వీరభద్రరావుగారు, ఆంధ్రుల చరిత్రలో పేర్కొనినట్లు కమ్మ, తెలగ, రెడ్డి మొదలగు కర్షకులు ప్రప్రథమమున యేక జాతీయులే అనియు, ఆ రెడ్లే వివిధ ప్రాంతాలకుపోయి భిన్న నామములు పొందిరని ఆయనకూడ విశ్వసించెను. కనుక యిక ముందు యిట్టి కులసభలుగాక అవకాశం చిక్కిన రైతుసభలు యేర్పాటు చేయుట భావ్యముగా నుండునని భావించెను.

నిడుబ్రోలు నివాసి పాములపాటి వెంకటకృష్ణయ్య చౌదరి, మన రంగా కంటె కొన్నిమాసాలు పెద్ద. ఆయన యీయన బాల్య స్నేహితులు. వీరు ఉభయులు ఆ గ్రామంలో ఒక మిడిల్ స్కూలు, వారపత్రిక పెట్టి రు.3000 వసూలు జేశారు. 1920 సంవత్సరం ఆగస్టున ఆయన ఇంగ్లాండు ప్రయాణమై వెళ్లనున్నప్పుడు, వీడ్కోలు సందర్భములో ఒక సభ జరుపబడినది. ఆ పోగుచేసిన మొత్తం యేమి చేయాలా అను విషయం గూడ చర్చకు వచ్చింది. అనేకులు "కమ్మ" పత్రిక పెట్ట వలెనని సూచనచేశారు. కాని వీరుభయులూ రైతు పత్రిక పెట్టవలెనని వారికి సలహా యిచ్చిరి. ఆ సలహాను అచ్చటికి వచ్చిన పదిమంది పాటించిరి. అంతకుముందు కులమతములను అతిక్రమించి పల్లెటూరి నుండి ప్రకటింపబడే వర్గపత్రిక లేనేలేదు. ఈ రైతు పత్రికే ప్రథమ రైతు పత్రిక.

1920 వరకు రాజకీయాందోళన అంతా పట్టణాల్లోనే ప్రజ్వరిల్లింది కాని పల్లె ప్రదేశాలు చొచ్చింది కాదు. ఆయన మేనమామ రామస్వామి, ఉపాధ్యాయులగు ఆంజనేయులు, వెంకయ్యలు ఆనాటి రాజకీయ సమస్యలను గురించి కలుగజేసిన శిక్షణే ఆయనకు యీనాటి రాజకీయ నాయకత్వమునకు ఆధారభూతమైనది. వారి శిక్షణ, మేనమామ ఆస్తిసంక్రమణ ఆయన విదేశ విద్యాభ్యాసమునకు అనుకూల పరిస్థితులు గల్పించెను. అటుల ఆగస్టు సభలో అందరిచే అధికోత్సాహముతో వీడ్కోలు పొంది విద్యాభ్యాసమునకై ఆయన ఆంగ్ల దేశమున కరిగెను.

అది వరకే ఆక్సుఫర్డు విశ్వ విద్యాలయములో ఐ. సి. యస్. చదువుచుండిన రామకృష్ణ ఐ. సి. యస్. కై ఆ విశ్వవిద్యాలయములో ఒక సీటు సంపాదించుటచే ఆయన అందు ప్రవేశించెను. కేవలము సీటు యిప్పించుటేగాక, రామకృష్ణ, రంగాకు సంరక్షకుడుగా వుండి ఆయన అభివృద్ధికి ఆధారభూతుడయ్యెను. మహాత్ముని అసహాయోద్యమము అభివృద్ధిగా నున్న రోజులవి. స్వరాజ్యము సమీపించినదని అనేక భారతీయ విద్యార్థులు చదువులకు స్వస్తి చెప్పినట్లుగనే,

రంగాకూడ ఐ. సి. యస్. కు వప్పగింతలు పెట్టి భారత దేశము బయలుదేర ప్రయత్నించెను. కాని రామకృష్ణ ఆయన ఆలోచనను అరికట్టి విద్యాభ్యాసమునకు ప్రోత్సాహమిచ్చుటచే యెట్టకేలకు ఆయనమాట మన్నించవలసిన వాడాయెను.

ఆచార్యరంగా ఆయన మాట మన్నించినను ఐ. సి. యస్. ను వదలి ఆర్థిక రాజకీయశాస్త్రముల నభ్యసింపసాగెను. ఐ. సి. యస్. కై లోగడ ఆయన అభ్యసించిన గణిత శాస్త్రము యిందులో ఆయనకు ఆధిక లాభకారి ఆయెను.

భారతదేశములో వ్యవసాయం, పరిశ్రమలు పెంపొందు పెక్కు మార్గాలు, రామకృష్ణ రంగాకు బోధించి, నేటి ఆయన అభివృద్ధికి ఆధార భూతుడయ్యెను. ఆయన ద్వారానే  ఆంగ్లదేశములోని కర్షక కుటుంబములతో రంగాకు పరిచయం కలిగి వారి ఆర్థిక సాంఘిక పరిస్థితులు పరిశీలించుటకు అవకాశము కలిగెను.

రంగా భారత భూమిలో విద్యార్థిగా వున్నప్పుడు దేశీయమైన కట్టు బొట్టు జుట్టులతో వున్న సంగతి పాఠకులకు విదితమే. ఆయన ఆంగ్ల దేశములో వున్నప్పుడు కూడ చుట్టూ వసారా టోపి (హ్యాట్), పెట్టి ఆంగ్లేయుల ననుసరించక జాతీయాభిమానియై దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, కవిరాజు, రామకృష్ణలవలె తలగుడ్డనే వాడేవాడు.

డాక్టరు కార్లైలు వద్ద 1922 సంవత్సరములో సాంఘిక శాస్త్రమును రంగా చదివెను. స్టాక్, బట్లర్ దొరసానుల సలహాతో బ్రిటీషు ట్రేడ్ బోర్డ్సు ఉద్యమ మూల పురుషుడైన జె. జె. మాలెన్ (Malion) వద్ద కొంత కాలము లండనులో వుండెను. ఆ వేసవిలో వర్కర్సు ఎడ్యుకేషనల్ అసోసియేషన్సు సమ్మర్ స్కూలు (Bangor) లేబర్ రిసెర్చి డిపార్టుమెంటు సమ్మర్ స్కూలు, (Scarborough) ద్వారా సోషలిస్టుల తోను, కమ్యూనిస్టులతోను. పరిచయమేర్పడెను, అక్కడే ఆయనకు దత్తు సోదరులతోను G. D. H.Cole, H.N.BrailsFord, Page. ARNOLD, Hobson, Miss Willkinson, Prof H. Clay, Dr Radford ల ద్వారా సోషలిజం ముఖ్య సిద్ధాంతాలను తెలిసికొనెను.

రంగా తెలివితేటలు, పరిశోధనా పిపాసయందు అధిక ఆదరము బ్రెయిల్సు ఫర్డు గ్రహించి ఇటలీ జర్మని, ఫ్రాన్సు దేశముల కరిగి అచ్చట రైతుసంఘాలు, సోషలిస్టు సంఘాలు, సహకారోద్యమాల సంగతి బాగా తెలిసికొని రాగలందులకు

ఆయనకు సలహానిచ్చెను. 1922 సంవత్సరం వేసవిలో ఆయన ఆదేశానుసారము ఆయా దేశాల కరిగి, అచ్చట వివిధ ఉద్యమాలను అధికశ్రద్ధతో అధ్యయనం చేసెను. జెనీవాలో కొంత కాలముండి, నానాజాతి సమితి, ఇంటర్ నేషనల్ లేబరు ఆఫీసు వారి పనులు పరిశీలించెను.

## ఆక్సుఫర్డులో అధ్యయనము

వేసవి అనంతరం ఆయన ఇంగ్లండునకు వచ్చి యధారీతిని ఆక్సుఫర్డులో అధ్యయనము ఆరంభించుటే కాక ఆయన అక్కడ విద్యార్థిగా నున్న కాలములో ఆక్సుఫర్డు లేబరుక్లబ్బుతో అధిక సంబంధ మేర్పరచుకొనెను. ఆక్సుఫర్డు ఇంటర్ నేషనల్ లేబరు గ్రూపుకు ఆయన సెక్రటరీగా కూడ పనిచేసెను. ప్రొఫెసర్ Macgregor (the advocate of small holdings) J. A. O Todd (The author of world's cotton crops) Pro. H. Clay (The author of unemployment) G. D. H. Cole ల ఆధ్వర్యము క్రింద వివిధ ఉద్యమాలను గురించి అధ్యయనం చేసెను. ఇందువల్ల ఆయన ప్రజానీకమును సంఘటిత పరచు (ఆర్గనైజు) యధార్థస్థితి గతులలో శాస్త్రీయ పరిశోధనలను చేసి వారి న్యాయమైన కోర్కెలను గూడ తెలియజేయుటకు శక్తియుక్తులు కలిగియుండెను.

ప్రజాసమూహానికి శాస్త్రీయ పద్ధతిని సహాయము చేయుటకు అవసరమైన అన్ని తర్ఫీదులుపొంది, ఆక్స్ఫర్డు విశ్వవిద్యాలయములో తన పరీక్షలలో ఉత్తీర్ణుడై, సోషలిస్టు భావాలతో 1923 సంవత్సరమున భారతదేశమునకు అరుదెంచెను. అటువచ్చిన అనంతరం అప్పికట్లలో రైతుసభ, నిడుబ్రోలులో వ్యవసాయకూలీల సభ జరిపెను.

1923-27 మరి మూడుసార్లు ఆయన యూరపుఖండమున కరిగెను. ఆఖరు దఫా ఆయన అర్ధాంగి శ్రీమతి భారతిదేవిని గూడ యింగ్లాండు వెంట నిడుకొని వెళ్లి కొంతకాలము అచ్చటనుండెను. అప్పడే ఆయన (The Economic Organisation of the cotton industry of Southern India)దక్షిణదేశ దూది పరిశ్రమ ఆర్థిక నిర్మాణం గూర్చి ఒక థీసిస్ ను తయారుచేసి ఆక్సుఫర్డు విశ్వవిద్యాలయం వారిచే తత్పరిశోధనకు బి.లిట్. బిరుదును పొందెను.

స్వదేశమునకు వచ్చిన తరువాత ఆయన వివిధ ఉద్యమాలలో పాల్గొని, చేయుచున్న ప్రజాసేవ అందరకును తెలిసినదే. అయినా కట్టె, కొట్టె, తెచ్చె అన్నట్టు చెబుతా.

1923–27 లో ఆయన కృష్ణా, గుంటూరు జిల్లాలలోని ప్రజల స్థానిక అవసరములు తీర్చుటలోను, తాలూకా రైతు సంఘములు స్థాపించుట లోను, కార్మిక కర్షకోపయోగమైన వ్యాసాలు ప్రకటించుటలో, ఒంగోలు క్షామబాధితులకు సాయం చేయుటలో, కార్మిక, కర్షకుల ఆర్థిక పరిశోధనలు చేయుటలోను, అధికంగా గడపెను.

1927 లో ఆయన పచ్చయప్పా కళాశాలలో ఆచార్య పదవి పొందెను. 1928 లో ఆంధ్రరాష్ట్రరైతు సంఘమును, జమీందారీ రైతుసంఘమును స్థాపించెను.

1929–30 లో ఉభయ గోదావరి కృష్ణా జిల్లాల ఆర్థిక పరిశోధనా కార్యదర్శిగా, రీసెటిల్ మెంటు సందర్భములో పనిచేసెను.1930 లో ఆంగ్ల దేశానికి రౌండు టేబుల్ సభాసమయంలో అరిగి కాంగ్రెసుకు అనుగుణంగా అధిక ఆందోళన చేసెను. 1931 లో వెంకటగిరి ఎస్టేటులో అటవీ సత్యాగ్రహం ఆరంభించెను. రైతురక్షణ సంఘం స్థాపించెను. రీసెటిల్మెంటు ఆందోళన అద్భుతంగా చేయుటవల్ల ప్రభుత్వము వారు అరెస్టుచేసి ఒక సంవత్సరం శిక్ష విధించిరి.

1933 లో ఆంధ్ర జమీందారీ రైతుసభకు ఆధ్యక్షత వహించి జమీందారీ రైతుల ఆర్థిక పరిశోధనచేసి ప్రకటించెను. 1934లో మిత్రులతో కలసి పూనాలో కాంగ్రెసు సోషలిస్టుపార్టీని ఏర్పరచిన ప్రముఖులలో ఒకరు. రైతాంగ విద్యాలయ స్థాపన కూడ ఆ సంవత్సరమే కావించెను.

1935 లో కర్షక సేవకుల సభ ఏర్పాటు చేసి దానికధ్యక్షత వహించుటయే కాక, భారతదేశము అంతట సంచారము చేసి, అఖిలభారత రైతు సంఘ ఆవశ్యకతను బోధించి, కిసాన్ సంఘమును ఏర్పాటుచేసెను. దక్షిణదేశ కార్మిక, కర్షక సమ్మేళనము స్థాపించెను. కేంద్ర శాసనసభా కర్షక బృందమును నెలకొల్పెను, రాయలసీమ క్షామబాధితులకు సాయమొనర్చెను.

1936లో రెండవ కిసాన్ కాంగ్రెసుకు అధ్యక్షత వహించెను.

1937లో శాసనసభా ఎన్నికలలో తీవ్రప్రచారము గావించెను.

1938 లో కర్షక కవుల సన్మానము చేసెను.

1939 లో భారతదేవితో బర్మాకరిగి అచట కార్మిక సభకధ్యక్షత వహించి స్వాతంత్ర్యసమరమునకు పురికొల్పెను.

1940 లో మద్రాసులో ఇంటర్నమెంట్ వుత్తరువును ధిక్కరించినందున సంవత్సరమున్నర శిక్షకు గురియయ్యెను.

1942 లో విడుదలై కలోనియల్ పీపుల్సు ఫ్రీడం ఫ్రంటు ఏర్పరచుట తిరిగి డిటిన్యూగా తీసుకుపోబడి 1944 అక్టోబరులో రెండు సంవత్సరముల అనంతరము విడుదలయ్యెను.

1945 లో బందరులో ఆంధ్ర విద్యార్థి సభను ఆరంభించెను. ఒంగోలు, రాయలసీమ, ఉత్తర విశాఖ క్షామనివారణ ప్రయత్నాలు, ప్రాజెక్టులు. కిసాన్ కాంగ్రెసు స్థాపన కేంద్ర శాసనసభకు పోటీలేకుండ ఎన్నుకోబడిరి.

1916 కేంద్ర శాసనసభలో కాంగ్రెసుపార్టీకి కార్యదర్శియై, కార్య కలాపాలు చూచుట,ప్రపంచ వుత్పత్తిదారుల సభకు లండను అరుగుట, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘ అధ్యక్షుడై కాంగ్రెసు కార్యకలాపములను గావించుట.

## కర్షకమూర్తి

"ఆగునా జీవాలు సాగునా లోకాలు
రాజుగా మనమెంచి రైతు జూడకపోతే
దేశాలు తల లెత్తునా, దాస్యపున్ పాశాలు తా వీడునా."--శెట్టిపల్లి.

*(శెట్టిపల్లి వెంకటరత్నం - ప్రతి సంవత్సరం రెండు, మూడుపాటలు రైతు భజనావళిలో 1934 నుండి 1939 వరకు రాశారు. 26 సంవత్సరాల వయస్సులో హఠాత్తుగా చనిపోయారు. వారి రచనలన్నింటిని ఇంగ్లీషు/తెలుగులో ఏ.జి.స్టాక్ పరిచయంతో రంగా గారు ప్రచురించారు.)*

"Princes and lords may flourish or may fade;
A breath can make them, as a breath has made,
But a bold peasantry, their country's pride
When once destroyed, can never be supplied." – Goldsmith.

దొరలూ, జమీందారులూ ఉండవచ్చును, ఊడిపోవచ్చును. ఒక్క క్షణంలో మళ్ళీ ఉద్భవిస్తారు. కాని ప్రతిదేశమూ తన రైతాంగమును చూచుకుని గర్విస్తుంది. ఆ రైతాంగం నశించెనా, అది పరిహారం లేని నష్టం.

ప్రపంచంలో అధిక జన సంఖ్యాకులు కర్షకులే. భరతావనిలోను అధిక సంఖ్య వారిదే. అన్నదాతలు వారే. అన్ని వృత్తులకు మూలవృత్తి వారిదే. వైదిక యుగాన ఆర్యుల వృత్తి అదే. అన్ని వృత్తులకంటె అధిక గౌరవంగా ఆర్యావర్తములో మన్నింపబడినది అదే. అందుచేతనే నేటికిని వివాహాది శుభకార్యాలకు ప్రతి గృహస్తుడు వర్గవిచక్షణ లేకుండా నవధాన్యములు భూమిలో మొలకవేయు ఆచారము కలదు కద. జనక మహారాజుకూడ భూమిని దున్నినటుల రామాయణం చెప్పుచున్నది. బలరాముడు హలాయుధుడు, శ్రీకృష్ణుడు గోపాలకుడు, శంకరుడు, నందివాహనుడు ఇవన్నీ ఏమిచెప్పుచున్నవి?

మన దేశము వ్యావసాయక దేశమే. మన దేవతలట్టివారే. మన వైదిక మంత్రములు కూడ వ్యవసాయాభివృద్ధినే ప్రతిపాదించును. మనదేశీయులేకాక విదేశీయులగు, రాజప్రతినిధులు కూడ కర్షకుల ఆధిక్యతను ముక్తకంఠంతో పొగిడారు. "అన్నిరాజ్యాంగ వ్యవహారాలు ఎంత చిక్కులైనాసరే, ముందుగ అయిదు యకరాల చిన్నరైతు క్షేమముమీద ఆధారపడి యున్నవి. సర్వకాలములయందు నేడును రైతే ముఖ్య ఆధారము. అతడే ఐశ్వర్యమునకు ఆధిక్యమునకు కారకుడు. యదార్థం వచించాలంటే, అతడే భారతదేశము.

"కృషీవలుని స్వేదబిందువే ఈశ్వరోద్దిష్టమైన ధనము. (Sweat is devine currency) ఇదే అర్థశాస్త్రానికి మకుటప్రాయమైన సూత్రమని అర్థ శాస్త్రానికి ఆదిమపురుషుడగు ఆడమ్‌స్మిత్ అన్నాడు. ఈ సత్యాన్నే, "నహిధాన్య సమానోర్ధనః" ధాన్యంతో సమానమైన ధనం లేదని ఏనాడో అన్నాడు మనభారతీయ ఆచార్యుడొకరు. ఇటుల వివిధ ప్రముఖులచే ప్రస్తుతింపబడిన కర్షకులకు సంఘంలో స్థానములేదు. సాహిత్యములో చోటులేదు. ప్రభుత్వములో పలుకుబడిలేదు. అతన్ని గురించి మొసలి కన్నీరు కార్చువారు లేకపోలేదు. కానియదార్థముగా కర్షకాభివృద్ధికై పాటు పడువారు, పరితపించువారు ఎందరున్నారు? హితము కోరువారు లేకపోయిన మాని, ఇతడిని దోచనివాడున్నాడా? "రైతాంగము దారి తెన్నుగానక,

దారిద్ర్యముచే పీడింపబడుచు అనేక వెతలనొందుచు దుఃఖభాజనమైన తమ విధికి విడువబడి, ప్రభుత్వము, జమీందారులు, వడ్డీవ్యాపారస్తులు, చిన్నచిన్న ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులు, లాయర్లు, పురోహితులు, వీరు వారననేల, వారి దగ్గరకు చేరు అడ్డమైనవారిచేతను, అణగత్రొక్క బడి, దోచుకొనబడుచున్నారు.

*'ఆంధ్రప్రజ'* (జవహర్ లాల్ ఆత్మకథ 62.)

ఈ ఆంధ్రప్రజకై సర్వస్వం ఒడ్డి, సతతం సతమతమగుచు వివిధ వర్గాలకు, రాజకీయ పార్టీలకు, విరోధయి వీరోచితముగా పోరాడుచున్నవాడు భారతదేశంలో ఆచార్య రంగాయే అంటే ఆశ్చర్యపడనక్కరలేదు. ఆయన కర్షకబంధువే కాదు, కర్షక మూర్తే. కర్షకజాతిలో విద్యావంతులు తదితర జాతుల్లోకంటే తక్కువ.వారిలో వున్నత విద్య అభ్యసించి ఉన్నత పదవులు పొందినవారంత కంటె తక్కువ.

నిర్వీర్యమైన రైతాంగంలో చైతన్యం కలిగించింది ప్రప్రథమున మహాత్ముడే. ఆటుతర్వాత కర్షకజాతిలో పుట్టిన పటేల్ ఎట్టి ఉద్యోగం సద్యోగం లేకుండా అపార మైన కర్షకసేవ చేయుటేకాక కర్షకావళిలో ఎంతో చైతన్యము కలిగించి, ప్రపంచానికి విభ్రమ కలిగించాడు. బర్డోలి మొదలగుచోట్ల ఉద్యమాల్లో నేతగా వుండి, మహాత్ముని చేత సర్దార్ బిరుదును పొందాడు.ఆ ఉద్యమమే భారతదేశ కర్షకుల్లో జాగృతి కలిగించింది. రైతులు యథాస్థితివాదులు, విప్లవకారులు కాదన్న మార్క్స దృక్పథాన్ని తలకిందులు చేసింది. నేడు కర్షకులు స్వాతంత్ర్య పోరాటంలో అగ్రగాములుగా వున్నారు. ఆస్తి లేకపోవుట, ఆకలిమంటలు కాదు(మార్క్సిస్టులు చెప్పునటుల) విప్లవాన్ని తెచ్చేవి. చైతన్యము, సరియగు నాయకత్వము, పరిస్థితులు. నేడు రైతుల సర్దార్ యావద్భారతదేశానికి సర్దారుగా వుండి కాంగ్రెస్ వ్యవహారాలను కట్టుదిట్టముతో నడుపుచున్నాడు.

సర్దార్ పటేల్ రైతుల కొరకు పోరాడినా, ఆయన రైతాంగము కొరకు ప్రత్యేక కృషి తీసుకోలేదు. కాంగ్రెసుద్వారానే రైతు సేవ చెయ్యాలని ఆయన అభిప్రాయము. ఆచార్య రంగా రైతాంగ ఉద్యమ నిర్మాత. ఇంతేకాదు నిండు నిలువున ఆయన రైతు. ఆలోచనలో,అభిప్రాయంలో, అభిమానంలో, అభిభాషణలో, ఆచరణలో ఆయన కర్షకమూర్తే. ఆయన కర్షక సఖుడు, సారధి, సచివుడు, గురుడు, దైవము ఏమి కాడు? 'అధికారదృప్తుల, కర్థమతులకు భోగదాసిగ నున్న, భూదేవి దాస్యము బాప

కారణ జన్ముడైన కర్షకమూర్తి'. 'వార్తలోన జగము వర్ధిల్లు చున్నది' కద. ఆచార్య రంగా సేవను ప్రశంసించని పత్రికలేదు.

"Prof. Ranga has done to the Indian peasantry what Sydney Webb did to the British Labour. He knows not only the depths of Kisan India, but he is the founder of the Indian Kisan Movement." ***Indian Affairs***

"సిడ్ని వెబ్బు బ్రిటీషు కార్మికులకు చేసిన మేలే ఆచార్య రంగా భారతదేశ రైతాంగమునకు చేసెను. ఆయనకు రైతులకు సంబంధించిన సర్వవిషయాలు సమగ్రంగా తెలుసు. తెలియుటే కాదు, రైతు ఉద్యమ నిర్మాత కూడ ఆయనే."

***యిండియన్ ఎఫైర్స్***

ఆంగ్లకవియగు షెల్లి The poets are unacknowledged legislaters of the world. ఏరాజుకారాజు తన రాజ్యంలోనే పరిపాలన చేస్తున్నాడట. ఈ కవిరాజులు ప్రపంచమంతా పరిపాలన చేస్తున్నారట. అట్టివారి అభిప్రాయం ఆదరించకపోతే, కొంపదీసి వీరుకూడ కొట్లో వేస్తారేమో ! కనుక వారి అభిప్రాయాలు చెప్పక తప్పదు ఏ విధంగా చూచినా!

బి.యస్.మూర్తిగారిని పాఠకలోకం ఎరిగివుండవచ్చును. ఆయన రాజకీయాల్లో రాటు తేలినవాడేకాక, సాహిత్యంలోను సరుకుగల వాడె. ఆయన 'ఆంధ్రవీరకుమారా'! అనే మకుటంతో ఒక పుస్తకం రాశాడు. అందులో ఆంధ్ర దేశంలో గల వివిధ నాయకులను గురించి కూడ విప్పిచెప్పాడు. రంగాను గురించి ఆయన అభిప్రాయం.

"భారత సౌభాగ్యంబున, కారయ రైతు, అతని సుఖములం
గోరి శ్రమలందు రంగా, పేరు మరువకోయి ఆంధ్రవీరకుమారా"

గుంటుపల్లి సీతారామయ్యగారు, ఈ మహనీయుడు 'మహతి'లో ప్రకటించారు (సంపుటం 2 సంచిక 2) ఈ రంగడెవ్వరో? అను మకుటంతో ఇది మకుటాయమానంగా వున్నదని మనవి.

❶'రంగరంగంటావు !సాష్టాంగపడతావు ! కావేటిరంగ మము కావు కావంటావు! ఈ రంగడెవ్వరో ఊహింపగలవా ? కావేటి తీర్థాన

❷ శ్రీరంగ క్షేత్రాన యాత్ర జేసే ప్రజల నానంద వీచికల నోలలాడించేటి శ్రీరంగనాథుడా ?

❸విపులాట్టహాసాన విపరీత భోగాన సకలసౌఖ్యాలలో సంతతారాధనల తులదూగుచుండేటి శృంగార రంగడా?

❹చంద్రభోగా సముత్తుంగభంగములతో పొంగారు భక్తితో డెందాన నానంద మందుచుండెడు భక్తబృందముల బ్రోచు శ్రీపండరీ రంగడా?

❺చంద్ర భాగా నదీ స్వచ్ఛతోయమునందు మంత్రపూతస్నానాన మహిమతో వెలుగొంది సంకీర్తనలుచేయు సాధుపుంగవుల హృద్రంగముల వెలుగొందు సదయాంత రంగుడా?

❻ కాదు, కాదీతడు కష్టజీవుల బ్రోవ నిత్యయత్నముజేసి నిలువునా కష్టించి పేరుగన్నట్టి యా ప్రఖ్యాత పురుషుండు !

❼కడుపు మంటలతోడ కండ్లప్రాణముతోడ పలుపాట్లు పడుచున్న పామరుల బ్రోవంగ కంకణము గట్టిన కర్మ వీరుండితడు !

❽ అసమాన వాగ్ధాటి పసమీరునా ప్రజ్ఞ ఉఝ్ఝాత లూపించు ఉద్వేగ మెక్కించు సాహసిని గావించు శక్తిమంతుండితడు.”

మాధవపెద్ది బుచ్చిసుందరరామశాస్త్రి గారిది తెనాలి. ఆయన రంగా హృదయము, శక్తిసామర్థ్యాలు ఎలా రంగరించి పోశాడో చూడండి. “రంగాకింక నితఃపరంబనఁగ నిర్లక్ష్యమ్ము ప్రాణంబు రైతాంగంబన్న, స్వపక్షమాతఁడొక పల్కాడంగ నేరీతి నుప్పొంగం జొచ్చునొ, శతృపక్షమటులే బొమ్మాడెడిన్ వాని వాగ్భంగిన్ విశ్వమె గింగిరాల్ దిరిగిపోవన్ సాగునొక్కొక్కడన్”

ఆయన గ్రామానికి అందుబాటులోవున్న గోవాడలో గొప్ప శిలావిగ్రహం స్థాపించి గుంటూరు గొప్ప నిలబెట్టారు. అందరకు అన్నంపెట్టే రైతాంగం ఎంత ఋణములో క్రుంగి కృశించిపోతున్నా ఆయన ఋణము తల తాకట్టయినా పెట్టి తప్పక తీరుస్తుంది.గోవాడలో యిటీవల (1945 నవంబరులో) జరిగిన శిలావిగ్రహ ప్రతిష్ఠసందర్భంలో కవికుమారులగు వేదుల జగన్నాధరావు. వంగల శివరామ బ్రహ్మము గారలు ఆచార్య రంగాకు ధన్యవాదములు అర్పించుతూ చెప్పిన పద్య రత్నాలు.

ఆయత సర్వవైభవ సమన్వితమౌ సిరియింటబుట్టి యా
ప్యాయ మహాధికార సముపార్జక విద్యల నేర్చియున్ దృణ
ప్రాయముగాగ తద్విభవభాగ్యములన్ ద్యజియించి రైతు నా
రాయణ సేవజేయగ దృఢవ్రతమూనితి త్యాగశీలివై. ||

మిసమిసలాడి పాలతెలిమించుల వెన్నుల క్రొత్తజాళువా
పసిడి మెరుంగు మేలిమి రవల్ వెదజల్లు హరిద్రవర్ణ పుం
బసలు వెలార్చుక్రొవ్వరుల పంటపొలాలకు రైతురక్షణా
భ్యసన విధానతానముల బల్కెడు మీదు మనోవిపంచియున్. ||
రమణీయంబగు పూర్ణసస్యఫలలక్ష్మీ పట్టభద్రత్వమున్
కమనీయాకృత వాగ్ఝరీజలకణస్నానాన జాతీయతా
విమలాశంసన పాలనీయ పృథివీచక్రంబునన్ గూర్చి వి
భ్రమనీయంబగు సేవచేసితిరి వహ్వా ! భారతీదేవితోన్ ||

రంగా నామము రైతులోకమున కెల్లన్ కొంగుబంగారమై
రంగారన్ రహిగాంచి కర్షక జనార్తా రావముల్ మీ ప్రభా
సాంగోపాంగవిధాన మార్గతతులన్ సాధింపగానెంచి స
త్సాంగత్యంబున కాంగ్రెసున్ ప్రబల సత్వన్ జేయ ధర్మమ్మగున్ ||

ప్రాచీనంబగు రైతుగౌరవము సంభావించి తోడ్తోపున
శ్శ్చాచద్యోతముచేయ కంకణము హస్తంబందునన్ దాల్చు మీ
కాచారంబగు కర్షకీన గురు సేవావాస్త సౌఖ్యంబులో
ఆచార్యా ! భరతాంబధన్య, భవదీయా విర్భవప్రౌఢిమన్ ||
"దున్నరా ఈ తెలుగుభూమిని – తొలుకరించిన పుణ్యభూమిని
కఱవులేని స్వర్గరాజ్యపు – దొరవు నీవయ్యెదవురా!"

––– తురగా వెంకట్రామయ్య

# మహాత్మునితో సంబంధము



ఆ బోసినవ్వులో అస్తమించును దేశ
దారిద్ర్యతిమిర సంతానపటలి
ఆ వెట్టిచూపులో అవతరించును భవ్య
సౌఖ్యోన్నతంపు విశ్రాంతమధువు,
ఆ మితభాషలో అవఘళించును జాహ్న
వీపయఃపూర గంభీరరవము,
ఆ ఫాలభాగాన అలుముకొన్నది దిగ్గి
గంత యశోవిజయార్ద్రరేఖ,

అతడు అడుగు మోపినచోట, అమృత మొలుకు;
అతని గాలి వీచినచోట మతులు కుదురు
అతడు సాక్షాత్తు శాంత బుద్ధావతారు,
డంచు తెలియుమో తండ్రి విజ్ఞానబుద్ధి. – జంపన

మన దేశంలో అనేక మతకర్తలు పుట్టారు. కొందరు రాజకీయ వేత్తలు జన్మించారు. కాని రెంటిని సమ్మేళనచేసి లోకాన్ని సంతరించిన వారు లేరు. మహాత్ముడు ఋషి, రాజకీయవేత్త, ఆరితేరిన ఆధునిక ప్రజా నాయకుడు. ఆయన నిద్రాణమైన భారతజాతిని మేల్కొలిపాడు. లక్షలాది త్యాగ మూర్తులను, వేలాది నాయకులను సృజించాడనుటకంటే, ఒక నూతనజాతిని సృష్టిచేశాడనిచెప్పవచ్చు. కాంగ్రెసుకు సారథియై 26 సంవత్సరాలనుంచి నడుపుచున్నాడు, తన దేశ సేవద్వారా విశ్వమానవసేవ చేయుచున్నాడు. జాతీయ దురహంకారంతో ధూళి ధూసరమైన పృధ్విని తన సత్య అహింసాబోధలద్వారా పునీతమొనర్చుటకు పూను కున్నాడు. ఆయన భారత దేశములోను, ఆసియాఖండములోను మార్పు తెచ్చుటే కాక, విశ్వమంతటా మార్పు తెచ్చి మన్ననల గాంచాడు.

1.1920 లో శిస్తు నిరాకరణ వుద్యమం ద్వారా రైతులను రాజకీయ రంగమునకు తెచ్చాడనే ఉద్దేశ్యముతో మహాత్మునియెడ ఆచార్యునకు అధిక ప్రేమ ప్రప్రథమమున కలిగినది.

2 1925లో మహాత్ముని దర్శనం మొట్టమొదటిసారి ఆయనకు కలిగింది. అప్పడే డా.అనిబిసెంటు ఆస్తిగలవారికి, చదువుకొన్నవారికి మాత్రమే ఓట్లు ఉండాలి అని ఆమె అంటూవుంటె, హరిజనులకు వయోజనులకు ఓట్లు కావాలనే రంగా వాదాన్ని మహాత్ముడు అంగీకరించెను, దానితో మహాత్మునియందు పరిపూర్ణ విశ్వాసము ఆయనకు కలిగెను.

3. 1931 జనవరిలో వెంకటగిరిలో జమీందారీ పెత్తనము పోవాలనే రంగా సూచనను గాంధిజీ అంగీకరించుటేకాక శాసనసభా కార్యమువల్లనే కాక, సత్యాగ్రహమువల్ల కూడ జమీందారీ పెత్తనము పోగొట్టాలని రంగాకు సలహా నిచ్చెను. అదివరకు ఆంధ్రదేశపు కొందరు పెద్దలు రంగా రైతుసంఘ నిర్మాణపు జమీందారీ వ్యతిరేక ప్రచారాన్ని అరికట్టి గాంధీజీ నుండి శ్రీముఖాన్ని తీసుకు రావాలని, యత్నించి విఫలులైరని ఆయనకు తెలుసు. కనుకనే ఆయన ఈ వెంకటగిరి సంపర్కము గాంధీజీ యొక్క అభివృద్ధిదాయకము, విప్లవకారియగు నాయకత్వముపై గురికలిగెను. అట్లే మహాత్ముని హరిజనోద్ధరణ కూడ విప్లవాత్మకం అని ఆయన విశ్వసించెను.

4. మహాత్మునికి కూడ, నాటినుండి రంగా మీద ప్రత్యేక విశ్వాస మేర్పడెను. అప్పడే భారతీదేవికి ఆంధ్రదేశ భక్తురాండ్రమధ్య ఎంత ప్రతిష్ఠగలదో తెలిసికొని ఆమెను ప్రత్యేకంగా ఆశీర్వదించెను.

5. 1935 లో గాంధి – ఇర్విన్ ఒడంబడిక ననుసరించి దేశమంతట తిరిగి ఉప్పు చేసుకొనుటకు కృషి చేస్తున్నందుకు రంగాను గాంధీజీ ఎంతో మెచ్చుకొనిరి.

6. రైతాంగ విద్యార్థులకు మహాత్ముడు 1936 మే 9 తారీఖున ప్రత్యేక సందేశమును పంపెను.

7. 1933 డిశంబరు 23తారీఖున మహాత్మాగాంధీజీచే రామానీడు వయోజన విద్యాలయమును తెరిపించెను. ఆ భవనమే రైతాంగ విద్యాలయానికి ఉపయోగపడు చున్నది

8. 1936నుండి, 6 నెలలకు ఒకసారి ఆచార్య రంగాను, మహాత్ముడు సేవా గ్రామానికి రప్పించుకొనుచుండెను.

9.1936 లో ఆయన, ఫైజుపూరు కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షోపన్యాసములో గాంధీజీయే ప్రథమ రైతాంగ రాజకీయవేత్తయని ఉద్ఘాటించెను.

10. 1937-39 మధ్య కాంగ్రెసు మంత్రివర్గాల సమయంలో వారిద్దరి మధ్య, కొన్ని విభేధాలు కలిగినవి. ముఖ్యకారణము మంత్రి వర్గాలు చురుకుగా పనిచేయకపోవడం. కమ్యూనిస్టులు హింసాత్మక ఆందోళన చేస్తున్నారనే భయం.

11. 1937-39 లలో పెద్దలనేకులు, ఆయనపై ఏదేదో చర్యలు తీసుకోవాలని రైతుసంఘాలను నిషేధించాలని ప్రయత్నించుచున్నా, రంగాపై రాయిపడకుండా కాపాడుకుంటూ వచ్చాడు మహాత్ముడు. కారణం అఖిల భారత రైతాంగానికి దొరికిన, ఉన్న స్వచ్ఛందమగు రైతునాయకుడు, సేవకుడు రంగా ఒక్కడేనని ఆయన విశ్వాసము.

12. 1937 లో ఒకసారి, 1939లో మరొకమారు, గాంధీజీ రంగాను పూర్తిగా తన సేవా కార్యవిధానం పెంచవలసినదని కోరెను. అప్పటికింకా ప్రపంచ జాతీయ విప్లవ పంథా (World role of National Revolution) ధోరణి కలుగలేదు. కిసాను మజుదూర్ ప్రజారాజ్య నినాదము హృద్గతము కాలేదు. కనుక రంగా మహాత్ముని ఆహ్వానమును అంగీకరించజాలక పోయెను.

13. 1939-40 లో జాతీయ సంఘర్షణను, త్వరితంగా సాగించాలనే ఆతురతచేత, మహాత్ముని ప్రాథమిక ఆశీర్వాదము పొందగోరెను. అహింసాత్మకంగా సాధించ గలిగితే మహాత్ముడు ఆశీర్వదించెద ననెను. కమ్యూనిష్టుల నమ్మరాని వైఖరి తెలిసిన తరువాత, అట్లు ప్రారంభించనని రంగా మహాత్మునికి తెలిపెను. అందులకు ఆయన తృప్తి చెందెను.

14. కాని 1940 లో రంగా యింటర్నమెంటు ఆర్డరును ధిక్కరించగా ఆయన స్వతంత్రించి పోరాటం పెట్టెనని భ్రమచెంది, రంగాపై ఆగ్రహించి ***హరిజన*** పత్రికలో ఆయనపై వ్యతిరేకంగా వ్రాసెను. రంగా మహాత్మునకు ఇచ్చిన సమాధానంచూచి, తిరిగి సుహృదయుడై రంగాను ఆశీర్వదించెను.

15.1942 లో జైలునుండి రావడంతోటే రంగా తన యావచ్ఛక్తియుక్తులు మహాత్ముని సేవావిధానానికి అర్పణచేస్తున్నానని ఆయనకు విన్నవించెను.

16. 1944 లో రంగా జైలునుండి వచ్చి, మహాత్ముని కలుసుకున్నప్పుడు వారి ఉభయ హృదయాలు ఒకటైనవట.... రంగా రైతాంగ శక్తుల హృదయం, సేవలను మహాత్మాజీ స్వీకరించి, ఆశీర్వదించి పెంపొందింప పూనుకొనెను.

17. రంగా రైతాంగ విద్యాలయమందు 1937 లోనే గాంధి..లెనినుల సిద్ధాంతాలను పోల్చిచూపెట్టి గాంధీజీ మహత్తర విప్లవనాయకుడని నిరూపించెను.

18. 1945 లో రంగా గ్రంథాలన్నిటిని చదువుతూ, నీలగిరి జాతులు (Tribe of Nilgiris) అనే దానిని ప్రత్యేకంగా ప్రశంశించుచూ మహాత్ముడు ఆయనకు ఉత్తరము వ్రాసెను.

19. రంగాపై అన్నివర్గాలు కోపించుచున్న ఆ 1940 లో కూడ ఆయన పాండిత్యాన్ని, ధైర్యసాహసాలను, చిరకాల రైతాంగ సేవను తనతో ఆయనకుగల చనువును, ప్రేమను ప్రత్యేకంగా మహాత్ముడు ఉగ్గడించెను.

20. తదితరులవలెగాక, తనకబ్బిన గాంధీజీ స్నేహాన్ని మరెందరకో కలిగించాలనే తాపత్రయం రంగాకు కలదు.

21. పతితదేశాల ప్రజల సేవకై రంగాకు ప్రోత్సాహమిస్తున్నాడు గాంధీజీ.

22. కాంగ్రెసులో ముఖ్యపాత్ర వహించుచున్న సర్దార్‌పటేల్, రైతు నాయకుడగు రంగాల మధ్య పరస్పర సహకారం పెంపొందించాలని మహాత్ముని కుతూహలము.

23. ఆచార్య రంగాచే ప్రతిపాదింపబడిన, రైతుకూలీ ప్రజా రాజ్యాన్ని మహాత్ముడు ఆశీర్వదించి అక్షతలు వేసెను.

24. ప్రపంచ ఉత్పత్తిదారుల సభ, కోపెన్‌హాగన్ సభల కరుగునపుడు, ఆచార్యుడు మహాత్ముని ఆశీస్సులను పొంది అచట కార్యక్రమము విజయప్రదముగ నిర్వర్తించుకొని, మహాత్మునకు విన్నవించి ఆయన మెప్పును పొందెను. మహాత్ముని ఆశీస్సులు కలవారు ధన్యులుగదా !

కాంగ్రెసు ఆదేశానుసారం ఆరుసార్లు జైలుకుపోవుటయే కాక రంగా నిరంతరం దేశసేవ చేసినాడు. ఆయన నిర్మాణకార్యక్రమం చేయుటలో కూడా గణనీయుడు. మహాత్ముని ఆదేశానుసారం పల్లెలలోనే ఉంటూ అక్కడి ప్రజల ప్రయోజనాలకే పలు విధముల కృషి సల్పెను. గ్రామసౌభాగ్యం కోసం అధికంగా సేవ, అపూర్వమైన పుస్తకాల ద్వారా ప్రచారం చేశాడు. తమ హస్తనైపుణ్యంచే

భారతదేశ ఖ్యాతిని ప్రపంచం అంతటా వ్యాపింపజేసి వివిధ దేశాలనుండి ధనరాశులను మన మాతృభూమికి రప్పించిన చేనేత పారిశ్రామికులు యంత్రాల పోటీని తట్టుకొనలేక లెక్కకు కోటికి మించిన సంఖ్యతో  కృశించుతుంటే వారి దీనస్థితిని చూసి  దయతలచిన వారు లేనప్పుడు, సహాయసంపత్తిని అందించిన వారు లేని సమయాన ఆంధ్రరాష్ట్ర చేనేతసంఘమునే కాక అఖిలభారత చేనేత కాంగ్రెసు సంఘమును కూడా అల్పకాలములోనే ఏర్పాటు చేసి, వారిలో రాజకీయ చైతన్యము కలిగించి, వారిని కాంగ్రెసుకు బాసటగా నిలిపిన కార్యశీలి రంగా. గ్రామ పునర్నిర్మాణానికి, హరిజనలు , గిరిజనులకు ఆయన చేసిన సేవ నిరుపమానం.

ఆయన ఆర్థిక శాస్త్ర గ్రంథాలన్నీ గ్రామస్తుల ప్రయోజనాల కోసమే రచించ బడ్డాయి. అఖిల భారత మినహాయింపు ప్రాంతాల మహాసభ ఆయన సృష్టియే. "గ్రామ  ప్రజల అవసరాలను బాగా అర్థం చేసుకొని, హృదయపూర్వకంగా వాటి కోసం పాటు పడుతున్నది ఒక్క రంగా గారే" అన్నారు వైస్రాయ్ కార్యనిర్వాహక సభ్యులలో మేధావియైన  సర్ జేమ్స్ క్రిబ్.

ప్రణాళిక  వ్రాయడంలో ఆయనది పెట్టింది పేరు. ఆయన వయోజన విద్యా ప్రణాళిక ప్రపంచ ఖ్యాతి గాంచినది. ఆయన రైతాంగ విద్యాలయం, పౌరసత్వ కళాశాల  అనుకరణీయాలు అయినవి.

ఆయన గొప్ప వీరుడు. ఆయన వీరోచిత కార్యాలెన్నో ఉన్నాయి. మోహనలాల్ సాగ్జానా తో కలసి అసెంబ్లీ  భవనం మీద గల యూనియన్ జాక్ పతాకాన్ని లాగివేసిన వీరుడు. 1930 లో కృష్ణాజిల్లాలో సత్యాగ్రహ సమయాన అంగలూరు మొదలగు ప్రాంతాలలో పోలీసులు చేసిన అత్యాచారాలను ఆయా ప్రదేశాలకు వెళ్లి వారితో ఎంతో ధైర్యంగా పోరాడి, వారిని అరికట్టుటకు ఎంతో కృషి చేసి, ప్రజల భయాందోళనలను బాపి, పోలీసు జులుం ను అరికట్టగలిగిన అమిత ధైర్యసాహసోపేతులు.  యుద్ధ నిరోధక సమయంలో ఆయన  వీరోచితంగా 1940 లో ప్రవాసాజ్ఞను ధిక్కరించిన సంగతి లోకవిదితమే. అందుకే ఆయనను మహాత్మా గాంధీ  "ఆచార్యరంగా అతి ధైర్యశాలి"  అని ప్రశంసించాడు.

కొందరికి మాట్లాడగల శక్తి ఉంటే  వ్రాయగల నేర్పు ఉండదు. వ్రాయగల నేర్పు ఉంటే మాట్లాడగల దక్షత ఉండదు. రంగాకు అన్నీ ఉన్నాయి.  ఆయన వక్త, వాదచతురుడు. అసమాన ఆందోళనకారుడు. ప్రచండ ప్రచారకుడు. నిర్మాణ నిపుణుడు, పండితుడు, ఆర్థిక పరిశోధకుడు, విమర్శకుడు.

గ్రంథ రచయితగా నూతన దృక్పథంతో, సమకాలీన సమస్యలకు అద్దం పట్టే పలుగ్రంథాలను రచించారు. అంతే కాక సాహిత్య పరంగా కూడా విప్లవాత్మక మార్పులు తీసుకు రాగలిగారు. ఆంధ్రసాహిత్య పరిషత్, నవ్య సాహిత్య పరిషత్‌ల మధ్య భాషా వివాదాలున్నాయి. ఆచార్య రంగా భాషా విషయంలో నే కాక వస్తు విషయంలోనూ ఇదివరకు ఎవరూ తీసుకురాని మార్పు తీసుకువచ్చారు.

మన కవులందరూ ప్రాచీనుల ప్రాముఖ్యాన్ని , మనదేశ ప్రాశస్త్యాన్ని, మన రాజుల ఆధిక్యాన్ని గానం చేశారు గాని లోకానికి ఆధారభూతమైన కర్షక, కార్మికుల గూర్చి కన్ను ఎత్తి చూడలేదు, పన్నెత్తి పలుకలేదు. ఇంతే కాదు, కవిరాజు రామస్వామి చౌదరి కురుక్షేత్ర సంగ్రామంలో “ఆముటెద్దులు రెండు పోరాడు చుండ నడుమ నున్న లేగల కాళ్లు నలిగినట్లు” అంటే అది శూద్ర ఉపమానం అన్నారు విమర్శకులు. కర్షక ఇతివృత్తం కావ్య వస్తువుకు తగదన్నారు కవులు, పత్రికాధిపతులు కూడా. ఆయన ప్రకటించిన రైతు భజనావళి, కష్టజీవుల ప్రాముఖ్యము సాహిత్యంలో తీవ్ర పరిణామం తెచ్చాయి. దాని తరువాత అటువంటి గేయకావ్యములు అనేకం బయలు దేరినవి. కర్షక ఇతివృత్తము గల అనేక గ్రంథాలకు ఆయన పరిచయం వ్రాసి ప్రచార ప్రాముఖ్యం చేశారు. రైతు గ్రంథమాల పెట్టి కర్షక కవులకు సన్మానాలు చేసి, వారి రచనలను ప్రోత్సాహపరచారు. రంగా గారి కృషి ఫలితమే నేడు అందరూ కార్మిక, కర్షక ఆలాపన చేయుట. జానపద గేయాలలాగా ఈ గేయాలు ప్రచారంలోకి వచ్చుటకు కారణభూతుడు ఆయనే. ఈ విధంగా భాషతో పాటు భావము పైన కూడా ప్రభావం చూపిన ప్రతిభాశాలి రంగా. వాహిని వంటి పత్రిక ద్వారా, పలు వ్యాసాల ద్వారా పత్రికా ప్రపంచంలో కూడా ఆయన చూపిన మార్గాలు అనుసరణీయం.

“ లోకమంతా నిద్రపోతున్న సమయంలో కాంగ్రెసు వారు తలపెట్టని రోజుల్లో ఈ దేశంలో సంఘం ద్వారా రైతులను మేల్కొలిపి రైతు, రైతు అని మొరలిడి, రైతు బాధలు తొలగింప తలపెట్టాడు రంగా.” అన్నది కృష్ణాపత్రిక . వివిధ ప్రాంతాల కర్షకోద్యమాలను ఏకముఖం చేసి స్వరాజ్య పోరాటానికి సోపానంగా సాధించిన వారు లేరు. ఈనాడు అటువంటి ఉద్యమం ఒక రూపం ధరించడానికి కారణ భూతుడు అయ్యాడాయన. భారతదేశం కనీవినీ ఎరుగని నూతన పద్ధతులను రైతు ఉద్యమంలో ప్రవేశపెట్టింది రంగాగారే. రైతు రక్షణ

యాత్రలు, రైతు రాయబారాలు, రైతు రక్షణ దినం, రైతు విద్యాలయం, రైతు భజనావళి మున్నగునవి  వీరి మానసిక పుత్రికలే.

## కుటుంబ జీవితము

రంగాకు ఇద్దరు తమ్ములు. అందులో ప్రథముడు వెంకటప్పయ్య, స్కూలు ఫైనల్ వరకు చదివెను. కుటుంబవ్యవహారం దిద్దవలసి వచ్చుటచే ఉన్నతవిద్య చదువుటకు వీలుకలుగలేదు. ఈయన మంచి ఉద్రేకి, ఉత్సాహ వంతుడు. గ్రామములో ఒక పెత్తందారు. కాంగ్రెసు రైతు ఉద్యమాలంటే అభిమానమే కాదు, శక్తికొలది సేవచేయును. ఈయన కొన్ని సంఘాలు పెట్టించెను. వడ్డి ఉప్పరులకు ప్రత్యేక వృత్తి సంఘములు ఏర్పరచుచు, కృషిచేయుచుండును. కనుకనే గరికపాడు సమీపములో ఉప్పరులు వేరేఊరు కట్టుకొంటూ "రంగాపురము' అని నామకరణ మొనర్చిరి. గుంటూరుజిల్లా యానాదుల సంఘమును నెలకొల్పి పనిచేయుచున్నాడు. ఇచ్ఛాపురం నుండి బయలుదేరిన రైతు రక్షణ యాత్రాదళంలో వుండి విజయవంతముగా సాగించుటలో సాయసంపత్తి కలుగజేసెను.

ఆచార్య రంగాకు రెండవ తమ్ముడు లక్ష్మీనారాయణ. ఆయన ఎమ్. ఏ. ఎల్.ఎల్. బి. ప్రాక్టీసు చేయక గ్రామములోనే వుండి స్వంత సేద్యము చేయుచు రైతాంగానికి వివిధరీతుల సాయము చేయుచున్న రైతునాయకుడు, గుంటూరుజిల్లా రైతు సంఘమునకు అధ్యక్షుడుగను, ఈనాందారీ రైతుసంఘ అధ్యక్షుడుగను, అఖిలభారత కిసాన్ సభకు కార్యదర్శిగను పనిచేసెను. ఒంగోలు జిల్లాబోర్డు కాంగ్రెసుపార్టీకి నాయకుడుగను వ్యవహరించెను.

కమ్యూనిష్టులు రైతు సంఘాలలో చేరి రైతులకు చేయుచున్న అన్యాయము చూస్తే ఎంతో దారుణంగా తోస్తుంది. ప్రభుత్వమువారు కంట్రోలు పెట్టకమునుపే, కమ్యూనిష్టు కృష్ణాజిల్లా రైతు సంఘం ధాన్యంబస్తా 10 రూపాయలకు కంట్రోలు చేయమని తీర్మానము చేసింది. ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ అధ్యక్షుడు అదే పాలికేక వేశాడు. ఆంధ్రరాష్ట్ర రైతు సంఘం (కమ్యూనిష్టులది) 1943.9.13వ తారీఖున బస్తా 1 కి 10 లేక 11 రూపాయలు వుండాలని తీర్మానించింది. ఇది ఎంత ఘోర అన్యాయమో ఆలోచించండి. రైతులు కొనేవాటికి కంట్రోలులేకుండ, రైతు పండించే ధాన్యాలకు రైతు సంఘాల పేరనే కంట్రోలు చేయమని కోరుట రైతుల నట్టేట

ముంచుటేగదా ! రైతు సంఘము వర్గసంస్థ. ఆ వర్గలాభముకొరకు అది ఏర్పడింది. అట్టి వర్గసంస్థ రైతుల లాభముకొరకు పాటుపడకపోగా, వారిని నష్టపరచుటా? కమ్యూనిష్టులుగా కంట్రోలుకావాలంటే అర్థముంది. రైతు సంఘాల పేర రైతులనే కూలద్రోయుట క్షమింపరాని అపచారము. దీనికంతా కారణము ఒకటే. కమ్యూనిష్టుపార్టీ కార్మికవర్గము పార్టీ కార్మికుల క్షేమమే వారికి కావలసింది. ఏ వర్గసంఘములో వున్నా, వారు వారిపార్టీ దృక్పథముతోనే పాటుపడతారు.

కంట్రోలు కంట్రోలని నినాదాలు యిచ్చేవారు, అసలు ధరలు పెరగటానికి కారణాలు కనుగొంటే బాగావుంటుంది. ధరలు పెరగటానికి నాలుగు కారణాలు కనిపిస్తాయి. 1. ప్రజల అవసరాలు పెరగడము, 2. సప్లయి తగ్గడం, 3.డబ్బు చలామణి పెరగడం, 4. మారకం రేటు వేగంగా మారటం. ఈ నాలుగులో ఏ ఒక్క కారణంచేతనైనా ధరలు పెరగటానికి అవకాశము వున్నది. ధాన్యం సందర్భములో సయాం, బర్మాల నుండి వచ్చే బియ్యం సప్లయి తగ్గింది. డబ్బు చలామణి నాలుగురెట్లు పెరిగింది. ఇక ధరలెందుకు పెరగవు? శాస్త్రరీత్యా పెరుగుతాయి.

ఈ సంగతంతా గ్రహించే ఆరవ ధరల కంట్రోలు కాన్ఫరెన్సులో ధరలను కంట్రోలుచేయుటలో ప్రభుత్వానికిగల యిబ్బందిని వాణిజ్యసభ్యుడిలా వచించాడు: "ఉత్పత్తిదారుడు వినియోగము చేసే వస్తువులనుకంట్రోలు చేయకుండా, అతను ఉత్పత్తిచేసే సరుకుల ధరలు కంట్రోలుచేయుట అన్యాయము. పైగా ఉత్పత్తిదారుని జీవిత ఖర్చు, ఉత్పత్తి ఖర్చు ఎక్కువైన విషయాన్ని గమనించుటలేదు." 1939 అక్టోబరునుంచి 1943 సెప్టెంబరు వరకు అన్ని ధరల కంట్రోలు సభలలోను, ప్రభుత్వాధికారులు యిదే అభిప్రాయాన్ని ప్రకటించుచుండిరి. కనుకనే యం. యన్. రాయ్. యిలా అన్నాడు. “The price control conference clung to the view that the agriculturist deserved to be benifitted through a rise in prices in Wartime" “ధరల కంట్రోలు సభవారు యుద్ధసమయంలో ధాన్యం ధరలు పెరిగిన ప్రయోజనాన్ని రైతు అనుభవించుటకు అర్హుడనే దృక్పథంతో వున్నారు”.

పైకి ధాన్యం ధర పెరిగినట్లు కనబడ్డా రైతు అధిక లాభము పొందుటలేదు. కారణమేమంటే ఉత్పత్తిదారునకు జీవితపుఖర్చు ఉత్పత్తి ఖర్చుకూడా పెరిగి

పోయింది. కనుక అధిక ధరలవల్ల రైతు పొందవలసిన లాభము పొందుటకు అవకాశము లేకుండాపోయింది.

ఈ సంగతిని గమనించే కృష్ణాపత్రిక యిలా వ్రాస్తోంది. "ధాన్యం ధరలు 1 రెట్టు పెరిగితే వ్యవసాయపు ఖర్చులు 3 రెట్లు పెరిగినవి. 100 రూపాయలకు వచ్చే ఎద్దు 400 యిచ్చినను దొరకడంలేదు. ఇతర పదార్థాల మాట చెప్పనక్కరలేదు. వీసె 0-4-0 (అణాలు) అమ్మే చింతపండు వంటిది సాంబారునీళ్లు త్రాగే యీ రాష్ట్రవాసులు లక్షలాదిగా సైన్యములో చేరుటవల్ల 1-0-0 వరకు పెరిగినది. ఏ వస్తువుచూచిన కొనబోతే కొరివియై వూరకున్నది. ధాన్యంధరలు కంట్రోలుచేసి రైతుల రాబడికి మితి యేర్పరచి అతనికి కావలసిన యితర వస్తువులను కంట్రోలుచేయక, చేసిన వస్తువునైనను చీకటి బేరాల పాలుగాకుండ ఆపజాలని ప్రభుత్వమును, దాని ఉద్యోగులును రైతులు బలిసిపోయిరనుకొందురని మేము నమ్మజాలము' 1945-11-10.

ఈ విధంగా పత్రికలు, ప్రభుత్వోద్యోగులు కంట్రోలు రైతు పండించేవాటికి పెట్టుట అనర్థకమంటుంటే కమ్యూనిష్టులు కేవలం కార్మికుల లాభం కొరకు,యుద్ధ కృషికొరకు (యుద్ధసమయములో భారతదేశకార్మికులు సమ్మె చేసిన రష్యాకు తీరని నష్టం వస్తుందని తలచి) కంట్రోలు నినాదాన్ని లేవదీసి రైతులను తిండిదొంగలని ఇంకా అనరాని, వినరాని మాటలంటూవుంటూ రైతులను బాధ పెడుతూవుంటే ఆంధ్రరాష్ట్ర రైతు సంఘము(రిజిష్టర్డ్)రైతుల తరపున నిలబడి అఖండ సేవ చేయుచున్నా, దానికింకా బలము యిచ్చుటకు ధాన్యోత్పత్తిదారుల సంఘం పెట్టి దానికి కార్యదర్శిగా వుండి ధాన్యంధరల కంట్రోలును గురించి ప్రథమమునుండి కమ్యూనిష్టుల వైఖరి, రైతు సంఘాలు అవలంభించిన (కమ్యూనిష్టు) రైతు వ్యతిరేక నష్టదాయకవిధానము పూర్తిగా ఖండించుటే కాక, ధాన్యంఉత్పత్తిదారుల సంఘం తరపున కమ్యూనిష్టుల సంకుచిత-ప్రమాదకరమైన ధాన్యం ధరలను గురించి ఖండించుచూ, ప్రభుత్వ నిరంకుశ విధానమునకు తోడ్పడిన జాతీయ వ్యతిరేక పంథాను ఖండిస్తూ, తీర్మానములుచేయుచు, ధాన్యముబస్తా 1 కి 12 రూపాయలు ఉండాలనీ, రిక్విజిషను, ఎక్విజిషనులో రైతులకు కలుగుచున్న కష్టనష్టాలు నివారించుటకు లక్ష్మీనారాయణ అశేష శ్రమచేశాడు. అనేక సభలు, సమావేశాలు, ప్రకటనలు చేసి ప్రభుత్వోద్యోగులను కలసికొని వారితో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి.

ఎన్నోవిధాల రైతాంగానికి అమిత సేవచేసి, రంగా అనుంగు తమ్ముడని అనిపించుకొని ఆయన కారాగృహములో ఉన్న సమయాన ఆయన లేని లోటు తీర్చిన రైతాంగబంధువు లక్ష్మీనారాయణ.

ఆయన గొప్ప సేవకుడయినటులనే ఆంధ్ర సాహిత్యములో, రంగాతో సరితూగ గలడు. ఉభయుల రచన ఒకేమాదిరి వుంటుంది.లక్ష్మీనారాయణ వాహిని పత్రికకు సంపాదకుడుగా వుండి సమర్థతతో సాగించాడు.

దేశములో అనేక పత్రికలు పుడుతూవున్నాయి గిడుతూవున్నాయి.వాటి ఆదర్శాలుకూడా భిన్నాలు, ఈ వాహినియొక్కఆదర్శం గమనార్హం. ప్రథమ సంచిక సంపాదకీయము గమనిస్తే దాని ఆదర్శం మనకు ద్యోతకమవుతుంది. "స్వరాజ్య సంపాదనకు మూలాధారము ప్రజాశక్తి అట్టిప్రజాశక్తిని ఇనుమడింపజేయుట, రాచకీయ సంస్థలయొక్క ముఖ్యకర్తవ్యము.

ఈ కర్తవ్య నిర్వహణమునకు ప్రాణము కార్మిక, కర్షక వర్గచైతన్యము. అట్టి వర్గ చైతన్యము ప్రజానీకమునకు కలిగించుటే నేడు ఆంధ్రదేశమునకు మేము సమర్పించుకొనుచున్న ఈ వాహినీపత్రిక ప్రత్యేకసందేశము, '

ఈ పత్రికద్వారా ప్రజాశక్తిని పెంపొందింప జేయుటయే కాక, పత్రికా ప్రపంచంలో కూడ మార్పు తెచ్చెను (సంపాదకుడు)

ఆయన కృష్ణజన్మస్థానమునకు యాత్ర చేసివచ్చాడు రైతు సేవలో, 1937 సంవత్సరం డిశంబరు 4 వ తేదీన ఇదుపులపాడు గ్రామంలో మూడవ బాపట్ల తాలూకా రైతుసభలో రాజద్రోహ ఉపన్యాసమిచ్చాడని సత్ప్రవర్తనకు జామీను యివ్వవలసినదని ప్రభుత్వము కోరినపుడు జామీను నిరాకరించిన (జైలుకేగెను) మొక్కవోని పౌరుషము గలిగిన రైతునాయకుడు లక్ష్మీనారాయణుడు. ఆచార్య రంగా రాజకీయ జీవితము ఆబాలగోపాల మెరిగినదే. ఆయన కుటుంబజీవిత మాధుర్యం ఎరిగిన వారెందరున్నారు?

నేటివలెకాక ఒకానొకప్పుడు మనదేశ స్త్రీలను అధికముగా గౌరవించెడి వారని మన సాహిత్యమువల్ల విదితమగును. వైదికయుగమున ఆ గౌరవముండెడిది. భవభూతి కాలములో కూడా అట్టిస్థితే అలవడెనని అనుకొనుటకు ఆధారములు ఉత్తర రామ చరిత్రమును బట్టి ఊహించవచ్చును. రాముడు సీతను "దేవీ"! అని

సంబోధించును. ఆమె తన అభిలాషను తెలుపమన్నప్పుడు "ఆజ్ఞాపించుము" అనును. సన్మానపరాకాష్టకు యింత కంటే ఏమి కావాలి.

లోకంలో భార్యను దాసిగా చూచేవారున్నారు. భార్యావిధేయులున్నారు. ఆమె నడిస్తే కాళ్ళు అరిగిపోతాయనుకొని నెత్తిని పెట్టుకొనిమోసే మోహలాలసులు వున్నారు. కాని ఆమెను గౌరవ భావముతో గుర్తించే వారు, ఆమెకు సమానహక్కు మర్యాదలు యిచ్చే వారెందరున్నారు? యిలా యిచ్చేవారిలో ఆచార్యరంగా ఆదర్శ మూర్తి.

ఆచార్య రంగా, భారతీరంగాల దాంపత్యము అసదృశము, అనన్యము. మన ఆచార్యునకు ఆమె బహిఃప్రాణమేకాదు, అంతఃప్రాణము కూడ. వారి దాంపత్యప్రేమ సఖ్యభావ మాధుర్య మిళితమై, ఆదర్శ ప్రదమైనది. అది ఉత్తమశ్రేణికి చెందినది. ఆమె గుణగణాలను, శక్తిసామర్థ్యాలను ఇష్టాగోష్టిలోకాని, బహిరంగసభలలోకాని, గ్రంథాలలో కాని సందర్భానుగుణ్యంగా ఆయన చెప్పి చరితార్థుడగును. ఆయన పత్నీవిధేయుడుకాదు. సతిని సరిసమానముగా భావించి, సగౌరవంగా సత్కరించే సంస్కారి, యింతేకాదు, ఆయన అర్ధనారీశ్వరుడు. ఆయన అర్ధనారీశ్వరత్వానికి ఒక ఉదాహరణ గమనించిండి. మద్రాసులో ఒకనాడు గొట్టిపాటి బ్రహ్మయ్య, ఆచార్య రంగా ఒక చోటికి పోదలచారు "రిక్షాను పిలవనా ఎక్కిపోదాం' అన్నాడు మిత్రుడు బ్రహ్మయ్య. 'భారతీదేవికి అది ఇష్టం లేదు నేను ఎక్కను' అన్నాడు ఆచార్యుడు. అర్ధనారీశ్వరుడంటే యిట్టి వాడే కదా ఏ చిన్నకార్యముకూడ ఆయన ఆమెకు అయిష్టమైనది చేయడు. మన హిందూస్త్రీలు భర్తలను ఎంత పూజ్యభావంతో పూజిస్తారో అట్టి భావముతోనే ఆయన ఆమెను ఆదరిస్తాడు. ఆశ్చర్యమేస్తుంది ఆయన పోకడ చూస్తే. కొత్తవారికి, అది మరో ప్రపంచంగా తోస్తుంది. ఆచార్యుని వంటివారు ఎందరున్నారు?

ఆచార్యునితో సమానమైన అర్ధనారీశ్వరుడు ఆంగ్లేయులలో ఒకరున్నారు. ఆయన పూర్తిపేరు ఫ్రెడరిక్ విలియమ్ లారెన్సు అయన ఎర్మిలైన్ పెథిక్కును పరిణయ మాడెను, వివాహమైన తరువాత పుట్టింటిపేరుపోయి భర్తింటి పేరు వస్తుంది. పురుషులు ఎక్కువేమి, స్త్రీలు తక్కువేమి అని తలచి, ఆచారాన్ని అతిక్రమించి ఆమె పేరు తనపేరు కలసివుండాలని ఆమె యింటిపేరు పేథిక్కును తన యింటి పేరు కలిపెను. అప్పటినుంచి పెథిక్ లారెన్సు అనిప్రఖ్యాతిగాంచాడు.

మనలో కొందరు పూర్వాచారాలు తోసిపారేస్తున్నారు. నూతనాచారాలు స్వీకరిస్తున్నారు. ఆచారాలు మారిన ప్రయోజనములేదు. హృదయము మారాలి. సంస్కృతి లేని మార్పు నిష్ప్రయోజనము.

మానవసంఘములో సభ్యత అభ్యుదయమైన కొద్దీ, పురుషులలో మహత్ప్రవృత్తులుదయించి, స్త్రీ జాతియందంతకంతకు అధిక ఆదర సన్మానములు అలవడును. వేయేల? ఒక సంఘం యొక్క నాగరికత అభివృద్ధి, స్త్రీ జాతియందు పురుషులు చూపు ఉన్నత దృక్పధం పై ఆధారపడియుండును.

ఆచార్యుని ఆయన తమ్ములను విద్యావంతులుగా జేయుటకు మంగమ్మతల్లి 45,000 రూపాయలు ఖర్చుపెట్టింది. కాని ఆమె వారినెన్నడు ఉద్యోగం చేయుమని ప్రోత్సహించలేదు. స్వతంత్రజీవనమగు రైతు జీవనానికే వారికి అభిమానము కలిగించింది. ఈనాడు వారంతా స్వంత సేద్యము చేయుచున్న రైతులే, రైతు నాయకులే. ఈ పునాది అంతా ఆపుణ్యమూర్తిదే.

"ఆమె మాటలకంటె భావాలకంటె, ఆమె చేతలే ఆమె బిడ్డలకు హృదయాలనే కాదు, తత్వానికి రూపురేఖలు యిచ్చినవి. ఆ ముగ్గురు ఈనాడు రైతు ఉద్యమమున సేవచేస్తున్నారంటే. ఒక్కరు ప్రారంభకులుగా, మరొక్కరు రైతురక్షణ యాత్ర సారధిగా, మూడవవారురైతు సంఘాల సమాలోచనకర్తగా, రైతువుద్యమ చరిత్రయందు కన్పడుచున్నారంటే మంగమ్మ జీవితమే ప్రతిబింబితమగుచున్నదన్న మాట. (మాఅమ్మ మంగమ్మ 1929.2.19 వాహినీ ఆచార్యుని రచన.)

ఆ తల్లి ఋణవిముక్తి కొరకే ఆ తనయుడు “హరిజన నాయకుడు” అంకిత మిచ్చి శాశ్వత కీర్తి కలుగజేశాడు.

ఆచార్య రంగా ఆయన తమ్ములు విభజించుకొని వేరువేరుగా జీవించుచున్నా ఎంతో కలసిమెలసి, "ఐకమత్యముతో ఆదర్శప్రాయముగా సంచరించుచున్నారు. అన్న మాటకు అడుగుదాటరు ఆయన తమ్ములు. రంగా వారిని వారిబిడ్డలను ఎంతో ఆదరణతో చూస్తాడు. ఆప్యాయముగా పలకరిస్తాడు. తమ్ములతో సంప్రదించిన తరువాతకాని ఆయన యేకార్యము ఆరంభింపడు. ఆచార్యుడు ఆరంభించిన ప్రతికార్యములోను ఆయన సోదరుల, భారతీరంగా, సాయములేకుండా వుండదు.

అచార్యరంగా రైతాంగ విద్యాలయము ఆరంభిస్తే, ఆయనవలననే అగుచున్నదా! లక్ష్మీనారాయణ రెసిడెంటు ప్రిన్సిపాలుగా వ్యవహరిస్తాడు. వెంకటప్పయ్య విద్యార్థుల భోజన మజ్జనపానాదులను చూస్తాడు. వారి ఆట పాటలకు ప్రోత్సాహమిస్తాడు. భారతీదేవి వారి కష్టసుఖాలు మాతృప్రేమతో కనుగొని కంటికి రెప్పవలె కాపాడుతుంది.

ఆచార్యునకు నూతనమైన భావాలను (ఐడియాస్) వెంకటప్పయ్య అందిస్తే, లక్ష్మీనారాయణ దానిని వ్యతిరేకధోరణితో వాదించి,ఆచార్యునకు దానికి సమాధానం ఆలోచించుకొనే అవకాశము కలిగించి రాజబాటకు రప్పిస్తాడు. భారతీరంగా స్త్రీ జన సహజమైన ఓర్మి, కూర్మలతో ఆచార్యుని శారీర మానసిక కష్టాలను తొలగించి నూతన చైతన్యమిచ్చి తన సహజబుద్ధికుశలతతోను, వ్యవహార దక్షతతోను అనుష్టాన మార్గమును ఆయనకు అవగతము చేయును. ఆచార్యునకు ఇంతమందీ హంగుదారులున్నారన్నమాట, మనము అవగతము చేసుకోవాలి ఆదర్శమైన వారి కుటుంబజీవితము, మనకు నవజీవితాదర్శమును నెలకొల్పక పోవునా?

## జైలు జీవితం

''దేశముక్తికి పోరాడు ధీరమతులు, ఆత్మస్వాతంత్ర్యమున దేలి యాడుకతన వారి పాలికి జెఱసాల స్వర్గశాల వారికవమానమనుమాట వట్టిమాట.'' ''బానిసకు యజమాని గృహమంతయు జైలేయనునట్లు నాకు భారత దేశమంతయు పెద్ద జైలువలె నున్నది.'' (మహాత్ముడు.) దుర్మార్గులకు పరలోకమున నరకము అని, యిహలోకాన జైలు అని అందరూ అనేదే. జైలుజీవితము ప్రత్యక్షనరకమే. ఆ పనులూ, ఆ దుస్తులూ, అక్కడ అధికారులు పెట్టు యాతనలూ, ఆ పురుగుల తిండీ, దేవతా పులుసు, సి క్లాసు ఖైదీల బాధలు చెప్పతరంకాదు, యీ బాధలకు జడిసి దుర్మార్గులు దౌర్జన్యాలు చేయరని ప్రభుత్వంవారు తలచవచ్చు. కాని అది కల్ల. దొంగతనము చేయువారు, సంపాదించుదామనే ఉద్దేశ్యముతోనే చేయరు. అది వారి మానసిక ప్రవృత్తి.

మహాత్ముని ప్రబోధంవల్ల జైలుయాత్ర తీర్థయాత్ర అయినది. అది శ్రీకృష్ణ జన్మస్థానమని ఖ్యాతిగాంచింది. నేడు జైలుకు భయపడేవారెవరూలేరు. దేశారాధకుల్లో దేశారాధకులకు (ఒక యోగ్యత) ఒక గీటురాయి అయినది. అసలు

జైలుకుపోవట మేమిటి? మనం స్వతంత్రంగా వున్నామా? వుంటే మనకీగతి ఎందుకు? పెద్ద జైలునుంచి చిన్నజైలుకు పోతున్నాము. అంతేకాదు స్వాతంత్ర్య సంపాదన కొరకు పోతున్నాము; ''దేశంబు నాదని తెలివిపొందని యట్టి దేబెది అది యెట్టిబ్రతుకు?''. ఆరోగ్య భంగం కలిగింది: అసువులు బాసినవారు ఉన్నారు, అయితే ఏం? దేశం కొరకు ప్రాణాలను పువ్వుల మాదిరిగా అర్పించే త్యాగులు బయలు దేరారు బాపుజీ బోధలవల్ల. శ్రీకృష్ణ జన్మస్థానం, మన కొందరి కాంగ్రెసు సేవకుల్లోని, మనోమాలిన్యాన్ని పోగొట్టి త్యాగదీప్తిని ప్రకాశింపచేసి ఐక్యతాభావం అలవరిచింది. అంతేకాక ఆధునిక ఉత్తమసాహిత్యమంతా అచ్చటనే సృష్టింప బడింది. ఆత్మోన్నతికి, దేశ స్వాతంత్ర్యానికి కూడ జైలుకు వెళ్ళటం ప్రతి కాంగ్రెసు సేవకునకు అవసరం.

ఆచార్యరంగా అనేకసార్లు కారాగృహానికరిగాడు. ఆయన ప్రప్రథమున, రీసెటిల్‌మెంటు ఆందోళన సందర్భంలో జైలుకువెళ్లాడు. 1931 డిశంబరులో ఆయన్ని అరెస్టు చేసి ఒక సంవత్సరం శిక్ష విధించింది ప్రభుత్వంఅప్పడే ఆయిన ''ఆధునిక రాజ్యాంగసంస్థలు''అను గ్రంథాన్ని రెండుభాగాలుగా రచించాడు- వివిధ దేశాల రాజ్యాంగం ఎలావున్నదో, మనదేశరాజ్యాంగంతో పోల్చి, సులభశైలిలో, రాజ్యాంగ గొడవ తెలియని రైతాంగంకూడ తెలుసుకొని రాజకీయజ్ఞానం పొందేటట్లు రచించాడు: వాటిని కాకినాడలోని జాతీయ గ్రంథమాల ప్రచురించి వ్యాప్తిలోనికి తెచ్చింది.

1940లో మద్రాసున కరిగినప్పుడు ప్రభుత్వం వారు మద్రాసు విడిచి పొమ్మనమంటే పోక, శాసనోల్లంఘనజేసి చెరసాల్లో ఏడాది పున్నాడు. 1941-2-11 తిరుచనాపల్లి జైలునుండి విడుదలచేసి వెంటనే డెటిన్యూగా రాయవేలూరు జైలుకు తీసుకొని వెళ్లారు. మళ్లీ ఒక సంవత్సరానంతరం 1942-3-11 విడుదల చేశారు. 1942-44 రెండేండ్లు డెటిన్యూగా వున్నాడు. 1942 నవంబరు 4 అరెస్టు చేశారు. 1943 జనవరి 10 రాజపుటానా దగ్గర దామోజైల్లో వుంచారు. 1944 అక్టోబరు 9 తేదీన విడుదల చేశారు. చలిబాధచే ఆసుపత్రిలో బాధపడుతుండి కూడా ఈ దఫా ఆయన ఆనేక గ్రంథాలు రాశాడు. పాకిస్థాన్, Kisans and Communists, Challange of the World role of National

Revolution. Life and thoughts of a political prisioner మొదలగునవి. అక్కడ జీవితము మధురంగా గడిచింది. ఏకాశయముతో వచ్చిన వారప్పటికి 500 వున్నారు. పెద్దిరెడ్డి తిమ్మారెడ్డిగారి( వ్యవసాయశాఖామాత్యులు) తియ్యని కంఠంతో ప్రభాత భేరిలేస్తే అందరు లేచి కార్యాలుతీర్చి స్నానాలు చేసి ఫలహారాలు సేవించి ప్రార్ధన, అటు తర్వాత ఆచార్యరంగా అనుదినము వుపన్యాసాలివ్వటం జరిగేది. ఆ దేశభక్తులశిబిరం ఒక విశ్వవిద్యాలయం అయ్యింది. పాకాల వెంకట్రామా నాయుడు. (రంగాగారి అనుచరుడు సూళ్లూరుపేట) రిజిష్ఠారుగా పనిచేశాడు. ఆయన ఉపన్యాసాలకు 300 మంది హాజరగుతూ వుండేవారు; ఎక్కడవున్నా ఆయన ఆచార్యత్వము, ఆయన్ని వీడదు. గ్రంథ రచన ఆగదు. కొట్లోవేస్తేనేం, కోటలో ఉంచితేనేం !

ఉదయం సంగతి చెప్పాను తర్వాత సంగతి చెప్పవద్దూ ! 11గంటలకు భోజనాలు, తర్వాత రాట్నచక్రము, అధ్యయనాలు, మళ్లీ ఫలహారాలు, 4 గంటలకు మీటింగులు, ఆటలు పాటలు అనంతరం భోజనాలు. ఈ విధంగా విద్యార్ధిజీవితం గడిపినట్లు గడిపారు మన దేశభక్తులు. అక్కడ పండగలు పర్వదినాలని, స్వాతంత్ర్యోత్సవాలు, సభలు, సమావేశాలు, జైలు అధికారులతో అప్పడప్పుడు తగాదాలు, చిత్ర చిత్రంగా జరిగింది యీ దఫా. ఆ మధుర జీవితాన్ని ఎంతైనా చెప్ప మక్కువవున్నది. కాని, “అతి సర్వత్ర వర్జయేత్”అన్నారుగా ఆర్యులు!

ఆచార్య రంగా జైల్లో వున్నా పూరుకుండే మనిషి కాదు. ఆయస వయోజనవిద్యా ప్రచారంతోపాటు అనేక గొప్ప గ్రంథాలు రచించి రాణకెక్కెను.

## పచ్చయప్ప కళాశాలలో ప్రధానాచార్యత్వం

పలుసారులు పరదేశాలకేగి 1927లో స్వదేశానికి వచ్చినతర్వాత యేమి చేయుదునని ఆచార్య రంగాకు ఆలోచన ఆరంభమైనది. ఆయన ప్రభుత్వోద్యోగము చేయడని ఆయన స్వభావాన్నిబట్టి మనకు విదితమే. ఐ.సి.యస్. పరీక్ష జదువుట మానిన సంగతి తెలిసినదేగదా! ఇక యే వృత్తిలో ప్రవేశించిన, తన రాజకీయ జీవితానికి ఆటంకం వుండకుండా వుండుటేగాక, భావిజీవితానికి అభివృద్ధికరంగా వుండునో, దాని కొరకై ఆయన తీవ్రఆలోచన చేయసాగాడు. అది ఉపాధ్యాయత్వమేనని నిశ్చయించు కున్నాడు.

బ్రతకలేక బడిపంతులని మనలో ఒక సామెతున్నది. అలా తలచుట పొరపాటు, ఉపాధ్యాయవృత్తి ఉత్తమవృత్తి. ఇంతేగాక ఉపాధ్యాయులుగా నుండి దేశోపకారము చేసిన మహానుభావులు అనేకులు కలరని ఆయన యెరుగక పోలేదు.

మద్రాసులోని ప్రభుత్వేతర కళాశాలయగు పచ్చయప్ప కళాశాలపై ఆయన దృష్టిపడెను. అందు ప్రవేశించిన ప్రయోజనముండునని తలచి అందుకొరకు ప్రయత్నింప, మధ్య అనేక అడ్డంకులు వచ్చినా చివరకు అదృష్టవశాత్తు అందులో ఆయనకు ఉద్యోగం 1927 అంత్యమున లభించెను.

ఆయన ఆ కళాశాలలోని రాజకీయార్థిక శాస్త్ర శాఖకు ప్రధానాచార్యుడుగా (Head of the department of History and econamics) నియమింప బడెను. ఆయన ఆక్సఫర్డులో చదివినది ఆదే అప్పటికి ఆయన వయస్సు 27 యేళ్ళు మాత్రమే. మనిషి స్ఫురద్రూపి కాదు. డాబుదర్పం అసలేలేదు. కనుక ఆకర్షవంతంగా లేదు పిల్లలకు. క్లాసులోకి వెళ్ళగానే మొట్టమొదటిరోజున విద్యార్థులు అందరూ గల్లంతుచేశారు, రెండవరోజునా అంతే నోరుయెత్తనివ్వలేదు. ఈ పిట్టలపోలాయి. మనకు చెప్పేదియేమిటి, మనము వినేదియేమిటి? అనుకున్నారు. ఆయన సంగతేకాదు, మొట్టమొదటిరోజుల్లో వచ్చిన ప్రతి ఉపాధ్యాయునకు ఇట్టి గౌరవమే విద్యార్థులు చేసెదరను సంగతి అనుభవము గలవారికి అందరకు యెరుకయే కదా! ఈ బడిపిల్లలు మాస్టర్లనుపెట్టే యాతన, వారికీ వీరికీ మధ్య జరిగే కార్యకలాపాలన్నీ కన్నులకట్టినటుల కాంచనగును మునిమాణిక్యం వారి ''ఉపాధ్యాయుడు'' లో.

మూడవరోజున విద్యార్థులను కాస్త మందలించాడాయన.''నాయనలారా! నేను చెప్పేసంగతి కాస్త వినండి. మీలో నాకంటే కొందరు పెద్దవారుగూడా వున్నారు. మీరు అల్లరి చేస్తే నాకు వచ్చే నష్టమేమీలేదు. ఇంతమాత్రాన నా ఉద్యోగము పోదు. నాకు జీతము ముట్టకపోదు. ఎటు వచ్చీ నష్టపడేది మీరే. కనుక యీ సంగతి సందర్భాలన్నీ ఆలోచించుకొని అల్లరిమాని చెవియొగ్గి నేను చెప్పేది విని మీరు బాగుపడండి'' అని కాస్త హితబోధ చేసేటప్పటికి అందులో కొందరు, ఆయినా చూద్దాం యెలావుంటుందో, అల్లరియెందుకని, అల్లరిమాని ఆలకించ వుద్యుక్తులయ్యారు. అంతట ఆరంభించాడు ఆచార్యుడు తన అనర్గళ ఉపన్యాస ధోరణిని. పిల్లలంతా అది విని దిగ్భ్రమజెందిపోయారు. అరే! మనమే తప్పుచేశాం.

ఏపుట్టలో యేపామున్నదో తెలుసుకోకుండా, పిట్టకొద్ది కూతఘనమౌనో! అని అనుకున్నారు. నాలుగోరోజున ఆయన క్లాసులోకి రాగానే చుట్టూచేరి ప్రొఫెసరు గారూ! ప్రొఫెసరుగారూ! మేము మీకు టీపార్టీ చేయడానికి నిశ్చయించుకున్నామని చెప్పసాగారు. "అందుకు నాకు యేమీ అభ్యంతరం లేదు. ఆఖర్చులో నేనుగూడా సగము వంతు యిస్తాను. యిది సాంప్రదాయము పాశ్చాత్యదేశాలలో మీరు నాకు చెయ్యడం, నేను మీకు చెయ్యడం అవుతుంది. ఇందువల్ల మనము వుభయులం ఒకరినొకరు గౌరవించుకొంటున్నాం''అని అనేసరికి వారంతా పరమానందభరితులై మరుసటి రోజున అలాగే చేశారు.

ఉపాధ్యాయుడు వుద్రేకుడు కాగూడదు. అతనికి ఓర్పు, నేర్పు వుండాలి. అవిలేకపోతే ఆయనగతి అధ్వాన్నమే. ఈ రెండుగుణాలు అదివరకే ఆచార్య రంగాకి అలవడుటచే, పిల్లల ప్రేమకు పాత్రుడయ్యాడు. విద్యార్థులంత మంచివారు మరొకరు లేరు.వారి హృదయాలు నిష్కల్మషాలు. వారి బాగోగులన్నీ ఉపాధ్యాయుల మీదనే యుండును. విద్యావినోదాల్లోనేకాక, వినయ విధేయతల్లోకూడా. సద్గుణ సముపార్జనలోను, విద్యాబోధలోను, ఆయన ఆచార్య నామము సార్ధకము.

ఆచార్య రంగా, అందరి ఉపాధ్యాయులవలె పాఠము చెప్పుటతోనే తృప్తి నొందక, పరీక్షలలో వచ్చు అనేక ప్రశ్నలను, వాటికి సమాధానాలు చెప్పి అధికంగా విద్యార్థులు పరీక్షలలో ఉత్తీర్ణులయ్యేటట్లు చేశాడు.పరీక్షల్లో మద్రాసు కళాశాలలు అ న్నింటిలోకి పచ్చయప్ప కళాశాల ఆయన కాలంలో ప్రధానస్థానం ఆక్రమించింది.

ఆనర్సు స్టూడెంట్సుని ప్రజల స్థితిగతులను తెలిసికొనుటకు ఆయన పరిశోధనలు జేయించాడు. ఆ పరిశోధనలలో ఆయనవిద్యార్థులు చాల విఖ్యాతి గాంచారు ఆయన విద్యార్థులలో నొకరగు కె. గోపాలరావు కర్జన్‌మెడల్ పొందాడు. ఆయన ఆచార్యడుగానున్నసమయాన, పచ్చయప్ప కళాశాల అర్థశాస్త్రానికి అధికఖ్యాతి గాంచింది. (పచ్చయప్ప స్కూల్ ఆఫ్ ఎకనమిక్సు అని ప్రఖ్యాతి గలిగింది) అందుకనే ఆయన రీసెటిల్‌మెంటు కమిటీకి కార్యదర్శిగానున్న కాలమందు కూడా ఆయనకు నెలకు రూ. 400-0-0లు జీతము యిస్తూనే వున్నారు కళాశాలవారు. ఇలా పిల్లలవల్ల, కళాశాలవారివల్ల, మన్నన, మాన్యత పొందుచున్న మన ఆచార్యుడు 1930 లో ఢిల్లీ అసెంబ్లీకి అభ్యర్థిగా నిలిచినప్పుడు ''కళాశాల ఉద్యోగు లెవరు, శాసనసభలకు పోరాదని నియమము కలద'' ని వారు

చెప్పగా ''మీ కళాశాలయందలి పదవి కన్న ప్రజాసేవయే నాకు పరమప్రీతి'' యని ఆచార్యత్వానికి రాజీనామా యిచ్చివేసెను. పచ్చయప్ప కళాశాలలోని ఆచార్య త్వానికి మాత్రమే ఆయన రాజీనామ ఇచ్చాడు కాని, ఆయన రాజకీయాల్లో ప్రవేశించినా ఆచార్యత్వాన్ని మానలేదు అని మనము మరచి పోరాదు. ఆచార్య రంగా నామము వాడుకపేరే కాక సార్ధకనామమేనని మనకు ముందు విశదం కాగలదు.

''జరయు మృతియులేని జనునట్లు ప్రాజ్ఞుండు
ధనము విద్య గూర్పదలచవలయు
ధర్మ మాచరింపదగు మృత్యుచేతల
బట్టి యీడ్వ బడినవాడు వోలె''

## ఆర్థిక పరిశోధనలో అందె వేసిన చెయ్యి

ఆచార్యరంగా, మనదేశములోని వివిధ తరగతుల ఆర్థిక స్థితిగతులు, వారి అవసరాలూ, పరిశోధన చేయుటద్వారా మనదేశములో ప్రఖ్యాతి గాంచిన ఆర్థికవేత్తగా అధిక ఖ్యాతి సంపాదించాడు. ఉత్తర హిందూస్థానంలో రాధా కమల ముఖర్జీ( రాధా కమల ముఖర్జీ "పద్మభూషణ్" – ప్రొఫెసర్ ఆఫ్ ఎకనమిక్స్ – లక్నో 1889-1969) పరిశోధనల కెట్టి విలువ గలదో,దక్షిణదేశమునకు సంబంధించి నంతవరకు యీయన పరిశోధనలకు అట్టి విలువ, విఖ్యాతి కలదు. పంజాబు ప్రభుత్వమువారు పల్లెప్రజల ఆర్థిక పరిశోధనము చేయించు చున్నను, రైతాంగపు ఆర్థిక పరిశోధనలలో రంగా పరిశోధనలవలె తృప్తికరంగా లేవు.

డాక్టరు గిల్బర్డుస్లాటర్, హేరాల్డ్ మాన్ (Harold maun) కర్నల్ జాక్, వారి విద్యార్థులు అనుయాయులు, మలబారు, చంగల్పట్టు, హైదరాబాదు మున్నగు ప్రాంతాలలో పరిశోధనలు చేసి, ప్రఖ్యాతి గాంచినట్లుగనే ఆచార్య రంగా రైతుల ఆర్థిక పరిస్థితులలో సరియైన అంచనాలు వేసి, ప్రభుత్వమువారి లెక్కలు యెలా తప్పుడు తడికలో, లోకానికి వెల్లడించాడు, ఒక్క రైతు ఆర్థిక పరిస్థితులు తెలిసికొనుటలోనే ఆయన తృప్తి పొందలేదు. వ్యవసాయ కూలీలు, చేనేత పారిశ్రామికులు, నీలగిరి కొండజాతులు మొదలగువారి స్థితిగతులు పరిశోధనలు

చేసి ప్రఖ్యాతి గాంచాడు. ఆంధ్రా ఎకనామికల్ సీరిస్ క్రింద ఆయన పరిశోధన గ్రంథాలు ప్రకటింపబడినవి.

1. Economic organisation of Indian villages vol 1 (Deltaic villages) 1926.

ఆంధ్రములో ప్రథమ ఆర్థికశాస్త్రము రచియించిన ప్రఖ్యాతులు, ప్రతిభా వంతులు కట్టమంచివారు పీఠికలో యీ గ్రంథాన్ని పరిపరి విధాల ప్రస్తుతించారు.

2. Economic organisation of Indian villages vol II (Dry Deltaic villages) 1928.

3. The Tribes of Nilagiries – Their Economic and Social conditions – 1928.

4. The Handloom Weaving Industry – 1930.

5. Economic condition of the Zamindary ryots 1983.

6. Labour in South India – 1934.

7. A guide to Rural Economics.

ప్రభుత్వంవారు కొందరిచేత పరిశోధనలు చేయించారు. కొన్ని విశ్వవిద్యా లయములూ చేయించినవి. కాని వ్యక్తిగతంగాను, ఒంటరిగా అధిక వ్యయ ప్రయాస లకు లోనై యింత ఓర్పు నేర్పులతో, యిన్ని పరిశోధన గ్రంథములు వ్రాసిన వారు. ఆయనతప్ప మన దేశములో మరొకరు లేరేమో! ఆయనచేత యీ గ్రంథ రచన చేయించిన శక్తియేది? ఆయన యందావిర్భవించిన ప్రజాకష్ట నివారణా శక్తియే.

1927–30 లో ఆయన పచ్చయప్ప కళాశాల ప్రధానాచార్యుడుగా నున్నప్పుడు విద్యార్థులచేత పలు పరిశోధనలు చేయించుట పాఠకులెరిగినదే. 1927–29 లో మద్రాసు ప్రభుత్వానికి ఆర్థిక సలహాదారుగా (Special officer for Economic survey of Madras Government) నుండి ప్రభుత్వము నుండి వేతనమును, పారితోషికమును పుచ్చుకొనకనే నీలగిరి, కోయంబత్తూరు, సేలం, గుంటూరు జిల్లాలలో పరిశోధనలు చేసెను. ఆ పరిశోధన వల్ల ప్రజల దారిద్ర్యస్థితి, అతిదారుణంగా ఉన్నట్లు ఋజువగుటచే, ఆ ఆఫీసును రద్దు చేసి ఆయన పరిశోధనలు ప్రచురింపక ప్రభుత్వమువారు మిన్నకుండిరి, ఆయన పరిశోధనా నైపుణ్యమును గమనించే, 1929–30 లో ఉభయగోదావరీ,

కృష్ణాజిల్లాల రీసెటిల్‌మెంటు ఆర్థిక పరిశోధక కమిటీవారు ఆయనను కార్యదర్శిగా యేర్పాటు చేసుకొనిరి, అందునా ఆయన పరిశోధన ఫలితములు పదిమందికీ పంచిపెట్టి, ప్రస్తుతింపబడ్డాడు.

మన దారిద్ర్యస్థితి తెలుపుటకు ఆర్థిక శాస్త్రజ్ఞుల లెక్కలు, డొక్కలు అవసరములేదు. మన గ్రామాల్లో నివసించు, మన కంటికగపడు నరకంకాళములే ప్రత్యక్ష ప్రమాణము. ప్రతి సంవత్సరము మన దేశములో యెక్కడో ఒకచోట కాటకం రావడం, జనం నల్లులుమాడినట్లు నశించడం పరిపాటి అయిపోయింది, దీనికంతకు కారణమేమిటి? ప్రపంచంలో యే దేశమైన సుభిక్షంగా వుండాలంటే, ఆ దేశపు వ్యవసాయ, వాణిజ్య, పరిశ్రమలు పరస్పరాభివృద్ధికరములై పరిఢవిల్లాలి. అట్టిది మన దేశంలో లేదు. మన వర్తకం, పరిశ్రమలూ పరులపాలైపోయాయి. అవి మనల ననుదినమూ క్షీణింప జేయుచున్నవి, దేశానికి వెన్నెముకైన రైతాంగాన్ని కృంగదీస్తున్నాయి ఈ రెండును. దేశాభివృద్ధికరములగు వాణిజ్య పరిశ్రమలు పరహస్తగతం కాగా యిక మిగిలింది మనకొక్కటే వ్యవసాయము, ఇది ఇక్ష్వాకులనాటి పద్ధతే. ఇంతేకాక, జమీందారులు, షాహుకార్ల దోపిడీకి అంతేలేదు. ప్రభుత్వపు పన్నులకు పరిమితి అంటూ లేనేలేదు. వ్యవసాయానికి నీటి సరఫరా శూన్యము, రైతుల కృషి ఫలించుటకు మేఘుడే కారకుడయ్యాడు. పురుష ప్రయత్నం పూజ్యమైనది. ఇక మనదేశం బాగుపడేదెలా? ఇంతటితో పోలేదు. గోరుచుట్టుపై రోకటిపోటన్నట్లు ప్రభుత్వమువారి పన్నుల పద్ధతి, వ్యయవిధానము కూడ దేశారిష్టం గానే వున్నది. కనుకనే కరవులకు మనదేశం పుట్టిల్లయినది. దారిద్ర్యదేవత మనలను పీక్కుతింటున్నది.

ఆచార్య రంగా యివన్నీ ఆలోచించాడు. యివన్నీ తన గ్రంథాల్లో వివరించి, ప్రజలకు శ్రేయోమార్గం చూపెట్టాడు. అందరివలెనే ఆయన యీ గ్రంథరచనతోనే కూర్చోలేదు, దేశీయులు ఆర్థికంగా కాస్త అభివృద్ధి పొందుటకు వివిధ వృత్తి సంఘాలు నెలకొల్పుట ఆయన విశేషం. రైతు సంఘాలూ, కూలీసంఘాలూ, చేనేత పారిశ్రామిక సంఘాలూ మొదలగునవి ఆయన సృష్టే. మన ఆర్థికవేత్తలు పుస్తకాలు వ్రాసినవారున్నారు. ఆయనవలె పీడిత ప్రజకు ప్రత్యక్ష ప్రయోజనము కలుగజేసిన వారెందరున్నారో చెప్పలేము.

మన ఆర్థికవేత్తలు అధికంగా ప్రభుత్వపులెక్కలనే ఆధారంగా తీసుకొన్నారు కాని, స్వయముగా పరిశోధించి మదింపువేసినవారు అరుదే. మనదేశ ఆదాయాన్ని మదింపువేసిన దాదాభాయికికాని, డిగ్‌బీకికాని, విశ్వేశ్వరయ్యకు కాని, ప్రజలతో పరిచయమెంత? వారి అంకె లెంతవరకు స్వయముగా తేల్చుకొన్నవి? మనదేశంలో మొట్టమొదట దామాషా సాలుసరి సగటు ఆదాయము రూ.20/- అని దాదాభాయి మదింపు వేశాడు. (1870) కర్జన్ ప్రభువు 1900 లో రూ.30/- అన్నాడు. షా కంబటాగార్లు 1921-22 లలో రూ.67/- అన్నారు. 1931 లో బ్యాంకింగు విచారణసంఘం వారు భారతదేశములోని నికరాదాయము యెంత హెచ్చుమదింపు వేసినా సాలుకు తల ఒకటికి 42 కన్న లేదని నిర్ణయించారు. అందువల్ల రోజుకు రైతు ఆదాయము 0-1-7 అయింది. (సంవత్సరం ఒక అణా 7 పైసలు.) ఆచార్య రంగా అధిక్రమచేసి రైతు ఆదాయము రోజుకు 0-0-11గా నిర్ణయించాడు. (1935) రోజూ రైతు చెల్లించవలసిన ఋణం 0-2-3. ఇవి నేటి భారత దేశపు రైతు భాగ్యభోగ్యాలు. అతడు అన్నమే తినాలో, సున్నమే తినాలో, ఆలుబిడ్డలనెలా పోషించాలో మీరే ఆలోచించండి. రైతు సంఘాల పేరిట కొందరు కొన్ని నినాదాలు యిస్తూ వున్నారు. రైతు స్థితిగతులు వారికేమైనా తెలిసేనా? ఇతరులు యే మెరుగుదురు రైతుల బాగోగులు? రైతునాయకుడుగానే కాక ఆచార్య రంగా ఆర్థికవేత్తగా  కూడా రైతు రక్షణకై ప్రతిదినమూ పదుగురితో పోరాడేది ఈ రైతు దుస్థితి మనసులో నుంచుకొనే. అందుకనే ఆయన వెయ్యి రూపాయలు ఆదాయము రాని రైతున కెట్టిపన్నూ వేయరాదని చెప్పును.  ఇది ఆశ్చర్యంగా కనిపించవచ్చును కొందరికి. ప్రపంచాన్ని పీడించే షాహుకార్లకు రెండు వేల రూపాయల ఆదాయము పైబడి తేనే ఆదాయపుపన్ను. దీనికంతకు కారణం రైతు తరపున నోరువిప్పేవారు లేకపోవుటే, మెత్తనివాడిని చూస్తే మొత్తబుద్ధి అయిందన్న సంగతి అందరకు తెలిసిందే. రైతుల మీద దుర్భర పన్నులు బడుట వారిలో రాజకీయ చైతన్యం లేకపోవుటే.ఆచార్య రంగా ఆర్థిక పరిశోధనలో అందెవేసిన చెయ్యి అని ఆయన వివిధ పరిశోధనలు విదితము చేయును.

“పగలు రాతిరి లేక పాటుపడు నా రైతు
కడగండులం గాంచి యాదరించక పోతే
రాజ్యమే యిల నిల్చునా, భూదేవి భగ్నమై పోకుండునా! సె.. గి.

## వక్త

స్వీయాభిప్రాయాలను ప్రపంచంలో ప్రచారం చేయటానికి అనేక సాధనా లున్నాయి. అధికంగాను, త్వరగాను రేడియో ద్వారా చెయ్యవచ్చు. తర్వాత పత్రికల వల్ల, అనంతరం గ్రంథరచన ద్వారా కూడ చెయ్యవచ్చు. గ్రంథకర్తగా తన అభిప్రాయాలను విశ్వమంతటా వెదజల్లినవారు అనేకులు కలరు. తమ గ్రంథాలలో విప్లవజ్యోతులను వెలిగించినవారు వేళ్లమీదే లెక్కింపులోకి వస్తారు.

ఇక రంగా వాక్సరణి ఎట్టిదో పరికింతము. ఆయన గొప్ప ఆవేశపరుడు. ఆవేశము లేని వక్తృత్వం, వక్తృత్వం కాక వాచాలత అగును. ఆయన ఆవేశం ఔచిత్యాన్ని భంగపరచదు. అనర్గళమైన ధార ఆయనను శిక్షించు న్యాయాధిపతి (1931) బర్కు, యెలక్వెన్సీ వున్నదన్నాడు. ఆయన ఉపన్యాసధోరణి ప్రవాహ వేగమును పోలిన ధారాళమగు శైలియని న్యూస్ క్రానికల్ పేర్కొన్నది. ఆయన కృషి అంతా పండితుల కొరకు కాదు ప్రజానీకము కొరకు, ప్రజల నుద్రేక పరచడంలోను, వారికి సుబోధకరంగా వారిమాటలలో, వారి పద్ధతిని, వారి మనస్తత్వ మెరిగి చెప్పగల దిట్ట ఒక్కడేనేమో! రాజకీయ ప్రత్యర్థులపై కాక పార్టీలపైనే ఆయన అంబులపొది పోనీయుటలో అగ్రేసరుడు.

ఆయన ఉపన్యాసం స్వీయబృందానికి పరమానందం, పరపక్షానికి పక్కలో బాకు, వడి, వాడి ఆయన వాక్కులో విశేషంగా వుంటుంది. కారణమేమంటే తాను యదార్థమని నమ్మినదానినే చెప్పును. ఇందుచే ఆయన వాక్కు శక్తి సమన్వితమై యుండును. వక్తకు కావలసిన ఆత్మవిశ్వాసం ఆయనలో అమోఘం. ఉద్యమాలకు వరవడి, ప్రోత్సాహం ఒక్కుమ్మడి ఆయన ఉపన్యాసం వల్ల కలుగును. ఆయన గొప్పవీరుడు. వీరరసములో ఆయన ప్రజానీకానికి ఉద్రేకం కలిగించి కార్యసాధన కావించును. ఆయన యెక్కడ కాలుపెట్టితే అక్కడకు జనం వేలాదివేలుగా వస్తారు. ఆయన సేవాధర్మానికి,వక్తృత్వానికీ వశులుకానివారు లేరు!

తలపరువు నోరే చెప్పును. శాసనసభల్లోను, మన కాంగ్రెసు రంగంలోను, వాద చతురులుగా ప్రఖ్యాతి గాంచినవారు పెక్కురు గలరు.వక్తకు కావలసింది హృదయం. అందు కళాభిరుచికల వానికేచోటు, వాదించువానికి కావలసింది

మెదడు. అతడు సూక్ష్మదర్శియై తీవ్రాలోచన, విషయ విభజన, స్పష్టోచ్చారణ, తీవ్రవిమర్శ చేయగల వాడై వుండాలి.

మన ఆంధ్రుల్లో పట్టాభి, రామలింగారెడ్డి, రాఘవేంద్రరావు యిందులో గొప్పవారు. పట్టాభి ప్రతిభ కౌన్సిలు నందుగాక, కాంగ్రెసు కదనరంగమందే కాంచనగును. గొప్పగొప్ప లాయరులై ప్రఖ్యాతిగాంచిన దాసు, పటేలు, మోతీలాలు వాదచతురులను, స్వరాజ్యపార్టీ సందర్భంలో తన వాదచాతుర్యం చేత చకితులను జేసినది చరిత్ర ప్రసిద్ధము. వేయేల పట్టాభి ప్రతివాది భయంకరుడు. ఆయనకు సాటి మరొకనిని కానం.కాని ఆయనవాదనలో కాస్త కరుకుతనం కాననగును. డాక్టరు కదూ!

రామలింగారెడ్డి జస్టిస్ పార్టీ ప్రభుత్వకాలంలో వారినెలా పల్టీలు కొట్టించిందీ ప్రపంచమెరుగును. ఆయన పరాయిని రాళ్ళుబెట్టి కొట్టడు, బుక్కా వాడి తోనే పోట్లాడినా పువ్వులతోనే పోట్లాడాలని మనలో నొక సామెత యున్నది. అట్టివాడు ఆయన. ఆయన రసహృదయుడు, ఎదిరిని తన హాస్యచాతుర్యముచే బుట్టలో బెట్టి తన్ను తాను చక్కగా కాపాడుకోగల కాపుబిడ్డ.

రాఘవేంద్రరావు ఆంధ్రదేశంలో పుట్టకపోయినా మధ్యమాగాణములో స్వీయ ప్రతిభచే ప్రసిద్ధికి వచ్చి, ప్రజానాయకుడు గాను, ప్రభుత్వోద్యోగి గాను, ప్రజాసేవలో తనకాలము గడపిన గణనీయుడు. గాంధీటోపితో గవర్నరు గద్దెనెక్కిన దేశసేవా పరతంత్రుడు, ఆయన యెదిరిని యేమీ అనడు. ఆయన వాదనలో యెంత గాంభీర్యము, శక్తి, వైశాల్యాలుంటవో అంత విలాసముకూడా వుంటుంది. ఆయన భాష శ్రీనివాస శాస్త్రి భాషవలె మృదుమధురము. పరాయివారికి పరవశత్వము గలుగజేయును. అసలు ఆయన బారిష్టరు వాదనలో పరాయివానికి అవకాశము లేకుండా చేయగల చతురుడు, ఆయనది సమ్మోహనాస్త్రము. ఆచార్యరంగా వాదము సరసమైనదే. వాచ్యముకంటె ధ్వని అధికము. ఆయన విషయ విమర్శన చేయును. తన వాదనాబలమునకు తన అర్థశాస్త్రమును అండగాగొని అవతలివాడిని నిర్వీర్యునిగా చేయగల నిపుణుడు. ఎదిరిని సాధ్యమైనంతవరకు తనవైపు త్రిప్పు కొనుటకే యత్నించును, అటువెనుక అతడు యెదిరించినచో అతనిని పీటీచేసి కాని పీఠము బెట్టడు.

## రాజకీయవేత్త

రాజకీయవేత్తగా రాణించుట బహుకష్టము, అందున పరాధీన దేశాల్లో మరిన్నీ. ప్రభుత్వము పెట్టే బాధలు చెప్పతరముగాదు. ప్రజల విమర్శలకు అంతే వుండదు. ఎక్కువ తీవ్రముగా ప్రభుత్వాన్ని విమర్శించే వాడే గొప్పవాడుగా ఎన్నబడుతూ వుంటాడు. గాంధియుగానికి ముందు రాజకీయవేత్తలది అది ఒక జాతిగా వుండేది. వారు బాగా రాజకీయాలు చదువుకున్నవారుగా ఉండేవారు, అదంతా తారుమారయింది. గాంధి యుగమున గీటురాయి మెదడుగాక త్యాగమైనది. నేడు రాజకీయనేత లనబడు నాయకులలో కొందరు రాజకీయ, అర్థశాస్త్రముల నెరుగనే యెరుగరు.

విషయప్రవేశమునకు ముందు మన ప్రాచీన రాజకీయవేత్తల స్మరించుట యీ సమయమున సముచితము. మన కాంగ్రెసు స్థాపకుడు హ్యూం (1885) కాని కాంగ్రెసు మూలపురుషులనేకులు. వారిలో దాదాభాయ్, మెహతా వాచా, గోఖలే, తిలక్, సురేంద్ర నాధ బెనర్జీ, ఆనంద మోహన్ బోస్, విపిన్ చంద్రపాల్, సిన్హా, లజపతిరాయ్, సుబ్రహ్మణ్య అయ్యర్, విజయరాఘవాచారి, సుబ్బారావు, శంకర నాయర్, సయ్యదు మహమ్మదు మొదలగు మహానుభావులెందరో కలరు. అందులో అమరకీర్తి గాంచగలిగినది తిలక్,( బాలగంగాధర తిలక్) లాలాలజపతిరాయలే. మహాత్ముడు రాజకీయ పోరాటాల ద్వారా ఎంతో రాజకీయజ్ఞానం కలగజేశాడు.

గురూ బెనర్జీయని ప్రఖ్యాతిగాంచిన, సురేంద్రనాధ బెనర్జీ కాల ప్రవాహంతో కలసి రాక నామరూపాలు లేక నశించాడు, పాల్ పాతబడ్డాడు. అనిబిసెంటు భారత రాజకీయాకాశమున ఒక వెలుగు వెలిగించి వెల్లికిల బడినది. శ్రీనివాసయ్యంగారు ఒక మెరుపు మెరసి మబ్బులో మాయమయ్యాడు. రాజగోపాలా చారి రంగులు మారుస్తున్నాడు. అరవిందుడు ఆశ్రమవాసి అయ్యాడు. జిన్నా, సావర్కారు, భాయి పరమానంద, రాయ్ అభివృద్ధి నిరోధకులయ్యారు. మన మోచర్ల న్యాయపతులు మనతో రాలేకపోయారు. ప్రభుత్వాన్ని ఒకప్పుడు గజగజ లాడించిన శర్మ ప్రభుత్వఅండ జొచ్చాడు. దేశభక్తుడు దేశసేవలోనే పండి పోయాడు. విప్లవమూర్తి మన సాంబమూర్తి అనారోగ్యంచే రాజకీయ రంగములో లేని కొరత కనిపించుచునే యున్నది. కాళేశ్వరరావు, కమ్యూనిస్టులకు కాళిక, కాంగ్రెసు వారికి

కడు పూజ్యనీయులు, వయోభారము హెచ్చిన కొద్ది ఆయనలో ఉత్సాహము వృద్ధి యగుచున్నది. మన ఆంధ్రకేసరి దేశమంతటా ప్రకాశించు చున్నాడు. ఆ వీరునకు యెదురులేదు యెందునా. పట్టాభి పటిమ పెరుగు చునే యున్నది. రామలింగారెడ్డి అసమానుడు. ఆయన సముద్రుడు. ఆటు పోటు వుంటుంది.

ఇక మన రంగా రాజకీయార్థశాస్త్రాలు బాగా చదువుకున్నవాడే కాక అనుభవజ్ఞుడు కూడా. ఆయనలోని బాల్యచాపల్యము పోయి, యవ్వన అహంకారం నశించి, దీర్ఘదర్శకత్వం యేర్పడి యువజన నాయకులలో మకుటాయమానంగా వున్నాడు. ఆయన రాజకీయాల్లో ప్రవేశించి 22 సంవత్సరాలయ్యింది. కాంగ్రెసులో ప్రవేశించిన తర్వాత యెన్నడును ఆయన వెనుకంజ వేయలేదు. ఆయన ప్రజా హృదయమును చూరగొనని సమయము లేనేలేదు.

మన రాజకీయవేత్తలందరూ పునాదులులేని సౌధాలు కట్టుతున్న కాలంలో ఆయన కర్షక, కార్మిక సంఘాలు స్థాపించి వారిలో చైతన్యము కలిగించి, కాంగ్రెసుకు పుష్టి తెచ్చిన రాజకీయవేత్త. ఆనాడు ఆయన రైతు సంఘాలను యెదుర్కొను వారు యీనాడు దాని ఆవశ్యకతను గ్రహించారు. కాంగ్రెసు ఆశీర్వదించింది ఆయన కార్యక్రమాన్ని.

కష్టజీవులకు వూపిరి పోసిన అనుష్టాన రాజకీయవేత్త. ప్రజలతో అధిక సంబంధంగల రాజకీయవేత్త. ఆయన ప్రజల తరపున పోట్లాడుటతో తృప్తిపడువాడు కాడు. ప్రజలే తమ హక్కులకొరకు పోరాడునట్లు చేయు రాజకీయ విప్లవకారి, కాంగ్రెసు ప్రజల కొరకు గాక ప్రజలదే అగునట్లు చేయుటకు అనవరతము అఖండకృషి చేయు రాజకీయ వేత్తయై ఉన్నారు. కొందరు రాజకీయవేత్తలు కార్మిక, కర్షకులకు దూరులైన వారు. వీరిముఖం యీ రోజున చూచువారు లేరు, కర్షకులలో కల్లా కపటం లేనట్లే ఆయన రాజకీయాల్లోను ఉండవు. కాని ప్రభుత్వమువారి టక్కు, టమార, గోకర్ణ, గజకర్ణ విద్యలకు ఆయన మోసపోడు.

ఆయన నిరంతరము చేయునది రాజకీయ ప్రచారమే. ఆయన రైతాంగ విద్యాలయం అనేక యువజనులకు రాజకీయాలలో తరిఫీదు చేయుచున్నది. శాసనసభలో ఆయన చర్చలు, ఆయన రాజకీయ చతురతను ప్రకటించును. వేయేల? ఆయన "ఆధునిక రాజ్యాంగ సంస్థలు" ఒకసారి చూడతగును. రాజకీయ శాస్త్ర విజ్ఞానానికి ఆయన రాజకీయవేత్తయే గాక, రాజకీయాలకై ఆత్మార్పణ

మొనర్చుకొన్న పరమత్యాగి. “వందేమాతరం”తో ఆరంభమైన మన రాజకీయాలను ఇండియాను వీడిపొండనే నినాదం వరకు తెచ్చిన గాంధీమహాత్మునకు మనమెంతో ఋణపడి యున్నాము. పతితమైన మన జాతిని ఎంతో పైకెత్తిన అపూర్వపురుషుడు.

## నిర్మాణ నిపుణుడు "సంఘే శక్తి కలౌ యుగే"

పూర్వకాలంలో మనవారు ఆందోళన వ్యక్తిపరంగానే చేసేవారు. అది కొద్ది పాటిదే. ఆ వ్యక్తులను బంధిస్తే అంతటితో ఆఖరు. పాశ్చాత్యులలో నిర్మాణశక్తి అధికము. వారు వ్యక్తులకంటే సంఘాన్ని ఎక్కువ గౌరవిస్తారు. మనం నేర్చుకో వలసిన మంచి గుణాలు వారిలో చాలా ఉన్నాయి. మనం ఎంతవరకూ వ్యక్తుల మీదనే లక్ష్యం ఉంచుతాము, ఇది అంతమంచిది కాదేమో!

ఎంత ప్రచారము, ఆందోళన చేసినా సంఘనిర్మాణం లేని ఆ కార్యము పునాదులు లేని భవనం వంటిది. సంఘాలుంటే ఎంత కార్యకలాపమైనా జరుగు తుంది.

భారతదేశంలో సంఘనిర్మాణం అనిబీసెంటు స్వరాజ్య సంఘాల ద్వారా చేసింది. ఆమె గొప్ప నిర్మాణశక్తి సంపన్నురాలు. భారతదేశ అభివృద్ధికై ఆమె అనేక సంస్థలు పెట్టి ప్రయోజనం సాధించి పేరు గడించింది. మహాత్ముడు రాజకీయాలలో ప్రవేశించిన తరువాత గొప్ప మార్పు కలిగింది అన్నివిధాలా. ఆయన గొప్ప నిర్మాణశక్తి చూపెట్టాడు, కాంగ్రెసును సజీవం చేసి పల్లెపల్లెలలోను సంఘాలు యేర్పాటు చేయుటే కాక అఖిలభారత చరఖాసంఘం. హరిజన సేవాసంఘం, గోరక్షణసంఘం, గ్రామసౌభాగ్య సంఘం మొదలగు పెక్కు సంఘాలు పెట్టి ప్రయోజకుడు అనిపించు కున్నాడు. మన సర్దార్ పటేల్ పెద్దరైతు. నిర్మాణములో నిరుపమానుడు. మన రంగా కూడా నిర్మాణనిపుణుడే. ఆయన వూరూరు తిరిగి ఉపన్యాసాలిచ్చి వూరికే పోడు. వెళ్ళిన చోటల్లా వర్కర్సును కలసికొని, వారి సాధకబాధకాలను కనుగొని, తగు సలహాలనిచ్చి, సంఘ నిర్మాణానికి పురికొల్పును. ఆయన నిర్మాణశక్తి అంతా కార్మిక కర్షక ప్రయోజనాన్ని ఉద్దేశించే. అందుకుగాను ఆయన ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం, అఖిల భారత రైతుసంఘం, రైతురక్షణ సంఘం, దక్షిణ భారత కార్మిక కర్షక సమ్మేళన. జమీందారీ రైతుసంఘం, రైతాంగ

విద్యాలయం, కేంద్ర శాసన సభలో రైతాంగ బృందము, చేనేత పారిశ్రామిక సంఘం మొదలగునవి నిర్మాణం చేశాడు.

జాతీయ ప్రబోధమును గాంచి, తమ హక్కులకొరకు సర్వస్వమును ధారబోయ సమకట్టిన ప్రజల ఆశయములను, కల్లబొల్లి కబుర్లను, టక్కు,టమార విద్యలును మోసపుచ్చగలవా! రంగా గొప్ప ప్రచారకుడు. ఆయన పాశ్చాత్యదేశ పద్ధతుల నను సరించి ప్రచారము చేయును. ఇది నూతన టెక్నిక్. ఆయన రైతాంగ ఉద్యమ నిర్మాత అను సంగతి అందరు యెరిగినదే. రైతుసంఘాలు ఆయన స్థాపించ దలచినపుడు నలుగురు నాల్గువైపులనుండి రాళ్ళు రువ్వారు. జమీందారులు, షావుకార్లు, జస్టిసు పార్టీ వారు, కొందరు కాంగ్రెసు పెద్దలు కూడాను. అయినా ఆయన నిరంతర ప్రచారమువల్ల దానిని సర్వజన ఆమోదము చేయగలిగినాడు. భారతదేశమంతట పలుసార్లు తిరిగి, తన రాజకీయాలను ప్రచారము చేసినాడు మహాత్ముడు. ఆయన పాదపద్మముచే పునీతము కాని పల్లెపట్టులేదు. ప్రకాశము ప్రవేశించని పల్లెలే లేవు ఆంధ్రావనిలో, ఆచార్య రంగా ఎన్నిక సమయములో మాత్రమే తిరిగే ప్రచారకుడుకాడు. ఏదో ఒక కార్యము కొరకు నియమితకాలములో సంచారము చేసేవాడు కాదు. ఆయన నిరంతరము మత ప్రచారకునివలె ప్రచారముచేయు రాజకీయ ప్రచారకుడు. ఆ సేతుహిమాచల పర్యంతం అనవరతము తిరుగుచునే యుండును. ఆంధ్రావనిలో ఆయన అడుగు పెట్టని ప్రదేశమే లేదు. ఆయన నిత్యసంచారి, గొప్ప ప్రచారకుడు.

ఆయన ప్రచారము బహువిధములు. రైతు ఉద్యమ ఆరంభకాలములో రెండు అచ్చు ఆఫీసులు వాహినీ, గోభూమి, క్రాంతి మొదలగు స్వంత పత్రికలేకాక మరికొన్ని అభిమాన పత్రికలుకూడా వుండేవి. ఆయన ఆందులో అనేక వ్యాసములు వ్రాసి, వ్రాయించి, అద్భుతముగా రైతుల కడగండ్లు లోకానికి వెల్లడించెడువాడు, కరపత్రములు చిన్నచిన్న పుస్తకములు ప్రకటించెడువాడు. సభలు సమావేశములకు అంతువుండేవి కావు నాడు నేడుకూడా. సేవాదళాలు, రైతుయాత్రలు, రైతాంగ విద్యాలయములు, యింకా యెన్నో విధాల యిదివరకు మనము కనివినియెరుగని పద్ధతులు ప్రచారమునకు తెచ్చిన గొప్ప ప్రచారకుడు ఆచార్యరంగా.

## అసమాన ఆందోళనకారుడు

తమ అధికారాన్ని మనం ఎంతమాత్రం లక్ష్యం చెయ్యజాలమని ప్రభుత్వం గుర్తెరుగునట్లు మనం భగీరధ ప్రయత్నాలు సలుపుదుము గాక ! –''మహాత్ముడు''

''ప్రతి జాతి తనకు తగిన ప్రభుత్వమును తాను పొందును''.ప్రచారము రైతులలో వర్గ చైతన్యం, రాజకీయ చైతన్యం కలగడానికి చేసే కార్యము కష్ట నివారణకు కాని, నూతన హక్కుల కొరకు కాని చేసే యత్నమే ఆందోళన, ప్రచారము. ఒక కార్య ఆవశ్యకత తెలుపుటకు, ఆందోళన కార్యసాఫల్యాన్ని పొందుటకు.ప్రచారం నాయకులు,సేవకులు చెయ్యాలి.ఆందోళనఅందరు చెయ్యాలి.

రైతులకు రాజకీయాలంటే తెలియనే తెలియదు. వారిలో విద్యాజ్ఞానము బొత్తిగాలేదు, ప్రభుత్వము ఏమాదిరిగా నడుస్తూన్నదో ఏమాత్రము యెరుగరు. యే విషయమైనా ఎవరికి ఎప్పుడు చెప్పుకోవాలో ఎరుగనే యెరుగరు. చెప్పుకుంటే వింటారా అని ఒక అపనమ్మకము కూడాను. ఇలా రైతాంగము నిర్వీర్యమై నిలబడి ఏమీ చెప్పలేని స్థితిలో వుంటే వారికి అండగా నిలబడి ఆఖరు వరకు పోరాడేవారు అరుదే. మహాత్ముని తోనే రైతులలో జాగృతి బయలుదేరినది. చాంప్రాన్, వైరా, బార్డోలి ఉద్యమాల ద్వారా. రైతుల ఆందోళన ఆర్జీలతోనే ఆఖరు. అంతకంటే వారికి మార్గాలు తెలియవు. రైతులలో పుట్టి ఆంగ్లభాష ఏ మాత్రము నెరుగక ఆందోళనలో అందెవేసిన చెయ్యిగా అఖండఖ్యాతి గాంచినది కానూరు వెంకటాచలపతయ్య. ఆయన ఆందోళన అనేక విధముల వుండేది. పత్రికలకు వ్రాయుట, సభలు చేయుట, ప్రభుత్వమునకు టెలిగ్రాముల నిచ్చుట, ప్రభుత్వోద్యోగుల వద్దకు రాయబారము వెళ్ళుట మున్నగునవి. 1914 లో మద్రాసు శాసనసభలో ఇరిగేషన్ పంచాయతీ బిల్లు ఒకదానిని ప్రవేశపెట్టగా దానిని తీసివేసి ప్రభుత్వమువారు ఇరిగేషన్ బిల్లు పెట్టినపుడు అది అనర్ధకమని, అనవసరమని ఒక్కరోజున రెండు వేల టెలిగ్రాములు గవర్నమెంటుకు పంపి ఆ బిల్లును ఆపుదలచేసిన అఖండ ఆందోళనకారుడు. ఇలాగే రైతుకు అనర్ధదాయకములైన పెక్కు బిల్లులను ప్రతిఘటించిన రైతు పెత్తందారు. రైతాంగ సమస్యలలో ఆయన అందెవేసిన చెయ్యి, భీష్మపితామహుడు.

ఆనిబిసెంటుకూడా గొప్ప ఆందోళనకారకురాలే. మహాత్ముడు వచ్చిన

తర్వాత ఆందోళనేకాక ప్రత్యేక పోరాటములు తెచ్చి ప్రజలలో ఎంతో చైతన్యము కలగజేసెను.

అడగనిదే అమ్మయినా పెట్టదను సంగతి అందరికీ తెలిసినదే. రైతులు ఆందోళన  చెయ్యక, వారి తరపున ఎవరో చేస్తూవుంటే, ప్రభుత్వము వారిని పనిపాటలు లేక ఆందోళన చేసేవారని హేళనచేసేది. ఆందోళన వల్ల అనేక కార్యాలు సాధింప బడ్డాయి. బార్డోలి రీసెటిల్‌మెంటు, కృష్ణా ఉభయగోదావరి జిల్లాల రీసెటిల్ మెంటు అందోళనవల్ల రైతుల కెంతో ప్రయోజనము కలిగిన సంగతి కరతలామలకమే.

సాధారణంగా ప్రభుత్వము తనకుతోచిన విధముగా పోతూవుంటుంది. ఎవరిలో చైతన్యం తక్కువగా ఉంటే, వారిపై పెత్తనం చేస్తూ వుంటుంది. అందుకనే రైతాంగం మీద అధికపన్నులు, మనలో జాగృతి లేకపోతే ప్రభుత్వము మనపై పన్నుపై పన్ను వేయకమానదు. రౌతుకొద్ది గుర్రము అన్న సంగతి అందరికి తెలిసినదేగా. యధారాజా తథాప్రజా అన్నది ప్రాగ్దేశపు సామెత, పాశ్చాత్య దేశపుసామెత యేమిటో పరికించారా? ‘‘యధాప్రజా తథా రాజ్యము’’అనగా ప్రజలలో ఎంత చైతన్యం వుంటే ప్రభుత్వము అంత ప్రజానుగుణ్యముగా వుంటుందన్నమాట.

ఆచార్యరంగా వివిధ దేశాలలోని ఆందోళనలను అనుభవమునకు తెచ్చుకున్న అసమాన ఆందోళనకారుడు. రైతుసంఘాలద్వారా ఆయన చేసిన ఆందోళన అమోఘం,  అపూర్వము. ఊరూరా తిరిగి రైతు కష్ట నష్టాలను ఎంక్వైరీచేసి ప్రకటించుట, వారి కనీసపు కోర్కెలను ప్రకటించుట, రిఫరండము ప్రకటించుట, ఆకలి యాత్రలు చేయుట, రైతురక్షణ వారముచేసి ఆ వారములో దేశమంతటా సభలు చేసి తీర్మానములద్వారా ప్రభుత్వమునకు పత్రికలకు పంపుట మొదలగు పలువిధములుగా ఆయన ఆందోళన వుండెడిది. 1935లో ఆయన స్వయముగా గొప్ప రైతు సమూహానికి నాయకుడై గుంటూరు కలెక్టరు వద్దకు తీసుకువెళ్లి రైతు కష్టాలను వెల్లడించెను. ఇలాగే వివిధ ప్రాంతాలలో ఆయన స్వయముగ చేయుటో, చేయించుటో జరిగెడివి.

ఆర్థిక శాస్త్రరీత్యా ఆయనకు గల అనుభవమును పురస్కరించుకొని రైతువారి, మెట్ట, మాగాణీ స్థితిగతులే కాక జమీందారీ గ్రామాలలోని స్థితిగతులను

విచారించి రైతుల స్థితి ఎంత దుర్భరముగా నున్నదో లోకానికి వెల్లడించి, గొప్ప మార్పును తీసుకు వచ్చిన మహనీయుడు.



కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి ఆధ్వర్యాన బయలుదేరిన ఆంధ్రరాష్ట్ర రైతు రక్షణ యాత్రను గంజాం జిల్లా ఇచ్చాపురములో 1937 సం జులై 18 వ తారీఖున ఆచార్య రంగా ఆరంభించి ఆంధ్రావనిలో అద్భుతచైతన్యం కలుగ జేసినాడు. ఈ యాత్ర నాలుగుమాసాలు సాగి, రైతులోకంలో అద్భుత ప్రబోధములు కలిగించింది. 1500 మైళ్ళు ప్రచారముచేసి యీ రైతుదండు మద్రాసు మంత్రిమండలికి తన కోర్కెలను వెల్లడించినది.

మహాత్ముని దండయాత్ర అఖిల భారత లోకాన్నేకాక ప్రపంచాన్ని అంతా కదిలించింది. ఈ రైతు రక్షణయాత్ర ఆంధ్రలోకములో అపూర్వ సంచలనము కలుగజేసి, ప్రజలలో నిరుపమానమైన ప్రబోధము కలుగజేసి, రైతులోకానికి అనేక లాభాలను కలుగజేసినది. ఈ దండును, యీ దండు నాయకుడైన మూర్తిని, దీనికి మూలపురుషుడైన ఆచార్య రంగాను ఆంధ్ర రైతాంగము అనుదినము స్మరించక తప్పదు. వేయేల అలజడి ఆయన జీవితము, ఆందోళన ఆయన వూపిరి.

ఆచార్యరంగా 1935 నుండి కేంద్ర శాసనసభలో కాంగ్రెసు పార్టీ సభ్యుడుగా వుంటూ ఆమోఘమైన సేవచేయుచుండుట లోక విదితము, ఆయన ప్రతిభ ప్రాముఖ్యత మాత్రమే ప్రస్తుతము తెలిపెద. అసెంబ్లీలో అతిప్రాముఖ్యమైన పబ్లిక్ ఎక్కౌంట్సు కమిటీలో ప్రముఖ సభ్యుడుగా వుండి పాటుపడుతున్నాడు. వల్లభపంతు, సత్యమూర్తి గార్ల అనంతరం ఆచార్యరంగా అంతటిగొప్ప ఆర్థిక శాస్త్రవేత్త శాసన సభలో లేడని టైమ్సు పత్రికా ప్రతినిధి ప్రశంసించెను. "ఆచార్యరంగా అంకెలలో అందెవేసిన చెయ్యి. ఆయన చెప్పే ప్రతి విషయం, సత్యమైన సందర్భాల చేతను, అంకెలచేత ఋజువు చేయును" అని ఒక ప్రముఖ రాజకీయవేత్త ప్రశంసించెను.

''మద్రాసు నుంచి వచ్చిన ప్రతినిధులందరు మాటకారులే కాని, విషయ విజ్ఞానం కలిగి ఉత్తేజకరంగా ఉపన్యసించ గలవాడు ఆచార్యరంగా ఒకడే''

అంటాడు యూరోపియన్ గ్రూపు సెక్రటరి జేమ్సు. వేయేల? ఆయన ఉపన్యాసాలకు ట్రెజరి బెంచి వారు తప్పక సమాధానం చెప్పుటే ఆయన ప్రతిభకు ప్రజా సేవకు ప్రబల ప్రమాణము. ''శాస్త్రీయ సోషలిజమును శాసనసభలో ప్రచారం చేయుటలోను ఉపన్యసించుటలోను ''మాక్సిటన్'' తో మనం ఆచార్య రంగాను పోల్చవచ్చు'' అంటాడు సుప్రసిద్ధ ఆర్థిక శాస్త్రవేత్త కె. టి. షా.

## ఎడ్జరన్‌మెంటుల్లో అద్వితీయుడు

ఆచార్యరంగా ఉత్తేజకరంగా ఉపన్యాసాలిచ్చుటలోను ప్రభుత్వ సభ్యులను, ప్రశ్న పరంపరచే పీటీ చేయుటలోను ప్రసిద్ధుడేకాక, కోత తీర్మానములలోను, అడ్జరన్మెంటు మోషనులలోను అద్వితీయుడు.

ఆయన ఇట్టి తీర్మానములు అనేకం శాసనసభలో పెట్టినా, నూతన శాసన సభలో యీ సంవత్సరము ప్రథమంగా పెట్టి ప్రథమ విజయం గాంచాడు, ఆ సందర్భములో ఆచార్యుని ఔచిత్యానికి చాకచక్యానికి పత్రికలన్నీ ప్రశంసించినవి. ఆ సందర్భము కాస్త ఆలకించుదము.

ఇండోనీషియా ఇదివరకు డచ్చివారి పాలనలో వుండేది. దాదాపు ఏడు కోట్లున్నారు వారు. 1945 సంవత్సరం ఆగష్టులో వారు స్వాతంత్రం పొందారు, సోకర్నో ఆ రిపబ్లిక్‌కు ప్రధమ అధ్యక్షుడుగా ప్రస్తుతి గాంచుతున్నాడు. అట్టివారిని అణచి వారి దేశాన్ని స్వాధీనం చేసుకొనుటకు డచ్చి ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే, భారత సేనలను కూడ డచ్చివారికి  అండగా పంపింది మన గవర్నమెంటు. దానికి రంగా, రంగసింహమై ''జపానుతో యుద్ధం అయిపోయిన తర్వాత కూడా, ఇండోనీషియా, చైనాలతో బ్రిటీషు ప్రభుత్వం సాగిస్తున్న దౌర్జన్యచర్యలలో పాల్గొనడానికి భారత ప్రభుత్వం ఎందుకు నిరాకరించరాదో'' అన్న విషయాన్ని భారత శాసనసభలో చర్చించాలన్న వాయిదా తీర్మానం ఏకగ్రీవంగా నెగ్గింది.

భారతశాసనసభలో ప్రతికూలపక్ష నాయకుడు శరశ్చంద్రబోసు, ముస్లిం లీగుపార్టీ నాయకుడు జనాబ్ జిన్నా, కాంగ్రెసుపార్టీ నాయకుడు  దివాన్ చమనలాల్ మొదలగువారు బలపరచి ఇరుగుపొరుగు ఆసియా దేశాలలో స్వాతంత్రోద్యమాలను అణచివేయడానికి జరిగే యుద్ధంలో భారత సైనికులను ఉపయోగించరాదని తీవ్ర అసమ్మతిని వెల్లడించారు. (1946-1-21).

ప్రథమంగా ప్రభుత్వాన్ని పరాజయం పొందించుటేకాక, ఆసియా జాతుల స్వాతంత్ర్యాన్ని మేము అరికట్టనీయమని, నేడు భారతీయులలో ప్రబలంగా ప్రస్ఫుట మగుచున్న స్వాతంత్ర్యకాంక్ష ఆచార్య రంగా ద్వారా, ఆసియా ప్రజలందరకే కాక ప్రపంచానికి ప్రదర్శింపబడింది.

“నూతన కేంద్రశాసనసభలో ప్రభుత్వ పరాజయమును గావించి ప్రధాన గౌరవము, ఈసారి రైతు నాయకుడగు ఆచార్య రంగా గారికి చెందుట ఆంధ్రులు గర్వింపదగిన విషయం” ఢంకా 1946 ఫిబ్రవరి. ఢంకా బజాయించాలిసిందే అంటారు ఆంధ్రులు.




“ఈ సందర్భాన్ని పురస్కరించుకొనే కృష్ణాపత్రిక (శ్రీ ముట్నూరి కృష్ణారావు. ఎడిటర్) (46-1-26) ‘రంగాగారి బోణి’ అంటూ ఇట్లా అంటున్నది. “క్రొత్త శాసనసభ ఆరంభించిందో లేదో ఆచార్య రంగా వాయిదా పెట్టి లోకానికంతా భారత ప్రభుత్వ బండారాన్ని బయటపెట్టాడు. ఇండోనేషియా ప్రజల స్వాతంత్రాశయాలకు భిన్నంగా, హాని కరంగా భారతసేనను ఉపయోగించిన దోషాన్ని, ఆయన చర్చకు పెట్టగా ప్రభుత్వం పరాజయం పాలైనది. సభలో వోట్లుకూడా తీసుకోవలసిన అవసరం లేకుండాపోయింది. అన్ని పార్టీలు హంగు చేశాయి. దాని వెంటనే మోహన్ లాల్ సాగ్జెనా మరొక తీర్మానంపెట్టి మరొక అపజయాన్ని కలిగించాడు.” రంగాగారి బోణి బంగారపుబోణి బలేబోణి అంటుంది ఆ పత్రిక.

ఇంతవరకు కాంగ్రెసు ముస్లింలీగ్ ఏకమై ప్రభుత్వాన్ని పరాజయం గావించి నవి. మరొక జయం మరువరానిది మౌలంకరు గారిది. ప్రభుత్వమువారు ముస్లింలీగ్ మిలాకత్ అయి, ముసిముసినవ్వులు నవ్వుకొంటూ, భుజభుజాలుకలసి పనిచేసినా, కాంగ్రెసు అభ్యర్థిగ మౌలంకరుగారు శాసనసభా అధ్యక్షుడగుట, ఆచార్యరంగా చేతిచలవ కాకపోతే మనమేమి అనుకోవాలి అంటున్నారు కొందరు.

## పార్టీలో ఆయన ప్రాముఖ్యము

అసెంబ్లీ కాంగ్రెసు పార్టీకి ప్రత్యేకంగా (Statistical Department) ధనాగారపు అంకెలు శాఖ ఏర్పాటు చేయించి, దానికి కార్యదర్శిగా వుండి, పార్టీ ప్రముఖుల్లో ఒకరై పార్టీలీడరు వెనుక వీటిని కాచుకొని కూర్చుండి పార్టీ లీడరగు భులాభాయి దేశాయికి ప్రధాన సలహాదారులలో ఒకరుగా వుండెను.

పార్టీ అంకెల కార్యదర్శిగా ఆయన చేయవలసినపని శాసనసభాసభ్యులు తమ వాదనకు అవసరమగు అంకెలు అడిగినప్పుడు వాటిని ఇచ్చుట, అంకెలేకాక ఆయన అనేకులకు అవసరమగు నోట్సు కూడ వ్రాసిపెడుతూ వుండేవాడు. ఒకనాడు దేశాయి అవసరమైన భోగట్టా కొరకు ఆచార్యరంగాను కొన్ని అంకెలు కోరెను.

ఆ అంకెలు ఆయన స్మృతి పధముననే వుండెను కాని తక్షణమే చెప్పుట, అంత మర్యాద కాదేమోనని తలచి, 5 నిమిషాల అనంతరం ఆ అంకెలను ఆ నాయకునకు ఆచార్యుడు ఇచ్చెను. ఆ కాగితం ఆయన అందిపుచ్చుకొని విస్మితుడై ఇట్లా అన్నాడు. ‘‘ఇటువంటి ప్రతిభావంతుడగు సెక్రటరీ కాంగ్రెసు పార్టీకి కలిగినందుకు అమిత ఆనందం పొందుతున్నాను.’’ ‘‘అందరిచేత ప్రతిభావంతుడని ప్రశంసింపబడుచున్న నా నాయకునకు తనకు కావలసినదాన్ని అందిచ్చే స్థితిలో నన్నుంచినందుకు నేను కృతజ్ఞత తెలుపుతున్నాను’’ అని అచార్యరంగా సవినయముగ అనెను.

భులాభాయి న్యాయవాదిగ శాసనసభాప్రతిపక్ష నాయకుడుగ ప్రఖ్యాతి గాంచినా, అజాద్ హింద్ ఫౌజు కేసులో ఆయన చూపిన న్యాయశాస్త్ర పారీణత, అంతర్జాతీయ న్యాయశాస్త్ర పరిజ్ఞానము, ఆయన అఖండ ప్రతిభా విశేషాలు ప్రపంచానికి విదితమైనవి. ఆయన నామము భారతజాతీయ స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో నేతాజి అనంతరం పేర్కొనక తప్పదు.

ఈ క్రింద ఘటనలవల్ల రైతులయందు ఆయనకున్న అనురక్తి, పార్టీ నాయకునకు ఆయన యందున్న గౌరవము, ఆయన మనోనిబ్బరము విదితం కాగలదు.శాసనసభలో నాడు నేడు కూడ కాంగ్రెసుపార్టీ మెజార్టీ పార్టీయే. ఎవరైనా యితరులు ఒక బిల్లు పెట్టవలసినప్పుడు, పార్టీ నాయకునితో సంప్రదిస్తారు. అట్లాగే దేశాయి లీడరుగా వున్న సమయంలో, తోట యజమానుల బృంద కార్యదర్శి

(ప్లాంటర్సుగ్రూప్ సెక్రటరీ) తానొకబిల్లు ఉపపాదింప తలచి, దేశాయి ఆమోదం కోసం వచ్చెను. ఆయన అది చూచి, ఇదంతా రైతులకు సంబంధించిన వ్యవహారం . రంగాకు చూపించు, ఆయన ఔనంటే నాకేమి అభ్యంతరం లేదన్నాడు.

ఆ కార్యదర్శి ఒకనాడు ఆచార్య రంగాను విందుకు పిలిచి, బాగా మైకం కలుగగలందులకు షర్బత్తులో బ్రాంది కలిపి యిచ్చెను. ఆనంతరం ఆ బిల్లు తీసుకొని వచ్చి చూపెట్టెను. అందులో రైతుకు అనర్ధకరమైన అంశాలున్నవి, నేను అంగీకరించనని ఆఖరుకు రంగా అనెను.

అనంతరం ఆ కార్యదర్శి దేశాయి దగ్గరకు వచ్చి రంగాకు నిషా ఎక్కుటకు బ్రాంది యిచ్చినా ప్రయోజనం లేకపోయింది, ఆయనకు కైపూ ఎక్కలేదు. ఆయన అంగీకరించనూలేదు, మరి మా సంగతి ఏమంటారు అన్నాడు. రైతుల సంగతి ఏదొచ్చినా రంగా తేల్చవలసిందే. నీ కర్మ నేనేమి చేస్తాను? మొట్టమొదటనే చెప్పాను ఇక దయచెయ్యవచ్చు, అన్నాడు.

ఆచార్య రంగాకు నిషావస్తువులేవీ అలవాటు లేదు. ఆయన, ఆ పానీయం ఒక్కపట్టున మూడు గ్లాసులు పుచ్చుకొన్నాడు. అది ఆయన పానీయమని గ్రహించను లేదు. కైపూ ఎక్కలేదు. మర్నాడు కొంచెం బడలికగా వుండి ప్రొద్దెక్కి మాత్రంలేచాడు. ఇట్లా ఆయన మర్యాదమన్ననలు పొందుతూ, ప్రతిభా ప్రదర్శనము ను చేస్తూ రైతు రక్షకుడుగా రాజిల్లుతున్నాడు.

10 సంవత్సరాలకు భారత శాసనసభా యెన్నికలు జరిగాయి. నాటి కంటే నేడు కాంగ్రెసు బలం అధికమైనట్లే ఆచార్య రంగా ఆధిక్యము అధికమైనది. ఈ శాసన సభలో శరశ్చంద్రబోసు పార్టీ నాయకుడు. ఆచార్య రంగా, మోహన్‌లాల్ శాగ్జానా కార్యదర్శులు. కాని ఆచార్య రంగా మీద అధికభారం పడింది, ఆయనే కార్యకలాప మంతా చూస్తున్నాడు.

‘‘శరశ్చంద్రుని నాయకత్వాన ఆచార్య రంగా ఇతోధికంగా తన ప్రతిభా, కార్యకౌశలము చూపించి, అఖండ కీర్తిని ఆర్జించుచున్నాడు.

ప్రభుత్వమేదో తవ్వి తలకెత్తునట్లు కమీషనులను ఏర్పాటుచేస్తుంది. ఇలా యేర్పాటు చేయుట ఆ కార్యాన్ని చేయకుండా కాలహరణము చేయడానికే అని అభిజ్ఞుల అభిమతము. ఆ కమీషనులలో అవసరమైన విషయాలపై ఆలోచన

బుద్ధిపూర్వకంగానే వదలివేస్తారు. మన కళ్లనీళ్లు తుడవడానికి పెద్దలనంతా ముస్తాబు చేసి పిలుస్తుంది సాక్ష్యాలకు. ఆయా సమస్యలలో ఆరితేరిన వారిసాక్ష్యమే తీసికోబడుతుంది కూడా. ఆచార్యరంగా వివిధ కమీషనుల యెదుట సాక్ష్యము నాకు లభ్యము కాలేదు, కాన ఆయా విషయములందు అయన అభిప్రాయాలు పొందు పరుస్తా.

1926 సంవత్సరంలో వ్యవసాయ విచారణ సంఘం వచ్చింది. దాని ఎదుట సాక్షమిచ్చాడు. ఆయన పుట్టింది పెరిగింది రైతు కుటుంబములోనే. ఆయన సర్వశక్తులు రైతాంగము కొరకే ధారపోస్తున్న సంగతి భరత ఖండమేగాక సర్వప్రపంచం యెరుగును.

ప్రపంచములో మానవకోటికి జీవనాధారాలైన రైతులు నానాటికి కృశించుచున్నారు. దేశరాజుల పరిపాలననాటి శిస్తు కంపెనీ పరిపాలన నాటికి నూటికి 75 వరకు పెరిగింది. 1859-1919 నాటికి భూమిశిస్తు 21 కోట్లనుండి 33 కోట్ల వరకు పెరిగింది. అనగా నూటికి 57 చొప్పన పెరిగిందన్న మాట. ఇది ప్రభుత్వం వారి పన్నుల పెంపకము.

ఇక రైతుల ఆదాయం 18 కోట్ల78 లక్షలనుండి 8 కోట్ల 38 లక్షలకు అనగా సగం వంతు తగ్గింది. 1928లో రూ.146 లు సంపాదింపగలిగిన కుటుంబము 1933 నాటికి రూ 84 లు మాత్రమే సంపాదించుచున్న దన్నమాట.

1881 నాటికి నూటికి 58 మంది రైతాంగం

1891 నాటికి నూటికి 66.6 మంది రైతాంగం

1901 నాటికి నూటికి 66.5 మంది రైతాంగం

1921 నాటికి నూటికి 73.9 మంది రైతాంగం

ఇతర వృత్తులన్ని నశించుటచేత యిలా జనం వచ్చి భూమిమీద పడుతూ వుంటె రైతు వత్తిడి ఎక్కువగుచున్నది. ఈ వృత్తి లాభప్రదమనికాదు. చేయునది ఏమీలేక సేద్యము చేయుట.

1771వసంవత్సరములో రైతునకు సగటున 40 యకరములు

1915 సంవత్సరములో రైతునకు సగటున 7 యకరములు

ఇప్పుడు యింకా తగ్గింది. అయిదు యకరాలకంటె తక్కువగల రైతులు నూటికి 37 మంది వున్నారు. ఇండియా మొత్తం మీద దీనితో వీరికి జీవనం జరగటం లేదు.

## మన నీటి సరఫరా–రైళ్లు

కృష్ణా, గోదావరి ఆనకట్టలపై నూటికి 5 రూపాయల వడ్డీవస్తే చాలన్నది ప్రభుత్వము. నేడు రూ.20లు వస్తుంటే ఇతర ఆనకట్టలెన్ని కట్టింది? ప్రజాసౌకర్యాలు చేయక రైళ్లు నిర్మించుతున్నది1854–1905 వరకు 30 కోట్ల నీటిసరఫరాకున్ను, రూ.266కోట్లు రైళ్లకున్ను భారతదేశములో ప్రభుత్వమువారు ఖర్చుపెట్టారు. ఇక ఏమి చెప్పవలసి వుంటుంది?ప్రజల మేలుకన్నా వారి లాభాలు అవసరము. రైళ్లవల్ల మనదేశము నుండి ముడిపదార్థములు త్వరగా తీసికొనిపోగలరు. వారి సరుకులు దిగుమతులు ఆగును. సైన్యాల రాకపోకలకు అనుకూలంగా వుండును. నోరెత్తితే నూర్పిడి చేయడానికి. ఇది మన ప్రభుత్వ రాజనీతి. నీటి సరఫరా అధికం కావాలని, రైతులకు గిట్టుబాటయ్యే ధరలు నిర్ణయించాలని వెయ్యిరూపాయలకు తక్కువ ఆదాయమువచ్చే రైతునుండి ఎట్టి శిస్తు వసూలు చేయరాదని, బంజరుగావున్న15 కోట్ల యకరములు వ్యవసాయ కూలీలకు అమ్ముకొనే హక్కులేకుండా, సహకార పద్ధతిని సేద్యముచేసుకొనే పద్ధతిని యిస్తే దేశం సుభిక్షంగా వుంటుందని ఆచార్యుని అభిమతము. **భూమి కలవాడుగాడు రైతు. స్వంతంగా సాగుచేసుకొనేవాడే రైతని ఆయన అభిప్రాయం.** ప్రభుత్వానికి రైతుకి మధ్య జమీందారు మొదలగు దళారులు ఉండరాదని ఆయన ఆశయము. 1929 లో లేబరు కమీషను వచ్చింది. దానిలో కూడ ఆయన సాక్ష్యమిచ్చాడు. ఆయన ఆంగ్ల దేశములో వుండగనే లేబరు ఉద్యమమునందు ప్రత్యేక కృషి చేసెను. గిరి, ఎమ్. ఎన్. జోషి మొదలగు శ్రామిక నాయకులున్నా ఆచార్యునివలె కార్మిక కర్షకోద్యమాల్లో కాకలు తీరిన వారు లేరు. కార్మిక కర్షక రక్షణకై కంకణము కట్టుకున్నవారు కానరారు. ఈ సంగతిని కేంద్ర శాసనసభలోని ఆంగ్లేయ శాసనసభా సభ్యుల బృందపు కార్యదర్శి, ఇ.ఎఫ్. జేమ్సు ‘‘ఆచార్య రంగా భారతదేశపు కార్మిక, కర్షక ప్రతినిధి’’అని సత్యాన్ని ఉగ్గడించాడు.

రాజ్యాంగపరిషత్తుకు మద్రాసు ప్రతినిధులలో కార్మికులకు సరైన ప్రాతినిధ్యం కలుగ చేయలేదని ఆక్షేపించాడు. ఆయన రైతుబాంధవుడేకాదు, కార్మిక బంధువు కూడ.

ఆయనలో ప్రత్యేకత ఏమంటే, మనదేశపు పరిస్థితుల ననుసరించి వ్యవసాయ కూలీలను కూడ కార్మికవర్గములో కలుపును. వ్యవసాయకూలీల కొరకు భారతదేశంలో ప్రథమమునుండి నేటివరకు పాటుపడుతున్నది ఆయనే. మిల్లు కార్మికులతో టు సమస్తసౌఖ్యాలు, హక్కులు కలగాలనే ఆయన అనుదిన ప్రయత్నం. వారితోపాటు వీరికి కూడ కనీసవేతనాలు నిర్ణయించాలని ఆయన దీక్ష.

పారిశ్రామికాధికారులు జాతీయాభిమానమును పెంపొందింప జేసి, వారి వస్తువులు లాభప్రదముగా అమ్ముకొనుచూ ఉత్పత్తి దారుల కష్ట నష్టాలు గుర్తించుట లేదని వారి సంఘాలను విచ్ఛిన్నం కూడ చేయుటకు ప్రయత్నిసున్నారని ఆయన అనే దానిలో సత్యమెంతేని కలదు. వారు విశ్రాంతి తీసికొనుటకు, ఫలహారాలు ఆరగించుటకు వసతి గృహాలు నిర్మించాలని, వారికి కనీస వేతనాలివ్వాలని, ప్రభుత్వమువారు యజమానులకు రక్షణయిస్తూకూడ కార్మికులయెడల నిర్లక్యము చూపుట మంచిపద్ధతి కాదని ఆయన ఖండించును. కార్మికుల ఆర్థిక స్థితిగతులన్ని పరిశోధించి (Labour in south India) దక్షిణ దేశములోని కార్మికుడు అనే గ్రంథాన్ని రచించాడు.

అవసరమైన పరిశ్రమలు (యంత్ర పరిశ్రమలు) ప్రభుత్వం స్వాధీనం చేసి కొని మిగతా పరిశ్రమలు కుటీర పరిశ్రమలుగానే వుంచి, నిరుద్యోగసమస్య నిర్మూలనం చేసి, దేశసౌభాగ్యం పెంపొందింప చేయాలని ఆయన అభిమతము.

1931లో సెంట్రల్ బ్యాంకింగు విచారణ కమిటీ యెదుట కూడ ఆయన సాక్ష్యమిచ్చెను. ‘‘ఫైనాన్సు కమిటీ’’ లో ఆయన ప్రసిద్ధుడు. ఆర్థిక వేత్తగా అత్యధిక ఖ్యాతి గాంచాడు. ఇంతేకాక ఆయనకు బ్యాంకుల అనుభవం కూడ అధికంగానే యున్నది. ప్రాథమిక భూమి తనఖా బ్యాంకుకు ప్రెసిడెంటుగాను, మద్రాసు రాజధాని కేంద్ర భూమితనఖాబ్యాంకుకు డైరక్టరుగాను, రాష్ట్రీయ సహకార సంఘ యూనియన్ గౌరవ సభ్యుడుగా నుండెను.

1904 లోనే సహకార సంఘాలు, 1935లో రైతులను షాహుకార్ల నుండి కాపాడాలని భూమి తనఖాబ్యాంకులు ఏర్పడ్డవి. కాని నేటికి నూటికి రూ.10 లు

మాత్రమే రైతులకు బ్యాంకుల ద్వారా సప్లయి అగుచున్నది. యీ సంఘాలవల్ల రైతులకు ఆత్మగౌరవము, ఐకమత్యము, వ్యవహారదక్షత కలుగుతున్నమాట నిజమే. కాని వీనివల్ల అనుకున్నంత ప్రయోజనం కలుగుటలేదు, అసలీ బ్యాంకు పునాదులలోనే లోపమున్నది. ఆస్తిని బట్టి ఋణము యిస్తున్నారు కాని, అవసరాన్ని బట్టికాదు. సహకారోద్యమము డెన్మార్కు, ఐర్లాండులలోవలె అభివృద్ధి పొందలేదు మన దేశములో ఈ సంఘాలు పరపతి సంఘాలుగా పనిచేస్తున్నవి కాని ప్రజల జీవిత పరిమాణాన్ని పెంపొందింప లేకపోయినవి. ప్రభుత్వము వారికి కావలసింది రైతులు సకాలములో శిస్తులు యిచ్చుటేకదా, అందుకే యివి పనిచేస్తున్నవి. ప్రభుత్వమువారు పెట్టే బ్యాంకులు, రైతులకు అనుకూలమని భ్రమపడే శాసనాలు, రైతులు భూములు వదలి పెట్టకుండా వుండటానికే పని చేయుచున్నవి కాని వారికి క్షేమంగా మాత్రము లేవు.మనము బ్యాంకు విధానానికి లోబడియున్నాము. కాని, మనకు కావలసిన బ్యాంకు విధానము ఏర్పడలేదు. ఈసత్యాన్నే డేనియల్ హామిల్టను గారిలా అన్నాడు.

"ఎక్కువ పంటనంతను త్వరితముగ దేశమునుండి తీసుకొనిపోగల రైల్వేలను దేశీయుల కిచ్చితిమి, కాని ఉత్పత్తి నెక్కువ చేయుటకు ఉపకరించు బ్యాంకింగు పద్ధతిని వారికి మనమివ్వలేదు. పంటలు ప్రపంచమునందన్ని ప్రాంతాలవారు తీసుకొని పోవుచున్నారు. వర్తకుడు, వ్యాపారస్తుడు పైకమును తీసుకొని పోవుచున్నారు. ప్రజలను పిశాచములు తీసికొనిపోవుచున్నవి" ఇది యదార్థస్థితి. భారతదేశంలో రైతాంగము అమాయకమైనది. అవిద్యావంతమైనది. కనుక దాన్ని దోచుకొనేవారు చాలా మంది వున్నారు. వర్తకుడు వడ్డీవ్యాపారస్తుడు అధికంగా దోస్తున్నారు. నేటి నాగరిక దేశాలగు గ్రేట్ బ్రిటన్, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా దేశాల్లో రైతులకు అల్పవడ్డీకి ఋణ సౌకర్యాలు, వారి పంటదినుసులు అమ్మటానికి సరసమైన ధరలు కలిగిస్తున్నారు.

మన బ్రిటీషు ప్రభుత్వము ఈ విధంగా ప్రయత్నించచక, తాటస్త్య విధానాన్ని వహించుట రైతులనధోగతి పడద్రోయుటే.

మన వస్త్రపరిశ్రమ, పంచదార పరిశ్రమ రక్షణపద్ధతిమీద సాగుతున్నది. మన వ్యవసాయ పరిశ్రమ దోపిడిపద్ధతిమీద సాగుతున్నది. రక్షణ లేకపోగా హిందూ

దేశ క్షామానికి కారణమిదే. హిందూ దేశంలో అణగద్రొక్కబడిన జాతులున్నట్లే, అణగద్రోక్కబడిన పరిశ్రమలున్నవి. అందులో అధికమైనది వ్యవసాయ పరిశ్రమ.

వర్తకములో నిపుణత, తక్కువకు కొని ఎక్కువకు అమ్ముట. రైతు ప్రతివస్తువు టోకుగా అమ్మి చిల్లరగా కొనును. చౌకగా అమ్మి ప్రియముగా కొనును. యీవిధంగా నష్టపడుతున్నాడు. ఇంకా రైతు పెక్కువిధాల బాధలు పొందుతున్నాడు. ప్రభుత్వము రైతుని ఎక్కువ పండించమని ప్రోత్సహించునే కాని ఎక్కువధర రాబట్టుటకు ప్రయత్నించకపోగా దాన్ని అరికట్టును. రైతులను అధికంగా పండించుటకు సరసమైన ధరలు వచ్చేటట్లు చేయుటకు, వారి జీవితపరిమాణం పెంచుటకు ప్రయత్నించాలి. నేడు దానికి భిన్నంగా సంచరిస్తున్నది.

ఈ విధంగా ప్రభుత్వము, వర్తకుడు, వడ్డీ వ్యాపారస్తుడు, ఆమాయకుడగు రైతును అణగద్రొక్కుచున్నారు. కనుకనే దేశ ఐశ్వర్యాన్ని పెంపుచేసే ఆర్థికవేత్త రైతుకు బాసటగా నిలవాలి. ఆ నిలిచేవారిలో ఆచార్య రంగా అధికుడు. ఆయన రైతు నాయకుడుగా గాక భారతదేశ పరిస్థితులు చక్కజేయు ఆర్థికవేత్తగా, రైతులకు వారి కష్టమునకు తగు కనీసధర ముట్టాలని నిరంతరం కృషిచేయుచుండుటలో రహస్యమిదే.

దీనినే The Economics of Indian Agriculture గ్రంథకర్తలిలా అన్నారు. “Agriculture is both a craft and a business .... The successful agriculturist should, therefore, be a sound business man. The Indian farmer for example, is poor not mainly because he is inefficient as an agriculturist, but because he is a bad business man. It is here that the economist comes in.' Pages, 2, 3 **"వ్యవసాయమంటే గొడ్డులాగా పాటుపడటం కాదు. పండించుటలో తెలివితేటలు, అమ్ముకోవడంలో లాభదృష్టి ఉండాలి. మంచివ్యవసాయకుడంటే గట్టి వర్తకుడన్నమాట. హిందూదేశ రైతు దరిద్రానికి కారణం, అతని వ్యవసాయంలో లోటుకాదు, అమ్ముకొనే తెలివితేటలు లేకపోవటమే. ఈ సందర్భములో ఆర్థికవేత్త అతనికి సాయపడాలి."**

ఈ బ్యాంకింగు కమిటీవారు రైతుల ఋణగ్రస్తతను గురించి విచారించారు. 1895లో మన మద్రాసు రాజధాని రైతుల ఋణము 45 కోట్లు

1930 నాటికి 150 కోట్లు, 1935 నాటికి 207 కోట్లని నిర్ణయించాడు సత్యనాధన్. ఇలా పెరిగి పోతున్నది.

అలాగే హిందూదేశ ఋణము 1911 లో 300 కోట్లుండునని మాక్లిగన్ అంచనా. 1931 నాటికి బ్యాంకింగు విచారణకమిటీవారి ఆంచనా ప్రకారం 900 కోట్లు. ఈ మొత్తం నేటికి 2000 కోట్లయినదని నేషనల్ ప్లానింగు కమిటీ అన్నది. దాని మీద వడ్డీరేటు నూటికి 12 మొదలు 75 వరకు కూడా పున్నదని తెలిసిన తర్వాతనైనా రైతు ఋణ విమోచనకై పయత్నించరా ?

ఈ అప్పుకు కారణం మారకపు రేటు ప్రతి సెంటుకు దారుణంగా వసూలుచేసే శిస్తువిధానము, ఆర్థికమాంద్యము, అధిక చలామణి, చేతి వృత్తులు నాశనమగుట, రైతుల వ్యవసాయం గిట్టుబాటు గాకుండా పుండుట, అధిక వడ్డీరేట్లు, మొదలగు పెక్కుకారణాలని ఆచార్యుని అభిప్రాయము. గ్రామీణ ప్రజల ఋణగ్రస్తత, నివారణోపాయాలు, Rural Indebtedness-remedical meausures, అనే గ్రంథాన్ని ఆంగ్లములో రచించి రైతుల కృతజ్ఞతకు పాత్రుడయ్యాడు ఆచార్యుడు. బ్యాంకులు నేడు నూటికి 6 రు చొప్పున యిస్తున్నవి. రైతుకి వ్యవసాయం నూటికి 3 రు చొప్పున గిట్టుతున్నదని ఆర్థికవేత్తల అంచనా, కనుక వడ్డీ రు 2 తగ్గాలి. పరపతి సంఘాలలోని ఉద్యోగులు అధికారుల మనే భావం పోగొట్టుకొని, ప్రజాసేవకులమనే భావంపొందాలని, సమిష్టి బాధ్యతవల్ల (unlimited liability) రైతులకు అమిత నష్టం కలుగుచున్నది గాన దానిని తొలగించే మార్గం చూడాలని ఆయన అభిప్రాయం.

రైతు అప్పులలో పుట్టి, అందులోనే పెరిగి, అందులోనే అస్తమిస్తున్నాడు మన బ్యాంకులు పాత కాతాకంటె కాస్త అసుగుణమైన కొత్త కాతాను కొంతవరకే పెట్టుచున్నవి, కాని అప్పుముప్పుగానే వున్నది అప్పుడు ఇప్పుడు. కనుక పాత అప్పులు రద్దయ్యేమార్గము, నూతనంగాఅప్పుల్లో పడకుండా వుండేమార్గము ఆలోచించాలి ఆర్థిక వేత్తలు, రాజకీయవేత్తలు, దేశం సుభిక్షంగా వుండే తరుణోపాయమిదే. అల్ప సంస్కరణలతో ప్రయోజనము లేదు. రోగం తీవ్రమైనది గనుక తీవ్రమైన చికిత్సే చేయాలి.

## నూతన నిర్మాణములు

ఆచార్య రంగా అఖండ ప్రతిభావంతుడు. ఆయన కొందరు ప్రతిభావంతుల వలె, తర్కమీమాంసలతో కాలక్షేపము చేయక, ఆకాశ హర్మ్యములను నిర్మించుటలో కూర్చొనక, కేవలం ఆదర్శవాదిగా సంచరించక, దేశ కాలానుగుణ్యమైన అనేక నూతన నిర్మాణముల నెలకొల్పి దేశాభ్యుదయమునకు అధికముగ తోడ్పడుచున్నాడు. ఆయనవలె అసంఖ్యాకములైన ప్రజలకు ఉపయోగ కరములైన నూతన నిర్మాణము లొనర్చువారు లేరనుట అతిశయోక్తి కాదు. పరికించుడి, మీకే విశదమగును.

- 1920 లో "రైతు"... అనే వారపత్రిక పెట్టుటకు పి. వి. కృష్ణయ్య చౌదరి వగైరాల సాయముతో ఏర్పాటుచేయుట, ఇదే బహుశా ఆంధ్రదేశములో పల్లెప్రాంతమునుండి వెలువడు వర్గపత్రిక.
- 1922 లో విద్యార్థిదశలో వున్నప్పుడు ఆక్సుఫర్డులో అంతర్జాతీయ లేబరు సంఘము నెలకొల్పెను.
- 1923 లో అప్పికట్లలో గుంటూరుజిల్లా రైతుసంఘము.
- 1923 లో హరిజన వ్యవసాయభూముల సంపాదన సంఘము.
- 1945 లో చేనేత పనివారల సంఘము.
- 1926-27 ఒంగోలు తాలూకా కరువునివారణ సంఘము.
- 1927 విద్యార్థుల గ్రామ పునరుద్ధరణ సంఘము
- 1927 అంతర్జాతీయ స్వాతంత్ర సేవకుల కలియక,
- 1928 పశుప్రదర్శనాలు, మద్రాసు రాష్ట్ర అటవీ పంచాయతీ సంఘం.
- 1928 ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ నిర్మాణము-బాపినీడు గారి సాయంతో.
- 1929 రాష్ట్ర జమీన్‌రైతు సంఘనిర్మాణం-మందేశ్వరశర్మగారి సాయం
- 1931 రైతు రక్షణసంఘ స్థాపనము.

మారుటోరియం కావాలని నినాదము. జమీందారులు పోవాలని నినాదము, భూమి శిస్తులు పోయి ఆదాయపుపన్ను కావాలని, రైతుదిన ప్రారంభము. రైతాంగ సేవాదళము ప్రారంభము, (బలరామకృష్ణయ్య, కొమ్మారెడ్డి సూత్రధారులు) రైతాంగ శిక్షణ శిబిరము.

వెంకటగిరి జమీందారీ రైతుల సత్యాగ్రహ ఉద్యమ ప్రారంభము. ఉభయ గోదావరి, కృష్ణ, రీసెటిల్‌మెంటు శిస్తు నిరాకరణ ఉద్యమ ఆరంభము, వెంకటగిరి జమీందారీ రైతుల విచారణ సంఘం. రిపోర్టు1931 లో లండనులో రంగుజాతుల సమ్మేళన స్థాపన. ఇప్పటికీ యిది పనిచేస్తున్నది. కార్యదర్శులలో ఆయనొకడు.

- 1933 లో రైతాంగ గ్రంథమాల, గాంధీజీచే రైతాంగ విద్యాలయ ప్రారంభము హరిజన సేవాదళము, ఆంధ్రరాష్ట్ర జమీందారీరైతుల విచారణసంఘ రిపోర్టు. మార్చి 6 వ తేదీన రైతు రక్షణ యాత్రలు ప్రారంభం

  ఇవే భారతావని కంతయు మార్గదర్శకములైనవి.

  గ్రామీణపారిశ్రామికప్రదర్శన.(గోవాడ)పి.నాగేశ్వరరావుగారి మంత్రిత్వం.

కార్మిక కర్షక సమ్మేళనము తమ ఆదర్శమని రైతుసంఘాలు ప్రచురించుట హరిజనులకు కథలు అనే ప్రచురణలు. దానికి ధూళిపూడి కోటయ్య మంత్రి.

ఈనామ్ దారీ రైతుల సంఘము లక్ష్మీనారాయణగారి అధ్యక్షత క్రింద, ఆయుర్వేద పశువైద్యకళాశాలకు పూర్తి ప్రోత్సాహము(యేజెళ్ల శ్రీరాములు)

- 1934 కాంగ్రెసు సోషలిష్టుపార్టీకి మూలపురుషులలో ఒకరు. వారి వ్యవసాయ ప్రణాళికను సరిదిద్దిరి. రైతాంగ విద్యాలయ సమావేశ ప్రారంభం, రైతు భజనావళి ప్రచురణ. తెలుగులో జమీన్‌రైతుల కనీస కోర్కెల ప్రణాళిక. భారతావనిలో ఇదియే ప్రప్రథమయత్నం, రాచకీయంగా 1930 లో ఇర్వినుకు గాంధీజీ పంపిన ప్రణాళిక దీనికి మాతృక.
- 1926-34 వరకు పెదవడ్లపూడి, అప్పాపురం, పాతూరు ప్రాజెక్టుల నిర్మాణ కార్యము, పింగళి సూర్యనారాయణ గారి మంత్రిత్వంతో గుంటూరుజిల్లాలో 700 పంచాయతీబోర్డులను స్థాపించి 6 లక్షల రూపాయల విలువగల పునర్నిర్మాణ కార్యములు చేయించెను. ఒక ప్రణాళిక ప్రకారం అనతి కాలములో ప్రజాబాహుళ్యం మీద గ్రామగ్రామానికి పోటీపెట్టి నిర్మాణ కార్యములు సాగించుట కిదియే ప్రథమము.

- 1934–35 రాయలసీమ కరువు నివారణ–నిధి–దినము కరువు పనులు గడ్డి సప్లయి, అనాధలకు ఉచిత భోజనము–అసెంబ్లీలో విస్తారమైన ప్రచారం. 1926 ఒంగోలు కరువు అనుభవమును పూర్తిగా వినియోగం.
- 1928 లో సర్దారు వల్లభాయి గుజరాతులో వరద బాధితులకు చేసిన రక్షణ కార్యమును సాటి ఓబులరెడ్డి(కందుల ఓబులరెడ్డి 1955 తర్వాత కాంగ్రెస్ లో చేరారు.) 20 సంవత్సరాల పైగా రంగా గారి శిష్యుడిగా ఉన్నారు) రామచంద్రరావు, కల్లూరి సుబ్బారావు గార్ల పూర్తి సాయముతో నెరవేర్చెను.
- 1935 లో అఖిల భారత రైతాంగం సంఘాల బిల్లును కేంద్ర శాసనసభలో తయారుచేయగా వైశ్రాయి నిరాకరించెను.

  అఖిలభారత రైతాంగసేవకులకు సభ (రంగా అధ్యక్షుడు.)

  సెంట్రల్అసెంబ్లీలో రైతాంగబృందము నేర్పరచుట.

  దక్షిణాపథమున కంతకును రైతాంగ దినము.

  దక్షిణ భారత రైతుకూలీ సంఘస్థాపన.

  ద.భా. రైతుకూలీల కనీస కోర్కెలు ప్రచురించుట.

  అఖిలభారత రైతాంగ ఉద్యమ ప్రచారముచేస్తూ, రైతాంగ సమస్యలు అనుదిన వార్తలలోనికి ప్రధానముగా వచ్చునట్లు చేయుట.

  ఇంగ్లీషులో రైతు భజనావళి ప్రచురణ.

  1926, 1936 లో ప్రారంభించిన ఆంధ్ర ఆర్థిక ప్రచురణ 7 పుస్తకాలు ఆంగ్ల ప్రచురణ, రైతాంగ ప్రచురణలకే నూతన స్వరూపమిచ్చి ఆధునిక భారత రైతు ఆనే ఆంగ్లగ్రంథ ప్రచురణ.

## వాహినీ పత్రికా ప్రారంభము.

1936 ఏప్రిల్లో, లక్నోలో అఖిలభారత రైతుకాంగ్రెసు, డిశంబరులో ఫైజుపూరు రైతుకాంగ్రెసుకు అధ్యక్షత వహించుట. అఖిలభారత రైతాంగ కనీసకోర్కెల ప్రణాళిక ప్రచురించుట, దానికి మాతృక దక్షిణ భారత రైతుకూలీ సమ్మేళన ప్రణాళిక ప్రధాన రచయిత ఆయనే.

1936 సెప్టెంబరు 1 వ తేది అఖిల భారత రైతుదినము. వ్యవసాయ కూలీల స్థితిగతుల నివారణ. ఆంధ్ర చేనేత పనివారల సంఘము.

1937 రైతాంగ బిల్లులను ప్రకటించుట, విద్యార్థులద్వారా నిరక్షరాస్యత నిర్మూలనము.

1938 లో స్వదేశ సంస్థానాల రైతుల కోర్కెల విచారణ, ప్రకటన. మహాత్ముని ఆశీస్సులతో సంస్థాన రైతాంగ కోర్కెలను తయారు చేయించుట, చాంపరాన్‌లో 1917మహాత్ముడు అనుసరించిన పద్ధతిని మొదటలో ఒంగోలు, పెదవడ్లపూడి, వెంకటగిరి మద్రాసు రాష్ట రైతులు  పిమ్మట చేనేతపనివారల స్థితిగతులను, ఆర్థిక సూత్రరీత్యా విచారణ చేసెను. అటులనే సంస్థాన రైతుల స్థితికూడ విచారించెను. ఒరిస్సాలోని సంస్థాన రైతులను గురించిన ఆయన రిపోర్టును గాంధీజీ హర్షించెను.

జనసమర్థముగల డెల్టాలనుండి జనము తక్కువగానుండే హైదరాబాదు వంటిచోట్లకు రైతుల వలస ఏర్పాటుచేయుట అవసరమని 1927 స్థిరీకరణ చేసెను. ఆయన "గ్రామ ఆర్థిక పరిస్థితులు' అనే పుస్తకం రెండవ సంపుటంలో వివరించెను.

కొండజాతులను, తదితర భారతీయులనుండి బ్రిటీషువారినుండి రక్షించ వలెనని 1926 నుండి 30 కి చేసిన విచారణ ఫలితంగా నిర్వహించెను.

"నీలగిరి కొండజాతులు" అనే ఆయన పుస్తకాన్నిమహాత్ముడు ప్రత్యేకంగా శ్లాఘించిరి. పుసులూరి కోదండరామయ్యగారి మంత్రిత్వముతో ఆంధ్ర కొండ జాతుల కొండప్రదేశ సభ, సంఘము ఏర్పరచెను.

ఆయన రిపోర్టుమీద ఆధారపడియే అఖిలభారత కాంగ్రెసు సంఘము ఒక ప్రణాళిక ప్రచురించినది. కాంగ్రెసు తీర్మానములు చేసింది. 1937లో అఖిలభారత వయోజన విద్యా సభను నడిపించెను.

ఆంధ్రరాష్ట్ర రైతు రక్షణ యాత్రకు ప్రారంభోత్సవము, దానికి అధ్యక్షులు కొమ్మారెడ్డి. రైతాంగ యువతీయువకులను నాయకులుగా, ప్రచారకులుగా తయారు చేయుటకు ప్రథమయత్నము ఆయనదే.  తన పిమ్మట ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ అధ్యక్షులుగా 1.గొట్టిపాటి 2.కొమ్మారెడ్డి 3.శ్యాంబాబు 4.భారతీదేవి 5.లక్ష్మీ నారాయణ 6. తిమ్మారెడ్డి 7. రామానాయుడు 8.నన్నపనేని, 9. గొట్టిపాటి. వీరంతా

ఆయనచేత తయారుచేయబడిన వారే. ఇట్లు తన తరువాతివారిని, తోటివారిని తనంత పెత్తనానికి తీసికొని వచ్చి ప్రోత్సహించటం గాంధీజీ తరువాత ప్రథమ యత్నం ఆయనదే.

కనుకనే ఆంధ్ర రైతాంగ ఉత్సాహాన్ని కమ్యూనిష్టులు కదలించలేకుండా ఉన్నారు. ఆంధ్రరాష్ట్ర జమీన్‌రైతు సంఘాధ్యక్షులు కూడ 1. గొట్టిపాటి 2. బద్దిపూడి 3. మందేశ్వరశర్మ పిమ్మట ఆధ్యక్షులు, రైతాంగ కవుల సన్మానము.

1938 సాధారణ కాంగ్రెసు వీరుల సన్మానము. పిమ్మట, ఆయన మిత్రులు శర్మగారు "వీరసంస్మరణ మందిరమును" కొవ్వూరులో తెరచిరి.

1939 లో హైదరాబాదుకు రైతాంగ విద్యాలయము, లెఫ్ట్ కన్‌సాలిడేషన్ కమిటీ స్థాపకులలో ఒకరు.

1940 సెప్టెంబరు వీర గున్నమ్మకు వీరపూజా మందిరమును భారతీదేవి స్థాపించుట.

1942 దేశద్రోహ విధానాన్ని అవలంభిస్తున్న కమ్యూనిష్టుల పెత్తనంలో నున్నదానిని వదలించి ప్రజావిప్లవమును, కాంగ్రెసును, బలపరచుచు కాంగ్రెసు రాజకీయమును, అనుసరించుచు అఖిల భారత కిసాన్ కాంగ్రెసును స్థాపించెను.

1942 జాతీయ విద్యార్థి సంఘమును ఏర్పరచుట.

1942లో పతితజాతుల సమ్మేళనము స్థాపించెను. గాంధీజీ ఆశీర్వాదముతో దాని ప్రధానసూత్రము "పతిత జాతులను వదలిపో సామ్రాజ్య వాదము" అనే నినాదము మీద ఇంగ్లీషులో 1945 లో ఒకగ్రంథము రచించెను. దానిని సింహా తర్జుమా చేసి "పతిత ప్రజల" ను పేరుతో జమీన్ రైతులో ప్రకటించెను.

## రైతుకూలీ ప్రజారాజ్యము

1935 లో రైతు రాజ్య నినాదము,

1937 రైతుకూలీ రాజ్యనినాదము.

1941 మే నెలలో రైతుకూలీ ప్రజారాజ్యమునకు పెరిగినది. ఈ భావమే ఆగష్టు తీర్మానములో ఇమిడివున్నది.

1944 నవంబరులో గాంధీజీ రైతుకూలీ ప్రజారాజ్యమును ఆమోదించిరి.

ఆచార్యునకు ఈ భావపరిణామమునకు ఆధారమేమని మీకు ఆలోచన కలగవచ్చును;

- కాకతీయ, విజయనగర, రెడ్డి, తంజావూరు, చెంజి, మధుర రైతాంగ ప్రజల, భరతపూర్, సిక్కు, మహారాష్ట్ర, ప్రజల రాజ్యాంగ నిర్మాణ చరిత్రలను ప్రత్యేకంగా 1941 లో పునర్విమర్శించి రైతులకు రాజ్యాంగ నిర్మాణ నిర్వహణ శక్తి, చరిత్ర, కలవని నిరూపించుట.
- 1922 లో రష్యాలో లెనిన్ రైతుకూలీ రాజ్యమును ఏర్పరిచెననే ఉత్సాహము.
- భారతదేశంలో నూటికి 85 గా ఉన్న రైతాంగానికి రాజ్యాధికారము స్వరాజ్యములో ఉండాలని అభిమతము.
- 1937–38 లో పారిశ్రామిక కూలీల సహకారము కూడా పొందగలమనే ఆశ, కమ్యూనిష్టులు కాంగ్రెసు యెడల అవలంబించ పూనుకున్న నూతన వైఖరిని బట్టి కలిగినది. రైతాంగమును కూడా పేర్కొంటున్నది. కనుక రైతుకూలీ నినాదము అవసరము రైతాంగానికి అవసరమను కొనెను.
- 1940–42 ఉద్యమములో చేతిపనివారు, మధ్యతరగతిలోని చదువుకొన్న శ్రామికుల సహాయము జాతీయవిప్లవానికి అత్యంతంగా ఉన్నది. ఈ నినాదం, రైతుకూలీ ప్రజారాజ్యముగా పెంపొందినది.
- రష్యాలో తదితర దేశాలలో నియంతృత్వ విధానపు ఆపత్తులను గ్రహించుట ద్వారా, రైతుకూలీ ప్రజారాజ్యం ప్రజాస్వామికంగానే వుండాలని తీర్మానించు కొనెను.
- రష్యాలో కూలీనియంతృత్వం, రైతుల, ప్రజల, చదువుకున్నవారిని, పెత్తనంలో సమానభాగస్తులుగా అంగీకరించనందున, వారి విధానము పతిత దేశాలకు పనికిరాదనుకున్నాడు. భారత సోషలిష్టురాజ్యము, రైతుకూలీ ప్రజలందరికి చెందివుండాలని నిర్ణయానికి వచ్చాడు.

1944 లో విద్యార్థి కాంగ్రెసు.

1945 మార్చిలో అఖిలభారత గ్రామీణ ప్రజల సమ్మేళనము.

1945 లో అఖిలభారత చేనేత పారిశ్రామిక సంఘము.

1945 లో పౌరసత్వ కళాశాలలకు(Citizen Colleges) నామకరణ, ప్రోత్సాహం.

గాంధీజీ,ఆశీస్సులతో కాంగ్రెసు సేవాసంఘం స్థాపించ యత్నించ తలచాడు. తదనుగుణ్యంగా 1946-6-21 తారీఖున రాష్ట్రీయ కాంగ్రెసు కార్యవర్గ ఆమోదము తో కాంగ్రెసు సేవాసంఘము నెలకొల్ప తీర్మానించెను.

## వీరపూజా ప్రచారము

"వీరగంధం తెచ్చినారము వీరుడెవ్వడొ తెల్పుడీ

పూసి పోదుము మెడను వైతుము పూలదండను భక్తితో.. కవి రాజు

వీరపూజ దేశౌన్నత్యానికి, జాతి మహత్వానికి ఆత్యావశ్యకమైన పవిత్ర అనుష్టానము. ("A nation lives by memories of its heroes.") "జాతి తన వీరుల ఆరాధన వలనే జీవించును" అన్న ఆంగ్ల విద్వద్వరేణ్యుని వాక్యము నందెంతేని సత్యమున్నది. మనకై తమ అసువులను తృణప్రాయముగా త్యజించిన వీరులను విస్మరించి మన మెట్టిగతి పొందుదుమో వివరింపవలెనా? మనజాతి ప్రాచీనకాలం నుండి వీరారాధన సల్పుచున్నది. అది మనకు సాంఘికధర్మమే కాక మతానుష్టానము కూడ అయినది. మన భీష్మేకాదశి, శ్రీరామనవమి, కృష్ణాష్టమి, శంకరజయంతి మొదలగునవి మతానుష్టానములైనవి.

వీరపూజ మానవప్రకృతిలో గాఢముగ నాటుకొనిపోయినది. తమతమ స్వజాతిలోపుట్టిపెరిగిన వీరులను ఆరాధించుట ఎంతో ఉత్సాహవంతంగా ఉండును.

శివాజీ, గణపతి ఉత్సవాలద్వారా లోకమాన్యుదు ప్రజలలో దేశాభి మానాన్ని ఉద్దీపింపజేసినది లోకవిదితమేగదా.

బ్రహ్మనాయుడు కులాలను కూలద్రోసి అందరినీ ఏకంచేసి, తన సేనలో చేర్చు కొని వారినందరను జగదేక వీరులుగా జేసి విఖ్యాతి గాంచెను. కడజాతివాడైన కన్నమనీడును కన్నపుత్రునిగా ప్రేమించుకొన్న విశాల హృదయుడు.

పలనాటివారికే కాదు ఆంధ్రులందరు ఏనాడో కారిమపూడిలో వారికి ఆలయము కట్టిరి, నాటినుండి నేటివరకు అక్కడ కార్తీకపూర్ణిమకు ఉత్సవము ఏటేట జరుగుచున్నది. నిరంతరాయంగా ఇట్లు ఆయుధపూజ, వీరపూజ జరుగుట మరొక చోటకానము. సంఘాన్ని సజీవంగా చేసిన బ్రహ్మనాయుడు, బాలచంద్రుడు,

ఆంధ్రులకు ఆదరణపాత్రులు. ఇట్టి ఉత్కృష్ట వీరారాధన ప్రపంచములో మరొకచోట లేదు.

మొఘలాయీ కాలమున, గురుగోవిందసింహుడు తన శిష్యులను వీరులనుగా చేసి మాతృదేశరక్షణకు పురికొల్పి, వారిచే అనేక మహత్తర కార్యములను సాధింప జేసెను. నాటినుంటి నేటివరకు శిక్కుజాతి వీరజాతియై వర్ధిల్లుచున్నది.

గురుగోవింద సింగ్ గురుశిష్యుల పరస్పర భేదభావముల పూర్తిగా నిర్మూలించుట మూలమున, సామాన్య ప్రజాహృదయమును ఆకర్షించి వారిని పోరాటమునకు పురికొల్పినటులనే, నేతాజీ (సుభాస్ చంద్రబోస్/సుభాసుబాబు) నాయకులు, ప్రజలు అనే భేదభావము లేక ప్రజలలో అంతర్లీనమగుటచేతనే ఆయన ప్రజల అభిమానమును, కాంగ్రెసు బహిష్కరించిన దినములలో కూడ చూరగొనెను. ఆయన ప్రజాహృదయమును చూరగొనని సమయము లేనేలేదు.

ఈ యిరువదవ శతాబ్దమున గాంధీమహాత్ముడు మన దేశీయులలో మహత్తర రాజకీయ, ఆధ్యాత్మిక సంస్కృతిని పెంపొందించెను.సర్దార్ పటేల్, రాజేంద్రబాబు వంటి వారిని మహానాయకులు సృష్టించింది ఆయనే. శతాధిక అతిరథ మహారథులను, లక్షలాది వీరులను సృష్టించింది, ప్రాణహీనులై కోట్లకొలది యున్న దేశీయులలో నూత్న ప్రాణసంచారము కల్గించింది మహాత్ముడే. అల్ప మనుష్యులనందరిని సంస్కరించి వన్నెపెట్టిన స్వర్ణకారుడు ఆయన. వేయేల ప్రపంచము కనివిని యెరుగని ఒక నూతన వీరజాతిని తన అహింసాశక్తిద్వారా మహాత్ముడు సృజించెను.

ఇక మనమెంతవరకు ఆధునిక వీరారాధన చేయుచున్నామో అరయుదము, మన అభివృద్ధికి ఆధార భూతుడైన వీరేశలింగమును బ్రతికి యుండగా బాధించాము. దోషిగా యెంచి విచారణ చేశాము (impeach చేసితిమి) ఆయన అనంతరము శిలా ప్రతిమ ప్రతిష్ఠించితిమి. సుభాసుబాబు కారాగృహంలో క్షయవ్యాధిగ్రస్తుడు కాగా బెంగాలీలు గొప్ప ఆందోళనచేసి విడిపించి బ్రతికించుకొనగా, బయటవుండి బ్రతికి యున్న ఆంధ్రరత్నాన్ని ఆంధ్రులు చేతులార చంపకపోయినా, అంతపని చేశారు. ఆయన దిక్కుదెస కనుక్కోక నేడు

ఆంధ్రరత్న భవనమను పేరుపెట్టాము. ఏమి ప్రయోజనము? దేశాభిమాని, కలియుగ భీముడని ప్రఖ్యాతిగాంచిన కోడిరామమూర్తికి మనమేమి సహాయము చేశాము? మన దామెర్ల రామునకు, విశ్వదాతకు, మునిస్వామి నాయునకు, కవిరాజునకు ఏమేమో చేయ సంకల్పించినాము. ఎగిరాము. ఆంధ్ర పౌరుషము చూపించదలచాము. చివరకు చేసిందేమిటి? మన చిలకమర్తి కవిని వృద్ధాప్యంలో పోషించుకోలేక పోవుటచేత ఆయన అస్తమించాడు. సిసిరో వంటి వక్తయైన మన చెరుకువాడ నేడు వృద్ధాప్యదశలో కూడా కాలుకాలిన పిల్లివలె తిరుగుచున్నాడు. (ఒక ఇన్సూరెన్సు కంపెనీ నుండి మరియొక ఇన్సూరెన్సు కంపెనీకి)

మన ప్రజలపాటల త్యాగరాజు గరిమెళ్ల గంజినీళ్లు లేక గగ్గోలు పడుతున్నాడు. ఇట్లు ఎందరో తమ యావచ్ఛక్తి యుక్తులు మనకై ధారపోసిన కవులు, గాయకులు, వక్తలు, చిత్రకారులు, దేశారాధకులు, కడుపునకు గంజిలేక అల్లల్లాడుచున్నారు. రాజకీయ బాధితుల కొరకు యేమేమో చేయ సంకల్పించి నాము. చేసింది బండిసున్న.

ఆచార్యరంగా జ్ఞానయోగికాదు, భక్తుడు కాదు, కర్మయోగి. ఆయన వీరుడన్న సంగతి లోకవిదితము. ఆయన వీరపూజా దురంధరుడగుటచేతనే అట్టి వీరుడు అయ్యెనని తెలిసికొనినచో వీరారాధనలోని మహత్యము మనకు విదితము కాగలదు. ఆయన జాతిలోనున్న వీరారాధన మహత్యాన్ని విప్పిచెప్పెను. పల్నాటి వీరచరిత్ర ఆయన్ని పసితనముననే ఆకర్షించెను, విద్యారణ్యుని ఉగ్రనరసింహారాధన, హనుమదారాధన, దేశీయులను ఎటుల వీరుల కావించెనో తన లేఖిని ద్వారా తెలిపిన వీరారాధకుడు. (వాహిని – రంగా గారి పత్రిక శ్రీ గొర్రెపాటి వెంకటసుబ్బయ్య (ఈ పుస్తక రచయిత కాదు.) ఎడిటర్ గా చాలాకాలం నడిపారు.) మన కోడిపందెములు, వీరకొలుపులు, దేవతా కొలుపులు, వీరభద్రపళ్లెం పట్టుట, ఖడ్గాలు పలుకుట. నారసాలు వేసికొనుట మొదలగున వన్నియూ, మనము రక్తమును చూచి భయపడకుండా వుండుటకు, దెబ్బలు ఓర్చుకొనుటకు మనలో వీరరసము ఉప్పొంగుటకు ఏర్పడినవేయని ఎరుక పరచును. రైతాంగ భజనావళికి, భారత స్వాతంత్ర్యప్రథమ యుద్ధమునకు ఆయన వ్రాసిన తొలిపలుకులు చదివిన ఆయన వీరారాధన విదితము కాగలదు.

మన ఆటలలో ఎంతో వీరోచిత పౌరుషమున్నదనును. మన బలిచెడుగుడు, చెరబద్దీ, కోతికొమ్మచ్చి మొదలగునవి యుద్ధరంగమునకు సంబంధించినవేయని ఆయన వాకొనును.

పండుగ, పర్వములందు మన స్త్రీలు తొక్కుడుయ్యాల లూగుట, నాలుగు స్తంభాలాట, కొక్కాట మొదలగునవి వారి పిక్కబలమును వృద్ధిచేసి వీరవనితలుగా తయారుచేయుటకు ఏర్పడినవేయని ఆయన విదితపరచును. మన యువకులు పాశ్చాత్య ఆటలయందు వ్యామోహితులైన సమయాన, పూర్వపు ఆటలపోటీలకు తిప్పినవారిలో రంగా ప్రథముడు, ప్రముఖుడు.

దేశారాధకులందరకు ఊరేగింపులు, ఉత్సవాలు, జై నినాదములు అవసరమని ముక్తకంఠంతో ఆయన ఘోషించును. అనుటే కాదు ఆ విధంగా ఆయన ఆచరించును. వీరుడుగా పూజింపబడుటకు. వీరపూజకు ఆయన సమధి కోత్సాహము చూపును. ఆయన ఆంతర్యము గ్రహించలేని వారు ఆనేక విధములుగా అనుకొన వచ్చును.

ఆయన అరమరలేని మనిషి. "గాంధీమహాత్మునకు జై"అనుటతో తృప్తిపడక దేశారాధకులందరకు హెచ్చుతగ్గులు లేక జేజేలు పలుకును. బందరులో జరిగిన ప్రథమ ఆంధ్ర విద్యార్థి కాంగ్రెసునకు ప్రారంభకుడుగా వచ్చినపుడు నాయకులకు జేజేలు కొట్టుటతో తృప్తినొందక, వీరహనుమాన్ తోట నరసయ్యకు జై కొట్టిన సంగతి నాటి సభికులు స్మరింతురు గాక! దేశసేవలో పండి పోయి, ఆంధ్రులకు సంఘసేవ, దేశసేవ, మానవసేవ చేయుటకు ఆదిగురువైన దేశభక్తునకు 'తన ఆధునిక రాజ్యాంగ సంస్థలు'(రంగా గారు తెలుగులో రాసిన ఈ పుస్తకాన్ని కొండా వెంకటప్పయ్య పంతులు గారికి అంకితమిచ్చారు.) అంకితమిచ్చిన ఆదర్శ వీరారాధకుడు ఆచార్య రంగా, ఇంతేకాదు ఆయన రైతాంగ భజనావళి" నేటికి ఎన్నో కూర్పులైనది. ప్రతిదఫా అది వీరాంకితమే. ఆయన క్రాంతి పత్రికాలయములో నేతాజీ ప్రవేశించినపుడు ఓహో ఇది మీ విప్లవ యంత్రాగారమా! (Oh! is this your revolutionary machine!) అని ఉగ్గడించెను.

మనవారు పూలమాల వేస్తూ ఉండగనే తీయుట వినయలక్షణంగా ఎంచుదురు. ఆది నేడు సాంప్రదాయమైనది. ఆయన మాత్రము అటుల చేయడు.

అటుల చేయుట ఆరాధక బృందమును అవమాన పరచుట అని తలచును. ఆయన మెడలో వేసిన పూలమాలను, నూలుదండను, ఆయన  ఆరంభించిన కార్యక్రమం ఆఖరగు వరకు తీయడు, ఇది పాశ్చాత్య సాంప్రదాయము. పాశ్చాత్య సాంప్రదాయాలలో  సత్సాంప్రదాయాలెన్నో ఆయన అనుష్టించును, అనుష్టింప జేయును.

1938 లో సాధారణ కాంగ్రెసువీరుల సన్మానము జరిపెను. మందేశ్వర శర్మగారిచే నిర్మింపబడిన వీరస్మరణమందిరంను కొవ్వూరులో తెరచెను. ఆయన అనుంగు అర్థాంగి వీరారాధకురాలే. 1940 మందసా జమీలో పోలీసుల కాల్పులకు గురియైన వీరగున్నమ్మ (1940 లో మందసా పోలీసు కాల్పులలో మరణించింది) వీరపూజా మందిరము భారతీదేవి స్థాపించెను. 1945 ఆగస్టులో ఆ వీరాంగన మందిరమున కరిగి ఆచార్యుడు పూజసలిపి పునీతుడు అయ్యెను.

వీరపూజలోగూడా ఆయన విశిష్టత వేరు. మన వీరులచరిత్ర రచించుట కూడ వీరారాధనయే అని ఆయన అభిప్రాయము. అందుకనే పరుచూరి రామకృష్ణ చౌదరి వ్రాసిన రాజేంద్రప్రసాదు జీవితముపై అభిప్రాయమును తెల్పుచు ఆయన వ్రాసిన దానిని తెలుసుకొనిన ఆయన సౌజన్యము, వీరారాధన విదితము కాగలవు. "బాపూజీ ఆదర్శప్రాయ జీవితకథను ఆంధ్రులకు అందచేయుచున్నందులకు ఎంతో అభివందనీయులు. ఆంధ్రదేశము లాంటి బీహారునకు ఆయనచేసిన సేవ గణనీయము. మనకీనాడున్న నాయకశ్రేష్టులలో ఉత్తములు వారు. ఆట్టివారెందరో ఆంధ్రదేశమున గలరని నా నమ్మకం. వారి జీవితరహస్యములనుగూడ మనకు ప్రజలకు మీ బోంట్లు తెలుపుట యుచితము." "ఇటులనే, అటు జవహరలాల్ నెహ్రు, ఇటు మన వెంకటప్పయ్య, శాస్త్రి, పట్టాభి, నాగేశ్వరరావు, డాక్టరు సుబ్రహ్మణ్యం, ప్రకాశం, ఉన్నవ, కనకమ్మ, ( నెల్లూరు వాసి,  గాంధీజీ శిష్యురాలు ఒక సంవత్సరం జైలుశిక్షను అనుభవించారు) వీరేశలింగం, మునిస్వామి, ప్రభృతుల చరిత్రలు  క్లుప్తముగానైన వ్రాయుదురు గాత" ఆంధ్రదేశములో విఖ్యాత దేశాభిమానులు వయోజన విద్యాప్రచారకులని అఖండ ఖ్యాతిగాంచిన గాడిచర్ల, శనివారపు, చెరుకువాడ, గరిమెళ్ల మొదలగువారి గతిని గానక విస్మరించిన ఆంధ్రావళికి మేలుకొలుపులను పాడిన ఆచార్య రంగా వంటి ఆంధ్రనాయకులు ఎందరున్నారు?" ప్రజల పాటల త్యాగయ్య, గరిమెళ్ల' (15-8 40) "ప్రజల

పండితుడు, విజ్ఞానచంద్రికా విరాట స్వరూపుడు మన గాడిచర్ల, మన చెరుకువాడ' (15.10.39) "మన శనివారపు " (10.12.39, చిత్రగుప్త) ఆ నామకరణములలో ఎంత సౌహార్ధమున్నదో గ్రహించండి. ఇక విషయము విని పులకాంకితుడు కాని మానవుడు ఉండునా? కవిబ్రహ్మ ఏటుకూరి వెంకట నరసయ్యను పలనాటి వీరచరిత్రను యితివృత్తముగా తీసుకొని కావ్యరచన చేయుటకు ప్రోత్సహించిన వీరకావ్యాభిమాని మన రంగా. ఆయన పోత్సాహమును పురస్కరించుకొనే ఏటుకూరి. నాయకురాలు, మగువమాంచాలాది వీరకావ్యములను ఇంపుగా మనకందించుచున్నాడు నేడు.

## రైతాంగ విద్యాలయము

"Look to the interest of 80 per cent of the population which for the most part remain on the verge of starvation"
(Yaminikhan)

"ఈవే స్రష్టవు రైతుసంఘములకున్ ఈ నేతసంఘాళికిన్
నీ విద్యాలయ మన్ని దేశములకు న్నీటైన యాదర్శమై
ప్రావృణ్మేఘపు వర్షబిందుతతిచే ప్రాదుర్భవం బొందు మొ
ల్కల్ వోలెన్ యువకాళినెందరినొ మాకర్పించినావో సుధీ"–
*కావూరి వెంకటరామయ్య.*

భారత దేశములో అనేక ఋషులు, యోగులు, కవులు, గాయకులు, వీరులు, యోధులు జన్మించారు. వారిని భారతజాతి పూజించి పొగిడింది. వారికి గుళ్ళు, గోపురాలు కట్టింది. పుస్తకాలు, గ్రంథాలు వ్రాసి వారి కీర్తి దిగంతాలు వ్యాపింప జేసింది.

కాని కష్టించి తమ స్వేదబిందువులచే ఒక గింజకు పదిగింజలు పండించి జాతివృక్షానికి మూలవీరులైన పంటకాపులను మనసార ప్రేమించ లేకపోయింది.

ఎంతసేపు జాతీయ వృక్షపు ఫలపుష్పముల ననుభవించి ఆనందం పొందింది. దానికి కారకులైనవారిని విస్మరించింది.

కట్ట గుడ్డ, పొట్టకు తిండి లేని కటిక దరిద్రుడు, తన జాతీయ రథాన్ని ఎలా లాగగలడు? మన ఆర్థిక సంపత్తికి, యింతేకాదు మన సకల సంపదలకు ప్రాణము పంటచేను అను సంగతి మన నాయకులకు వంటపట్టలేదు. మనదేశములో నూటికి 80 మంది వ్యవసాయం వల్ల జీవిస్తున్నారనే నిత్యసత్యాన్ని గ్రహించలేకపోయారు. వ్వవసాయం అభివృద్ధి గాంచితే కాని, మన గృహపరిశ్రమలు వర్ధిల్లితేకాని, దేశ సంపద పెంపొందజాలదని గుర్తించలేకపోయారు. మన పాడిపంట, మన కుటీర పరిశ్రమలు అభివృద్ధి పొందాలంటే, మన కర్షకుల కష్టనష్టాలను నివారించి వారిని అభివృద్ధి పంథాకు రప్పించాలి. అందుకు వేలకొలది సేవకులు, వారికి శిక్షణ ఆలయాలు కావాలి.

11 సంవత్సరముల అనుభవానంతరం రైతు ఉద్యమము సక్రమ పంధాను జరగాలంటే, రైతు సేవకై తర్ఫీదు పొందిన యువకులు ఉంటే కాని, అది సజీవంగా వుండ నేరదని, ఆభివృద్ధి పొందనేరదని ఆచార్య రంగాకు విదితమైనది.

దానికి విద్యావంతులపైన, పట్టణవాసులపైన ఆశ పెట్టుకోరాదని రైతాంగ యువజనం అట్టి విద్య పొంది అర్హత సంపాదించుటకు ఒకపాఠశాల అవసరమని ఆయనకు బోధపడింది. అందుకే ఆచార్య రంగా హరిఓం అంటూ ఆంధ్ర రైతాంగ విద్యాలయం నిడుబ్రోలులో 1934 వ సంపత్సరము ఏప్రియల్ నెలలో నెలకొల్పెను.

ఆ సంవత్సరము వివిధ ప్రాంతాలనుంచి విద్యార్థులు వచ్చిరి, ఆయనే కాక అనేక దేశారాధకుల రావించి వివిధ విషయాల్లో విజ్ఞానం కలుగజేశారు, విద్యార్థులకు నాలుగువారాల్లో. ఇందులో రైతాంగ యువకులకు రాజకీయార్థిక విషయాలు, రైతాంగ దృక్పథముతో చెప్పుటేకాక, రైతులను యెలా సంఘటిత పరచాలో నేర్పబడును. దీనిద్వారా వర్గచైతన్యం కలుగజేసి రైతాంగములో నవయుగోదయము కల్పింప రంగా సంకల్పము. యీ విద్యాలయం ద్వారా రైతాంగోద్యమమెంతో బలపడింది. నేడు ఆంధ్రదేశములో అధికముగా కలిగిన రాజకీయ విజ్ఞానానికి అంకురార్పణచేసినది ఆచార్య రంగాయే.

ఆచార్య రంగా ఆర్థికశాస్త్ర పండితుడని, పరిశోధకుడని లోక మెరుగు. అర్థశాస్త్రమంటే ఎరగని రైతు యువకులకు ఆర్థశాస్త్ర రహస్యాలన్నీ అరటిపండొలిచి పెట్టినట్లే చెప్పగల ప్రతిభావంతుడని అనుభవజ్ఞులకే విదితము.

ఈ విద్యాలయానికి పలువురు పెద్దలు సాయముచేసినా, దీని విజయానికి తోడ్పడిన ప్రథములలో ప్రస్తుతించదగినవారు శనివారపు సుబ్బారావు, న్యాపతి నారాయణ మూర్తి, పండితారాధ్యుల నాగేశ్వరరావులు.

ఇది ప్రారంభమైనపుడు పత్రికల్లో చదివి, పదిమంది పకపకా నవ్వారు. ప్రొఫెసరుగారు పల్లెటూరిలో ఫస్టురేటుకాలేజి స్థాపించాడని హేళన చేశారు. ఈ విషయాన్ని గురించే కాదు, ఆయన ప్రారంభించిన ప్రతి కార్యము ప్రథమమున పరిహసించ బడక పోలేదు. వారే చివరకు ప్రస్తుతించక తప్పింది గాదు.

ఆయన రైతుయాత్రలు ఆరంభిస్తే, అతివాదులు గవర్నమెంటు ఉద్యోగుల వద్దకు ప్రార్థనాపత్రములు పుచ్చుకొని పరుగెత్తు చున్నారని పరిహాసము చేసారు. తరువాత పండిత జవహర్‌లాల్ యీ యాత్రలవల్ల ప్రజలలో చైతన్యం కలుగుతుందనేసరికి రంగాను యెగతాళిచేసిన వారంతా భళాభళి అని పొగడ సాగారు, మనవారి మనస్తత్వం యిలా వుంటుంది.**మనలో మంచివారిని మనము యెంచుకోలేము. పరాయివారు గుర్తిస్తేనే మనము గౌరవించేది.**

ఆచార్య రంగా కు పూర్వము యిట్టి అల్పకాలములో సుశిక్షితులైన సేవకులను స్వల్పధనముతో తర్ఫీదు చేసినవారు లేరు. ప్రథమ సంవత్సరము 25 మందితో ప్రారంభించిన పాఠశాల సంఖ్య 1945 వ సంవత్సరానికి 200 వరకు వృద్ధి జెందెను.

దీని ప్రాముఖ్యము గమనించే పంజాబు, మధ్యరాష్ట్రము, ఒరిస్సా, బీహార్ మొదలగు రాష్ట్రాలవారు రైతాంగ విద్యాలయములు స్థాపించిరి. వాటినిచూచే కాంగ్రెసువారు, సోషలిష్టులు, కమ్యూనిష్టులు, రాడికల్ పార్టీ వారు రాజకీయ పాఠశాలలను ప్రారంభించుకొనిరి. ఇలా సూక్ష్మములో మోక్షమునిచ్చే పద్ధతిని, సేవకబృందాన్ని సుశిక్షితము చేయ సంకల్పించిన ఆచార్య రంగా ఆంధ్రావనిలోనే కాక, యావద్భారత వర్షమునకు అనుకరణీయుడయ్యెను.

## వయోజనవిద్య

"వయోజనవిద్యా బోధనమే, స్వరాజ్య సాధనరా, అయోమయంలో భారత జాతికి ఆధారంబిదేరా" *వేజెండ్ల వెంకటసుబ్బయ్య.*

ప్రభుత్వం ప్రజలందరికి అన్నం, విద్య కలిగించాలి. అవి రెండూ మనకు తక్కువగానే వున్నాయి, నేడు రవి అస్తమించని బ్రిటీషు సామ్రాజ్యం క్రింద మనమున్నా, ప్రభుత్వం 150 సంవత్సరాలనుండి చేసిన కృషిఫలితము నేటికి నూటికి పదముగ్గురు అక్షరాస్యులు. రైతుల వద్దనుండి టోలీ (అతి చన్న నాణెము దమ్మిడి కన్న చిన్నది.) లతో సహా విద్యాపన్ను వసూలు చేస్తున్నారు. కాని రైతాంగానికి విద్య మాత్రము సున్న, అసలు మనకు విద్య నేర్పితే వీరి ఆటలు సాగవని వీరికి తెలుసు. వీరి రాజ్యరక్షణ వీరి సైన్య సహాయము వల్లగాదు జరుగుచున్నది మన అజ్ఞానము వల్లనే, మన అజ్ఞాన మంతరించిన వారి రాజ్యము నిలవదని వారెరుగుదురు. అందుచేతనే వారిటుల మనలను యీ దశలో వుంచుట.

మన దేశనాయకులు కొందరు జాతీయ విద్యాలయాలవల్ల, ఇతరవిధాల విద్యాదానము చేయదలచారు. మరి మనలో వున్న పెద్దలగు నిరక్షరాస్యులకు విద్యవలన ప్రయత్నాలు చేయసాగారు. ఆ విద్య రెండువిధాలు. 1 చూడటం, వినటం ద్వారా, 2 వ్రాయటం, చదవటం ద్వారా, మొదటి పద్ధతి పగటివేషాలు, తోలుబొమ్మలు, నాటకాలు, జంగం కథలు, హరికథలు, సినిమాలు, పురాణ శ్రవణం, రేడియో, ఉపన్యాసాలు మొదలగు వాటిద్వారా జ్ఞానము పొందుట. ఇది ప్రాచీన కాలమునుండి మన దేశములో వాడుకలోవున్న విధానం. ఇందుచే మనవారు నిరాక్షరాస్యులైన విజ్ఞాన మూర్తులై విలసిల్లిరి. రెండవది అగు చదవటం, వ్రాయటం, ఇది ఇటీవల ఎక్కువగా వ్యాప్తిలోనికి వచ్చినది.

మన ఆంధ్రదేశములో వయోజన విద్యా ప్రచారములో ప్రథములుగా పేర్కొన తగినవారు శనివారపు సుబ్బారావుగారు. ఆచార్య రంగాఅన్నట్లు ఆయన తలే ఒక వయోజన విద్యాలయం. ఇందువిషయమై ఆచార్యరంగా చేసిన సంగతి చెప్పెద. ఇంటగెల్చి రచ్చగెలవమని కథ సామెత. అందుకని ఆయన మొట్టమొదట తన అర్ధాంగి భారతీదేవిని విద్యావంతురాలుగా చేసెను. ఆయన ఆమెను ఆంధ్ర ఆంగ్లాల్లో ప్రవీణురాలుగానే కాక, స్వయంగా వివిధ విషయాల్లో విజ్ఞానవతిగా చేసెను. ఆమె సంగతి ఆంధ్రదేశమే కాదు యావద్భారతము ఎరుగును.

భారతీయ ప్రజలలో శృతపాండిత్యపు చొరవ హెచ్చుగావున్నదని ఆయన ఎప్పుడో కనిపెట్టెను. నిరక్షరాస్యులైనా ప్రజలు తెలివితక్కువ వారు కారని, భారతీయ వైజ్ఞానిక సంప్రదాయము ననుసరించి వ్యవహారికవైజ్ఞానిక జ్ఞానమును చాలవరకు పొందుచుండిరని ఆయన ఎరుగును.

చదువుకున్న ప్రత్యేక తర్ఫీదు పొందిన, విప్లవ ఉత్సాహము కలిగిన నాయకులను విరివిగా తయారు చేయడము అవసరమని గ్రహించెను.

1913 లోనే గ్రామములోని ఆంధ్ర సరస్వతీ గ్రంథాలయమును పునరుద్ధరించెను, 1920 వరకు గ్రామములలో గ్రంథాలయాలను స్థాపించుచుండెను.

1923–27 వరకు విద్యార్థుల మధ్య స్టడీ సర్కిల్సు (అధ్యయన కేంద్రాలు) మద్రాసులోనేకాక, ఆంధ్రలో పలుచోట్ల ఏర్పరచెను.

1933 డిశంబరు 23 తారీఖున నిడుబ్రోలులో రామానీడు వయోజన విద్యాలయమును మహాత్మునిచే తెరపించెను.

1934లో అంధ్ర రైతాంగవిద్యాలయమును ప్రారంభించి ఇప్పటికి వెయ్యికి పైగా పట్టభద్రులను దేశములోనికి సేవాకార్యమునకై పంపెను. వీరిలో అనేకులు యీనాడు ఆంధ్ర రాష్ట్రమున పేరెక్కిన నాయకులు,ఆయన మార్గముననే అవలంబించి కమ్యూనిస్టులు 1937 నుండి విద్యాలయాలు ప్రారంభించు కొనిరి.

పంజాబు, మధ్యరాష్ట్రాలు, ఒరిస్సా బీహారు మొదలగు వివిధ రాష్ట్రాలు ఆంధ్ర రైతాంగ విద్యాలయమును అనుకరించి స్థాపించెను.

కీర్తిశేషులగు శనివారపు సుబ్బారావుగారి మంత్రిత్వముతో ఆంధ్రరాష్ట్ర వయోజన విద్యాసంఘమును 1936 లో స్థాపించెను. ఈ సంఘము తరపున 1938లో మద్రాసు కాంగ్రెసు ప్రభుత్వమునకివ్వబడిన వయోజన ప్రచారకా ప్రణాళికను ఆచార్యరంగాయే తయారు చేసెను. దానిని డాక్టరు పట్టాభిగారు హృదయ పూర్వకముగ అంగీకరించిరి.

1937లో అఖిలభారత వయోజన విద్యాసభలో ప్రముఖ పాత్రను వహించి, దానికి జాయింటు సెక్రటరి గా, పిమ్మట వైస్ ప్రెసిడెంటు గాను ఉండెను.

1938లో మద్రాసు రాష్ట్ర వయోజన విద్యాసభవారు వయోజన విద్యా ప్రచారానికి ఆయన చేస్తున్న సేవను ప్రత్యేక తీర్మానములలో ఉగ్గడించిరి.

ప్రాథమిక విద్యాప్రచారానికి ఆయన ఇచ్చిన ఆమూల్య సలహాలను అంతర్జాతీయ కార్మిక సంఘ డైరెక్టరు బట్లరుగారు ఎంతగానో ప్రశంసించిరి. విద్యార్థులకుగాను ప్రత్యేకంగా పౌరసత్వ కళాశాలలను విద్యార్థి కాంగ్రెసుద్వారా నడపడానికి ఆయనే ముఖ్య కారకుడు. బొంబాయిలో ఆరంభింపబడిన పౌరసత్వ కళాశాలలో ఆయన అధ్యాపకుడు.

ఎడ్లపల్లిలో ఆంధ్ర విద్యార్థి కాంగ్రెసు అధ్వర్యం క్రింద 1945 డిశంబరు నుండి జనవరి 1 వరకు జరిగిన పౌరసత్వ కళాశాలకు ఆచార్యరంగాయే ప్రధాన ఆచార్యుడుగా పనిచేసెను,

వయోజన విద్యను గురించి వివిధ నాయకులు వివిధ విధాల వెల్లడించారు. మహాత్ముని దృష్టిలో వయోజన విద్యంటే "వాగ్రూపంలో చెప్పే నిజమైన రాజకీయవిద్య" ఇది ఆచార్య రంగా అనవరతము ఆచరించేదే. ఆచార్యరంగా శనివారపు సుబ్బారావుగారితో కలసి "వయోజనవిద్య అభ్యుదయ రచయితలు" అని ఒక గ్రంథము, భారత దేశీయ విద్యోద్యమము (Indian Adult Education movement) అను మరొకటి స్వయంగా ఆంగ్లమున రచించెను.

## సాహిత్య సేవ

మన ఆంధ్రకవిత నన్నయ్యకు పూర్వమున్నా మన కంటికి కనబడకుండా నశించుట దురదృష్టము. దీనికి కారణము యేది యెలా వున్నా మన వారికి తెలుగుపై గల యీసడింపేయని అనటానికి అనేక ఆధారాలున్నాయి. నన్నయ మొదలు చెళ్లపిళ్ల వరకు తెనుగంటే యీసడింపే ఆధికంగా వుండేది, ఇది శూద్ర భాషయని, సంస్కృతం దేవభాషయని అది నేర్చుకుంటే యిహంపరం వుంటుందని వారి అభిప్రాయం. వైదికులెవరు తెలుగులో కవిత్వం చెప్పక సంస్కృతంలోనే చెప్పారు. నన్నయ మొట్టమొదట సంస్కృత శ్లోకము చెప్పి తెనుగున భారతం ఆరంభించాడు. తిక్కన అంతే. ఇంతేకాదు యీ మార్గకవులు సంస్కృతారణ్యం నుంచి శార్దూలమత్తేభాదులను దెచ్చి తెనుగుతోట పాడుచేశారు.

ఆనాడు సంస్కృతం వారిది పైచెయ్యి అయినట్లే. ఈనాడు ఆంగ్ల విద్యాధికులదయింది. ఆస్తిపాస్తులు పైతరగతి వారివే అయినట్లు సాహిత్యసంపద వారిదే అయింది.

నేడు ప్రపంచంలో మార్పులు వస్తూవున్నట్లుగనే, యీ పవిత్ర కర్మభూమి లోకూడ రాక తప్పుటలేదు. "*శూద్రమక్షరసం యుక్తం దూరతః పరివర్జియేత్*" "*చదువుకున్న శూద్రుని దూరంగా వెళ్ళగొట్టు*" అనే ఆర్యోక్తి అడుగంటింది. "ఉపమ గల్గిన శయ్యల నొప్పియున్న నంఘ్రిభవుని కావ్యంబు గ్రాహ్యంబు గాద"ను అప్పకవి ఆజ్ఞ ఆచరణీయమగుట లేదు. నేడు విద్య యీ ఆంగ్ల ప్రభుత్యంలో కొద్దియో గొప్పయో అందరికి అంటగట్టడానికి అవకాశమున్నది, అందువల్ల అణగద్రొక్క బడిన తరగతుల వారుకూడ చదువుకుంటూ వున్నారు. **పండితులకు పిడుగు, పామరులకు పెన్నిధి అగు గిడుగువారి వాదం ప్రజానీకానికి ప్రయోజనం కలిగించింది.** కనుక వ్రాసేవారు చదివేవారు కూడా కార్మిక కర్షకులలో అధికం అవుతున్నారు, పూర్వమువలె కవిత్వం తన ప్రతిభ చూపెట్టటానికో, ప్రభువుల మెప్పు కొరకో, ప్రమోదము కొరకో అయితే అడుగున పడి పోతుంది.

స్వస్థాన వేష, భాషాభిమతాస్సంతో రసప్రలుబ్ధిధియః– స్వస్థాన వేష భాషలకు సన్నిహితంగా కవిత్వం వుంటేనేకాని రససిద్ధి కలగదని యేనాడో అన్నాడు శబ్దశాసనుడు, అది వీరి చెవి కెక్కితేగా? మార్గకవులు మన్నించారా? యీ మార్గకవితే ఆంధ్రవాఙ్మయంగా తలిస్తే పొరపాటు పడినవారవుతారు. మార్గకవిత ప్రభుత్వాదరణతో పండిత అభిమానం కొరకు పుట్టబడింది. ఆనాడు కూడా ప్రజాసాహిత్యం లేకపోలేదు. దేశికవితలో కావలసినంత ఉన్నది. తెనుగు తేటదనం అంతా అందులో తేజరిల్లింది. కర్ణాటకులకు త్రిపద యెలాగో, తెలుగు వారికి ద్విపద ఆలాంటిది. అందులో తెలుగువారి సుఖము, దుఃఖము, లాభము కష్టము, వేయేల వారి నిత్యజీవితము తేటతెల్లముగా తెలుపబడింది, మార్గకవిత మంటగలపాలనే వాడనుగాను, అందులోను, అణిముత్యాలు ఉన్నాయి. తేడా మాత్రం తెలిపాను.

ప్రజాసామాన్యపు సాధకబాధకాలను, వారి కష్టసుఖాలను, ఆశ నిరాశలనూ, ఆశయ ఆదేశాలను, వారి భాషలో రచించేదే ఉత్తమ సాహిత్యమని జహ్వర్ పండితుడు నిర్వచనం చేశాడు.

ఇట్టి సాహిత్యమే ఆచార్య రంగా అభిలషించేదీ, ఆదరించేదీ. ఆయనను రైతు నాయకునిగా అందరూ యెరుగుదురు. కాని రసహృదయునిగా యెరిగిన వారు ఎందరు ఉన్నారు? పూర్వాంధ్రము లోనూ, నవ్యసాహిత్యమందు కూడ

ఆయన నిష్ణాతుడే. భారతం ఆయన అభిమాన గ్రంథము. ఆయన కేమిటి ఆంధ్రుల కందరకు నట్టిదే. అందుకనే "*తింటే గారెలు తినాలి, వింటే భారతమే వినాలి*" అని సామెత పుట్టింది. పోతన్నంటే ఆయన పొంగిపోతాడు. ఆ కర్షక కవిని రంగా దంపతులు వేనోళ్ళ ప్రశంసిస్తారు. ప్రబంధాల పోకడలన్నీ ఆయన యింపుగా వివరిస్తాడు. వసు, మనుచరిత్రలను విమర్శిస్తాడు. ఆధునికాంధ్ర సాహిత్యంలో యెంకి పాటలంటే ఆయనకు యెనలేని గౌరవము. "*యెంకి వంటి పిల్ల లేదోయి* (యెంకి పాటలు – రచయిత నండూరి సుబ్బారావు), *లేదోయి*" అనియెలుగెత్తి పాడుతాడు కుర్రవాడి లాగా. ఉన్నవ అంటే ఉబ్బితబ్బిబ్బవుతాడు. మాలపల్లిని మాణిక్యం లాగా మన్నిస్తాడు. పెక్కు మాటలేల? కర్షక యితివృత్త గ్రంథాలంటే కళ్ళకద్దుకొంటాడు.

ఆయన ఆంధ్రములో వ్రాసిన సాహిత్య గ్రంథము హరిజన నాయకుడు అను నవల, అస్పృశ్యతా నివారణా ప్రచారమునకై రచింపబడిన పల్లెటూరి నవల.

కర్షక సంబంధమైన పల్లెపట్టు, కర్షకా, కష్టజీవి కర్షక చరిత్రమొదలగు వాటికి పరిచయ వాక్యాలువ్రాసి పసందు, ప్రసిద్ధి తెచ్చాడు. వాహిని, గోభూమి, క్రాంతి పత్రికలు పెట్టి భాషాసేవ దేశసేవ చేశాడు.కార్మిక కర్షకుల కష్ట నష్టాలు వెల్లడించుతూ నేటికి ఆర్థిక విధానములోని లోటును వెల్లడిస్తూ వారి సంబంధమైన వాటికే ప్రాధాన్యము నిస్తూ పత్రికా ప్రపంచంలో మార్పు తెచ్చి అనుకరణీయు అయ్యాడు. రైతు గ్రంథమాల పెట్టి తద్వారా సాహిత్యసేవ చేశాడు. ఆయనచే ప్రచురింపబడిన రైతు భజనావళి, ఆంధ్ర సాహిత్యానికి అలంకారము. ఎంతోమంది కవికుమారులకు హుషారు యిచ్చి, వూతమిచ్చి, గేయరచనలు చేయించిన భాషాసేవకుడు. ఆయన మాలపల్లి విమర్శ, పండితపామర జనస్తుత్యం. భాషాసేవలోను ఆయన బాగుబాగనిపించు కొనుచున్నాడు.

పసగల జాతీయ రచనలు చేయుటలో ఆయన పందెగాడు. భారత రైతునాయకుడు కోరే సాహిత్యమూ, మెచ్చిన గ్రంథాలు, ఆయన పలుకుల పసందూ, ఆయన రచనల ద్వారానే తెలిసికోండి. రాజులు రాణులు గాదు మనకు నాయకీ నాయకులుగా వుండదగ్గవారు.

ఈనాడు కష్టజీవుల కథలు కావాలి! చెమట బిందువుల మాణిక్యంపు దీధితులు ప్రకటించాలి! పొలములో భూమిపై పొరాడువారు, చేలల్లో

చెరలాడువారు, బీళ్ళల్లో గోమాతలకు తోడగువారు: డొంకలలో పచ్చిచొప్ప మోతల సంగీతాన్ని విరజిమ్మువారు, నదుల వెంట, కాల్వల ప్రక్క, రాళ్ళమధ్య, ఆడవుల చెంత పశుపక్ష్యాదుల కూరట కల్గించు వారు. తోడి మానవులకు జీవితాశలను విజృంభింప జేయువారు ఆ కోటాను కోట్ల కొలది సాధారణ ప్రజలు.,కష్టించు కార్మిక కర్షకులు, అలసట నెరుగని బక్కజీవులు, సున్నితమగు జీవితానుభవ మెరుగని సుతిమెత్తని హృదయాలవారు. ఈనాటి భావకవులకు నూతన రచయిత లకు, జన నాయకులకు, ప్రజాపాలకులకు, మహాప్రపంచ గంధర్వులకు అర్హమగు నాయికా నాయకులు.

ఈ సత్యాన్ని మన ఆంధ్రదేశపు కవులు, గాయకులు చాలనాళ్ళ నుండి గ్రహించిరి. "గురజాడ" నుండి "బసవరాజు" వరకు, "సాహితీ సమితి" నుండి "విశ్వసాహిత్యమాల" వరకు. "రామిరెడ్డి" నుండి, "జాషువా" వరకు, "శెట్టిపల్లి" నుండి "గొట్టిపాటి" వరకు, "చదలవాడ" నుండి, "నాగరాజు" వరకు, "వున్నవ" నుండి, "గరిమెళ్ళ" వరకు. యీ నవ్యభారత భావాలను వినూత్న కాంతుల విరజిమ్ము నూతన సాహిత్యసృష్టిలో ప్రకటించుచున్నారు.ఇందును భారతదేశమున ఆంధ్ర కవి గాయకులదే ప్రథమ తాంబూలము.

ఈ పంథాకు వడి, వేగము కల్పించుటకే "రైతు గ్రంథమాల" వారి ప్రథమ పుష్పము "హరిజన నాయకుడు" ఈనాటికి ఆంధ్రులకు ఆదర్శమగువ్యక్తి. మనుష్యులలో, సాహిత్య ప్రపంచములో రెండవ పుష్పము ఆంధ్ర గ్రామసీమలకు నూతన జీవకళల ప్రసాదించుచున్న "రైతు భజనావళి" దాని "సౌరభముల" ను

ఆనందించి యింకను ఆంధ్రులు తనివిజెందుటలేదు.- (ఆకలి మంటల పరిచయం) రచయితలు రెండు రకాలు. ఉద్గ్రంథాలు రచించేవారు, సాహిత్యానికి నూతన జీవనము యిచ్చేవారు. ఆంధ్ర వాఙ్మయంలో నూతనజీవనము తెచ్చినవారిలో ఒకరు ఆచార్యరంగా, ఆయన శబ్దచాతుర్యము, భావమాధుర్యము, ఆశయాలు కొంతవరకైన తెలియకపోవు కొత్త వారికి. ఆయన సాహిత్యసంపదను గురించి " ధర్మజ్యోతి" వెలిగించి రాష్ట్రగానము చేసి ఇంక పెక్కుకృతులు ఇంపుగా వెలయించి అభినవ తిక్కన అను ప్రఖ్యాతి గాంచిన తుమ్మల సీతారామమూర్తి చౌదరి( తెలుగు లెంక– "లెంక అనగ నెవడు కింకరుడేసుమీ") ప్రశంస చెప్పక తప్పదు.

"నిను దేశభక్తుఁగా; మెచ్చినవారలు కలరు మహి నశేషప్రజ నీ
వొనరించిన భాషాసే
వ, నెరింగినవార లెన్నివందలు కలరో? చక్రవర్తుల ముత్యాలశాలలందు,
నగ్రహారాల నడిబొడ్డులందుఁ గులుకు
కవులు కనలేని తెలుగు చక్కందనమ్ము, చూఱలాడిన శారదాసుతుడవీవు
పల్లెటూరఁబుట్టి పల్లెల సేవించి,
బీదవారి కులము పేదవారి
పలుకు గుట్టెఱింగి పసగల జాతీయ,
రచనల సేయు కవిరాజవీవు
తెలుఁగు నుడికారమందున్న మెలపు నెఱిఁగి
తెలుఁగు హృదయంబు నందున్న తీపినెఱిఁగి
తెలుఁగు సంస్కృతియందున్న చెలువమెఱిఁగి
తెలుఁగునకు నీవు సరిక్రొత్త వెలుఁగులిడితి.

రాజకీయాల్లో మునిగి ములకలేస్తూవుండే ఆచార్య రంగా, సాహిత్యంలో సానలతీరిన జాతిరత్నమని, సాహిత్యసేవలోనే మునిగిన తుమ్మలవారు చెప్పిన వాక్యము వేదవాక్యముగా స్వీకరించక తప్పదు కద!

ఇక ఆయన హరిజననాయకుడు, రైతు భజనావళి, వ్యాసాలు, మాలపల్లి విమర్శను గురించి ఇంతో అంతో వేరువేరుగా చెప్పి యీ విషయం విరమిస్తా.

## మాలపల్లి విమర్శ

ఆంధ్రుల ఆమోదము పొందిన నవల మాలపల్లి, భాషలోనే కాక, భావంలో గూడ నవ్యత అందులో ఆందాలు చిందుతూవున్నది. భారతం ఆనాటి సంఘాన్ని యెలా చిత్రించిందో, మాలపల్లి యీనాటి ఆంధ్రదేశాన్ని చిత్రించింది. దీనిని జి. వి. కృష్ణారావు గారు "ఆంధ్ర ప్రభ" లో మార్క్సిస్టు దృక్పధముతో విమర్శించారు. (1942 మార్చి 15) శ్రీనివాస శిరోమణిగారు భారతిలో సమగ్రంగా విమర్శించారు.

(45, నవంబరు) ఆచార్యరంగా ఆంధ్రపత్రికలో విమర్శించారు. (1944, జనవరి ఇది 1932 లో వ్రాసింది)

మాలపల్లిని వ్యాఖ్యాన పంథాలో విపులంగా విమర్శించింది ఆచార్య రంగా వొక్కడే, సంగదాసు మాలపల్లిలో ప్రధానపాత్ర. అతడు అచ్చంగా గాంధిశిష్యుడు. ఆతడు చేసే బోధ, పనులు కూడా యెంతో వుదాత్తంగా వుంటాయి, అతని విశాలజ్ఞానమూ, రాజకీయ దృక్పథమూ, అన్ని విధాలా అభినందనీయమని ప్రథమ వ్యాసంలో ప్రస్ఫుటం చేశాడు.

ఆచార్య రంగా ఆంధ్రపత్రికలో నాలుగువ్యాసాల్లో దీన్ని యిలా ముగించారు. "ఇదియ, లక్ష్మీనారాయణగారి సాంఘిక తత్త్వము. ఇయ్యది తనంతట తాను భారతీయ ప్రజాసామాన్యపు కష్టపరంపరను గూర్చి కరుణాభరితమగు శ్రీలక్ష్మీనారాయణగారి హృదయం సత్యమార్గ మన్వేషించుటలో కన్పడు సందేశం. శ్రీలక్ష్మీనారాయణగార్కి అటు పాశ్చాత్యదేశాలందలి సాంఘికవాదమూ తెలియును, యిటు మనదేశపు ప్రజల మానసిక తత్త్వమూ, అవసరములూ తెలియును. మధ్య గాంధిమహాత్ముని దివ్యబోధ వారి హృదయమందు పీఠము గొనియుండెను. వీరి దీర్ఘ విచారపు ఫలితమే దూరదర్శకమగు, మార్గదర్శకమగు సాంఘిక తత్త్వము. ఇయ్యదియే యీ కాలపు మన దేశమునకు అవలంబనీయము. రామదాసు, సంగదాసు, జ్యోతి వగైరాల ధర్మపథము ననుసరించి, వెంకటదాసు కార్యచతురత, వుత్సాహపరంపర నుపయోగించి, రామానాయుని కార్యకారితనము చేయూతగొని, కార్మికులకు తగు సేవ చేస్తే "నాది హృదయ రాజ్యమని భారతీయ, సాంఘిక సేవకుడు పలుకగలడు."

ఆచార్యరంగా మాలపల్లి హృదయాన్ని మనకు తెలిపి, జాతీయ సేవకులకు మార్గము చూపించారు. దీనిని యిదివరకు వారెవరునూ చేసియుండలేదు. ఇది యీ విమర్శ ప్రత్యేకత. ఆచార్యుని హృదయ వైశాల్యము.తిలక్ మహారాజు మాండలే జైల్లో గీతారహస్యము రచించి మాన్యుడైనట్టే, లక్ష్మీనారాయణగారు వేలూరు జైలులో మాలపల్లిని రచించి మాన్యులయ్యారు.

భగవద్గీతకు అనేక వ్యాఖ్యానాలు పుట్టినటులనే దీనికి పుట్టవచ్చు. మాలపల్లి నుండి ఉన్నతభావాలూ, ఉజ్వల ఘట్టాలూ యెత్తబూనుట సముద్రానికి ఏతము

యెత్తినట్లే. ఆచార్యరంగా ఆంధ్రులకు అందలి ఉద్బోధలు కొన్ని చూపి, మాలపల్లికి మరొక మాధుర్యమూ, మాన్యత కలిగించాడు.

## వ్యాసములు

Full many a gem of purest ray serene,
The dark unfathomed covers of ocean bear
Full many a flower is born to blush unseen
And waste its sweatness on the desert air.

సాహిత్యములోని వివిధాంగములలో వ్యాసరచన కడుకష్టభూయిష్టము. రచనలన్నిటికంటె వ్యాసరచన రచయిత స్వభావమును సుస్పష్టపరచును.

ఆచార్యరంగా రాజకీయ జీవితము 1923వ సంవత్సరములో ప్రారంభం అయినది. ఆ నాటినుండి ఆయన ఎందరినో కలసికొన్నాడు. ఎందరితోనో కలసి మెలసి పనిచేశాడు.ఏ పనిచేసినా, ఎవరితో పరిచయము కల్గించుకొన్నా రైతు ఉద్యమాభివృద్ధికే. రైతు ఉద్యమాభివృద్ధికి ఎవరెంతవరకు ఉపయోగపడేది చూచుకొని, వారి దృక్పథాన్ని, తత్వాన్ని మార్చుటకు ఎంతో కృషిచేశాడు. "*కాంతులు వెలిగక్కు, విలువగల మణులెన్నో చీకటుల చిమ్ము సముద్రగర్భమున దాగియున్నవి. సౌందర్యమునకు ఆలవాలమగు, కుసుమములెన్నో. నట్టడవియందు నిరర్థకముగ నేల రాలుచున్నవి.*" అని ఆంగ్లకవి "థామస్ గ్రే" అనినట్లు, ప్రతిభావంతులెందరో గలరు. వారు తమ కార్యాలను లోకానికి చాటాలనే చేయరు. వారిది కేవలం సేవాధర్మమే. అందులో అనేకులు చేయూత లేక చిక్కి శల్యావశిష్ఠులై యుందురు. వారికి చేయూతనిచ్చి వారి సేవ పొందాలి,

ఇట్టి వారిని గురించి ఆయన అనేక వ్యాసాలద్వారా లోకానికి వెల్లడించాడు. వారికి చేయూతనిచ్చి లోకాన్ని హెచ్చరించాడు. బేర మెరుగని రైతురక్షకులు (1-10-1937 చిత్రగుప్త) అనే మకుటంతో గ్రామాల్లో ఉచితంగా దక్షతతో వైద్యము చేయువారి నెందరినో లోకానికి వెల్లడించాడు. అందులో వడ్డూరు రాజులు, పిట్టపాలెపు వైద్యులు, నిడుబ్రోలులోని ఓరుగంటి రత్తయ్యల దీక్షాదక్షతలు వేయిముఖాల వెల్లడించాడు. ఇట్టి ఘనవైద్యులెందరో మన గ్రామసీమల్లో కలరు. వారు పేరు ప్రఖ్యాతులకై కాని, ధనధాన్యాలకు కాని పెనుగులాడక పలువిధముల

సహాయము చేయుదురు. అట్టివారిని లోకానికి వెల్లడించి మన వైద్యాన్ని కాపాడు కోవాలి. పెద్దపెద్ద మహాపురుషులను గురించి, రాజకీయ నాయకులను గురించి వ్రాయువారు కలరు కాని, పల్లెల్లో అనామకులై అనాథసేవ చేయుచున్న సేవకులను గురించి వ్రాయువారు అరుదు. అట్టివారిని అభివృద్ధి చేయుట ఆచార్యుని లక్ష్యము.

ఇట్లు రైతుల రక్షకులు, నిరాడంబర ప్రజాసేవకులు, నామరూపాలులేక నశించిపోయిన కాంగ్రెసు సత్యాగ్రహ వీరులను గురించి, ఇంకా ఇతర సేవకులను గురించి విశేషంగా ఆయన చిత్రగుప్తలో (1936-40) అనేక వ్యాసములలో ప్రకటించాడు. ఇంకా ప్రజాబంధు, వాహినిలోను వ్రాశాడు. ఆయన వ్యాసాలన్ని బహు యింపుసొంపు కల భాష, భావము పందెములు వేసికొని పరుగెత్తు చున్నట్లు ఉండును. అవి నిజంగావ్యాసాలవలె కాక కథలుగా కన్పించును. పాఠకుని కెంతో పరమానందం కలిగించును. వర్ణనలలో ఆయన వాసిగాంచాడు. శైలి ధారా ప్రవాహికమై సుబోధకమై, పేలవం కాక, పెలుసు కాక, ముచ్చటగా వుండును. భాషాలాలిత్యము, భావమాధుర్యము ఆధికంగా అలరారు చున్నవి. శీర్షికలు పెట్టుటలో సిద్ధహస్తుడు. కథానికలవలె ఆకర్షవంతముగను సముచితమైన పేరు పెట్టుటలో ప్రతిభావంతుడు.ఆ వ్యాసాలు కొండవీడు చాంతాళ్ళవలె కాక, సంగ్రహం కాక సమగ్రంగా నున్నవి.

ఆయన వ్యాసాలన్నిట సౌజన్యం, సౌహార్ద్రం పడుగు పేకవలె అల్లుకొని పోయినవి. కేవలం ఆయన భాషాలాలిత్యం, భావ మాధుర్యం, విషయ విజ్ఞానం, విమర్శనా పటిమ పరాకాష్ఠచెందినవి. ఈ వ్యాసావళి ఆయన ఉన్నత స్వభావమును, దేశసేవకుల పరిచయమును, ఆంధ్రావళికి అర్పించగలదు. వీని నెవరైన ప్రచురించి ప్రస్తుతి గాంచలేరా!

## రైతు భజనావళి

*అరే!నీవు రైతువై కూడ పాటలేలపాడవు ? బంగారపు నాగలి, వెండి కాడి, రత్నాలవంటి ఎద్దులు-రైతు కేవలము కృష్ణభగవానుడే సుమా.* (ఏటుకూరి.) ప్రాచీన గేయాల్లో సాహిత్యపుష్టి, సంగీత ప్రతిభలేకాక, అనిర్వాచ్యమై, ఉత్తేజకరమైన అప్పటి సాంఘిక రాజకీయనైతిక ఛాయలు చెన్నారును. వినుటకు వీనులకింపుగా వుండును. అందుకనే రవీంద్రుని వంటి మహాకవికి వీనియందుండే మక్కువచే

రైతుల గ్రామగీతాలు పెక్కు ప్రయాసతో సేకరించి ప్రచురించాడు. దేవేంద్ర సత్యార్థి పల్లె పదాల పరమార్థమెరిగిన వాడగుటచే భరతఖండమంతా తిరిగి పల్లెపదాలు సేకరించి చరితార్థుడయ్యాడు.

భారతి, కృష్ణాపత్రికలు వంటి పత్రికలు ఈ పల్లెపదాలను కొంత వరకు ప్రకటించినవి. గృహలక్ష్మి కూడ దీనికి చేయూతనిచ్చింది. వేటూరి ప్రభాకరశాస్త్రి గారు విశేష పరిశ్రమ చేసి చాటువులు ప్రకటించుటే కాక ఈ పల్లెపదాలు కూడ సేకరించారు. నేదునూరి గంగాధరం, టేకుమళ్ళ కామేశ్వరరావు వంటి యువకులు ఎన్నో సేకరించారు. అయినా ఇందులో ఇంకా ఎంతోకృషి చేయవలసియుంది. మన తెనుగు జీవితమంతా పదకవితలోనే వుంది. మన సంప్రదాయ విజ్ఞానం సేకరించి ప్రకటించుకోవలసిన బాధ్యత భాషాభిమానులందరిపైన వున్నా, విశేషించి ఆంధ్రవిశ్వకళాపరిషత్తు వారిపై నున్నది.

ప్రాచీన సాహిత్యమునుండి ఒక చాటువు, ఒక పదము మచ్చునకు చూపిస్తా. కర్షక సాహిత్యమెంత ముచ్చటగా నున్నది.

"పొలమును బుష్టి చేసి శ్రమ పొందుచు దున్నుచు నాటు వేళకున్
జలములు గట్టి మమ్ములను సత్ఫలవంతము సేయు నాకృషీ
వలికి సువర్ణరాసులను భక్తిసమర్పణఁ జేతు మందునున్
పలికెడు భాతి చేనులు సువర్ణపు వెన్నుల వంగి యుండెడిన్"

"దూరాన చంద్రయ్య దోబూచులాడే,
నింగి నుంచొక చుక్క తొంగిచూచింది !
కొడవలి మొలనుంచి కోత సాలించి,
రావోయి వేవేగ రామన్న మామ !
పాడిపంటలు పెంచి ప్రజలకాపాడి,
పుణ్యంబుపొందేటి పురుషుడవు నీవె!
కొడవలి మొలనుంచి కోత సాలించి,
రావోయి వేవేగ రామన్నమామ!
ప్రాణమానము గాచు పంటపత్తియును,
మక్కువగ పండించు మగవాడ వీవె!
కొడవలి మొలనుంచి కోత సాలించి,
రావోయి వేవేగ రామన్నమామ !"

దీనిలో కవితా మాధుర్యము, భావసంపద రుచిచూచిన తర్వాత వేరే వివరించుట ఎందుకు? పాడేవారినికాని వినేవారినికాని తన్మయత్వము కలిగింప జేసేవి ఇవే. తర్వాతనే చెప్పాలి పద్యాన్ని. కారణం మన గేయాలు లయతాళ బద్ధాలుగా వుండి సంగీతంతో సన్నిహిత సంబంధం కలిగి ఉండుటే కాక, మార్గ కవితలో మాదిరి దూరాన్వయం, శబ్దాడంబరం లేక అందరకు తేట తెల్లంగా అర్థమగును. అందుచేతనే ఇది ప్రజల పెన్నిధిగా పెరిగింది.

ఇక రైతుభజనావళికి వద్దాము.

రైతుదండు గుంటూరులో (1933-36) నడుపుతున్నపుడు రైతు భజనావళి ఆవశ్యకత ఆచార్యునకు గోచరించింది. వేలకు వేలు ప్రజలు మూగజీవాలవలె పోయేకన్న ఒక్కమాటనే స్మరించుతూ, ఒకే భావాన్ని మననంచేస్తూ, ఒకేసారి, ఒకేరీతి, ఒకే పట్టుదలతో తమ దండు పల్కుల ప్రకటించుకొనగల్గినపుడు, ఏ కార్యానికైనా పటుత్వము కన్పడును. జయలక్షణమై బయల్పడును.

ఇంతేకాదు ఏ యుద్యమ సిద్ధికైనా సాధారణ ప్రజల కందుబాటులో హృద్గతము కాదగుమాటలు, పాటలు, గీతాలు, గేయములు అత్యవసరం. ఆ అవసరం తీర్చుటకే రైతుభజనావళి 22-4-1934 తేదీ ప్రథమముద్రణ అయ్యింది. రైతుభజనావళిలో అనేక కవుల విప్లవ గేయాలు కూర్చబడినవి. కాని అందులో ప్రజలపాటల త్యాగరాజని ప్రసిద్ధిచెందిన గేయ రచయిత గరిమెళ్ళ సత్యనారాయణ గారి "అన్యాయకాలంబు దాపురించిందిపుడు, అందరము మేలుకోవాలండి" అనేది తలమానికము. తర్వాత బయలుదేరాడు విప్లవకవి (శెట్టిపల్లి) "రైతు సత్తా దెల్ప రణభేరిమోగింది, రండోయి,""జయభేరి మోగింది వో తెలుగురైతా. జయగేయముల పాడ సాగిరమ్మింక" అన్నాడు. తరువాత ఈ దక్షిణాపథములో జమిందారి వుద్యమ యుగనిర్మాత నెల్లూరి వెంకట్రామానాయుడు (జమీన్‌రైతు సంపాదకులు ) "మాకొద్ది *జమీంద్దార్ల పొందు*." అని పాడాడు. ఈ నినాదమే నేడు భారతావని యందంతట ప్రచారమై జమీందారీ విధానము రద్దునకు రాజబాట ఏర్పరచింది.

రైతాంగ భజనావళిలోని ఒక్కొక్క పాట పది ఉపన్యాసాల పెట్టు అయి దేశమంతట అంతులేని ప్రచారము కావించినది. 30 పేజీల నుండి 125 పేజీల వరకు పెరిగి, ప్రఖ్యాతిగాంచి ఎన్నో ముద్రణలు పొందినది. నెల్లూరి వెంకట్రామా

నాయుడు, న్యాపతి నారాయణమూర్తి, గౌతు లచ్చన్న, మల్లంపాటి చెంచురామయ్య, నన్నపనేని వెంకటసుబ్బయ్య, అట్లూరి అప్పారావు ప్రభృతుల కంఠనినాదాలతో రైతు భజనావళి తత్వం ప్రకటితమైనది. వీరేకాదు. గోగినేని వెంకటసుబ్బయ్య "బుర్రకతల వారు", చిట్టాల జనసమాజము. దివి తాలూకా బ్యాండు వారు, నానా ప్రచారకులు, రైతాంగ విద్యార్థులు, రైతు రక్షణ యాత్రాదళమువారు మూలమూలలకు కూడ తీసుకొనిపోయిరి.ఇంకా "కాంతిగీతాలు", "కార్మికభజనావళి", "చేనేత భజనావళి", "ఎన్నిక పాటలు" మొదలగునవి యెన్నో బయలు దేరినవి.

రైతాంగభజనావళి దేశవిదేశ భాషల్లోకి అనువదింపబడి ఆంధ్రులకు అమరకీర్తి తెచ్చుచున్నది. ఇది కాంగ్రెసు కర్షకోద్యమాలకు అఖండ బలమిచ్చి లోగడ యెన్నికల్లో జస్టిసుపార్టీని పోటీలో మన్ను చేసింది, కార్మికకర్షక ప్రాముఖ్యము ప్రస్ఫుటము చేసినది.

సాహిత్యము సంఘ ప్రతిబింబము. ఏ సంఘమాధిక్యముగాంచునో ఆ సంఘ సాహిత్యమే సృష్టింపబడును. పురాణకవిత (వస్తుకవిత) బయలుదేరి బ్రాహ్మణ ఆధిక్యత ప్రకటించినది. తర్వాత ప్రబంధకవిత (వర్ణన ప్రధానము) వచ్చి క్షత్రియాధిక్యత తెలిపింది. అనంతరము భావకవిత (భావప్రధానము గలది) బయలుదేరి, ధనికులదిగా వుండి ఆత్మ సుఖముకొరకే ఆలాపింపబడినది. అట్టడుగునవున్న కార్మికకర్షకుల కొరకు నేడు అభ్యుదయ కవిత (ప్రజాసాహిత్యము) అభివృద్ధిపొందుతూంటే ఆశ్చర్యపడ నక్కరలేదు. ఇది క్రమబద్ధ పరిణామము. నేడు కార్మిక కర్షక అభ్యుదయసాహిత్యాన్ని అరికట్టుట కాలప్రవాహానికి ఎదురీత. కనుక శక్తి సామర్థ్యములు కలిగి, ఇట్టి మహత్తర శక్తి శాలియైన సాహిత్యమును పెంపొందించని వాడు సంఘద్రోహి, దేశద్రోహి. ఇంతేకాదు, ఆత్మద్రోహి కూడ ఆగును. అట్టిశక్తి సాహిత్యానికి వున్నది కనుకనే ఆచార్యరంగా సాహిత్యసేవ చేయుచు, అనేక యువకులకు ప్రోత్సాహమిస్తూ వున్నాడు.

## ఆంధ్రరాష్ట్ర రైతు సంఘం

రైతు బాధలు యీనాడే కాదు. మన గ్రామసంఘాలు నాశనమైన నాటినుండి గలవు. నేటివలె నాడు రైతు వుద్యమమునకు ఒక స్వరూపం లేక పోయినను, రైతులు తమను బాధించు సమస్యలపై అంతోయింతోఆందోళన చేయకపోలేదు.

కాని వారిలోగల సంచలనానికి సంఘశక్తికితగిన ప్రబోధం ఆనాడు లేదు. ఆనాడు రైతులు సమ్మెలు కట్టెడువారట. అది ఆలోచిస్తే రైతాంగానికే అధికంగా నష్టం. వారికి ప్రభుత్వాన్నెదిరించి పన్నులు యివ్వకుండ ఉండుటకు మారుగ వ్యవసాయమే మాన జొచ్చిరి. బ్రిటీషు ప్రభుత్వ హయాములోగూడ యిదే పద్ధతిని అవలంబించిరి. కృష్ణానదికి ఆనకట్టకట్టిన తరువాత డెల్టా భూములకు తీరువ హెచ్చు చేసినపుడు అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం గారి ఆధ్వర్యాన సాగుచేయక సమ్మె చేసిరి. కాని ఆది ఫలవంతం కాలేదు. దానికి కారణాలు చాలా ఉన్నాయి. కాని ఆ సమ్మెలు ఆనాటి మన రైతు నాయకుల మనస్తత్వం తెలియజేయును. ఆనాడు వ్యవసాయం చేసి పన్నులు ఎగపెట్టాలన్నది ఘంటశాల వాసి గొర్రెపాటి బాలకృష్ణమ్మ గారు ఒక్కరే.

కొన్నాళ్ళకు జిల్లాసంఘాలంటూ పుట్టినవి. అలాగే కృష్ణాజిల్లాలో 1901 లో ఏర్పడినది. ఇవి ఆ కాలములో కాంగ్రెసుకు అనుబంధముగా వుండి రాజకీయ చైతన్యం కలుగజేయుచు రైతులకు అండదండగా వుండేవి. మహాత్ముని శకము వచ్చిన తరువాత, వాటి యావశ్యకత అంతరించెను. నేటికి గోదావరి జిల్లాలో దుగ్గిరాల సూర్యప్రకాశరావు గారి నాయకత్వాన దీటుగా ఒక్క గోదావరిజిల్లా సంఘమే పనిచేయుచున్నది.

నేడు దేశాలు సాధారణముగా రెండు విధాలుగా వున్నాయి, వ్యవసాయక దేశాలని, పారిశ్రామిక దేశాలని. మనదేశం, చీనా మొదలైనవి వ్యావసాయక దేశాలు. ఇంగ్లాండు, మొదలైనవి పారిశ్రామిక దేశాలు. ఈ పారిశ్రామిక దేశాల్లో రెండే తరగతులు, ధనికులు, దరిద్రులు.కాపిటలిస్టులు (మిల్లుయజమానులు) లేబర్ (మిల్లు కూలీలు) ఉందురు. అక్కడ రాజకీయవేత్తలు యీ కార్మికులను కర్మాగార అధిపతుల నుండి కాపాడే విధము అధికముగా ఆలోచింతురు. ఆ విధంగానే మన ప్రభుత్వము, మనలో కొందరు నాయకుల ఆలోచన వున్నది. అక్కడ లేబరు సంఘాలకు ప్రభుత్వ ఆదరణ వున్నది. వారి రక్షణకు శాసనాలున్నవి, వారి కష్టసుఖాలు ఆలోచించుటకు నాయకులున్నారు, సంఘాలు వున్నవి.

కాని యిండియా యింగ్లండు కాదు. ఇది వ్యవసాయక దేశము. కనుక యిక్కడ నూటికి 80 మంది వ్యవసాయకులు వున్నారు. తరువాత చేతిపనులమీద

ఆధార పడువారు వున్నారు. ఫ్యాక్టరీ కూలీలు లెక్కకు మిక్కిలి తక్కువ, ఇక్కడ పరిస్థితులను బట్టి సంఘాలను స్థాపించాలనే సంకల్పం ఆచార్యరంగాకి కలిగింది.

1922 లో పామీదత్తు, పేజ్‌ఆర్నాడు ప్రభృతుల కార్మిక పరిశోధకశాఖా విద్యాలయములో ఆయన చేరినప్పుడు రైతు సంఘూలు, వ్యవసాయ కూలిసంఘూలు ఏర్పాటుచేసి వారికి ఆర్థికసాయం, చైతన్యం కలిగించి, ఈ కార్మిక కర్షక సంఘాలను కలిపి సామ్రాజ్యవ్యతిరేక సమ్మిళిత సంఘటనాన్ని సాగించవలెననే సంకల్పము కలిగింది.

1923లో రైతు వుద్యమము పేరట గుంటూరుజిల్లా అప్పికట్లలో బ్రహ్మాండమైన జిల్లాసభ రంగా అధ్యక్షత క్రింద జరిగినది. రైతుల ముఖ్య అవసరాలు కోర్కెలను ప్రకటించి, రైతులను మేల్కొల్పింది. వారి దుస్థితిని కళ్లెదుట పెట్టింది. రైతు వుద్యమము ఆనాటినుండి (1923) నేటివరకు నిర్విఘ్నంగా నడుపుచున్నాడు. 1923 లో ఆయన రైతాంగ ఎన్నికల ప్రణాళిక తయారుచేసి యెలక్షను కమిటీని ఒకటి యేర్పాటు చేసి అభ్యర్ధులనామినేషనులు తీసికొని, ఎన్నికల వ్యవహారం నడిపాడు. గుంటూరుజిల్లాకు గల నాలుగు స్థానాలలో 3 స్థానాలు వీరి అభ్యర్థులే ఆక్రమించారు. కేంద్ర శాసనసభకు వీరి అభ్యర్దే జయము గాంచాడు.

1924-26 రైతు వుద్యమం, కృష్ణా గోదావరులు దాటిపోలేదు. కారణం రైతుశ్రామికులు, రైతు విద్యాలయాలు లేకపోవుటే. రైతు వుద్యమానికి ఆంధ్రదేశంలో మొట్టమొదట అండదండగా యున్నవారిలో ప్రముఖులు కానూరి వెంకటాచలపతయ్య, మాగంటి శీతయ్య, కలిదిండి నరసింహం, దుగ్గిరాల సూర్య ప్రకాశరావుగారు మొదలైన వారు.

ఈ విధంగా పెద్దలు సహాయం చేయుటేకాక కాంగ్రెసువారు కొందరు, తదితర పార్టీలు వారుకూడ రైతుసంఘాలకు చేయూత యివ్వకపోలేదు.

అసహాయోద్యమము రైతులలో మంచి జాగృతిని కలుగజేసింది. ప్రభుత్వమందు అసంతృప్తిని పెంచింది. చాంపరాను, కైరా, పెదనందిపాడు, బార్డోలి రైతువుద్యమాలు రైతు సంఘనిర్మాణానుకూల వాతావరణం ఏర్పరచినవి.

ఆచార్యరంగాకు రైతువుద్యమ సంకల్పం ఇంగ్లండులో కలిగినది. భారత దేశములో కాంగ్రెసులోని వివిధ రైతు ఉద్యమాలు రైతుసంఘ నిర్మాణానికి అనుకూల వాతావరణం ఏర్పరచినా, ఆయనలో రైతు ఉద్యమము అభివృద్ధి

పంథాను నడిపించవలెననే ఆకాంక్ష కలుగుటకు యిలా చెప్పుచున్నాడు. "కిసాన్ సర్దార్ నా గురుపీఠమని భావించాను. సర్దారు వంటి నాయకుడు, గాంధీజీవంటి మార్గదర్శకుడు, కర్షకులకు వుండగా బార్డోలి సత్యాగ్రహాన్ని వారంతా జయ ప్రదంగా  నెరపగలిగితే, ఇక వారు స్వరాజ్యసిద్ధిని, కిసానురాజ్యాన్ని పొందకుండ అభ్యంతరం వుండగలదా ? ఎక్కడో ఆనాడు బార్డోలిలో కర్షకులు సాధించిన విజయము యింతటి ఆశలను నాలో రేకెత్తించింది. భారతదేశమంతటా, కిసాను వుద్యమాన్ని పునర్విజృంభింప చేయాలనే ఆకాంక్ష రేకెత్తించింది. సర్దారు విజయం ప్రోత్సాహమివ్వగా ఆంధ్రకర్షక వుద్యమాన్ని పెద్ద యెత్తున లేవదీయటానికి నడుము బిగించాను" (ఆంధ్రప్రభ 1-11-1945)

ఇలా ఆచార్యరంగా అధికోత్సాహములో వుండగా అమెరికాలో వ్యవసాయ విద్యాభ్యాసము గావించి అక్కడ రైతుసంఘ కార్యకలాపాలు గమనించి వచ్చిన మాగంటి బాపినీడుగారు "రైతు సంఘాలెందుకు" కరపత్రప్రకటన, మ్యాజిక్కు లాంతరు, ఉపన్యాసాలవల్ల, రైతుసంఘ యావశ్యకతను బోధపరచుటేగాక, ఆంధ్ర రాష్ట్ర రైతుసంఘ స్థాపనలో ఆచార్యరంగాకు తోడ్పడిరి.

ప్రథమ రైతుమహాజనసభ బిక్కిని వెంకటరత్నం గారి అధ్యక్షతన జరుపబడి ఆంధ్రదేశాని కంతయు, ఆంధ్రరాష్ట్ర రైతుసంఘమొకటి 1928 సంవత్సరం స్థాపింపబడెను. దానికి అధ్యక్షుడు బిక్కిన వెంకటరత్నం గారు, కార్యదర్శి బాపినీడు గారు. మరల మరుసటి సంవత్సరం రెండవసభ ఆచార్య రంగాగారి అధ్యక్షత క్రింద, మూడు, నాల్గు, అయిదు సభలు వరుసగా దండు నారాయణ రాజు, కె. కోటిరెడ్డి, వేమవరపు రామదాసు పంతులుగార్ల అధ్యక్షతన జరిగెను.

ఇలా ఏటేట సభలు జరిపి రైతు వుద్యమాన్ని వృద్ధిచేశారు. 1936లో ఆంధ్ర రాష్ట్ర రైతు సంఘం రిజష్టరు చేయబడినది. ఈ రాష్ట్ర రైతుసంఘ విజయమునకు తోడ్పడిన వారు, నెల్లూరి వెంకట్రామానాయుడు, న్యాపతి నారాయణమూర్తి, దండు నారాయణ రాజు, గొట్టిపాటి బ్రహ్మయ్య, (పూర్వ కాంగ్రెస్ అధ్యక్షుడు) గోగినేని లక్ష్మీనారాయణ, కొమ్మారెడ్డి సత్యనారాయణ, వాసుదేవరావు, కాళేశ్వరరావు, కల్లూరి సుబ్బారావు, డాక్టరు రంగయ్య మొదలగువారు.

ఆంధ్రరాష్ట్ర రైతు వుద్యమం అత్యధికంగా వ్యాప్తిగాంచుటకు ఆచార్యరంగా ఆధ్వర్యాన, నడుపబడు రైతాంగ విద్యాలయము, ఆయనచే స్వల్పఖరీదుతో ప్రకటింపబడిన రైతు భజనావళి అధిక సహాయకారులైనవి. రైతువుద్యమాన్ని సర్వ మార్గాలలో నడిపి బలపరిచిన సూరయనాయుడు, సెట్టిపల్లి కవి స్మరణీయులు.

కాంగ్రెసువాదులు, రైతు సేవకులు 1942 లో జైలుకు పోయినపుడు కమ్యూనిష్టులు రైతు సంఘాల నాక్రమించుకొన్నది సర్వజనవిదితము.ఆంధ్రరాష్ట్ర రైతు సంఘము రిజిష్టరు కాబడినందున నాటినుండి నేటివరకు ఆచార్యరంగా నాయకత్వము క్రిందనే యథాతథముగా పని చేయుచు నేడు గొ౹రెపాటి వెంకటసుబ్బయ్యగారి అధ్యక్షత క్రింద అభివృద్ధి పొందుచున్నది.

రైతాంగము ఇతరులమీద ఆశపెట్టికొని ఇంతవరకు యిక్కట్లకు గురియైనది. ఇక నుండి తమ స్వశక్తిమీదనే ఆధారపడాలి. తమను ఎవరో ఉద్ధరిస్తారని ఉబలాట పడరాదు. "ఉద్ధరేదాత్మనాత్మానాం". తన్నుతానే ఉద్ధరించుకోవాలి. అప్పుడే సంకటాలు, సంకెళ్లు విడిపోతాయి. ఇందుకు సంఘనిర్మాణము అవసరము. కనుక రైతాంగం అంతా రైతుసంఘాలలో చేరాలి.

"చదువుల్ నేర్చెడు నప్డె యాంగ్ల భువిలో సత్కర్మతానిష్ఠచే
బ్రతుకే దుర్భరమంచు నెంచుజనులన్ ప్రాణాలతో నిల్పగా
నెదలో నెప్పుడు చింత చేసి యజమానిం దూరి తత్కార్మికా
పదలన్ మాన్పెను "రంగనాయకులు" ప్రాపయ్యెన్ సదా రైతుకున్.

*కావూరి వెంకటరామయ్య*

## జమీందారి రైతు ఉద్యమం

"భారతదేశ వడ్డీ వ్యాపారస్తులు, భూస్వాములును ఏ సమకాలిక, సాంఘిక, ఆర్థిక పద్ధతిలోను లేనట్టి సర్వభక్షకులు." బ్రైల్సు ఫర్డ్, భారతదేశము కని విని యెరుగని 'ఆబ్సెంటీ ల్యాండులార్డ్సు'అను ఒక వింతజాతిని (జమీందారులను) ఈస్టిండియా ప్రభుత్వం సృష్టించినది. ఆ ప్రభుత్వము మారి బ్రిటీషుప్రభుత్వము వచ్చినా జమీందారీ విధానము యథాతథంగానే యున్నది. ఈ విశ్వామిత్ర సృష్టివల్ల అనేక అనర్థాలు కలుగుచున్నవి. ఈ పద్ధతి ఒక రైతాంగమునే నాశనము చేయుట లేదు. దీనితో భారతజాతి అభివృద్ధి అరికట్టబడినది, నాగరికత నాశనం అవుతుంది.

మానవప్రకృతే మారుచున్నది. దీనిగాలి సోకినంతవరకు మానవులు మహమ్మారి సోకినట్లుగా మలమల మాడిపోవుచున్నారు.

అనుమానముంటే అధికారు లేమంటున్నారో ఆలకించండి. ఈ పరమ ప్రయోజకుల ప్రయోజకత్వమును గురించీ, ప్రయోజనమును గురించీ 1828-35 గవర్నరు జనరలుగనున్న విలియం బెంటిక్ ప్రభువు ఇటుల చెప్పెను. "అనేక విషయాలలో పర్మనెంటు సెటిల్‌మెంటు నిరుపయోగమైనదనే చెప్పవచ్చును. కాని దేశ వ్యాపిత తిరుగుబాటును,అశాంతిని ఆణచుటలో ఇది వుపయోగమైనదనుటలో సందేహంలేదు. ప్రజలమీద పూర్తి పలుకుబడిగల యీ ధనిక జమీందారీ వర్గ ప్రయోజనాలు బ్రిటీషుప్రభుత్వం నిలిచివుంటేనే రక్షింపబడి వుంటవి. అందుచేత యీ జమీందారీ పటాలమంతా ప్రజావిప్లవానికి ప్రతిరోధకంగా వుపయోగపడును. ఇది ఒక్కటే దీని ప్రయోజనము."

*Speeches and Documents on Indian Policy*

*1750-1921, Vol. 1, Page 215.*

ఇట్టి జమీందారీ పద్ధతిని భారతదేశమంతటను వ్యాపింప చేయవలసిందని రమేశ చంద్రదత్తు 1902 లో ఆందోళన చేయగా, అప్పటి రాజప్రతినిధియగు కర్జను ప్రభువు కాదని యిలా వివరించెను. "స్వంతముగా భూములను సాగుచేయని భూస్వాము లొనర్చు అన్యాయము లెరుంగుదుము. జమీందారీ ఉద్యోగులు చేయు దుర్మార్గాలు తెలుసు. రైతు- జమీందారుల మధ్య పెరుగుచున్న వివాదాలు కలవు. మధ్యవర్తుల సంఖ్య పెరిగి భూమిపై వచ్చు ఆదాయమును అన్యాయంగా అపహరించు వారి సంఖ్య హెచ్చుట గమనించుచున్నాము. రైతు రక్షణకై జమీందారి పద్ధతి ఇతర చోట్ల ఏర్పరచుట శ్రేయమని గుండెపై చేతినిడికొని చెప్ప జాలం."

మనదేశమును కొల్లగొట్టుచున్నారని మన కష్టసుఖములను గమనించరని దేశనాయకులచే చెప్పబడుచున్న ప్రభుత్వ ప్రధానోద్యోగులు జమీందారులు చేయు అనర్థకములను గురించి అరమర లేక చెప్పచుండ మన దేశము నుద్ధరించాలని వుబలాటపడు కొందరు నాయకులు, కవులు, పత్రికాధిపతులు, ప్రచురణకర్తలు, ఈ జమీందారులు భాషాపోషకులని, కళోద్ధారకులని, విశ్వదాతలని, వదాన్యులని

సహస్ర విధముల స్తుతించుచు, వారివల్లనే మనము ఆభివృద్ధి పొందుచున్నటుల ప్రకటించుచున్నారు. ఇందేది సత్యం ?

అసలీ జమీందారులు మన ఆంధ్రదేశములో కుతుబ్ షాహి (1600) కాలములో ఏర్పడ్డారు. అప్పటికి వారు యిజారాదారులు. మొగలాయి ప్రభుత్వము నందు భారతదేశ మందంతటను వారి స్థితి అంతే. కంపెనీ కాలములోకూడ వారు యిజారాదారులుగానే యున్నారు కాని భూమియందెట్టి హక్కులేదు. బెంగాలులో 1793లోను, మన మద్రాసు రాష్ట్రములో 1802 లోను వివిధ రాష్ట్రములలో వీలు వెంట పర్మనెంటు సెటిల్ మెంటు చేయబడినది. మరికొన్ని రాష్ట్రాలలో టెంపరరీ సెటిల్‌మెంటు కూడ చేయబడినది.

వీరు పెట్టే బాధలు, ఆక్రమాలు, అన్యాయాలకు అనేక రైతుకుటుంబాలు కూలి పోయాయి. పూర్వకాలంలో కూడ వీరి అన్యాయాలు అరికట్టుటకు అండగా నిలిచిన వారు లేకపోలేదు. వారి పేర్లుకాలగర్భములో కలిసిపోయాయి. 19 శతాబ్దాంతమున చల్లపల్లి ఎస్టేటులో గొర్రెపాటి బాలకృష్ణమ్మ, నూజివీడు ఎస్టేటులో కడియాల చంద్రయ్య మొదలగు రైతు నాయకులు జమీందారి అన్యాయాలు అరికట్టుటకు నడుములు కట్టినట్లే వివిధ జమీందారీలలోను రైతు నాయకులు ప్రయత్నాలు చేశారు. కాని వారికి ఆనాడు సంఘం అంటూ లేదు.

జమీందారీ రైతుల బాధానివృత్తికిని, వారిలో ఐక్యతను, సంఘటనాశక్తిని కలగజేసి, వారి హక్కులను కాపాడుటకు ఆచార్యరంగా, రెబ్బాప్రగడ మందేశ్వరశర్మతో కలసి 1929 ఆగష్టు 14 జమీన్ దారి రైతుసంఘమును స్థాపించెను. దీని అనంతరము వెంకటగిరి, నెల్లూరు, తిరుత్తణి మొదలగు ప్రాంతాలో జమీందారీ రైతుసంఘము లేర్పడి రైతాంగములో రాజకీయ చైతన్యము కలుగజేసినవి. జమీందారి రైతు వుద్యమములో మొదటినుండి పాటుపడినవారిలో పేర్కొనదగినవారు మందేశ్వర శర్మ, వేమవరపు రామదాసు, కటికినేని సోదరులు, వెంకట్రామానాయుడు, విశ్వనాథదాసు, వెంకోట శ్రీరాములు నాయుడు, బాపినీడు, మారిన నరసన్న, గొట్టిపాటి బ్రహ్మయ్య మొదలగు వారున్నారు.

కాని ఆంధ్రరాష్ట్ర జమీందారి రైతు వుద్యమములో ఆచార్యరంగా అనంతరము ఉద్యమ ప్రాణదాతలుగా బేర్కొనదగినవారు శర్మ, నాయుడు. శర్మ ప్రప్రథమమున జమీన్ రైతు సభలు ప్రారంభించినా ఆయన కేక ఆంధ్రదేశము

అంతటా వినబడలేదు. ఆయన పట్టుదల,ఓపిక, తెలివితేటలు కలవాడైనప్పటికీ, ఆంధ్రావని అంతా తిరిగి ప్రచారంచేయు ఆకాంక్ష ఆయనకు లేకపోయెను.

ఆచార్య రంగా నెల్లూరి వెంకటరామానాయుడుని "ఆంధ్రజమీందారీరైతు వుద్యమసారధి" అంటాడు. ఆయనను గురించి యీ వుద్యమ సందర్భములో ఆచార్యుని అభిప్రాయమిది. "*భయమేమి యిక లెండి. రైతుల్లారా*"... **చేయండి రైతురాజ్యస్థాపక కార్యం, మనకాచార్యులు దొరికారంటూ,** "*మాకొద్దీ జమీందార్ల పొందు, ఓ దేవా మా ప్రాణాలపై పొంచి మానాలు హరియించె మాకొద్దీ జమీందార్ల పొందు* "అని పాడినాడు. దాంతోలేచింది యీ నాటి భారతీయ జమీందారి వ్యతిరేక ఉద్యమము. వెంకటగిరిలో నాయుడు గారి మంత్రాక్షతలతో ప్రారంభమైనది. ఎందరో పాటలు, పద్యాలు రచించారు, పాడినారు. మరెందరో ఉపన్యాసాలిచ్చారు, నాయకులయినారు, ఉద్యమం నడిపారు, పెత్తనానికి వచ్చారు. ఆట్టివారిలో నేను ఒక్కడనే కాని అప్పటి మూల కందముగ పల్కుల నిచ్చువారే ముఖ్యులు. అటుల తనపలుకే బ్రహ్మవాక్కుగా ప్రసాదించిన మహనీయుడు, ఆంధ్రకవి శేఖరుల ప్రాణధనము మన రామానాయుడు... సొత్తున కేమి ఆయనకు కోటీశ్వరుల కందరాని సొత్తు సంప్రాప్తమగుచున్నది. నా బోంట్లందరు ఆయన సొత్తే. యావత్తు ఆంధ్ర రైతు వుద్యమము ఆయన సొత్తే! ఆంధ్ర రైతులోకమున జ్యోతి లాగా వెలుగుచు, జమీందారుల పాలిట మృత్యువు లాగా వెలువడుతున్న 'జమీన్ రైతు" వారి సృష్టియే. యువజనులను కార్యవీరులుగా చేయుచున్న పాటలన్ని వారి సంపాదనయే!...అంతటిశక్తి, సత్తా, ధారణ, ధోరణి, పాట, మాట, లేఖిని, లలాటరేఖలు రైతులోకానికి, అయాచితంగా లభ్యమైనందులకు నాలాంటివారి జీవితాలను, సౌరభయుతంగా చేయగలిగినందులకు, మనలను మనమే అభినందించు కొందాం. నాకు సహజంగా నాయుడన్న ప్రేమయే! కాని ఆయన యందున్న రైతు నాయుడమ్మ యెడలనే నాకు మిక్కుటమైన ప్రేమ, మమకారం. ఆయన్ని ఆంధ్రరైతాంగ సేవకులందరు "మా రామానాయుడ" ని సగర్వంగా పిల్చుకొని ఆంధ్రలోకానికి సమర్పించు కొంటున్నారు." (చిత్రగుప్త 15-8-1937)

ఆచార్య రంగాకు పూర్వం అక్కడక్కడ జమీందారీ రైతువుద్యమంలో పనిచేయువారున్నమాట వాస్తవమే. కాని వారి వాక్కు వినపడలేదు లోకానికి, వారి

పరిశ్రమవల్ల ప్రజలకు ప్రబలప్రయోజనము కలుగలేదు. ఆచార్య రంగా అన్ని హంగులుగల మనిషి. ఆయన అన్ని కార్యాలను ప్రవీణుడుగా చేస్తాడు. ఆయన వచ్చిన తరువాత, యీ ఉద్యమానికి ఒక నూతన స్వరూపమిచ్చి చైతన్యం కలుగజేసి దానిని నలుదిశల వ్యాపింపచేశాడు.

అడవుల ఆదాయం, ఇతర రుసుములవల్ల పదికోట్లు పెరుగుచున్నది. 18 కోట్లు ప్రభుత్వమునకిచ్చి దానికి 4 రెట్లు రైతుల నుండి వసూలుచేయుట రైతులను నిండు నిలువున ప్రాణము దీయుటే. ఈ అధికశిస్తుకు వీరుకట్టిన ఆనకట్టలు, ప్రోత్సహించిన నూతన పద్ధతుల వల్ల కావు. నానాటికి రైతులను నాశనము చేస్తూ, అధికంగా వసూలుచేయుట తప్ప అన్యంకాదని ఆచార్య రంగా అంటున్నాడు.

1931 లో ఆచార్యరంగా వెంకటగిరి ఎస్టేటు రైతుల కష్టనష్టాల గురించి ఒక రిపోర్టు తయారుచేసెను. ఆ సంవత్సరం సెప్టెంబరు 8 తారీఖున ఆంధ్రరాష్ట్ర ప్రథమ జమీందారీ రైతుమహాసభకు ఆయన అధ్యక్షత వహించెను. ఆ సభలో ప్రప్రథమంగాజమీందారీ విధానము రద్దు కావాలనే నినాదం ఆయన వెల్లడించాడు. అదే నేడు యావద్భారత దేశమున ప్రతిధ్వనించుచున్నది. వెంకటగిరిలో అటవీ సత్యాగ్రహం ఆయన ఆధ్వర్యానే ఆరంభించి ఆదర్శప్రాయుడయ్యాడు.

27.8.1933 తారీఖున ఏలూరులో జరిగిన ద్వితీయాంధ్రమహాసభకు ఆయన అధ్యక్షత వహించాడు. అందులో ఆంధ్రదేశంలోనిజమీందారీ రైతుల ఆర్థిక విచారణ చేయుటకు ఆయన అధ్యక్షత క్రిందనే ఒక కమిటీ యేర్పాటు చేయబడినది. ఆ సభలోనే కనీస కోర్కెల ప్రణాళిక కూడ ప్రకటింపబడినది.

1933లో యేర్పడిన ఆంధ్రరాష్ణ జమీందారీ రైతు విచారణకమిటీ ఎంతో కష్టభూయిష్టమైనది. ఆ కాలమున జమీందారులు నేటివలే లేరు. వారి దురాగతాలు చెప్పతరం గాకుండా వుండేవి. ఆట్టి తరుణములో తన ప్రాణాన్ని ఒడ్డి, ప్రజా శ్రేయం కొరకై వివిధప్రాంతాలలో రైతుల ఆర్థిక స్థితులు, వివిధ ఎస్టేటులలో జరిగే అన్యాయాలు, అక్రమాలు విచారణ చేసి ప్రకటించెను. ఆ రిపోర్టు నాగరిక ప్రపంచం లోనికి ప్రాకినది. ఇందువల్ల ప్రభుత్వమువారికి, ప్రజానాయకులకు, జమీందారీ రైతుల అగచాట్లపై ఆదరణ కలిగినది.

"రైతును రక్షించు" ఆనే శీర్షికతో జమీందారీ విధానమువలన రైతులోకము పడేబాధలు కన్నులకు కట్టినట్లు చిత్రిస్తూ, ఎట్టి పరిహారము లేక జమీందారీ విధానం

రద్దుచేయవలెనని వివిధ ఆంగ్ల, ఆంధ్రపత్రికలకు వ్యాసావళి రాసి జమీందారీ విధానము రద్దుకావాలనే నేటి మనస్తత్వాన్ని ఆయన కలుగజేసెను.

ఈ జమీందారీ విధానం వల్ల రైతులు యిద్దరు యజమానుల నిరంకుశత్వానికి బలియగుచున్నారు. కనుక ఈ విధానం రద్దు అయ్యేవరకు ఆందోళన ఆపరాదు. ప్రపంచం అంతటా ఈ అనాగరికపద్ధతి అడుగంటినది. ఫ్రాన్సు, పోలెండు, జెకో స్లెవేకియా మొదలగు దేశములలో విప్లవములు వచ్చి ప్రభుత్వమునకు ఆండగావున్న యీ జమీందారీ విధానమును తుడిచిపెట్టినవి. ఐర్లెండులో స్వాతంత్ర్యము వచ్చిన వెంటనే శాసనము ద్వారా ఆంగ్లేయ భూస్వాములకు అల్ప ప్రతిఫలము యిచ్చి జమీందారీ విధానమును అంతరింపజేసి అంతవరకు పాలేరులుగా వున్న రైతులకు ఆ భూమి పంచిపెట్టినది. రష్యాలో ఎట్టి పరిహారం లేకయే జమీందారీ విధానం రద్దాయెను.

ప్రపంచమంతట యిటుల ఈ విధానము నాశనమగుచుండ ఎంత కాలము మన దేశములో మనగలదు? మన రైతులవత్తిడివలన లోగడ కాంగ్రెసు మంత్రిమండలి జమీందారీ విచారణ కమిటీ ప్రకాశం అధ్యక్షతన ఏర్పడి శ్రమ శ్రద్ధలతో విచారణ సల్పి, సమగ్రమైన రిపోర్టు వెలువరించుట సర్వజనవిదితమే. కారణాంతరములవల్ల కాంగ్రెసు మంత్రిమండలి రాజీనామా యిచ్చినందున, ఆ కార్యకలాపము జరగలేదు. బెంగాలులో కూడ 1938 లో ఫౌడ్ అధ్యక్షతన జమీందారీ విచారణకమిటీ ఏర్పడి యీ విధానము రూపుమాపాలని ప్రకటించినది.

బానిసపద్ధతి కంటే ఈ విధానము బహునీచమైనదని గ్రహించాలి. వ్యవసాయం విరివిగా సాగుచేయుటకు ధనికమానవుడు తన సోదరమానవుని, ఆ పనిచేసే ప్రాణము ఉన్న పనిముట్టుగా వాడుకొనుటయే బానిస వ్యాపారము. నౌకర్లు, దున్నేపొలాలు వారివి కావు. వారు పండించు పంటలపై వారికెట్టి హక్కు భుక్తములు లేవు. కష్టమంతయు నౌకరులది, కష్టఫలితానికి హక్కుదారు యజమాని.

జమీందారీ విధానము అంతకంటే అధ్వాన్నముగ వున్నది, అదివరకు రైతు హక్కుభుక్తములో వున్న భూమంతా ప్రభుత్వము జమీందారుల వశం చేసినది. ఆ జమీందారులు రైతులకు అమరకమునకు యిచ్చుచున్నారు. ఇటుల చేయుట,

రైతులు పాటు పడి పండించిన పంట. గాదెలు నింపుటకు కాదు. మార్కెట్టులకు తోలుటకే. పడ్డ శ్రమంతయు జమీందారులకు ధారాదత్తము చేయబడుచున్నది. యజమాని బానిసననుకొని పనిచేయుచుండగా జమీందారు బానిసనుకొనకుండా రైతునే బానిసగా చేసి వైచెను.

ఆచార్యరంగా జమీందారి విధానం రద్దు కావాలన్న నినాదం కాంగ్రెసు ఎన్నికల ప్రణాళికలో చేర్చబడి, వర్కింగుకమిటి భారతదేశంలో దీన్ని నామరూపాలు లేకుండా చెయ్యాలని ఢిల్లీలో చేసిన తీర్మానం చూచైన, కాంగ్రెసు జమీందారుల ప్రాపకాలకై పెనుగులాడుతున్న దుష్ప్రచారం మానాలి. ఇక జమీందారి రైతులు గుండెలపై చెయ్యి వేసుకొని హాయిగా నిద్రపోవచ్చును.

## రీ సెటిల్ మెంట్ ఆందోళన

"భూమిని దున్ని యితరుల ప్రాణములను పోషించునట్టి సాధనములను కల్పించువారిని, తిండి లేకుండ మాడ్చి చంపివేయునట్టి చావు కళను, ఇప్పటి రాజకీయవేత్తలు తమ అద్భుత రాజనీతిలో కనిపెట్టిరి." – రూసో

ప్రాచీనకాలమునుండి మనదేశములో భూమిశిస్తు కలదు. మనుస్మృతివల్ల, పండిన పంటలో ఆరోవంతు మాత్రమే శిస్తురూపేణా వసూలు చేయబడెడిదని తెలియుచున్నది. మహమ్మదీయుల కాలంలో మూడవవంతు వసూలు చేయబడెడిది అని విదితమగుచున్నది.

ఈ బ్రిటీషుప్రభుత్వం వచ్చిన తరువాత, నికరాదాయంలో సగం ప్రభుత్వానికి ఇవ్వవలెనని నిర్ణయింపబడినది. అదివరకు గ్రామ వారీగాను, ధాన్య రూపేణా వున్న పద్ధతి పోయి, రైతు వారీగాను, రొఖ్ఖరూపంగాను, ఏర్పడిన శిస్తు విధానము రైతు నాశనానికి కారణమైనది.

ఈ రైతు వారి నిర్ణయమును ఎదిరిస్తూ రెవిన్యూబోర్డు వారు తమ మెమోరాండములో వ్రాసిన సంగతి గమనిస్తే వేరే వ్యాఖ్యానము చేయనక్కర లేదు.

"అభివృద్ధికరమనుకొనే యీ నూతన విధానాన్ని, అనుసరించడంలో మనము ప్రాచీన సామాజిక సంబంధాలను, సాంప్రదాయములను నాశనం చేస్తున్నాం. హైందవ గ్రామీణ స్వరూపాలను, వ్యవస్థను, కూలగొట్టి, చిరకాలాను గతంగా గ్రామమంతకు చెందుతున్న భూములన్నీ ముక్కలు చెక్కలుగా, వేరువేరు రైతులకు పంచుతూ, పన్నును ఒక్కొక్కని భూమిపై నిర్ణయిస్తున్నామను

కుంటున్నాము. కాని యదార్థములో మనము యిచ్చవచ్చిన హెచ్చు మొత్తాన్నే పన్నుగా విధిస్తూ మనకు ముందు ప్రభుత్వముచేసిన ముసల్మానులకు వలెనే రైతులను నిర్బంధముగా వాళ్ళ వృత్తికి బంధించి వుంచుతున్నాము. అధికంగా నిర్ణయింపబడిన పన్నుకు భయపడి పారిపోయిన రైతులను తెచ్చి బలవంతంగా నాగేటికి కట్టి దున్నించి, పంట పండే వరకు పన్నునిలిపి పంచి, పండినదాన్నంతా పన్ను క్రింద లాగేసి, రైతుకు నాగలి. ఎడ్లు, విత్తనాలు మాత్రము మిగులుస్తూ, అబ్బే! తరచుగా యివి కూడా లేకుండా చేసి, హరించి,మళ్లీ యీ దౌర్భాగ్యవృత్తి పోకుండా విత్తులను కూడ మనమే యిచ్చి వ్యవసాయం చేయిస్తున్నాము. ఈ వృత్తి రైతుల కోసం కాదు. తమకోసమే ముసల్మాను ప్రభుత్వం చేయించేది. దానికి మనము తీసిపోము.(1818 జనవరి 5 మద్రాసు రెవిన్యూబోర్డు మినిట్సు)మద్రాసు రాష్ట్రంలో రైతు వారీ సెటిల్ మెంటు సంస్థాపకుడగు మన్రో1813 లో పార్లమెంటు యెదుట సాక్ష్యమిస్తూ" రేట్లు శాశ్వతంగా నుండు విషయములో బెంగాలు జమీందారీ సెటిల్ మెంటుకును, ఈ రైతువారి సెటిల్ మెంటుకును, తేడా ఏమియు లేదు. కాని రైతువారి పద్ధతిలో బంజరుభూమి సాగు క్రిందకు వచ్చినప్పుడెల్లా గవర్నమెంటు రెవిన్యూ హెచ్చుచుండును." మన్రో గారి మాట నీళ్ళల్లో మూట ఆయింది. తరువాత ప్రతి ముప్పై సంవత్సరములకు సెటిల్ మెంటు చేయు సిద్ధాంతము అమలులోనికి వచ్చినది. ఈ సిద్ధాంతమువల్ల నికరాదాయాన్ని తేల్చునదెట్లు? ఆదాయాన్ని గుణించే దెట్లు? ఇది రైతు కష్టనష్టాల కారణానికి నిలయమగుచున్నది. రమేశ చంద్రదత్తు 1902 లో ఈ నికరాదాయపు లెక్కకు ఒక సూత్రమంటూ లేదని తెల్పగా, ఆ వాదనను కాదనలేక కర్జనుప్రభువు అలాంటి లోపము సవరించుటకై, అనుభవజ్ఞులు, బాధ్యులు, రైతుల మంచినే కోరు సివిలు సర్వీసు వుద్యోగులపై ఆధారపడుచుంటిమన్నాడు.

ఈ సెటిల్ మెంటునకు తల, తోక లేదని చెప్పచూ 1875 లో ఇండియా మంత్రి సర్. లూయీ మేలట్ యిలా వ్రాసెను. "ఇంత డబ్బు ఖర్చుపెట్టి తలయు, తోకయు లేని మిక్కిలి చిక్కైన ఈ అప్రయోజనపు సెటిల్ మెంటు అంతయు నెందుకు? ఇదియంతయు తీసిపారవేసి మనకు దొరకినచోట్లనెల్ల మనకెంత కావలిస్తే అంత తీసికొంటే పోతుందిగా? నికరపుపంటలో సగంవంతు సర్కారు శిస్తుగా తీసికొనవలెననుమాట కేవలము కాగితముమీదనే యున్నదిగాని, క్రియలో

నేమియులేదు. నిజమునకు సర్కారు నియమించిన రేట్లు చాలాచోట్ల నికరపు పంటను యావత్తు మ్రింగివేయుటయేకాక, రైతు అసలు పెట్టుబడిలో కూడ కొంత మింగెనని నాకు అనుమానంగా యున్నది."

ఉభయగోదావరి, కృష్ణాజిల్లాల రీసెటిల్ మెంటుకై మద్రాసు గవర్నమెంటు "హోల్ట్సువర్తు" అను ఉద్యోగిని నియమించెను. ఆయన అదివరకున్న రేటుమీద రూపాయకు మూడు అణాలు పెంచవలసిందని సిఫార్సు చేసెను. ధరలు తగ్గినవనియు, ఈ సెటిల్ మెంటు అన్యాయ మనియు, ప్రజలస్థితి గతులు సెటిల్ మెంటు ఆఫీసరు సరిగా గ్రహించ లేదని చెప్పుతూ, ఆంధ్రకేసరి, సర్దార్ దండు నారాయణరాజుల ఆధ్వర్యాన ఆందోళన సాగింది. శాసనసభలో కూడ నారాయణరాజు, కాళేశ్వరరావు ప్రభృతులు ఆందోళన ఆరంభించారు. అందుపై ఆ రిపోర్టులోని అంశములను విచారించుటకు, శాసనసభ్యులతో కూడిన ఒక కమిటీని ఆరోగ్యస్వామి మొదలియారు అధ్యక్షతన 1928 న నవంబరు 29 తారీఖున ప్రభుత్వము వారు నియమించారు. ఆ కమిటీకి అర్థశాస్త్రములో అందెవేసిన చెయ్యని అధిక ఖ్యాతి గాంచిన రంగాగారిని ఆ కమిటీవారు 400 రూపాయలు వేతనము, 325 రూపాయలు బేటాతో కోరారు. ఆయన అంగీకరించి, జాస్తి రామకోటయ్యను అసిస్టెంటు సెక్రటరీగాను, మరి 35 గురు వుద్యోగులను ఏర్పాటు చేసికొని ఈ మూడు జిల్లాలలోను మూల మూల ప్రదేశాలు తిరిగి 103 గ్రామాల్లో ఆర్థిక విచారణచేసి, రైతు ఎలా అప్పుల ముప్పులలో మున్కలు వేయు చున్నాడో తెలియచేశాడు. ఆయన పరిశోధన పూర్వకంగా నె 1కి నూటికి 12 రూపాయల వడ్డీతో యకరం 1కి 100 రూపాయలు అప్పు వున్నదన్నాడు. ఆ కమిటీ సభ్యులు కూడ మూడు జిల్లాలు తిరిగి విచారణచేసి రిపోర్టు ప్రకటించారు. ఇంతవరకు భారతదేశమున యింత పరిశ్రమ చేసి, యింత న్యాయసమ్మతముగను, శాస్త్ర సమ్మతముగ, వ్యవసాయపు లెక్కలు వేయు పద్ధతి మరొకచోట లేదంటే అతిశయోక్తి ఏమిలేదు. ఆ రిపోర్టు, ఆ ప్రెసిడెంటు అనుభవ పరిజ్ఞానము, సెక్రటరీ శాస్త్రీయ దృక్పథము, ప్రతిభ, శక్తిసామర్థ్యాలు అనుభవము వెల్లడించును. వేయేల? అది మన రైతాంగపు ఆర్థికస్థితిగతులు తెలుపు ప్రమాణ గ్రంథము .

ఆ కమిటీవారు ఇదివరకు వున్నదే హెచ్చుగానున్నదనియు, ఇంకను అదనంగా వేయుట అనుచితమనియు, వెనుకటి రేటునే తగ్గించుట అవసరమనియు సిఫార్సు చేసిరి.

ప్రభుత్వమువారు ప్రజాప్రతినిధులు పరిశ్రమచేసి ప్రకటించిన రిపోర్టును పెడచెవినిబెట్టి తమ అధికారి చెప్పినచొప్పన అదనముగా శిస్తు విధిస్తూ 1931 ఆఖరున ఉత్తరువులు జారీచేసిరి. అప్పటికి ధరలు తగ్గుటచేతను, బార్డోలి రైతుల రీసెటిల్ మెంటు ఆందోళన ఫలించుటచేతను, కాంగ్రెసు ప్రముఖులు, రైతు సంఘములవారు తిరిగి ఆందోళన చేయ సంకల్పించిరి. బాపినీడు, మందేశ్వర శర్మ, నారాయణరాజుల ఆధ్వర్యాన పక్షము రోజులలో ప్రచారకులను తయారు చేయుటకు ఒక పాఠశాల నెలకొల్పబడి శిక్షణ యివ్వబడినది, ఆ ప్రచారకులు, సత్యన్నారాయణమూర్తి, బాపినీడు, బలరామకృష్ణయ్య, బ్రహ్మయ్య, శ్రీపతి, మధుసూధనరావు, వెన్నేటి సత్యనారాయణ ప్రభృతులు ఆచార్యరంగా ఆధ్వర్యాన తీవ్రఆందోళన చేసిరి. 1931 నవంబరు 1 సెటిల్ మెంటు వ్యతిరేక దినముగా ఏర్పాటుచేసిరి. ఆంధ్రదేశములో అన్నిచోట్ల సభలు జరిపి అధిక అదనపు పన్నులకు అసమ్మతి చూపిరి. ఆచార్యరంగా ఈ సందర్భములో అనేక ఫిర్కా, తాలూకా, జిల్లాసభలు జరిపించి, కరపత్రాలు ప్రకటించి, యీ వుద్యమాన్ని యింకా తీవ్ర తరము చేశాడు. పన్నునివారణకై వీరంతా ఆందోళన చేయుచున్నారని ఆచార్య రంగా, తిరుమలరావు, బాపినీడు. మొదలగు తొమ్మిదిమందిని నిర్బంధించింది ప్రభుత్వం. ఇంతలో శాసనోల్లంఘన వచ్చుటచే ఈ ఆందోళన ఆ ఆందోళన లో అంతర్లీనమైంది. ఈ ఆందోళన ఫలితంగా రైతుసంఘాలు గ్రామగ్రామాన నెలకొల్ప బడి బలపడుటే గాక అధిక శిస్తులు కూడ ఆపివేయబడెను. 1928-29 బార్డోలి ఆర్థిక విచారణ సంఘం, 1929-30 ఉభయ గోదావరి కృష్ణాజిల్లాల ఆర్థిక విచారణకమిటీ, గవర్నమెంటువారి సెటిల్ మెంటు విధానము లోని అవకతవకలు, అక్రమాలు ప్రపంచానికి ప్రకటించినవి.

"పండిన పంటంత శిస్తు కమ్మేసి,
పంట ఖర్చుల ఋణము రక్తమును పిండగ,
ఘన దరిద్రము తోడ కడుపు పగిలిపోతుండ,
నిలువ నీడన్నదే లేదోయి

రణరంగమున దుముక రావోయి"

1930 లో ప్రభుత్వము భారత భావిరాజ్యాంగాన్ని నిర్ణయించడానికి, ప్రథమ రౌండుటేబిల్ సభ లండనులో జరుపబూనింది. ఆనాడు కాంగ్రెసు శాసనోల్లంఘన ఉద్యమము జరుగుచుండుటచే, దానిని బహిష్కరించి, పేరు ప్రతిష్ఠలు లేని వ్యక్తులను, సంఘాలను ఓడ నెక్కించింది బ్రిటీషు గవర్నమెంటు. కాంగ్రెసు, జాతీయ వాదులెవ్వరిని ఆహ్వానం అంగీకరించ వద్దని ఆజ్ఞాపించింది. విభీషణులంతా సీమకు పోయి, పీఠము వేసుకొని కూర్చున్నారు. 1930 నవంబరు 12 వ తారీఖున మొదటి రౌండు టేబిల్ సభ ఆరంభం అయినది.

ఆచార్యరంగా 1930 సం.మున సెంట్రల్ (ఢిల్లీ) అసెంబ్లీ ఎన్నికలలో ఓడి పోయినా, మరల ఉద్యోగంలో ప్రవేశించక లండనుపోయి, కాంగ్రెసుపై ప్రభుత్వము కావించే దుష్ప్రచారమును ఎదుర్కొని, జాతీయ మహాసభ కోర్కెలను బ్రిటీషు ప్రజలకు ఎరుకపరచాలని సంకల్పించి, లండను సమయానికి చేరుకున్నాడు. అచ్చటికి చేరిన వెంటనే ఇంగ్లండు, వేల్సు, అంతటా ప్రభుత్వ దృక్పధాన్ని ఖండించి, భారతస్వాతంత్ర్య సంరంభాన్ని విశదీకరించి, హిందూ దేశమునకు వెంటనే సంపూర్ణస్వాతంత్ర్యము యివ్వాలని తీవ్రప్రచారము చేశాడు. ఆయన ఆ విధముగ అహర్నిశలు ఇండిపెండెంటు లేబరు పార్టీ, ఫ్రెండ్సు సొసైటీ మొదలగు భారతదేశ హితైషి సంఘాల ఆధ్వర్యాన ఆనేక ఉపన్యాసములు ఇచ్చాడు. (1945) విజయలక్ష్మీపండిట్ అమెరికాలో అపరిమితమైన ఆందోళన చేసినట్లే ఆయన ఆనాడు ఆంగ్లదేశంలో చేశాడు.

కాంగ్రెసు సందేశము అటుల తెలుపుటేకాక, అక్కడి ఆంగ్లపత్రికలను, మన దేశములోని బొంబాయి క్రానికల్, ఆంధ్రపత్రికలను వ్యాసపరంపరలతో నింపెడివాడు. ఈ విధంగా తీవ్ర ఆందోళన చేసి స్వదేశమునకు వచ్చి "జైలుకు వెళ్ళని లోటు పూర్తిచేసి పవిత్రమైన కాంగ్రెసులో చేరుటకు అర్హతను సంపాదించు కొని అనంతరము కాంగ్రెసులో చేరి తినని" ఆయన అన్నవాక్యం అక్షరాలా సత్యమే.

## రైతురక్షణ సంఘం

ట్రేడ్ యూనియన్ కార్మికుల ఆర్థిక ప్రయోజనాలకై యేర్పడెను. అలాగే గుంటూరు సీమ రైతు సంఘం 1935. మద్రాసు రాష్ట్ర వ్యవసాయదారుల సంఘం 1942, రైతుల ఆర్థిక లాభాలకొరకే ఏర్పడినవి. ఎకనామిజం వాటి పరమప్రాప్యం.

రాజకీయాలతో రవ్వంతైనా సంబంధము లేక, రాజభక్తి కలిగి రైతుల లాభాల కొరకు పాటుపడుటే వాటి పరమార్థం. ఆమెరికా లోని రైతుసంఘాలు ఆర్థిక లాభాలకే ఆరంభింపబడ్డాయి.

కాని ఆచార్యునిచే ఆరంభింపబడిన రైతు ఉద్యమం, అంతకంటే అధిక విశాలమైనది. రైతులనేకాక, కవులుదారులను, వ్యవసాయకూలీలను కూడ రక్షించుటకు పనిచేయుచు, సత్వర కర్షక, కార్మిక, రాజ్యస్థాపనకు అనుకూలం అగునట్లు కర్షక, కార్మిక సమ్మేళన సూత్రములను బాధ్యతలను అనుసరించి మహత్తర కార్యసాధనకై ఏర్పడినది.

ఆంధ్రరాష్ట్రీయ రైతుసంఘములో వివిధ రాజకీయ పార్టీలవారుసభ్యులుగా నుండుటయేకాక అది మితవాదపంథాన వున్నది ఆనాడు. 1931 లో జస్టిసు పార్టీవారి అనుయాయులు, మరొకమారు రాష్ట్ర రైతు సంఘాన్ని ఆక్రమించు కోవాలని తీవ్ర ప్రయత్నము చేశారు. రామదాసు పంతులుగారి సహాయముతో ఆఖరుకు జయము కూడా పొందారు. ఆ సంవత్సరము రామదాసు పంతులుగారే అధ్యక్షులు అయ్యారు.

ఈ విధంగా జరుగునని ఊహించే విప్లవభావాలు కలిగి రైతు ఉద్యమాన్ని సామ్రాజ్యవాద వ్యతిరేకదృక్పథంతోను కాంగ్రెసుకు అనుకూలంగాను, వర్గ సిద్ధాంతాల పైన నడపుటకు కంకణము కట్టుకొన్న రైతు వర్కర్లతో 1931 లో ఆచార్యరంగా రైతు రక్షణ సంఘమును స్థాపించాడు.

ఈ సంఘము ద్వారా అనేక కరపత్రాలు, పుస్తకాలు, ప్రకటించి, సభలు, సమావేశాలు జరిపి రైతులలో తీవ్రభావాలు కలుగజేసి ఆంధ్రరాష్ట్ర రైతు వుద్యమము భారత దేశ రైతు వుద్యమాన్ని నిర్మించేటట్లుగా చేశారు.

1931 మార్చిలో ప్రథమ రైతురక్షణ వారము జరిపి రైతుల కోర్కెలను తెలిపారు. 1933 నవంబరు 1 వ తేది మొదలు ఆంధ్రదేశమంతటా రైతురక్షణ వారము జరిపి రైతుల కష్టనివారణకు యీసంఘముచే ప్రకటింపబడిన 12 తీర్మానాలు, ప్రతి గ్రామములోను సభ జరిపి ఆమోదించుటకును, ఆయా పంచాయితీలు, తాలూకా జిల్లాబోర్డులు కూడా, ఆంగీకరించి ఆయా జిల్లాకలెక్టర్లకు ఆంధ్రపత్రికకు రైతురక్షణ సంఘానికి పంపవలసినదిగా అధిక ప్రచారము చేశారు. అదేవిధముగా 1934 మొదటివారము 1935 జనవరి రెండవ వారము యీ

మాదిరిగా ఎన్నో రైతురక్షణ వారాలు జరిపారు. 1933 ఫిబ్రవరి12వ తారీఖున రైతు రక్షణయాత్ర రైతురక్షణ సంఘం క్రింద జరపాలని సంకల్పింపబడినది. భారత దేశములో ప్రప్రథమమున రైతురక్షణయాత్ర ఆంధ్రదేశములోనే ఆరంభమాయెను. 1933సం. మార్చిలో ప్రథమ యాత్ర సాగింది. రెండవయాత్ర ఆ సంవత్సరమే నవంబరు 22వ తేదిని దిగ్విజయముగా జరిగింది. గుంటూరు జిల్లాలో భారతీదేవి, గోగినేని లక్ష్మీనారాయణ, వెంకటప్పయ్యల ఆధ్వర్యాన, కృష్ణాజిల్లాలో ఆచార్యరంగా, కానూరు వెంకటాచలపతయ్య, గొట్టిపాటి బ్రహ్మయ్యల పెత్తనాన, గోదావరి జిల్లాలో మోచర్ల రామచంద్రరావు, న్యాపతి సుబ్బారావుల వంటి వృద్దనాయకుల ఆధిపత్యాన సాగింపబడినది. ఆంధ్రదేశమంతటా ఈమారు యిలాగే వివిధ నాయకుల ఆధ్వర్యాన యీ రైతురక్షణయాత్ర సవ్యముగా సాగింపబడినది.

1933లో యీ సంఘము రైతుభజనావళిని ప్రకటించి రైతు వుద్యమాన్ని జానపదులలో వ్యాపింప జేసింది.

భారతదేశాని కంతటకు ప్రప్రథమమున ఆచార్యరంగా ఆధ్వర్యాన యీ సంఘ పక్షముననే రైతు విద్యాలయము నెలకొల్పబడి రైతుయువకులకు, రైతు వుద్యమము ప్రచారము చేయుటకు నేటికి 1000 మందికి పైగా శిక్షణ యివ్వబడినది. రైతు రక్షణ సేవా దళాలు బయలుదేరతీసి, రైతు వుద్యమాన్ని మూల మూలలకు వ్యాపింపజేసినది. దీని ఆధ్వర్యానే ఇలా రైతు వుద్యమాన్ని విప్లవయుతముగా వ్యాప్తినొందింపచేసి ఆంధ్రరాష్ట్ర రైతు సంఘాన్ని ఆక్రమించుకున్నది రైతురక్షణసంఘం.

మహాత్ముడు కాంగ్రెసు వెనుక వుండి ఎలా నడుపుతూ వున్నాడో అలాగే ఆచార్య రంగా ఈ ఉద్యమాన్ని వెనుక నుండి నడుపుతూ వున్నాడు. ఈ సంఘమునకు అధ్యక్ష కార్యదర్శులుగా నుండి పాటుపడిన వారు పెక్కురున్నారు. గొట్టిపాటి బ్రహ్మయ్య, నూకల వీరరాఘవయ్య, వల్లభరావు, మొదలగువారు కార్యదర్శులుగా వుండి కార్యకలాపాలన్నీ సాగించారు. గౌతు లచ్చన్న *(గౌతు లచ్చన్న – రంగా గారి అనుంగు అనుచరుడు. 1954 లో వీరు మంత్రిగా ఉండి వీరి ఓటుతోనే ప్రకాశంగారి మంత్రివర్గం పడిపోయింది. రంగా గారు స్వతంత్ర పార్టీనుండి తిరిగి కాంగ్రెస్ లో చేరగా వీరు విభేదించి వేరొక పార్టీలో చేరారు.)* ఓబులు రెడ్డి అధ్యక్షులుగా వుండి దీనికై అధికకృషి చేశారు.దీనికి జిల్లా

సంఘాలంటూ లేవు. ఆంధ్రదేశానికి అంతటికి ఒకటే సంఘము. ఇది ఆంధ్రరాష్ట్ర రైతు సంఘమునకు మార్గగామిగా వుండి, ప్రత్యేకముగా రైతు యువకులకు ఉత్సాహము ఉద్రేకము, త్యాగము, కార్యతత్పరత కల్గించుటకు తోడ్పడినది. కాంగ్రెసులో, కాంగ్రెసు సోషలిస్టుపార్టీ ఎటుల విప్లవయుతమై కాంగ్రెసు ముందడుగు వేయుటకు పురికొల్పెనో, అటులనే రైతు రక్షణ సంఘము, ఆంధ్రరాష్ట్ర రైతు సంఘాన్ని విప్లవయుత మొనర్చినది. దీని ఆరంభముతో, రైతు ఉద్యమములో ఒక నూతన శకము ఆరంభమైనది. జమీందారీ రైతు సంఘము వలెనే, ఈ రైతు రక్షణసంఘము ఆంధ్రరాష్ట్ర రైతు సంఘానికి అనుబంధ సంస్థగా పనిచేయుచున్నది నేడు.

"ఆన్యాయకాలంబు, దాపురించిందిపుడు."
అందరము మేలుకోవాలండి !
మాన్యాలు, భోగాలు మనుజులందరి కబ్బ
మార్గాలు వెతకాలి రారండి !!

దక్షిణ భారత కర్షక కార్మిక(వ్యవసాయకూలీ) సమ్మేళనము

ఆచార్యరంగా రైతు వుద్యమము సాగించుటకుగాను, ఆంధ్రరాష్ట్ర రైతుసంఘము, జమీందారీ రైతుసంఘము, రైతురక్షణ సంఘము స్థాపించిన సంగతి పాఠకులకు సువిదితము. వాటి ప్రయోజనాలు కూడా ఎరిగే వున్నారు. ఈ సంఘాలన్నీ ఆంధ్రరాష్ట్రానికి సంబంధించినవే. మనమున్నది మద్రాసు రాష్ట్రములో. ఇందులో వివిధ భాషాప్రయుక్త రాష్ట్రరైతుసంఘాలు వున్నవి. ప్రభుత్వముపై వత్తిడి తెచ్చుటకు వీటి అన్నింటికి సమైక్యత కల్గుటకు రైతులకు కూలీలకు సంఘర్షణ కలగకుండా సామరస్యము కల్గుటకు ఒక సంఘము వుండుట అవసరమని ఆచార్యరంగా తలచాడు. తత్ఫలితమే దక్షిణభారత కర్షక కార్మిక సమ్మేళనము. 1935 సం. ఏప్రియల్ 28 వ తారీకున ఈ సమ్మేళనము ఏర్పాటు ఆయినది. దీనికి విశ్వదాత కాశీనాథుని నాగేశ్వరరావు ప్రెశిడెంటు, ఆచార్యరంగా కార్యదర్శి.

దీని ఆశయాలు : – కర్షక కార్మిక (వ్యవసాయకూలీ) ఆర్థిక రాజకీయ అభివృద్ధికై పాటుపడుట. పంటలు అధికముగా పండించుటేగాక బంజరు భూములన్నీ సాగులోనికి తెచ్చుట. ప్రభుత్వమునకు రైతునకు మధ్యనున్న జమీందారులు, ఈనాందారులు మొదలగు దళారులందరిని తొలగించుటకు కృషి చేయుట.

వ్యవసాయక ఋణాన్ని, రైతుల శిస్తు భారాన్ని తగ్గించుట. కుటీర పరిశ్రమలను పోషించుట. కార్మిక కర్షకాభివృద్ధికై ఎన్నికలలో కాంగ్రెసుకు తోడ్పడుట వంటివి. ఈ సంఘము కనీసపు కొర్కెలను 1935లో ప్రకటించింది. (Modern Indian peasant part3 page 66)

1935 అక్టోబరులో ఆ ప్రణాళిక కాంగ్రెసు అధ్యక్షులగు రాజేంద్రప్రసాదు నకు సమర్పించినది. 1935 డిశంబరులో రాష్ట్రమంతట దీని ఆధ్వర్యాన రైతు రక్షణ యాత్ర సాగింపబడెను.

1935 సెప్టెంబరు 1 న ప్రథమ అఖిలభారత రైతు రక్షణ దినోత్సవం జరుపబడెను.

1936 సెప్టెంబరులో ఈనాముబిల్లు రైతురక్షణకై శాసనసభలో ప్రవేశ పెట్టబడినపుడు రైతులకు ఆధిక లాభము జరుగుటకు శాసనసభ సభ్యులతో ఆందోళన చేసెను. 1936 అక్టోబర్ 6 కార్మిక, కర్షక సమ్మేళన ప్రణాళిక కాంగ్రెసు అధ్యక్షుడు జవహార్‌లాల్ నెహ్రూ సమర్పించి కాంగ్రెసుచే ఆమోదింపచేయ యత్నించింది.

ఇటుల ఆందోళన చేయుటే కాక మద్రాసులోని వివిధ భాషా ప్రయుక్త రాష్ట్ర రైతు సంఘములు ఒక సమ్మేళన క్రింద వచ్చుటచే ప్రభుత్వ దృష్టికి అధికంగా ఆకర్షింపబడినది. దీని కనీసపు కోర్కెలను అనుసరించే ఆఖిల భారత రైతు సంఘ కనీసపు కోర్కెల ప్రణాళిక ఏర్పడినది. ఈ ప్రణాళికలో, కూలీలకు కనీసభృతి, న్యాయమైన ధరలు, ఋణ నివారణ, జమీందారీవిధానము రద్దు, క్రమానుగతమైన పన్నులు, మొదలగునవి కలవు. అవి ఆనాడు ఎంతో తీవ్రముగ తలపబడినవి. అవి నేటికి కాంగ్రెసు తన ఎన్నికల ప్రణాళికలో అంగీకరించినది. ఆచార్యుని కృషి ఆందోళన 10 సంవత్సరాలకి ఫలించినదన్నమాట. నాడు తీవ్రమని ఆక్షేపింపబడిన కార్యములే నేడు భావ్యములని సత్వరాచరణీయమని కాంగ్రెసు ఆమోదించినది. నవ్విన నాపచేనే పండుతుందని సామెత సార్థకమైనది.

"బీదల సాదల జీవనము,
కర్షకావళి కరుణజీవనము.
కార్మికసంఘాల కష్టజీవనము,
తనచేతి కుంచెలో దనరారునట్లు,

కటిక గుండెలనైన కరిగించునట్లు,
రచియించు చిత్రకారులు కావాలి.
రాణించు చిత్రకారులు కావాలి.
భావిభారత దేశ భాగ్యోదయమునకు
కావాలి ; కావాలి : కావాలి నేడు." – భరద్వాజ

## రైతు కూలీ సామరస్యం

రైతులు, కూలీలు ఒకే వర్గములోని వారు. ఉభయులు వ్యవసాయం చేసి జీవించేవారే. రైతు భూముండి వ్యవసాయం చేస్తే, కూలి భూమి లేక వ్యవసాయం చేస్తాడు. ఉభయులు భూదేవి బిడ్డలే. రైతు కూలీతో వ్యవసాయం చేసేవాడేగాని, జమీందారువలె ఇతరుల శ్రమ వల్ల జీవించేవాడు కాడు. మిల్లు యజమాని కార్మికుల కష్టములవల్ల లాభాలు పొందునట్లు రైతు పొందుటలేదు. ఈ యిరువురు ఒకే వర్గానికి చెందిన రెండు బృందాల వారు.

వ్యవసాయం గిట్టబాటుకాని కారణముచేత కొంతకాలానికి రైతులు అప్పులపాలై కాలక్రమేణా పెరిగి భూముల కోల్పోయి కూలీలు అగుచున్నారు. అసలు పూర్వం యింత మంది కూలీలు వుండే వారేకాదు. పాలేర్లు అధికం. పాలు + ఏరు = పాలేరు. పాలు = పాలుకి ఏరు = వ్యవసాయము చేసేవాడు. నాటి పాలేరు భాగస్వామికాని జీతగాడు కాడు. ఒకనాటి రైతులు నేడు కూలీలగుచున్నారు. వివిధకారణాలవల్ల, ఆవేవంటేబ్రిటీష్ సామ్రాజ్య ఆర్థిక విధానము, జమీందారీ పద్ధతి, అప్పులబాధ, చేతిపరిశ్రమలు నశించుట జనసంఖ్య వృద్ధిఅగుట మొదలగునవి. సామ్రాజ్య ప్రభుత్వం పెట్టుబడిదారీ విధాన వ్యాప్తికి ఆవకాశం యివ్వనందున వేరే సాధనోపాయాలు లేక వీరంతా వ్యవసాయ కూలీలుగానే ఉండిపోతున్నారు.

1921 లో 2 కోట్ల 20 లక్షలు కూలీలు వుంటే, 1931 లో 3 కోట్ల 5 లక్షలు అయ్యారు. పది సంవత్సరాలలో 1 కోటి 18 లక్షలు రైతుకూలీలు అయ్యారు. ఈ క్రమముగా నేటికి దినదినము కూలీల సంఖ్య అధికంగా పెరుగుతూనే వుంది. డెల్టా ప్రాంతములో మరింత.

రైతులు, కూలీలు రెండు వర్గాలవారని కొంతమంది పొరపడి పోరాటం సాగించాలని ప్రయత్నించారు. ఇది త్వరలో తెలుసుకొన్నారు పొరపాటని. మెట్ట

ప్రాంతాలలో రైతుకూలి ఆందోళన పుట్టడానికే వీలు లేదు. అసలు అక్కడ కూలీలతో పని తక్కువ.

రైతులు, కూలీలు, ఒకే ఆర్థికవిధానమువల్ల బాధపడుతున్నారు. తమ కళ్ళ ముందు నేటి రైతులు కూలీలుగా మారుతున్నారు, ఉభయులను దోచుకొనే దోపిడీ దార్లను తెలియక ఒకరి నొకరు వ్యతిరేకులుగా భావించుకొనుట ఉభయులకు నష్టప్రదమైనది. కాన ఒకే ఆర్థిక విధానమునకు గురియైన ఇరువురు సామరస్యంతో మెలిగిన నాడే ఉభయుల బాధలు తొలగుతాయి. ఈ రహస్యం ఎంత త్వరలో గ్రహించిన అంత త్వరగా అభివృద్ధిపొందుతారు.

ఉభయులు సామ్రాజ్యమువల్ల, జమీందార్లవల్ల వడ్డీవ్యాపారులవల్ల దోచుకోబడుతున్నారు. ఉభయుల కష్టనష్టాలు మిశ్రమములు, కూలీలను రైతుదోచుకుంటున్నారని కొంతమంది వారిని రెచ్చగొడుతున్నారు. రైతులు, చాకళ్ళు మంగళ్ళు, పనిచేసినందుకు ప్రతిఫలము ఇస్తున్నట్లుగానే కూలీలకు ఇస్తున్నారు. అందులో దోపిడి వుంటే యిందులోను దోపిడి వుంది. రైతాంగం స్వంత పనిలేని, రోజులలో, గ్రామాలలోను, పట్టణాలలోను కూలి చేసుక బ్రతుకుతున్నట్లే వ్యవసాయ కూలీలు, రైతులకు అవసరమైన సమయాల్లో కూలిచేస్తున్నారు ఇందులో దోపిడి యేమి లేదు.

రైతులు, కూలీలు పరస్పర విరుద్ధమైన వర్గాలుకావు. ఒకే రైతు వర్గము కొన్ని కారణాలవల్ల రెండు బృందాలైనవని ఆచార్య రంగా అభిప్రాయం. కనుక ఈ రెండు బృందాలు తమలో తమకు కలిగే భేదాలు సామరస్య పద్ధతులపై తొలగించుకొంటూ ఒకే వర్గముగా వర్గచైతన్యము ఐకమత్యము పొంది చేయాలని ఆయన సంకల్పం. 1933లోనే రైతు సంఘ సభ్యులందరు రైతుకూలీ సామరస్యానికై కృషిచేసెదమని ప్రతిజ్ఞ చేయాలన్నాడు. ఆ సిద్ధాంతాల ననుసరించే 1935 దక్షిణదేశ కార్మిక, కర్షక సమ్మేళన స్థాపించెను.

రైతు కూలీ సామరస్యం కూలీలను కష్టనష్టాలకు గురిచేసే పద్ధతి కాదు. ఎలానంటే ఆయన ఆదిలోనే ధాన్యాలకు కనీస ధరలు, కూలీలకు కనీసపు జీత భత్యాలు, ఆ పరస్పరంగా ఆధారపడి యుండాలనే సిద్ధాంతాన్ని ప్రకటించాడు. ఆనాటి ప్రకటన నేటికి కాంగ్రెసు అంగీకరించి, ఎన్నిక ప్రణాళికలో చేర్చిన సంగతి యెల్లరెరిగినదే.

1923లో వ్యవసాయకూలి సభ జరిపి వ్యవసాయకూలీలకు బంజరుభూములు సంపాదించాలనే సంకల్పముతో ఆచార్య రంగా సంఘములను స్థాపించాలని సంకల్పించాడు. 1925 లో కులసభలయందుండే మోజుతో పారిశ్రామికులు ఆయన మాట అంగీకరించనటులనే వ్యవసాయకూలీలు ఆయన మాట అంగీకరించలేదు. ఉన్నవ లక్ష్మీనారాయణ ( శారదానికేతన్ – గుంటూరు స్థాపకులు. మాలపల్లి నవలా రచయిత.) మొదలగు పెద్దలు ప్రస్తుతము రైతు సంఘాలు స్థాపించి పనిచేస్తే బాగా వుంటుందని చెప్పారు. ఆ కారణాలచేత ఆయన అప్పట్లో ఆ కార్యం విరమించినా వారి బాగోగులు ఆయన గమనిస్తూనే వున్నాడు. 1926 లో రాయలు కమీషను యెదుట కూలీల రక్షణకు జరగవలసిన పనులు ప్రకటించాడు,

1923-30 మధ్యకాలం కృషి ఫలితంగా 1931 లో "దక్షిణ భారత కార్మికులు" అనే పుస్తకం ప్రకటించి కిసాన్ మజుదూరుపార్టీ ఆవశ్యకతను ప్రకటించాడు. రైతుకూలీలు పార్లమెంటరీ కార్యక్రమాన్ని విప్లవ కార్యక్రమాన్ని గూడ తమ కోర్కెలు సాధించుకోవటానికి అవలంబించాలని హెచ్చరించాడు.

1933-35 మధ్య వ్యవసాయకూలీల కనీస కోర్కెల ప్రణాళిక తయారుచేసి ఆ ప్రణాళిక అంగీకరించి వాటి సాధనకై కృషి చేయాలని హరిజన సంఘాలతో సహకారము చేశాడు.

1933-35 మధ్య చాలామంది హరిజన నాయకులకు కూడ ఈ కనీస కోర్కెల ప్రణాళిక అందజేయబడ్డది.

1935 లో దక్షిణభారత కార్మిక, కర్షక సమ్మేళన నెలకొల్పి, రైతుకూలీలు తమ న్యాయమైన కనీసపు కోర్కెలు ఒకరినొకరు అర్థము చేసికొనుటకును, కలసి మెలసి పని చేయుటకు వీలైనంత వరకు అంగీకృత కార్యక్రమము ఏర్పాటు చేయ ప్రయత్నాలు జరిపాడు. దానిని కాంగ్రెసు ప్రభుత్వాలకు కాంగ్రెసు లేబరు కమిటీలకు 1937 లో ఆందచేశారు. 1938 లో ఆంధ్రరాష్ట్ర రైతుసంఘము ఆ ప్రణాళికను అంగీకరించింది.తరువాత వ్యవసాయ కూలీలతో సమ్మెలు అనంతరము అది సరైన పద్ధతి కాదని గ్రహించిన కమ్యూనిష్టులతో నిండియుండిన కాంగ్రెసు సోషలిస్టు పార్టీ అంగీకరించింది.

వ్యవసాయకూలీల వేతనాలు పనిచేయు కాలము మొదలగు కార్యాలు సమ్మెల ద్వారా కాక సామరస్యం ద్వారానే ఏర్పాటు చేసికోవాలని విప్పి చెప్పనక్కరలేదు.

ఆచార్య రంగా రైతుకూలీ సామరస్యానికై సలహాలు ఇచ్చుటే కాక, ఆయన తన చేతిక్రింద పనిచేయువారి నెట్లు ఆదరించునో కనుగొనిన కడు ఆశ్చర్యమేస్తుంది. అన్నిటి కంటె తేలిక ఇతరులకు సలహా చెప్పుట. అన్నిటికంటే కష్టం తాను ఆచరించటం. ఆచార్య రంగా చెప్పినట్లు చేసేవాడేకాక , చేసెడిదే చెప్పెడివాడని ఈ క్రింది సంగతుల వల్ల మనకు విదితం కాగలదు.

ఆయన తాత, తండ్రుల నుండి గొఱ్ఱెలమంద కాచిన గొల్లవీరన్నను, తమపని మానుకొని వెళ్లిన అనంతరము, వారన్నదమ్ములు ముగ్గురు, భారతీ రంగా, ఆయన వున్న ప్రదేశానికి వెళ్లి ఆయన క్షేమమారసి నూతనవస్త్రము లిచ్చి వచ్చారంటే వేరే వ్యాఖ్యానమెందుకు

చిత్రగుప్తలో 15-6-1935 వీరుడైన మా వీరన్న- అనే శీర్షికతో వ్రాసిన వ్యాసమునుండి కొన్ని వాక్యాలు వుదహరించి, వారి హృదయపు ప్రేమను పాఠక ప్రపంచానికి పంచుతూ.

"చిక్కినాడు, ముసలితనం పైన పడుతున్నది. మా తమ్ముడు తెచ్చిన ధోవతి, వుత్తరీయం, మా బలవంతంమీద పైన వేసుకొని తన్ను పెళ్ళికొడుకును చేశాడు. ఈ చిన్నపిల్లలని సిగ్గుపడుతున్న, మా వీరన్న వీరుడే నిజంగా 80 ఏండ్లకు పైగా మా నిడుబ్రోలులో మావొక్క కుటుంబములోనే జీతము చేశాడు.

"ఈ బీదవాళ్ళు యీ దొరగారి పాలేళ్లు, యిన్నాళ్ళనుండి మాకు సామాన్యులుగా కనపడ్డారండి, ఎంత అదృష్టవంతులండి, ఎందరికో దొరకని మీరు, వీళ్ళ ప్రేమపాశాల్లో బంధింపబడ్డారే" అన్నారు పెద పవని నాయుడుగా రొకరు.

"వీరన్నని కలుసుకోవడం, అరుదుగా కలిసి ప్రయాణము చేసే మా ముగ్గురన్నదమ్ముల అదృష్టం కాదండి" అన్నాడు. ఆ నాయుడు గారితో ఆచార్యరంగా, అట్టిది ఆచార్యరంగా ఆదరణ, అభిమానము, ప్రేమ.

"భూమి గలదంచు రైతులు పొంగలేదు
కూలి కలదంచు పనివాడు కులుక లేదు

ఒండొరులు పొందు ఫలమది యొకటె తుదకు
జీవముల కాకటి చిచ్చుబాధ."(యడ్లపల్లి దానయ్యచౌదరి)
"రైతుకూలీ లేకమైతే కూటికే కరువేమిరా
కూలిరైతులలోన బలమీ కాలమందున నుండెరా
కూలిరైతులమైన మనకు కులములెందుకు తెలుపరా
రైతుకూలీలై న మనము కలసియుందము సోదరా
అన్నా-రైతులేకము కావలెరా
అన్నా-కూలీలేకము కావలెరా ," *లోకనాథం.*

## కాంగ్రెసులో రైతు సేవ

ఆచార్యరంగా 1923లో కాంగ్రెసులో చేరాడు. ఆ సంవత్సరమే అఖిలభారత కాంగ్రెసు సంఘ సభ్యుడుగా కూడా అయ్యాడు. 1926లో కాంగ్రెసు ఆర్థిక ప్రణాళిక తృప్తికరముగా లేదని రాజీనామా యిచ్చాడు. కాని ఏ పార్టీలోను చేరలేదు. తిరిగి ఆయన 1931 లో కాంగ్రెసులో చేరాడు. నాటినుండి నేటివరకు అఖిలభారత కాంగ్రెసు సభ్యుడుగాసేవచేయుచున్నాడు. నేడు ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడు కూడా అయ్యాడు.

1931 సెప్టెంబరులో బొంబాయిలోని అఖిలభారత కాంగ్రెసు సంఘములో పండిత జహ్వారలాలుతో కలిసి పౌరసత్వహక్కులను విశాలపరచుటకు ప్రయత్నించాడు. (అవి కరాచి కాంగ్రెసులో తీర్మానింపబడినవి.)

1933 నుండి రైతాంగము తమ వర్గసంస్థలు పెట్టుకొనుటకు కాంగ్రెసు ఆంగీకరించగలందులకు రైతుక్షేమరక్షణకు అనుగుణ్యముగా కాంగ్రెసు ఆర్థిక విధానము మార్చగలందులకు ఆయన అధిక కృషి చేయసాగాడు. ఫైజుపూరు కాంగ్రెసు వ్యావసాయక ప్రణాళికలో, మారుటోరియం చేర్చునట్లు ప్రయత్నించాడు. తదుపరి కాంగ్రెసు మంత్రి వర్గాలు యీ మారుటోరియం పెట్టి తరువాత వ్యవసాయ ఋణ పరిష్కారముగా మార్చారు. దీనివల్ల రైతాంగానికి కొంత సాయం చేకూరింది.

కాంగ్రెసులో కొందరి పెద్దలకు రైతుసంఘస్థాపన యిష్టం లేదు. నూటికి 80 మంది వున్న రైతాంగానికి కాంగ్రెసు సంస్థ వుపయోగపడక పోతే ఎవరికి వుపయోగపడుతుందని వారి వాదన. కాంగ్రెసు రైతు సంస్థ అని వారి విశ్వాసము. యం.యన్. రాయ్. కూడా రైతు సంఘ నిర్మాణానికి వ్యతిరేకే. కాని యీ వాదనలో

పసలేదు. కాంగ్రెసు అఖిల భారత జాతీయ సంస్థ. అందు వివిధ వర్గాలు వుండవచ్చు. భారతీయుల సర్వతోముఖాభివృద్ధికై పాటుపడు సంస్థ అయినను అది ముఖ్యముగా రాజకీయసంస్థ. దాని ప్రధానోద్దేశ్యం రాజకీయ స్వాతంత్ర్య సముపార్జనము. రైతుసంస్థ వర్గసంస్థ, దీని ప్రయోజనము ఆర్థికము. అందులోని సభ్యులు అధిక సంఖ్యాకులు రైతులైనంతమాత్రాన అది రైతు సంస్థ కాజాలదు. అటులైనచో కాంగ్రెసులో అధిక సంఖ్యాకులు హిందువులుగాన అది హిందూసంస్థ అనుటకు అవకాశము వున్నది. కాని కాంగ్రెసు ఎప్పటికి అటుల కాజాలదు. ఇంతేకాదు. యీ బ్రిటిషు ప్రభుత్వోద్యోగులు నూటికి 90 మంది భారతీయులు అయినంత మాత్రాన యీ ప్రభుత్వం జాతీయ ప్రభుత్వ మనవచ్చునా? కాదని అందరకు తెలుసును. అలాగే కాంగ్రెసు రైతుసంస్థ కాజాలదు, ఒక సంస్థ ఆశయాలు వుద్దేశ్యాలను బట్టి ఆసంస్థను పోల్చుకోవాలిగాని సంఖ్యాగణమునుబట్టి కాదు.

దీనినే జహ్వరలాలు నెహ్రూ యిట్ల వివరించాడు. "కాంగ్రెసు ముఖ్యముగా రాజకీయ సంస్థ" తరగతి విచక్షణ లేక భారతజాతియొక్క స్వాతంత్రం కోరేది. కార్మిక, కర్షకుల సంస్థలు ప్రత్యేకముగా కార్మికులకో, కర్షకులకో, ఏర్పడేవి. ఆయా ప్రత్యేక తరగతుల అభివృద్ధినే కోరును. కాంగ్రెసు ఆదర్శం రాజకీయం. కార్మిక, కర్షకసంఘాల ఆశయం ఆర్థికం. కాంగ్రెసు జాతీయ సంస్థ. అది సర్వకాలములందు ప్రత్యేకంగా కార్మికులయొక్కగాని, కర్షకులయొక్క గాని దృక్పథం చూపజాలదు. ఆది ట్రేడుయూనియన్ వలె గాని, కిసానుసభ వలె గాని పనిచేయజాలదు.

"*ప్రజామిత్ర* 11-7-1937"

భారతదేశములో కార్మిక, కర్షక సంఘాలు నిర్మాణం చేయుట అవసరమని పంజాబు కేసరి లాలాలజపతిరాయి(రంగా గారి రాజకీయ పాఠశాలలకు స్ఫూర్తి ప్రదాత) గాంధిమహాత్మునకు 1920 ప్రాంతముననే తెలియజేసెను. మహాత్ముడు గాని, తదితరులు గాని వాటియొక్క ఆవశ్యకత ఆనాడు గ్రహించలేదు.

## అఖిల భారత కిసాన్ సభ



ఆచార్యరంగా ఆంధ్రావనిలోను, దక్షిణదేశములోను రైతుసంఘ నిర్మాణముతో తృప్తిపడలేదు. ఇచట రైతు సంఘాలు బలపడిన తరువాత ఆయనలో అనుభవము అధికమైన పిమ్మట,

భారత దేశమంతటకు ఒక రైతుసంఘం నిర్మాణము చేయ సంకల్పించెను. 1935 లో అఖిల భారత కర్షక సభా నిర్మాణావశ్యతను గూర్చి పత్రికలలో వ్యాసములు వ్రాసెను.

1931 లో ఆల్ ఇండియా కిసాన్ కాన్ఫరెన్సు కరాచిలో జరిగింది. కాని, మద్రాసు రాజధాని రైతు సంఘాలవారు, సింధు, పంజాబు జమీందారీ రైతులే హాజ రయ్యారు. భారతదేశమందలి రైతు ప్రతినిధులందు రాకపోవుటచే కేంద్రసంఘమేది యేర్పడ లేదు. 1935కు పూర్వమే, వివిధ ప్రాంతాలలో రైతు సంఘాలు ఏర్పడి పనిచేయు చున్నవి. ఆంధ్ర రాష్ట్రములో ఆచార్యరంగా వలెనే యు. పి. లో మోహన్ లాల్ గౌతమ, ఆచార్య నరేంద్ర దేవులు, బీహారులో సహజానంద సరస్వతి, యదునందన శర్మలు, బెంగాలులో బంకిం ముఖర్జీ, ఒరిస్సాలో నవకృష్ణచౌదరి, మాలతీదేవి, గుజరాతులో ఇందులాల్ యాజ్ఞిక్, పంజాబులో సంతోష సింగు, కరమ్ సింగు (కీర్తికిసాన్ సంఘాలు) ఇలా ఆయారాష్ట్రాలలో రైతు వుద్యమ వ్యాప్తికి కృషి చేస్తూ వచ్చారు. కాని ఆచార్య రంగాకు మినహా తదితరులకు అఖిలభారత కిసాన్ సభా నిర్మాణ ఆలోచన కలుగలేదు.

ఆచార్యరంగా ప్రచారము వలన 1935అక్టోబరు 17 తారీఖున అఖిలభారత రైతు సేవకుల సభ మద్రాసులో ఆయన అధ్యక్షత క్రింద జరిగినది. శ్రీమతి కమలాదేవి ( శ్రీమతి కమలాదేవి చటోపాధ్యాయ) యీ సభను ఆరంభంచేసింది. ఈ సభకు బెంగాలు, ఒరిస్సా, ఆంధ్ర, కర్నాటక, మహారాష్ట్ర, మలబారు మొదలగు రాష్ట్రాలనుంచి అధికంగా వచ్చారు. కాని అప్పటికే బలయుతంగా యున్న బీహారు రైతు సేవకులు దీనిలో పాల్గొనక పోవుటయేకాక. స్థానిక సంఘాలు యింకా అభివృద్ధి చెందలేదుకాన, కేంద్ర సంఘము అప్పడే అవసరము లేదని తెలియజేశారు. అయినప్పటికి యీ సభలో ఒక ఆర్గనైజింగుకమిటీ యేర్పడినది. దీనికి అధ్యక్షుడు ఆచార్యరంగాయే. దీనివల్ల యితర ప్రాంతాల రైతు సంఘాల ప్రముఖులతో పరిచయము పొందుట, లేని ప్రాంతాల్లో రైతు సంఘాలు స్థాపించుటకు యత్నాలు జరిగినవి. ఈ సభా విజయమునకు తోడ్పడిన ప్రముఖులలో నేటి కేంద్ర శాసన సభా సభ్యుడగు న్యాపతి నారాయణమూర్తిగారు పేర్కొనదగినవాడు.

ఆచార్యరంగా ఒరిస్సా, బెంగాలు, పంజాబు, సంయుక్త రాష్ట్రాలలో సంచారము చేసి అఖిల భారత రైతుసంఘావశ్యకతను తెలియ జేశాడు. ఆ సమయములోనే ఇందూలాల్ యాజ్ఞిక్కు ఇంగ్లండు నుండి వచ్చెను. ఆయన కూడా అఖిలభారత రైతు సభా ఆవశ్యకతను గూర్చి పత్రికలలో ప్రచారము చేశాడు.

మోహన్ లాల్ గౌతమ, సాయముతో 1935 డిశంబరు 15 తారీఖున మీరట్ లో రైతు ప్రతినిధుల సభ జరిపి, అఖిలభారత రైతు సభావశ్యకతను తెలియజేశాడు. ఆల్ ఇండియా కిసాన్ కాంగ్రెసు లక్నోలో 1936 ఏప్రియల్ లో జరుపుటకు ఆ సభలో నిర్ణయింపబడినది. ఆచార్య రంగా, జయప్రకాశ్, గౌతములను ఆర్గనైజింగు కమిటీగా ఏర్పాటు ఆప్పడే చేయబడినది.

ఆ విధముగానే ఏప్రియల్ 11 తారీఖున సహజానంద సరస్వతి అధ్యక్షత క్రింద ప్రథమ కిసాను కాంగ్రెసు జరిగింది. ఆందులో అఖిల భారత కిసాను సంఘం కూడ ఏర్పాటు చేయబడినది. ఆచార్యరంగా, మోహన్ లాల్ గౌతమ, సహజానంద సరస్వతులు జాయింటు సెక్రటరీలుగా ఎంపిక చేయబడ్డారు, ఇందులాల్ యాజ్ఞిక్ మొదలగు వారు అఖిలభారత కిసాను కాంగ్రెసు నిర్మాణములో ఆచార్య రంగాకు సాయపడ్డవారిలో ముఖ్యులు.

## అధ్యక్షోపన్యాసము

26-12-1936 ఫెయిజపూరులో ద్వితీయ కిసాను కాంగ్రెసు జరిగినది. ఆ సభకు వివిధ ప్రముఖుల నామములు సూచింపబడెను. ఆచార్యుడే అధికసంఖ్యాకులచే ఎన్నుకోబడెను. ప్రథమ యెన్నిక అధ్యక్షస్థాన మలంకరించు గౌరవము ఆచార్యునకే దక్కినది. అధ్యక్షపీఠము నుండి ఆచార్యుడు చేసిన ఉద్బోధము చిరస్మరణీయము. అందుండి కొన్ని భాగాలు.

*"పవిత్రమైన ఈ మహారాష్ట్రదేశములో అఖిలభారత కర్షక ద్వితీయ మహాసభకు అగ్రాసనాధిపత్యం వహించడంవల్ల నా జన్మమున కొక్క ప్రధానమగు ప్రాముఖ్యత కలిగినదని నానమ్మకం. మనము ముమ్ముందు యెదుర్కొనవలసిన కష్టాలనుగూర్చి నేను యోచించునప్పుడెల్ల ఈ మహారాష్ట్ర కర్షక మహాగణమంతా పూర్వ మొకప్పుడు రాష్ట్రప్రభుత్వముతో పోరాడి డక్కన్ అగ్రికల్చరిస్టు ఆక్టును సాధించి ,సంపాదించు కొన్న వీరచరిత్ర జ్ఞాపకము వస్తుంది. నేడు మహారాష్ట్రదేశము ఈ చరిత్రతో తుల్యమైన గణ్యతను*

*రైతుయాత్రా ప్రారంభం వల్ల సంపాదించినందుకు దానిని అభినందిస్తున్నాను. ఇటువంటి యాత్రల వల్ల అఖిలభారత మహాసభకు జనసామాన్య సమూహంతో ప్రత్యక్ష సంపర్కం, దానివల్ల క్రొత్తబలం అధికారం కలిగినవి. ఇట్టి దీర్ఘ యాత్రలతో పల్లెటూళ్ళ వాళ్లందరికీ ఒక క్రొత్త ఉలుకు, ఉత్సాహం, కార్యాసక్తి దీక్ష సంఘనిర్మాణాసక్తి కలుగుచున్నవి.*

*ఇప్పటికి ఒక సంవత్సరం ఆరుమాసముల క్రిందట అఖిల భారత కర్షక సంస్థ యొకటి ఉండవలెనని మనలో కొందర మనుకొంటిమి. కాని నేడది స్థిరస్వరూపము దాల్చడమే కాకుండా, మనదేశంలో, మనదేశపు రాజకీయాలలో అగ్రస్థానం కూడా వహిస్తుదంటే మనము చాలా గర్వించాలి. నిజమైన రాజకీయ దృకృధము కలవాళ్ళందరూ, అఖిలభారత జాతీయ మహాసభ తరువాత మనదేశపు రాజకీయ సంస్థలలో లెక్కింప దగినసంస్థ మనమహాసభయేయని భావించుచున్నారు. ఈ విధంగా మన కర్షకోద్యమానికే ఒక అపూర్వమైన తేజస్సు వచ్చింది".*

జమీందారీపద్ధతి రైతులనుండి సాలీనా 5 కోట్ల రూపాయల పన్నును దిగమ్రింగుచున్నది. ఈ పద్ధతిలో చేవయూలేదు, భారమా అధికము, క్రౌర్యమా అసహ్యము. పన్నుల చిక్కులా దుర్భరము. కొన్ని లక్షలు నీతిలేని నిర్వ్యాపార జమీందారు లీసొమ్ముతో పులియుచున్నారు. ఈ జమీందారుల యొక్కయు. వీరి తాబేదారుల బాధలు మన రైతులు భరించలేకున్నారు. మన రైతులలో మూడోవంతు ఇట్టి పీడలు పడుచున్నారు. కనుక వానిని తప్పించుటకైనను మనమీ పద్ధతిని నిర్మూలనము చేయవలెను. మన జనసామాన్యమును ఈ దోపిడిబాధ లేకుండా రక్షిద్దామను సంకల్పము మనకే మాత్రమైనా ఉండేలాగుంటే, వారి కనీసకోర్కెలలో దేనినైనా తీర్చవలెనను తలంపు వుంటే మనము తొలి మెట్టుగా భావించి జమీందారీ పద్ధతి కుద్వాసనము చెప్పవలెను. మన జాతీయ ద్రవ్య ఆదాయములను ప్రైవేటు పెట్టుబడిదారులగు పారిశ్రామికుల చేతులలో మన ప్రభుత్వమువారు ఉంచుచు వచ్చిరి. ఇట్టి నీతి రైతుజనాలకు మహాప్రతికూలమైనది. దీనివలన యెవరో కొంచెము మంది వ్యక్తులు మాత్రమే బాగుపడిరి. వ్యవసాయదారులు రెండు విధములుగా చెడిపోయిరి. ముడి పదార్థములు పండించినందువల్ల వారే నష్టపోయిరి. తయారైన వస్తువులను కొనుక్కొనికూడా వారే చెడిపోయిరి. ఇక

ముందు పరిశ్రమాభివృద్ధి యెల్లయును, ప్రభుత్వమువారిచే స్వయముగ జరుపబడవలెను. అయితే చిన్నచిన్న పరిశ్రమలను అవి బాగా పెద్దవయ్యేదాక, ప్రైవేటు వ్యక్తులే ప్రభుత్వ అధికారం క్రింద చేసిన యెడల నష్టం లేదు.

కర్షక కార్మికులిరువురు కలసి తమ పరస్పర లాభముకొరకు చేసుకోవలసిన పనులనేకముఉన్నవి. ముందు ముందు వారు సాధించుకోవలసినది నిరుద్యోగాన్ని తొలగించి రెక్కలాడించుకొనుట, వీరువురును కలసి నిరంతరముగా పనిచేసినప్పడే వీరి ఆశయము ఫలించును. కనుక కర్షకులెల్లరును పనివారిని తమ సంఘములలో చేర్చుకొని, వారిని ఉన్నతస్థితికి తెచ్చి, వారి హృదయముల నాకర్షించి వారికి వలయు సహాయము నెల్ల ఒనరింతురని ఆశించుచున్నాను.

రైతులలోని కొన్ని దురాచారములను తెలిపి వానినుండి వారిని మరలింప బూననేని నాకర్తవ్యమును నేను నెరవేర్చినట్లు కాదు. అంతఃకలహములు. అన్నదమ్ముల పోట్లాటలు, కోర్టుదండుగలు, రక్తపాతములు ఇవన్నియు మన రైతులను పీడించుచున్నవి. బాల్యవివాహములు, ఘోషా పద్దతి, నిర్బంధ వైధవ్యమూ, పడుపు వృత్తులు, అంతులేని సంతానము, అధిక జనాభా ఈ మొదలగు దురాచారముల వల్ల మన రైతులు సాంఘికముగా, ఆర్థికముగా కూడా అడుగు పట్టిపోయినారు. పాత మతాచారములకు దాస్యము, నిర్జీవ దేవాలయ మసీదులలోను, నిరుత్సాహ పురోహిత వర్గములలోను విశ్వాసము పాపకరమయిన అస్పృశ్యతలో నమ్మకము, పై జాతులు తరగతులు దైవ సృష్టితములను తలంపు మనల నెప్పుడును మరీ మరీ క్రిందికి త్రొక్కుచున్నవి. మన ఈ క్షుద్ర విశ్వాసములు నాధారము చేసుకొని, ఇతరులు మనలను దోచుకొనుచున్నారు. ఈ దురాచారముల నెల్ల రూపుమాపుమని నేను రైతుల నెల్లరిని ప్రార్థించుచున్నాను.

## మహాత్మాగాంధి స్వయం సహాయము

మహాత్మాగాంధీకి నేను మీ యెదుట నా విధేయతా ప్రణామమునాచరింప గోరుచున్నాను. ఈ శతాబ్దమున కెల్ల ఆయనే ప్రథమ కర్షక రాజకీయ వాది. అనేక రైతుసమస్యలలో మనమాయనతో ఏకీభవింపని మాట నిజమే. ఇంతమాత్రమున మనమాయనను మనసోదరుడుగా భావించక విడువలేము. ప్రభుత్వము మీదగాని, ఆఖరునకు కాంగ్రెసు మీదగాని ఆధారపడక, స్వయం సహాయపరులము కావలెనని ఆయన మనకు బోధించి నేర్పినాడు.



Mahadev Desai, Mahatma Gandhi and Ranga
మహాదేవ్ దేశాయ్, మహాత్మాగాంధీ గారితో రంగాజీ.

ఆయన ఖద్దరు, గ్రామోద్ధరణ సంఘము, మలేరియా ప్రతిఘటన ప్రయత్నము సర్వమును ఆయనకు రైతు యందుగల ఆసక్తిని మనకు ఋజువుపరచును. ఇదివరకు కర్షకులనుగూర్చి మాటలాడిన మన నాయకులందరూ, తమ నగరానుభవములు, పాశ్చాత్య నగరానుభవములు ఆ నగర పరిభాషలో మాటలాడినవారే. జాతీయ సేవకులను, కాంగ్రెసును కూడా ఈ నగరముల నుండి గ్రామములకు నడిపించినది ఈమహాత్మాగాంధీ. ఆయన గ్రామమును తన వాసస్థలముగా మార్చు కొనినందున రైతుసోదరుల కందరకును ఒకే నూతన ఉదాహరణమును చూపుచున్నాడు. గ్రామములో నివసించుటకు, గ్రామ జీవనము సౌఖ్య వంతముగ చేయుటకు, గ్రామ బాధలను తగ్గించుటకు ఆయన వలె ప్రజలకొరకై బాధపడుటకు త్యాగము చేయుటకు, ఆయన వలె తీవ్రమైన ఆలోచనలు చేసి ఘోరమైన సాహసములోనికి దిగుటకు, ఆయనకు ప్రేమపాత్రులైన రైతులలో స్వేచ్ఛాభావములు రేకెత్తించుటకు మనము ఆయననే ఉదాహరణముగా తీసికొనవలెను.

మహాత్మాగాంధి ఈ మధ్యనే గుజరాతు దేశపు రచయితలు, పాత్రికేయులకును, కవులకును ఒక అమూల్యమైన సలహా యిచ్చినాడు. వారెల్లరును రైతులమధ్య జీవించి, వారి భావములలోనికి ప్రవేశించి, వారి వాంఛలు, ఆశయములను గుర్తించి, వారి జీవితములను గూర్చియు, వారి స్థితిగతులను గూర్చియు, వారి సజీవమైన పరిభాషలో వ్యాసములు వ్రాసి కీర్తనలు పాడుచుండుమనియు సలహా యిచ్చినాడు. మన గ్రామము లకు కొత్తసృష్టిని మనము ప్రసాదించవలెను. మనలోని విద్యాధికులును బుద్ధిమంతులును మాత్రమే ఇట్టి కృత్యముల నొనరించగలరు. మన సేవకులు, గాయకులు, కవులు వ్రాయసకాండ్రు వారి కలములనెత్తి దివ్యమైన భారములను లిఖించి పాడి మనకు నూతనోత్తేజమును కలిగించి కార్యశూరులను వీరులునుగా నొనరింపవలెనని విన్నవించు చున్నాను. వారు మనకీ రీతిని సేవ చేసినచో వారికి హిందూ దేశములో మహాత్మాగాంధీతో సమానమైన, ఆంధ్రరాష్ట్రములో ఉన్నవ లక్ష్మీనారాయణ గారితో సమానమైన, రష్యాదేశములో టాల్‌స్టాయి, గోర్కీలతో సమానమైన ఉన్నతస్థానము లభించునని నేను నమ్మగలను.

నేను కర్షక పుత్రుడను. నా నాళములో కర్షక రక్తము పొంగి పొరలాడు చున్నది. అనేక తరముల కర్షక కుటుంబముల రక్తము, సాహిత్యము, పరాక్రమము, భూమాతృదేవతా విధేయత, నాలో మూర్తీభవించి యున్నవి. నేను మీలో ఒక్కడనై రాణించుచున్నందుకు వచింపరాని ఆనందమందు తేలుచున్నాను. ఈసంగతులన్నియు ఉత్తేజకరమైన ఈ కిసాను కాంగ్రెసులో మీ సమక్షమున చాటుటకు నేను గర్వించు చున్నాను. మనము అనతికాలములో ప్రభుత్వమును వశీకరణము చేసికొనుటకై సమావేశము కాగలము. కర్షక కార్మిక రాజ్యస్థాపనము చేయగలము. ఆ రాజ్యము ద్వారా జనసామాన్య క్షేమమును మనము వృద్ధిపరచగలము. అట్టి దినము అతివేగముగ భరత ఖండమున నుదయమగుగాక. "ఊరకుంటావేల ఓ రైతురాజా ఎలుగెత్తి నీ గోడు నెరిగింపలేవా".

## అడవుల సంరక్షణలో ఆచార్యుని అఖండ కృషి

బ్రిటీషువారు రాకపూర్వము, అడవులన్ని ప్రజల హక్కుభుక్తములోనే వుండెను. వారు వచ్చిన తర్వాతనే అనేక శాసనాలుచేసి ప్రజల హక్కులు నష్టపరుచుటే కాక, వ్యవసాయమునకు తీరని నష్టమును కలుగజేసిరి. ఈ శాసనాలవల్ల కలిగిన ఆందోళన, అందరికి తెలియనే తెలియదు. భూమిశిస్తు ఉప్పు పన్నువలె భరింపరాని బాధలుగా ఉన్నట్లు భావింతురేకాని యీ శాసనాలు రైతుల ఉనికికి భంగము కలిగించెను. 1891 సం. లో ఒక కలం గీటుతో భారతీయ సాంఘిక జీవితంలో వచ్చిన మార్పు యెరిగినవారు యెందరున్నారు?"ఒక కలంగీటుతో ప్రభుత్వంవారు రైతులకు అనాదిసిద్ధంగా వస్తున్న సమిష్టి హక్కులను నిర్మూలన చేయగలిగారు, అప్పటినుండియే గ్రామస్థుల సాంఘిక జీవనంలో అపూర్వ పరివర్తనం కలిగినది.

బ్రిటీష్ ప్రభుత్వంపైన రైతులకు విరోధం కలుగుటకు ఈ చట్టాలు తక్కిన అన్నిటికంటె ఎక్కువ బాగా వుపయోగపడ్డవి". అని డాక్టరు అనీబిసెంటమ్మ అన్న మాటలు బింకంతో అన్నవి కావు. అవి అన్ని అక్షరాలా సత్యములే. ప్రకృతిమాత అనుగ్రహించిన ప్రసాదమైనను గ్రహించుటకు రైతు నోచుకొనలేదు, ఈ చల్లని బ్రిటిషు ప్రభుత్వ కటాక్షవీక్షణాలవల్ల "మాకు కావలసినన్ని పశువులుండేవి.

కావలసినన్ని బీళ్ళుండేవి. పశువుల ఆరోగ్యం కాపాడటానికి కావలసినంత ఉప్పు వుండేది : ఇప్పుడు మా పచ్చికబీళ్ళు, అటవీశాఖ వారి హస్తగతమైనవి. మా పశువులకు బీళ్ళవేట నేడు, ఆకలితో మాపశువు లెక్కడికైనను మేయపోతే బందెలదొడ్లో పెట్టబడును. చచ్చినట్టు మేము జరిమానాలు యిచ్చుకోవలసినదే. మా పశువుల చావిళ్ళకు, నాగళ్ళకు తదితర వ్యవసాయ పనిముట్లకు కావలసిన సామగ్రి మాకున్నది. సెలవు లేకుండ దానిని అంటుకుంటే కష్టనష్టాలకు గురికావలసి వచ్చును అని అనిబిసెంట్ అమ్మ "How India wrought for freedom" అని తాను వ్రాసిన కాంగ్రెసు చరిత్రలో రైతుల కష్టనష్టాలు కళ్ళకు కట్టినట్లు చిత్రించింది. ప్రభుత్వం వారు యీ అటవీ శాసనం చేసిన సంవత్సరముననే ఒక్క ఉత్తరఆర్కాట్ జిల్లాలో తొమ్మిది నెలలలో మూడు లక్షల పశువులు మృతినొందినవంటే యీ శాసనాలవల్ల పశునష్ట మెంతగలిగిందో యిక మీరే వూహించుకొండి. మన కాంగ్రెసు యీ శాసనాలనుండి రైతులను కాపాడుటకు ఎన్నో తీర్మానాలను చేసింది.

ఈ అటవీశాఖవారి వ్యవహారం ఎంతో అధ్వాన్నంగా వున్నది. ఈ డిపార్టుమెంటువల్ల అడవులు నశింపు కాకుండ చూచుట మినహా మిగిలినవన్నీ లెక్కింపరాని బాధలు. ఈ అడవుల చట్టాలవల్ల అటవీ జాతుల వారలకును, ఆ ప్రాంతాల రైతులకును చెప్పజాలనంత ముప్పు కలుగుచున్నది. రైతు నాశనానికే యీ శాసనాలు యేర్పడ్డవి. యీ వుద్యోగుల నిరంకుశాధికారాలు చెప్పతరముకాదు. కాస్త అనుమానం గలిగితే రైతు కొంప తీశారన్నమాటే.ఇక లంచాలకు అంతే లేదు.

1934-35 సంవత్సరాల అటవీశాఖవారి రిపోర్టు చూడండి. 2,69,98,624 యీ డిపార్టుమెంటుకు పెట్టిన ఖర్చు. ఇక యింత రైతుల దగ్గర గుంజుతుంది. పైగా ప్రాసిక్యూషనులు. ప్రాసిక్యూషనులేకాక, 2,56,300 మందిని జైళ్ళకు పంపారు. ఎంత ఘోరం!

రైతు దినదినం తెచ్చుకొనే ఆకు,అలమ, పుల్లా పుడక, పశువుల మేత అంతా బందే, ఇక పశుఘోష పట్టతరం కాదు. మన పశుసంపద నానాటికి నశించుటకు ఈ అడవుల చట్టాలే కారణాలు. ఈ అటవీశాసనాలను తొలగించుటకు వెంకటగిరి (జమీందారీ వ్యతిరేక ఉద్యమం) పల్నాడు, మందసా ప్రాంతములలోనే కాక కర్నాటక, మహారాష్ట్ర, అస్సాము ప్రాంతాలలో కూడా రైతులు సత్యాగ్రహము

చేశారన్న సంగతి గ్రహించాలి. అల్లూరి సీతారామరాజు తిరుగుబాటుకు కారణం యిదే.

లోగడ శాసన తిరస్కారసమయంలో కూడా, డాక్టరు మూంజీ, మన ఉన్నవ లక్ష్మీనారాయణ ప్రముఖులే కాక వేలకు వేలుగా ఈ శాసనధిక్కారం చేశారు. రైతు బాంధవుడగు రంగా రైతుల కష్టనష్టాలను నివారించుటకై అఖండ కృషి చేశారు. మద్రాసు రాష్ట్ర అటవీ పంచాయతీ సంఘాన్ని నెలకొల్పి, దానికి మాజీ ప్రధాని మునిస్వామినాయుడు అధ్యక్షుడుగా వున్నప్పుడు (1929–30) రంగా కార్యదర్శిగా వుండి పెక్కు లాభాలు కలుగజేశాడు. అడవుల దగ్గర రైతుల బాధలు తగ్గగలందులకు పదకొండువందలు ఫారెస్టు పంచాయతులకు స్టాండింగు ఆర్డర్లను మార్పించాడు. రూరల్ యిండియా అనే మాసపత్రికను ఆంధ్ర, ఆంగ్ల, అరవ భాషలలో ప్రచురించాడు. గుంటూరు జిల్లాలో అటవీశాసనాల యిబ్బందులను గురించి, ఉద్యోగులుచేయు అన్యాయాలపై ఆమిత ఆందోళన చేశాడు.

1928 సం.లో మద్రాస్ గవర్నమెంటునకు స్పెషలాఫీసరుగా ఆయనున్నప్పుడు ఆర్థికవిచారణచేసి అడవులను గురించి ఒక రిపోర్టు వ్రాశాడు.

నెల్లూరు జిల్లాలోని వెంకటగిరి యెస్టేటులో అటవీ సత్యాగ్రహము ఆయన ఆధ్వర్యం క్రిందనే ఆరంభమయింది.

ఆంధ్రదేశ ఫారెస్ట్ రైతులసభ 1937 డిశంబరు 25, 26 తారీఖులలో కంభంలో, ఆయన అధ్యక్షతన అద్వితీయంగా జరిగింది. రైతుల కష్టనిష్ఠూరాలు, కోరికలు చర్చించబడి తీర్మానించబడినవి. ఈ సభాఫలితమే ప్రభుత్వమువారు రైతుల కష్టనష్టాలు కనుగొనుటకు ఫారెస్ట్ స్పెషలాఫీసరును నియమించుట.

అడవుల ఉపయోగాలు, ఉద్యోగుల దుర్మార్గాలు, రైతులహక్కులు, రైతులకు కలుగుచున్న ఇబ్బందులు, వాని నివారణోపాయాలు గురించి భోగట్టా అంతా అడవులు అనే పేరుతో 1938లో ఒక చిన్న పుస్తకాన్ని ప్రకటించాడాయన. అది తెలుగులో కూడావచ్చింది.

అటవీశాసనాల్లో ఆయనకు గల అనుభవము. రైతుల బాధానివారణలో ఆయనకుగల ఆకాంక్ష యెరిగే 1938 లో మద్రాసు ప్రభుత్వం ఫారెస్టు చట్టాన్ని

సవరించు విధానాన్ని గురించి ఒక నివేదిక పంపవలసినదిగా కోరింది. వారి కోర్కె ననుసరించి రంగా ఎంతో కృషిచేసి దానిని పంపెను.

మూయబడిన సెంట్రల్ ఫారెస్టు కాలేజీని తిరిగి తెరిపించి చరితార్థుడయ్యాడు.అడవులకు రైతులకు అవినాభావసంబంధ మున్నది. అడవులు ఉంటే కాని వర్షములు కురియవు. వర్షాలు ఉంటే గాని పంటలు పండవు. అందుకని అడవుల రక్షణకై శాసనాలుండుట అవసరమే కాని,అవి రైతాంగానికి బాధాకరంగా ఉండకూడదు. ప్రభుత్వం రైతురక్షణకై నేడుప్రయత్నించాలి. మన మందసా రైతుల అటవీసత్యాగ్రహం మరువగలమా! ప్రఖ్యాతమైన ఆ పోరాటంలో వీరగున్నమ్మ వీరస్వర్గం అలంకరించింది. మన రైతువీరులు కొరచ చంద్రయ్య, గొర్లె జగన్నాయకులు, గొర్లె పున్నమ్మ గుండు దెబ్బలకు గురియై అంగవిహీనులు అయ్యారు. ఇట్లెందరో బాధలు పడ్డారు. ఈ శాసనాలు కాలరాయటానికి కాలం అనుకూలంగా లేదు.

## చేనేత వారికి చేయూత



'రాట్నము ఇతర దేశాలతో వర్తక పోటీకి నిల్చుటలేదు. దేశములో వృధా అగుచున్న జాతీయ శ్రమను (National Labour) సద్వినియోగము చేసుకొని, పెరుగుచున్న దేశ దారిద్ర్యాన్ని తగ్గించుటే దాని ప్రధాన ఉద్దేశ్యము." (From waste to wealth) మహాత్ముడు. మనదేశము వ్యావసాయకదేశమేకాదు. పరిశ్రమలన్నిటికి పుట్టి నిల్లు. ముఖ్యంగా వస్త్రపరిశ్రమలో అందెవేసిన చెయ్యి. క్రీస్తునకు పూర్వమే మనదేశపు సన్నని బట్టలు విదేశాలకు, విశేషంగా రోముకు ఎగుమతి అగుచుండెననుటకు ఆనాటి రోమను నాణెములు నేటికిని ఘంటశాల, అమరావతి, నెల్లూరు ప్రాంతాలలో దొరుకుచుండుటే నిదర్శనము. ప్లైని అను రోమను చరిత్రకారుడు నేటి మహాత్మునివలె హిందూ దేశానికి మన బంగారమంతా వస్త్రముల కొనుగోలుద్వారా పోయి, దేశం దారిద్ర్యమగుచున్నదని గోల పెట్టాడు.

అంతదూరమెందుకు ఇంగ్లీషువారు 1700 లో మన పట్టుబట్టలపైనగాక, కట్టుకొన్న వారిపైననే 5 పౌనుల జరిమానా విధించు శాసనముచేసిరి. ప్రతి సంవత్సరము ఇంగ్లాండునకు 13 లక్షల పౌనుల సరుకు మనదేశము నుంచి

పోయేది. 1750 వరకు మనకు 35 కోట్ల రూపాయిలు వస్త్ర వ్యాపారం వల్ల వచ్చేది.

ఆవిరి యంత్రాలు ఆంగ్లేయులు కనిపెట్టిన తర్వాత యీ పరిస్థితి తారు మారైనది. ఎగుమతి దేశము దిగుమతి దేశము అయినది. 1913 నాటికి ఏటేటా 158 కోట్ల దిగుమతి అయ్యేది. ఇలా 1918 వరకు జరిగింది. స్వదేశోద్యమం వచ్చిన తర్వాత యంత్రాలు మనదేశంలో అధికమైనవి.



మనదేశములో 1853 లో ప్రథమంగా మిల్లు స్థాపింపబడి ,నేటికి 400 వరకు పెరిగినవి. అయిదు లక్షల కార్మికులందు పనిచేయుచున్నారు. ప్రాచీనకాలములో గల 60 లక్షల మగ్గాలకు నేడు 30 లక్షల మగ్గా లున్నవి. 1 కోటికి పైగా పారిశ్రామికులు పనిచేయుచున్నారు. మన మద్రాసు రాష్ట్రములో 5 లక్షల మగ్గాలపైన 25 లక్షల ప్రజలు ఆధారపడియున్నారు. ఆంధ్రరాష్ట్రములో 2 లక్షల మగ్గాలపైన 10 లక్షల ప్రజలాధారపడి యున్నారు. నేటికి భారతదేశములోని వివిధప్రాంతాల్లో ఆంధ్రులే అధికంగా వలసపోయి చేనేత నేయుచున్నారు. మనకు కావలసిన గుడ్డలో 480 కోట్ల గజములు యంత్రాల ద్వారాను, 200 కోట్లు మగ్గాలద్వారాను ఉత్పత్తి అగుచున్నది. మూడవవంతు చేనేత ద్వారా సప్లయ్ అగుచున్నదన్నమాట. మన మద్రాసురాష్ట్రములో ఉత్పత్తి మరొకచోట లేదు. భారతదేశములో రైతులు. వ్యవసాయకూలీల తర్వాత, మూడవ వర్గంగా వున్న చేనేత వారి సంగతి చెవిని పట్టించు కున్నవారే లేరు. ఒకనాడు దేశములో ధనరాసులు పోసిన చేనేతవారిని నాశనము చేయుటకు వారి మగ్గాల పైన అగ్నిబాణాలు వదిలి, పెద్దమ్మను వీరింట్లో కాపురము పెట్టునట్లు చేశారు. ప్రభుత్వము వారు కాని, ప్రజానాయకులుగాని, వీరి విషయములో శ్రద్ధ తీసుకొనక పోవుట విచారకరం. కోటిమంది కష్టనివారణకు కంకణం కట్టుకొన్నది మన ఆచార్యుడే.

ఆదిలో రమేశచంద్రదత్తు, లజపతిరాయ్ పరిశోధనల ద్వారా భారతీయ ఆర్థికదుస్థితికి చేతిపరిశ్రమలు, నేతపరిశ్రమల నాశనమే ముఖ్యకారణమని ఆచార్యరంగా గ్రహించెను.

1925-26 లో మద్రాసు రాష్ట్రమంతా సంచారము చేసి వివిధ చేతిపనుల వారి ఆర్థికపరిస్థితులు విచారించి, ప్రత్యేకంగా చేనేత పరిశ్రమ, ఖద్దరు ఉత్పత్తి, ఆర్థికపరిస్థితుల గురించి విచారించి ఆక్స్ ఫర్డు విశ్వవిద్యాలయమునకు యీ పరిశ్రమల ఆర్థిక పునర్నిర్మాణ సూత్రములను సూచించు పరిశోధనా గ్రంథములను (థీసిస్) నివేదించెను. అందు ఖద్దరు, చేనేత పరిశ్రమలు భారతదేశపు ఆర్థికాభివృద్ధికి లాభమని, అవసరమని, ముందు ముందు హెచ్చుమందికి అదనపు జీవనభృతిని కలిగించగల వృత్తులని నిర్ణయించెను.

1925 లోఆంధ్ర దేశమంతట జిల్లా చేనేతపరిశ్రమ సంఘాలను స్థాపించెను. కాని కులసంఘాల మోజులో పడి కొట్టుకొనిపోతున్న చేనేత పారిశ్రామికులు ఆయన మాటను మన్నించక పోవుటచే ఆ సంఘాలు పని చేయలేదు. ఆనాడు చేనేత వారు వర్గసంఘాల ఆవశ్యకత గుర్తించక పోవుట చేతనే మద్రాసు రాష్ట్రములో నేతవారికి ఇవ్వబడిన శాసనసభా స్థానములు రెండును మిల్లులలోని మగ్గాలవారే హస్తగత మొనర్చుకున్నారు. ఈనాడు విలపించుతున్నారు, ఆయన సలహా వినకపోయి నందున కలిగిన నష్టానికి మన చేనేత వారు, మద్రాసు రాజధాని అంతా బహు వ్యయ ప్రయాసలతో ప్రయాణం చేసి, చేనేత వారి ఆర్థిక పరిస్థితుల్ని భోగట్టాచేసి The Hand-loom weaving Industry (చేనేతపరిశ్రమ)అనుగ్రంథము ప్రకటించి ప్రభుత్వదృష్టి, ప్రజానాయకుల దృష్టి వారివైపుకు ఆకర్షింప చేసెను.

The Economics of hand spinning చేనూలు ఆర్థికశాస్త్రమును రచించాడు. 1936జులై 17, 18 ఆంధ్రరాష్ట్ర చేనేత పారిశ్రామిక మహాసభ పెండెం వెంకట్రాముల ప్రోద్బలముతో ఉప్పాడలో జరిగెను. దానికి ఆచార్యరంగా అధ్యక్షత వహించెను. ఆ సభ దిగ్విజయముగా జరుపుటేగాక, కనీసకోర్కెలు కూడా ప్రకటించి ఆంధ్రరాష్ట్ర చేనేత పారిశ్రామిక సంఘమును స్థాపించి, దానికి జిల్లా, తాలూకా, గ్రామసంఘాలు కూడ ఏర్పాటుచేసి, వారికన్నివిధాల సాయము చేయుచు, వారిలో సంఘటితశక్తి పెంపొందించి, చైతన్యము కలిగించి, ఆర్థిక రాజకీయ హక్కులకొరకు పోరాడగల శక్తిని గలిగించెను.

1937 అక్టోబరు 30 కలకత్తాలో జరిగిన అఖిలభారత కాంగ్రెసుసంఘ సమావేశములో అఖిల భారత చేనేతపరిశ్రమ సేవకుల సభ సత్యమూర్తి అధ్యక్షతను

జరిపించి, ఢిల్లీ అసెంబ్లీ సభ్యులు ఆ సమావేశములో పాల్గొనచేసి, వారికి యీ పారిశ్రామికులపై అభిమానము కలుగునట్లు చేసెను.

1938 జులై 16 గుంటూరులో ఆయన సలహాసంప్రదింపులతోనే చెన్నయ్ రాష్ట్ర చేనేత పారిశ్రామిక సభ, సర్వోత్తమరావు అధ్యక్షతన రాజగోపాలాచారి ఆరంభించెను. ఇలా ఆంధ్రరాష్ట్రసభ చెన్నయ్ రాష్ట్ర చేనేత పారిశ్రామికుల సంఘము అయినది. నాటినుండి దానికి ఆయన గౌరవాధ్యక్షుడు.

నేత పనివారల సహకారసంఘము మిల్లు యజమానుల చేతినుండి 1939 డిశంబరు 18 ఆచార్యరంగా ప్రోద్బలముచే చేనేత వారు స్వాధీనము చేసుకొనిరి. దానికి ఆచార్యుడే అధ్యక్షుడు,

కమ్యూనిష్టులు చేనేతవారికి సహాయం చేయకపోగా వీరి కూట్లో దుమ్ము పోయటానికి కంట్రోలు నినాదం లేవదీశారు. రైతు సంఘాలలో కంట్రోలంటూ కర్షకుల నెత్తి అణచినట్లే 1943లో కేంద్ర ప్రభుత్వము చేనేతపై కంట్రోలు అసంభవమన్నది. కాని అనంతరం రాష్ట్రీయ టెక్స్ టైల్ కమీషనరు లాభం నిర్ణయం చేసి, కంట్రోలు ఆర్డరువేయ పూనుకొనెను. వీరి కష్టనష్టాలను గ్రహించి రంగా చేనేత వారిని కొందరను రాయబారులుగా తీసుకొని, వారి కష్టనిష్టురములు అధికారులకు ఎరిగించి, కంట్రోలుఆర్డరు ఆపించెను.

1933 నుంచి భారత ప్రభుత్వము చేనేతపని రక్షణకై ఏటేట 5 లక్షలు గ్రాంటు యిస్తూ వున్నది. అది 5 సంవత్సరాలకే గ్రాంటు చేయుటచే 1938 తో ఆఖరైనది. 1939 లో మరొక ఏడాది మాత్రమే పెంచినది. 1939 డిశంబరు 12 తారీఖున ఆర్థికసభ్యుని కలుసుకొని, పరిస్థితి వివరించి రంగా మరొక 5 సంవత్సరాలకు పొడిగింప చేసెను.

31-1-1945 చెన్నయ్‌రాష్ట్ర చేనేత సంఘంవారు యేర్పాటుచేసిన రాయబారవర్గము వెంటనిడుకొని రాష్ట్రీయ టెక్స్ టైలు కమీషనరుతో వారి కష్టనష్టాలు చెప్పి ఒక విజ్ఞప్తి అందచేసెను.

ఆయన కృషిచేతనే చేతిపరిశ్రమలను గురించి ఒక విచారణ సంఘము, ఒక అఖిలభారత చేనేత బోర్డు ఏర్పడినవి. ఇటుల చెన్నయ్ రాష్ట్ర సంఘానికి చేయూత యిచ్చినవాడు అఖిలభారత సంఘాన్ని ఎలా నెలకొల్పక ఉండును? ఆయన అధ్యక్షత

క్రింద 1945 ఆగష్టు 10 న చేనేత పారిశ్రామిక కాంగ్రెసు నాగపూరులో జరిగెను. అఖిలభారత చేనేత పారిశ్రామిక కాంగ్రెసుకూడ ఏర్పడెను. ఈ సభాసందర్భమున ఆంధ్రపత్రిక ఆచార్యరంగా శక్తిసామర్థ్యాలను గురించి రెండు కాలములలో ప్రస్తుతించుట గమనార్హ ము.

20-10-1945 చీమకుర్తిలో జరిగిన ఒంగోలు తాలుకా చేనేత పారిశ్రామిక సభను ప్రారంభించెను.

1946 ఫిబ్రవరి 23తారీఖున కేంద్రపరిశ్రమల శాఖాసభ్యుని దగ్గరకు ఆచార్యరంగా ఆధిపత్యాన వివిధరాష్ట్రాల చేనేత కాంగ్రెసు ప్రతినిధులు వారికిచ్చే నూలు చాలుటలేదని నెలకు 10 రోజులకే సరిపోవు చున్నదని, తిరిగి మగ్గాలు లెక్క వేయించాలని, కేంద్ర శాసనసభా తీర్మానము ననుసరించి మూడవవంతు నూలు సరఫరా చేయాలని విన్నవించారు.

ఈ నూలు విషయమై వారి కోర్కె చాలా సబబుగా యున్నది. నేడు మన దేశములో 162 కోట్ల 20 లక్షల పౌనులు నూలు తయారగుచున్నది. దీనిలో 116 కోట్ల 20 లక్షల పౌనుల నూలు మిల్లులకే సప్లయ్ చేయబడుచున్నది. మిగిలిన దానిలో 10 కోట్ల పవర్ లూమ్స్ కు, అల్లిక పనులు మొదలైన వాటిక్రింద పోగా 36 కోట్ల పౌనులు చేనేత పారిశ్రామికులకు యివ్వబడుచున్నది. ఉత్పత్తిలో మూడో వంతు 54 కోట్లు యిమ్మని వారి కోరిక. యుద్ధానికి పూర్వము 48 కోట్లు వారికి యిస్తూనే వుండిరి. పోతే ఆదనంగా 6 కోట్లు యిమ్మని వారు ఆడుగుచున్నారు. యుద్ధానికి పూర్వము 106 కోట్లే మిల్లులకు యిచ్చుచుండెడివారు. నేడు అధికంగా 10 కోట్లు మిల్లుల కిచ్చుట న్యాయమా?

ఆంధ్ర, బెంగాలు చేనేత సంఘాలవారు తమతమ ప్రత్యేక కోర్కెలుకూడ తెలియచేసిరి. వారు చెప్పినదంతా విని సంఘాలను గుర్తించి తగుసాయము చేస్తానని సమాధానము చెప్పెను. 1946 జులై 22 తారీఖున మద్రాసులో జరిగిన చెన్నరాష్ట్రచేనేత సహకారసంఘ పనివారలసమావేశం రంగాజీ అధ్యక్షతన జరిగెను.

అఖిలభారత చేనేత సమావేశం 1937 లో రమాకాంతంగారు జరిపారు. అనంతరం మళ్ళీ జరగలేదు. ఆచార్యరంగా ఆధ్వర్యాన నేడు ఆది సక్రమంగా సాగుచున్నది. తృతీయ సమావేశం చాందా లో 1947-1-17 న ఆయన అధ్యక్షతనే జరిగెను.అన్నిటిలోను ఆచార్యరంగాను అనుసరించే కమ్యూనిష్టులు

ఆయన యత్నాలను తమ సాధారణ ధోరణిలో భగ్నము చేయ యత్నిస్తున్నారు. కారణము వారికి చేతివృత్తులలో విశ్వాసము లేకపోవటమే.

ఆలాగే 1945 లో చేనేత సంఘాన్ని భగ్నమొనర్చుటకు ఆంధ్రరాష్ట్ర చేనేత సంఘమను పేరుతో పోటీ సంఘమొకటి పెట్టి, అమాయకులగు చేనేతవారిని మోసము చేయుచు, తమ పార్టీప్రాబల్యమునకై ప్రయత్నిస్తున్నారు. వారీ సంఘము తరపున కంట్రోలు పెట్టాలని, పవర్లూమ్స్ పెట్టాలని ప్రయత్నించుట బీదలనోట తాల్చిన మట్టి కొట్టుట గాక, మరొకటిగాదు.

కాన మిత్రులెవరో శత్రులెవరో ఎరుగనివారికి తెలిసినవారు తెలియచెప్పుట విధి.**చేనేత సంఘస్థాపనకు ప్రథమము నుంచి ప్రోత్సాహమిస్తున్న వారిలో పెండెం వెంకట్రాములు పేర్కొనదగినవాడు**. అత్యధిక కృషి చేసి, అనేక గ్రంథాలు చేనేత పరిశ్రమను గురించి రచించిన ఆ చేనేత నాయకుని "పరీక్షలకు మించిన పండితుడు." అని ప్రశంసించాడు ఆచార్య రంగా.

ప్రాచీనకాలములో మన చేనేత పరిశ్రమ అధిక ప్రస్తుతిగాంచిన సంగతి సర్వజనవిదితము. యీ పరిశ్రమ అధోగతిచెందిన యీ రోజులలోకూడ యిందులో అధిక నిపుణులు అక్కడక్కడ లేకపోలేదు. అట్టి వారిలో శిల్పాచార్యుడు అందె సుబ్బారాయుడు అందెవేసిన చెయ్యి. ఆయన ఆలీసోదరులకు, రాజేంద్రప్రసాదునకు మరెందరకో మహానాయకులకు కుట్టని చొక్కాలు మగ్గాన నేసి బహూకరించాడు. అలాగే అసెంబ్లీ ప్రెసిడెంటు అబ్దుల్ రహీముకు కుట్టులేని పట్టు షేరువాని బహూకరించి మెప్పుల కుప్పలుగొన్న మేటి మన శిల్పాచార్యుడు. ఇలా పనివానితనములో ప్రస్తుతిగాంచుటేకాక, ఆయన గొప్ప యేమిటంటే, ఆయన పరిశ్రమకు తగిన ప్రతిఫలము యిచ్చినా యివ్వకపోయినా ఆయన సమదృష్టితో ప్రవర్తించు ఆదర్శశిల్పి. ఈ వృద్ధాప్యములో కూడ ఆయన చేనేత సంఘ రక్షణ యాత్రలో పాల్గొని యువకునివలె ప్రవర్తించుట మరీ మెచ్చతగిన విషయం,

"అందె సుబ్బారాయుడు ఆదర్శ శ్రమజీవి, ఆయన మా యింటికి వస్తే గోభూమి కొకసొంపు, భారతీదేవి కొకయింపు, నాకొక భావాల కెంపు యిచ్చిపోతాడు" అని ఆచార్య రంగా ప్రస్తుతిస్తాడు. (22-1-1939 వాహిని)

మరొక చేనేతనాయకుని గురించి ముఖ్యముగా చెప్పవలసియున్నది. ప్రగడ కోటయ్య ఆంగ్ల భాష అంతోయింతో చదివి ఆచార్య రంగా రైతాంగ విద్యాలయములో ఆరితేరి ఆధునిక పోకడలన్నీ అవగతము చేసికొని ఆరితేరిన నాయకుడయ్యాడు. ఆయన నూతనకాలపు శిల్పి. ఆచార్యరంగా బొమ్మను మగ్గముపై నేసెను. దానిని గిరిగారు బహిరంగపరచిరి. ఇట్లు స్వవృత్తిలోను, శిల్పములోను ప్రసిద్ధిచెందిన వాడే. చేనేత వుద్యమతత్వాన్ని గ్రహించి ఆచార్యుని ఆదేశ ఆశీస్సులతో రైతుసంఘాల ఫక్కీని నడిపి చేనేతవారికి చేయూత యిస్తున్న వారిలో చెప్పదగినవాడు మన ప్రగడ.


ప్రగడ కోటయ్య

చేనేత యీ యంత్రయుగములో కూడ స్వరూపనాశనమై పోలేదంటే దానికి కారణం భారత నారీకళాభిరుచులే అందుకు కారణమంటాడు మన చేనేత నాయకుడు.

"కేవలము ఒక్క చేనేత పరిశ్రమ రక్షణకేకాక, భారత సభ్యతా రక్షణకే భారత కళాస్నిగ్ధ హృదయం ప్రధాన కారణం అనడంలో అత్యుక్తిలేదు." అంటుంది ఆంధ్రప్రభ. (9-10-1945) ఇందులో చెప్పబడినదంతా సత్యమని అంగీకరిద్దాం. చేనేత నాయకులలో పేర్కొనదగినవారు పెక్కురున్నారు. నేడు ప్రగడ కోటయ్య, దామర్ల రమాకాంతరావుల నాయకత్వాన చేనేత కాంగ్రెసు చెన్నారుతున్నది.

పూర్వంనుంచి రైతులు చేనేతవారు అన్నదమ్ములవలె మెలగు చున్నారు. మిల్లులు వచ్చిన తరువాత సంబంధము సన్నగిలినది. ఆచార్యుడు యీ రెండు సంఘములకు నాయకత్వము వహించి ఒండొరులకు సుహృద్భావము కలిగించి, పరస్పర సహాయాన్ని పురికొల్పి వుభయుల మెప్పులకు గురియగుచున్నాడు. కర్షకుల వలెనే చేనేతవారును ఇలవేల్పుగ భావించి, ఆయనకు కానుకలర్పించి తమ కృతజ్ఞత వెల్లడించుట, లోక విదితము. ఆయన ఆ ధనమును చేనేత సంఘములకే యిచ్చి, తదభివృద్ధికై కృషి చేయ ప్రోత్సహించుట యెంతయు సముచితము, స్తవనీయము.

## చేతిపనులకు ప్రోత్సాహం

ప్రపంచములో దేశాలు రెండు విధాలుగా యున్నవి. వ్యవసాయక దేశాలు, పారిశ్రామిక దేశాలు; ఇంగ్లాండు మొదలగునవి పారిశ్రామిక దేశాలు. ఐర్లాండు, చైనా, ఇండియా మొదలగునవి వ్యవసాయక దేశాలు. యంత్ర పరిశ్రమలు పెట్టి వ్యవసాయములో వత్తిడి తగ్గించి దేశాన్ని సుభిక్షంగా చేయాలని రమేశ చంద్రదత్తు, రెనడె, విశ్వేశ్వరయ్య మొదలగు ఆర్థికవేత్తల అభిప్రాయము. కమ్యూనిష్టు, రాయిష్టుల దోరణి యిదే. యంత్ర పరిశ్రమవల్ల యుద్భవిల్లినవే, క్యాపిటలిజం, ఫాసిజమ్, కమ్యూనిజం ఆపదలకు ఆకరమైన యంత్ర పరిశ్రమలను ప్రోత్సహించక, మన వ్యవసాయకులకు ఉపవృత్తిగా ఉండే గృహ పరిశ్రమములు పెట్టాలని గాంధిమహాత్ముడే కాదు, ఆర్థికవేత్తలగు రాధాకుముదముఖర్జీ, కుమారప్ప, ఆచార్యరంగా మొదలగువారి వాదన. పాశ్చాత్యులలో ప్రసిద్ధులగు ఆడంస్మిత్, డేవిడ్, రికార్డో మొదలగువారు యంత్రాల అనర్థకాలను లోకానికి వెల్లడి చేశారు.

ఇంతేకాదు, మన ప్రభుత్వం, మనయంత్ర పరిశ్రమలను అభివృద్ధి పొంద నివ్వదని 'షా' మొదలగు ఆర్థికవేత్తలేకాక అనుభవజ్ఞులందరు అంటున్నారు. ప్రభుత్వము, సంకటస్థితిలో యున్నప్పుడు ("యుద్ధ సమయము కూడా") మన యంత్ర పరిశ్రమను వృద్ధి పొందనివ్వలేదు. యుద్ధానంతరముకూడా యంత్రములు సహాయము చేయలేమన్నారు బ్రిటిషువారు. బిర్లా మొదలగు పారిశ్రామికాధిపతులు, విదేశాలు వెళ్ళి వచ్చిన తరువాత వీరి పన్నాగము విదితమైంది. ఇంతేకాక మనది బీదదేశము. పెట్టుబడి పెట్టలేము. పైగా మన దేశపు 40 కోట్ల సంఖ్యకు, ఏటేట 50 లక్షల జనసంఖ్య పెరుగుచున్నది. కనుక మన వ్యవసాయానికి అనుగుణ్యమైన చేతిపనులనే ప్రోత్సహించవలెననే వారిలో ప్రథముడు రంగా.

చిన్నప్పుడే గ్రామములో చేతిపనులు వృత్తిగానున్నవారితో సన్నిహిత సంబంధమున్నది. అనేకులు ఆయనకు బాల్యస్నేహితులు వారిలో యున్నారు. క్రమంగా వారి వృత్తి పోతూయుండటంతో వారి కష్టాలు మనస్సు కెక్కెను.

1923 లోనే ఇండియాలోయున్న వృత్తిప్రజలకు సంబంధించిన కుల తత్వమును; వృత్తిలో పెనవేసుకున్న కులమార్గాన్ని, కుల పంచాయితీని, పెరికివేసి వృత్తి సంఘాలుగా పునర్నిర్మాణము చేయవలయునని గిల్డు సోషలిష్టు ధోరణిగా "వృత్తి సంఘాలు" అని వ్యాసావళిని ప్రకటించాడు.

1928-29 లోమద్రాసు ప్రభుత్వానికి ఆర్థిక సలహాదారుగా నుండి నీలగిరి, సేలం, కోయంబత్తూరు, గుంటూరు జిల్లాలలో ఆర్థిక పరిస్థితులను విశదముగా విచారించిన పిమ్మట, చేతి పరిశ్రమల పునరుద్దరణ కొరకు ప్రత్యేక విచారణ చేయించాడు. ఆయన సలహానుసరించియే మద్రాసు రాష్ట్రమంతా విచారణ చేయించి, రైతాంగానికి వ్యవసాయపనులు లేని సమయాన, చేతిపనులు ఎలా ఉపయోగపడునో; దృష్టాంతపూర్వకముగా చూపెట్టబడెను. ప్రజానీకపు ఆర్థికస్థితి అభివృద్ధి చెందాలంటే, భారీ పరిశ్రమలకంటే సహకార పద్ధతిమీద అభివృద్ధి చేయబడిన గృహ పరిశ్రమలే ఉపయోగపడునని సూచింపబడెను.

1926 గాంధి జయంతిలో గుంటూరు బహిరంగ సభలో ఖాదీని ఆర్థిక శాస్త్ర రీత్యా బలపర్చెను. 1928 "యిండియన్ ఎకనామికల్ జనరల్" లో ఖాదీ ఆర్థిక సూత్రమును బలపర్చుచు వ్యాసము వ్రాసెను. 1927 లో ఆదే పత్రికలో "వ్యవసాయ పరిశ్రమలు" అను కరపత్రమును ప్రచురించెను.

1931-33లో గొల్లపూడి సీతారామశాస్త్రి (వినయాశ్రమం – కావూరు స్థాపకులు )దంపుడుబియ్యపు సంఘమును బలపర్చెను.

1933లో తాళ్ళపాలెం హరిజన హాస్టలులో వృత్తి విద్యాప్రచారమును ప్రోత్సహించెను.

1935 నుండి అఖిలభారత ప్రచారములో చేతిపనుల అవసరములు వారి ఆర్థిక అవసరాలను బలపర్చుతున్నాడు.

1935లో అఖిలభారత గ్రామసౌభాగ్య సంఘములు మహాత్ముడు ప్రారంభించగా, దానిఆర్థిక ఔన్నత్యసూత్రములను గ్రహించి బలపర్చెను. అందువల్లనే బాపూజీ, కుమారప్పలకు ఆయనమీద ప్రత్యేక అభిమానము, విశ్వాసము.

1936లో పొన్నూరులో ఆయన శిష్యుల్లో ఒకరు, రజకులకు (చాకలి వారికి) వృత్తిసంఘమును యేర్పరచెను.

చేతిపరిశ్రమల అభివృద్ధికొరకై కేంద్రప్రభుత్వముచేత విచారణ చేయించి ఆర్థిక పునర్నిర్మాణప్లానింగులో చేతిపనులకు ప్రత్యేక ఉపసంఘములను వేయించెను.

నేషనల్ ప్లానింగుకమిటీలో ఆయనను ల్యాండు పాలసి కమిటీలోనే కాక, కుటీర పరిశ్రమల కమిటీలలో కూడా చేర్చుకొనకపోవుచుండ యుద్ధము వచ్చుటచే, అనంతరం రాజకీయ పరిస్థితులవల్ల నేషనల్ కమిటీ ఆశయం నెరవేరలేక పోయెను.ఆయన చేనేత సంఘాలే కాక, వివిధ వృత్తిసంఘాలు కూడా పెట్టాడు. మరికొందరిని ప్రోత్సహించాడు.ఆయన యత్నము ద్వారానే గాంధీ ఆఖిలభారత గ్రామ పరిశ్రమల సంఘముద్వారా కలుగదగు రాజకీయ, ఆర్థిక, విప్లవ ఫలితములు జాతీయ యుద్యమమునకు కలుగగలవు.

కుమారప్ప ప్రభృతులకు అందని ప్రజాబాహుళ్యపు సంఘటనా శక్తి చాతుర్యమును ఆయన చేతలు, వ్రాతలలో ప్రకటించుచుండెను.

ప్రజలకున్న ప్రతి అవసరము, బాధ, ఆశయమును, ఒక ప్రబలమైన విప్లవ ఆయుధంగా తయారుచేయవలయునని ఆయన ఆశయము, పట్టుదల. ఇదియే లెనిన్ అభిమతము కూడా.

చేవృత్తులవారికి కేపిటలిజం, సామ్రాజ్యతత్వము ద్వారా తీరని నష్టము కలుగుచున్నది. భారతీయుల జనాభా హెచ్చయియుండుట, పెట్టుబడికి డబ్బు తక్కువుండుట, గృహపరిశ్రమలను అభివృద్ధిమార్గాన సౌష్టవపర్చుట సాధ్యమగుటచే యావన్మంది ప్రజలకు వృత్తిని చూపెట్టవలసిన అవసరమును, ఆయన గుర్తించుటవలన, మన దేశములో చేతి పరిశ్రమలకు అభివృద్ధిదాయకమైన పంథా యున్నదని ఆయన విశ్వాసము. ఇటీవల మనదేశములో బయలుదేరిన ప్లానులన్నిటికంటె గాంధి ప్రణాళికే ఘనమైనదని భారతదేశ స్థితిగతుల ననుసరించి వేయబడినదని చేతివృత్తులవారికి అది కామధేనువని చెప్పు గాంధి ప్రణాళిక (The Gandhian Plan) అనే సూత్రాన్ని రచించాడు. కనుకనే ఈ సంఘ నిర్మాణం యిప్పటికిప్పుడే ఆయననుకున్నట్లే, ఈ వృత్తుల ప్రజలు కల ధోరణిగాక వృత్తి చైతన్యమును పొందుచు జాతీయ కాంగ్రెసుకు ప్రబల బలగాలుగా తయారగు చున్నారు. చేతివృత్తుల పారిశ్రామిక సంఘాన్ని నిర్మించి వారికింకా చేయూత నివ్వనున్నాడు.మహాత్ముని మార్గాన్నే అనుసరిస్తూ వారికి (చేవృత్తుల వారికి) సంఘాలు నెలకొల్పి, చైతన్యము పురికొల్పి, చేదోడు వాదోడుగానుండి కాంగ్రెసుకు అండగా నిలబెట్టుటలో ఆచార్యుని ఆశయము మరింత మేలు కాదా.

*ఈసురోమని మనుషులుంటే దేశమేగతి బాగుపడునోయ్?*
*జల్దుకొని కళలెల్లనేర్చుకు, దేశిసరుకులు నించవోయీ,*
*అన్ని దేశాల్ క్రమ్మవలెనోయ్. దేశిసరుకుల నమ్మవలెనోయ్ !*
*డబ్బు తేలేనట్టి నరులకు కీర్తిసంపద లబ్బవోయీ... గురజాడ అప్పారావు*

## క్షామ బాధితులకు సహాయం



"నత్వహం కామయే రాజ్యం నస్వర్గం న పునర్భవం
కామయే దుఃఖతప్తానాం ప్రాణినామార్తి నాశనం"

సమస్త సిరిసంపదలకు ఆటపట్టయిన భరతభూమి నేడు క్షామాలకు ఆలవాలమైనది. అన్నపూర్ణగృహంలో అన్నమే కరువైనది. ప్రాచీన కాలంలో మనదేశమువంటి ఐశ్వర్యదేశం లేదు. నేడు మనదేశం వంటి దరిద్రదేశం లేదు.

యస్. విల్లే గారి క్షామ నివేదిక ప్రకారము 1800–1925 లందు జరిగిన యుద్ధములన్నింటిలోను 4కోట్ల 20 లక్షలు మృతినొందగా 1877 నుంచి 1927

అనగా గత 50 సంవత్సరాలలో ఒక భారత దేశములోనే కరవులవల్ల తిండిలేక "అన్నమో రామచంద్రా" అని అల్లాడి అసువులు బాసిన అభాగ్యులు 2 కోట్ల 42 లక్షలు, అని వినిన ఎవరి హృదయము ద్రవించకుండా ఉండును. 1890- 1901 మధ్య వచ్చిన క్షామాలవల్ల మరణించినవారి సంఖ్య చూచినచో రోజుకు 5,760 మంది. గంటకు 240 మంది, నిమిషానికి 4 గురు చొప్పన ఆకలిబాధచే చనిపోయారంటే మనదేశ మెంత దుర్భర దారిద్ర్యస్థితికి వచ్చిందో వెల్లడియగుట లేదా? ఈ కరువు కారణాలేమో తెలుసుకొందాం.

*"భారతదేశంలో క్షామం ఆకస్మిక ప్రమాదంగా తటస్థించినది కాదు, ప్రకృతి వైపరీత్యం వల్ల వచ్చింది కాదు. ఈ మహోపద్రవం పాలకులు కల్పించిందే. దేశములో సంతానాభివృద్ధి అధికమౌతుందనే కారణమువల్లను, లేదా తదితర కారణాలవల్లను ఈ క్షామాలు ఏర్పడుతున్నాయని సమర్థించడానికి వీలులేదు."* అంటాడు మహాత్ముడు.

మనలను మోసగించాలని, లోకాన్ని మభ్యపుచ్చాలని,కొందరు ఆంగ్లేయులు మనదేశ క్షామానికి జనసంఖ్య పెరగడమే కారణమంటారు. అది అసత్యమని ఈ క్రింది లెఖ్ఖలు విదితము చేయును. మనదేశంలో జనసాంద్రత మైలుకు 195, జర్మని 348, జపాను 482, ఇంగ్లండు, వేల్సు 685, బెల్జియం 702.

మనదేశం జనసంఖ్యతోపాటు వ్యవసాయాభివృద్ధి కావటం లేదు గనుక కరవు వస్తున్నదంటారు కొందరు. ఇదీ యదార్థం కాదు. ఇంగ్లాండు పంట ఇంగ్లండుకు సగం రోజులకు కూడ చాలదంటారు. ఆక్కడ కరువేలేదు. కనుక ఆహారపదార్థాల కొరత కరువుకు కారణము కాదని తేలుతున్నది. కరువుకు కారణం ప్రజలలో కొనుగోలు శక్తి నశించడమే.

భూమిపై వేయబడిన ఎక్కువ పన్నులు యంత్రముల మూలమున జరిగిన గ్రామపరిశ్రమల వినాశనము, భారత దేశ దారిద్ర్యానికి కారణము అంటాడు సుప్రసిద్ధ ఆర్థికవేత్త రమేశచంద్రదత్తు. నిజమే, స్వయంపోషకమైన మన పల్లెలు ఆవిరియంత్రాలు వచ్చిన తరువాత విదేశవస్తువులతో నిండిపోయినవి. మన చేతిపరిశ్రమలన్ని నశించినవి. ఇందుచే మనదేశము కేవలం వ్యవసాయక దేశమయింది. రైతువత్తిడి అధికమగుటచేత వ్యవసాయం గిట్టుట లేదు.

పన్నులభారం, జమీందారీ విధానము, అత్యధిక వడ్డీలు, నీటిసరఫరా లేకపోవుట, మురుగుపోవు సౌకర్యాలు లేక పోవుటచే రైతులు దరిద్రులగుచున్నారు.

దేశం సుభిక్షంగా వుండాలంటే నీటిసరఫరా ఎక్కువ కావాలి. ప్రభుత్వం వసూలుచేసే పన్నులు ప్రజోపయోగం కావాలి. వ్యవసాయంతోపాటు పరిశ్రమలు, వాణిజ్యము వర్ధిల్లాలి. ఇవి పరస్పరాశ్రయములై అభివృద్ధికరంగా వుండాలి. ఇవి నేడు మనదేశంలో లేకపోవుటే కారణాలు. ఇందుచే "ఆయువు *లేక చచ్చునుగాని, అన్నము లేక చావదు*" అనే సామెత సార్థకత నశించింది.

ఈ క్షామబాధితులకు ప్రభుత్వం చేసే కార్యములు చూస్తే చాలా ఆశ్చర్యమేస్తుంది. ఈ క్షామకార్యాలేవీ, క్షామనివారణకు ఉపయోగపడవు. క్షామసమయములో పగలు 10 గంటలు పనిచేస్తే 9 పైసలు యిచ్చేది. క్షామప్రకటన చేసిన తరువాత అణా ఆరు పైసలు. ఇటీవల ఒక కాని హెచ్చించారు గవర్నరుగారి దయవల్ల.మనవాళ్ళు కాలువలు త్రవ్వించమంటే, ఈ గవర్నమెంటు కూలివాళ్ళచేత కంకరరాళ్ళు పగలకొట్టిస్తుంది. కాటకం కలకాలం కాపురము చెయ్యాలనే వారి వుద్దేశ్యం. అందుచేతనే మన నాయకుల మాటలు మన్నించుటలేదు. ఈ కరువు కాలంలో వీరు చేసే ఖర్చులో సగము వంతు సిబ్బందికే సరిపోవుచున్నది. 1935 రాయలసీమ కరువు సమయములో 16 లక్షలు ఖర్చు పెడితే, ఇందులో 7లక్షలు సిబ్బంది ఖర్చులు. ఇట్లావుంది మన ప్రభుత్వ విధానం. మన పెద్దలంతా నీటి సరఫరా హెచ్చు చేయవలసిందని ఆందోళన చేస్తుంటే అంగీకరించలేదు. ఇంతవరకు 900 కోట్లు రైళ్ళకు ఖర్చు పెడితే 150కోట్లు మాత్రమే నీటిసరఫరాకు ఖర్చుపెట్టింది. కృష్ణా, గోదావరి నదులకు ఆనకట్టలు కట్టించిన, కాటన్ మహాశయుడు రైళ్ళకు ఖర్చుపెట్టే సొమ్ములో సగంవంతు నీటి సరఫరాకు ఇస్తేగంగానదీ జలము కావేరీతో కలిపి కాలవలు త్రవ్వించి దేశాన్నంతా సుభిక్షం చేస్తానంటే, సామ్రాజ్యప్రభుత్వం సశేమన్నది. నేటి మన మంత్రులు దీనిని నెరవేర్చాలి.

ఇదివరకు ఎక్కడ కరవువస్తే, అక్కడ బాధపడవలసిందే కాని, ఆ ప్రాంతానికి అధికంగా సాయపడడం అరుదు. ఆచార్యరంగా రాజకీయాల్లో ప్రవేశించిన తరువాత దీనిలో చాలా మార్పు కలుగ జేశాడు. ఆయన నిత్యసంచారి.ఏ ప్రాంతములో కరువు వస్తుందని గమనించునో, ఆ ప్రాంతమంతా తిరిగి రిపోర్టు

తయారుచేసి, ప్రభుత్వానికి పంపడం. పత్రికలలో వ్యాసాలు వ్రాయడం, క్షామనివారణ సంఘం ఏర్పరచి ప్రజలు ప్రభుత్వం సహాయం చేసే ఏర్పాటులు చేయడం. కరువునిధి, కరువు దినము మొదలగునవి ఏర్పాటుచేసి అధిక ఆందోళన చేయడం మొదలగు నూతన పద్ధతులు తెచ్చి, క్షామబాధితులకు సహాయకారి అయ్యాడు.

మన ఆంధ్రదేశములోకెల్ల కరువు ప్రాంతాలు నాలుగు రాయలసీమ, పల్నాడు, ఒంగోలు, విశాఖ. ఈ ప్రదేశాలు మెట్టప్రాంతాలు అగుటే అధికంగా కరవుకు కారణం. రాయలసీమ కరవు ఒక నాటిది కాదు. ఇది నిత్యకరవు. ఇలా నిత్యకరవుతో బాధపడే ప్రాంతములో ఇంతవరకు జనం ఎలా నిలవగలిగారా అను సంగతి ఆలోచనీయమే. ఈ కరవు పూర్వం నుంచి వుంటే, ఆ ప్రాంతములో జనం వుండేవారే కాదు. బ్రిటీషు ప్రభుత్వం వచ్చిన తర్వాతనే వీరికి ఆ కరవు ఏర్పడింది.

రాయలసీమ సంగతి తెలుసుకోవడం అవసరం. విజయనగర సామ్రాజ్యం 1300 మొదలు 1650 వరకు వర్ధిల్లింది. తళ్లికోట యుద్ధంతో నాశనమైందని పాశ్చాత్యుల వ్రాతలనుబట్టి మనవారు పొరపడుతున్నారు. ఇటీవల కొందరు బ్రాహ్మణులు, రామరాజు బ్రాహ్మణేతరులను చేరదీయుటవల్ల విజయనగర సామ్రాజ్యం వినాశమయిందని అబద్ధపు వ్రాతలు వ్రాస్తున్నారు. అళియరామరాయల అనంతరం నూరేళ్ళు ఆ సామ్రాజ్యము నిల్చిందన్న నిజాన్ని గమనించాలి. అట్టి సామ్రాజ్యము ప్రపంచములో మరోచోట లేదు. ఎవరు ఎన్నియుద్ధాలు చేసినా 1894 వరకు రాయలసీమ బ్రిటీషువారి యేలుబడిలోనికి రాలేదు. సామ్రాజ్యములోని కేంద్రప్రభుత్వము లేకపోయినా స్థానిక ప్రభుత్వాలు నశించలేదు. ఈ స్థానిక ప్రభుత్వాలు తిరుగుబాటు చేస్తూనే వున్నవి. విజయనగరసామ్రాజ్యం, ఆనకట్టలు కట్టి రాయలసీమ ప్రాంతమంతా చెరువులు త్రవ్వించి నదీజలము నింపి పంటల వలంతి చేసింది. నేటికీ మన మద్రాసు ప్రాంతములో వున్న చెఱువులు మరో ప్రాంతములో లేవు. ఈ రాయలసీమ వీరులను ఓడించలేక, బ్రిటీషు గవర్నమెంటు కృష్ణా, తుంగభద్రా తోయములను రాయలసీమ ప్రాంతములోనికి రానీయకుండా చేసిందని అభిజ్ఞులంటున్నారు. నాటి నుండి వారు పరపాలనలో బడుటయే గాక, క్షామదేవతకు బలియగుచున్నారు.

అర్ధశతాబ్దమునుంచి తుంగభద్రా ప్రాజెక్టుకు ఆలోచనలు జరుగుచున్నా మైసూరు, హైదరాబాదు, బ్రిటీషు ప్రభుత్వాలకు నీటిపాళ్ళు తెగక అది నిలిచియే యున్నది. నేటికరవు కళ్ళుతెరిపించి తుంగభద్రాప్రాజెక్టు నిర్మాణానికి దారితీసింది.

ఆచార్యరంగా కరవుకాటకాల నివారణకు అనేక సదుపాయాలు సూచించాడు. డెల్టా ప్రాంతముల నుండి, నైజాము ప్రాంతానికి పోయి సాగుచేయుట మంచిదని నేటికి 20సంవత్సరములకు పూర్వమే తెలిపాడు. సాగుకు అనుకూలమైన సుక్షేత్రమైన 15 కోట్ల యకరాల భూమి వ్యవసాయ కూలీలకు సాగుకు ఇవ్వాలని ఏనాడో ఎలుగెత్తి అన్నాడు.

మనదేశంలో ఆలోచన లేకుండ, ఎవరి యిష్టం వచ్చినట్లు వారు పైరులు వేస్తున్నారు. దీనివల్ల ఆహారపదార్థాల కొరతే గాక, ఒకే పైరు అధికంగా వేయుటవల్ల ధరలు తగ్గి రైతులు నష్టకష్టాలకు లోనగుచున్నారు. ఇవన్నీ గమనించి, ఏ పైరు ఎంత వేయాలో నిర్ణయించాలన్నాడు. ఏనాడో ఆయన క్రాప్ ప్లానింగ్ కావాలంటే నేటికి కూడ అమలుకు రాలేదు. నైజాము ప్రభుత్వం ఇలా చేస్తూవుంటే ఇప్పటికి కూడ బ్రిటీష్ ప్రభుత్వం అమలులో పెట్టకుండా వుండడం అనర్ధకరం.

రంగా కేంద్ర ఆహార సంఘ నిర్మాణానికి సహాయపడ్డారు. ప్రథమ సంఘంలో ఆయన ప్రధాన సభ్యుడు కూడ.

ఆహార సమస్యా పరిష్కారానికి సమగ్ర ప్రణాళిక ప్రకటించాడు. అందులో ముఖ్యంగా గమనించదగినవి. అధికోత్పత్తికి సాధనాలు,ఉత్పత్తిదారునకు సరియైన ధరలు, బీదసాదలకు చౌకడిపోలు పెట్టటం, గ్రామాల్లో సహా రేషనింగు పెట్టుట, అన్నిపార్టీలు క్షామనిర్మూలనకి పాటుపడాలని వివరించాడు.(3-4-1946 ఆంధ్రప్రభ)

ఇట్లా సలహాలిచ్చుటే కాక క్షామబాధితులకు ఆయన అనేక విధాల సహాయము చేశాడు. 1927 లో ఒంగోలులో క్షామము ఏర్పడగా, క్షామనివారణ సంఘం ఏర్పాటుచేసి, దానికి జాయింటు సెక్రటరీగా వుండి, ఇతర ప్రాంతాలనుండి ధనము, గడ్డి సప్లయి చేశాడు. ప్రభుత్వం సగం వంతు, ప్రజలు సగంవంతు చార్జీలు భరించే యేర్పాటుతో రైళ్ళమీద గడ్డి పంపించాడు. అందుచేతనే ఆ ప్రాంతము వారు ఆచార్యరంగాను **గడ్డిదొర** అని కృతజ్ఞతతో పిలుస్తారు.

గుంటూరు జిల్లాలో మురుగు వసతులు కల్పించుటే కాక, అదనంగా 65,000 ఎకరాలు పల్లపు సాగులోనికి తెచ్చుటకు కృషిచేసి కృతకృత్యుడయ్యాడు.

1934-35 రాయలసీమలో అధికక్షామం ఏర్పడింది. అప్పుడు ఆచార్య రంగా ఆ ప్రదేశమునకు అరిగి విచారణ చేసి, సమగ్రమగు రిపోర్టు తయారుచేసి, ప్రభుత్వానికి, కాంగ్రెసుకు కూడ పంపి, శాసనసభలో కూడ రాయలసీమ పల్లపుప్రాంతాన్ని సాగులోనికి తేవలసిందని ఆయన అధిక ఆందోళన చేశాడు. రాయలసీమ కరువునిధి ఏర్పాటుచేసి, కరువుదినం ప్రకటించి, అధికంగా ఆందోళన చేసి, ధనం సేకరించి వారికి సహాయపడ్డాడు. ఇందులో కల్లూరి సుబ్బారావు, ఓబులు రెడ్డి, రామచంద్రరావు ఆయనకు అండగా నిలిచారు. 1945 విశాఖ కరువులో గూడ ఆ ప్రాంత మరిగి, ఆ పరిస్థితులన్ని గమనించి, అధిక ఆందోళన చేసి, అది కరువు ప్రాంతముగా గమనించేటట్టు చేసి, ప్రభుత్వంచే క్షామబాధితులకు సాయం చేయించాడు. నేటి క్షామసమయంలో కూడ ఆయన అనేకవిధములైన ఆలోచనలు, సలహాలు, అందించుటే కాక 1946 ఫిబ్రవరి 24 తారీఖున న్యూడిల్లీలో ఆంధ్ర క్షామనిర్మూలన సంఘం ఏర్పాటు చేశాడు. శరత్ బోస్ గౌరవ అధ్యకుడుగాను, ఆచార్యరంగా అధ్యక్షుడుగాను, గంగరాజు కార్యదర్శిగను ఏర్పడి క్షామబాధితుల సహాయానికై కృషి చేస్తున్నారు,

నేడు అధికోత్పత్తి కావాలని అందరు అంటున్నారు. ఆచార్య రంగా సూచనను ఆమోదించకపోవుటచే ప్రభుత్వం ప్రారంభించినా గ్రోమోర్ ఫుడ్ కాంపైన్ (అధికాహారోత్పత్తి ఉద్యమం) అపజయము పొందింది. ఎందుకంటే ఆహార పదార్థాలకు ధరలు నిర్ణయించి, ఆహారేతర పదార్థాలకు ధరలు నిర్ణయించలేదు. వ్యాపారపదార్థాల కనుగుణమైన ధరలతో సమంగా ఆహారపదార్థాల ధరలు లేకపోవుటచే మెట్టప్రదేశాల రైతులు తమకు గిట్టుబాటగు పైరులనే వేశారు. అందుచేత అహారపదార్థాలు తగ్గాయి. ఈ సత్యాన్నే గ్రహించి, రిజర్వుబ్యాంకు మాజీ డిప్యూటి గవర్నరు సర్. మణిలాల్ ధరలు ఇంతకంటె పెంచకపోయినా, సబ్సిడి అధికంగాయిస్తే, అధికోత్పత్తికి ఉత్సాహం కలుగుతుందని అరమర లేక అంటున్నాడు. ఆ సంగతే ఆచార్యరంగా అధికోత్పత్తి కావాలంటే, ఉత్పత్తిదారులకు గిట్టుబాటు ధరలు నిర్ణయించాలి అన్నాడు.

కాంగ్రెసు ప్రభుత్వం ఇప్పటికైనా ఈ సత్యాన్ని గ్రహించాలి. ప్రధాని ప్రకాశం జూలై ఆఖరులోగా ధాన్యం యిచ్చినవారికి పుట్టికి 20/-రూపాయలు సబ్సిడి

యిస్తామంటే రైతులంతా సంతోషముగా తమ ధాన్యాన్ని యిచ్చారు. రిక్విజిషను, ఎక్విజిషను గోల ఏమీ లేకుండా ఇందుకు ప్రధాని ప్రకాశాన్ని ప్రశంసించవలసిందే కాని, ఆయన ఇంతటితో ఆగక, క్రొత్తపంటలో కూడా ఆహారపదార్థాలకు అధికంగా సబ్సిడి యిచ్చి అధికోత్పత్తికి తోడ్పడాలి. పత్రికలలో ప్రకటనవల్ల, నినాదాలవల్ల ప్రయోజనం లేదు. అన్నదాతా! నీవు అల్ప ఖరీదుకే యిమ్ము అను కమ్యూనిష్టు నినాదం కరవునివారణ కాజాలక పోయింది.

మనదేశంలో వున్నది వ్యవసాయ పరిశ్రమే. దాని అభివృద్ధి, క్షయాల మీదనే దేశముయొక్క భాగ్యములు ఆధారపడి యున్నవి. "హిందూదేశంలో వ్యవసాయ విధానపు ఆశయం, ప్రతి రైతు ప్రతి ఎకరానికి అధికం పండించాలనే దానితోపాటు మంచిధరకు అమ్మాలనే సంగతికూడ అయివుండాలని" హిందూదేశ వ్యవసాయ ఆర్థికాల గ్రంథకర్తలు అంటున్నారు. ఆచార్యరంగా సూచనప్రకారం నీటి సరఫరా అధికంచేసి, సబ్సిడి ఇస్తూ, క్రాప్ ప్లానింగు పెట్టి అధికోత్పత్తికి తోడ్పడాలి.

## ఆదిమవాసులకు అండ

మనలో ఐకమత్యం భగ్నం చేయడానికి స్వదేశ సంస్థానాలని, జమీందారీ ప్రదేశాలని, పూర్తి మినహాయింపు ప్రదేశాలని, అసంపూర్తి మినహాయింపు ప్రదేశాలని బహువిధాల భాగించింది బ్రిటీషు ప్రభుత్వమే. ఈ మినహాయింపు ప్రదేశాల్లో జనసంఖ్య 1941 జనాభా ననుసరించి బ్రిటీషు ప్రాంతంలో 1,67,00,000; స్వదేశ సంస్థానములలో 87 లక్షల మంది వున్నారు. వీరికోసం కాంగ్రెసు ప్రత్యేక కృషి చేస్తున్నది. భిల్లు మండలి అనుపమానమైన సేవ చేస్తున్నది.

ఇక మనదేశములోని వీరి సంగతి ఆలోచిద్దాము. గంజాము మొదలు గోదావరి వరకు పడమటివైపున కొండలప్రాంతం దట్టమైన కొండలతో నిండి ఏజన్సీప్రాంతం అనబడుతోంది. వీటిని జిల్లాకలెక్టరులే (మంత్రులప్రభుత్వమునకు లోబడక) గవర్నరు యేజంటుగా వ్యవహరిస్తూ వున్నారు. ఇక్కడ రైతాంగం ముఠాదారులవల్ల పెక్కుబాధలు పొందుతున్నారు. వీరి వస్తువులన్నీ అతి చౌకగా కొనబడును. వీరికి అమ్మేవి అన్నీ అతిప్రియముగా అమ్మబడును. వీరిలో నమ్మక మెక్కువ. అందుచేత అందరు వీరిని దోచుకుతినేవారే. ఇక్కడ ముఠాదారులే ప్రభుత్వపు యేజంట్లు, వారు ఆడింది ఆట, పాడింది పాట.

ప్రభుత్వోద్యోగులు అధికారము చెలాయించుతూ వెట్టిచాకిరీ చేయించు కొంటున్నారు. ప్రభుత్వము క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్ పెట్టి బానిసలుగా చేసింది వీరిని. మిషనరీలు వీరిని నానా భాధలు పెట్టి క్రైస్తవ మతములో కలుపుకుంటున్నారు. బయట ప్రజలు వీరిని ఆర్థికంగా దోచుకుంటున్నారు. వీరికి బోధించినవారు లేనేలేరు యీ లోకంలో. వీరికోసం మన ఆంధ్రులలో కూడ అనేకమంది కృషి చేస్తున్నారు. యానాదులను గురించి వెన్నెలకంటి రాఘవయ్య చేస్తున్నకృషి జగమెరిగినదే. గంజాము జిల్లా సవరలకై గిడుగు రామమూర్తి (సవరభాషకు నిఘంటువు రాశారు) చేసిన కృషి లోకం మెచ్చిందే. పుసులూరి కోదండరామయ్య అఖిల ఆంధ్రయేజన్సీ ప్రజాప్రతినిధి సంఘం పెట్టి తనసర్వశక్తులు వుపయోగించి పాటుపడుతున్న ప్రముఖుడు.

ఈ యేజన్సీప్రాంతాలను, కొంతవరకే అట్లు భావింపబడు ప్రాంతాలను 1935 సంవత్సరం ఇండియా శాసనం ప్రకారం మినహాయింపు ప్రాంతాలుగా విభజించి, ఆ ప్రాంతాలలోని ఖనిజసంపత్తును, ఆరణ్య సంపత్తును కొల్లగొనే అధికారాలను దక్కించు కొనుటకే ప్రభుత్వము ఇలా చేసింది.

ఇక ఆచార్యరంగా ఈ ఆదిమవాసులకు చేసిన కృషి యేమిటో చెప్పుకుందాం. కొండజాతులను తదితర భారతీయులనుండి, బ్రిటీషువారినుండి రక్షించవలెనని 1926 నుండి 30వరకు చేసిన విచారణ ఫలితంగా నిర్వచించాడు. **నీలగిరి కొండజాతులు – వారి ఆర్థిక, సాంఘిక పరిస్థితులు** అనే పుస్తకాన్ని 1928 లో రచించి మహాత్ముని మన్నన పొందాడు. పుసులూరి కోదండరామయ్య గారితో కలసి అఖిలభారత ఆంధ్రకొండ జాతుల సంఘం యేర్పరచిరి. వీరి రిపోర్టు మీద ఆధారపడి అఖిల భారత కాంగ్రెసు కమిటీ ఒక ప్రణాళిక ప్రకటించింది. క్రిమినల్ ట్రైబ్స్ యాక్టు సవరణ పెట్టి పాటుపడ్డాడు.

1938 ఫిబ్రవరి 20 హరిపుర కాంగ్రెసు సమావేశమును పురస్కరించుకొని ప్రతినిధుల విడిదిలో మినహాయింపు ప్రదేశాల సభ జరిగింది. స్వాగతసమితి ఆధ్యకుడు యల్. సిక్కుందుగారు స్వాగతము చెప్పిన పిమ్మట ఆచార్యరంగా అధ్యక్షత వహించాడు. పుసులూరి కోదండరామయ్య ఒక నివేదిక చదివాడు.

తర్వాత ఆచార్యరంగా యీ మినహాయింపు ప్రదేశ ప్రజలకు అనేక సౌకర్యాలను తగ్గించి, బ్రిటీషు పార్లమెంటు చేసిన అన్యాయాన్ని ఆవేశపూరితంగా వివరించాడు.

ఆ సభలో తీర్మానాల అనంతరము, ఆచార్యరంగా అధ్యక్షులుగను, పుసులూరి కోదండరామయ్య కార్యదర్శిగను అఖిలభారత మన్యప్రాంతాల కార్యనిర్వాహకవర్గము ఒకటి ఎన్నుకోబడెను. నేటి రాజ్యాంగపరిషత్ సమయాన కూడ ఆయన ఆదిమ నివాసులకై అనుదినము కృషి చేస్తున్నాడు.

## మహిళోద్యమము

"మానవుడు చేసిన అపచారాలన్నిటిలోకి స్త్రీలయెడల చేసిన అపచారమంత పశుప్రాయమైనది, అమానుషమైనది, పతనహేతువైనది మరొకటి లేదు"

"నా దృష్టిలో స్త్రీలు దుర్బలులుకారు, పురుషులకన్న స్త్రీలే ఉదారచరితలు. నేటికిని వారే త్యాగమూర్తులు. విశ్వాసం, సౌజన్యత, రెండవ కంటివాడెరుగని బాధ ననుభవించుట, జ్ఞానము వారియందు మూర్తీభవించెను.(మహాత్ముడు)

ప్రపంచారంభములో స్త్రీలదే పెత్తనంగా వున్నట్లు తెలుస్తుంది. ఆనాడు మాతృకుటుంబం కాలక్రమాన ఆర్థిక పరిస్థితులు మారినందున పురుషుని పెత్తనం వచ్చింది. పితృకుటుంబం యేర్పడినది. పురుషుడు ఆస్తిపాస్తులయందు సర్వహక్కులు సంపాదించెను. ఇంతటితో పూరుకోక ఆమెను బానిసగా చేసుకొన్నాడు. కొన్ని సందర్భాలు చూస్తే స్త్రీని మానవమాత్రురాలుగా కూడ తలచనట్లు తోస్తుంది.

సాధారణ మానవులేకాక మానవులను తరింపచేయాలని బోధలు సల్పే మతగురువులు, దైవదత్తాలనే గ్రంథాలు కూడా స్త్రీని నీచముగను పాపపంకిలం కావడానికి ఆధారభూతురాలుగను చెప్పుట పక్షపాతములతో కూడుకొని అధర్మ యుక్తముగా యున్నది. లోకకల్యాణకారకుడు అగు బుద్ధభగవానుడు ఒక్కడే స్త్రీ, పురుషులను సమబుద్ధితో చూచి సదయహృదయుడై,సత్యవంతుడై సత్కీర్తి గాంచెను.

ఆధునిక యుగనిర్మాతని ప్రసిద్ధిగాంచిన వీరేశలింగం, స్త్రీ సంఘాభివృద్ధికై యెంతో పాటుపడ్డాడు. మనలో కొంతవరకైనా కనువిప్పు కలిగించాడు. విద్యాసాగరులు దయాసాగరులై స్త్రీ సంఘాభివృద్ధికై సేవ చేసాడు.మహాత్ముని సమగ్ర హోమమువల్ల స్త్రీప్రపంచమెంతో చైతన్యం పొందింది. ప్రొఫెసర్ కార్వే స్త్రీ

విద్యాలయం పెట్టి ఎంతో సేవ చేస్తున్నాడు, మన ఉన్నవ దంపతులు శారదానికేతనమునకై తమ శక్తియుక్తులు వినియోగించి, స్త్రీవిద్యాభివృద్ధికై కృషిచేస్తున్న సంగతి అందరికి తెలుస్తూవున్న విషయమేగదా, ఇంకను పెక్కు పురుషులు స్త్రీలు మహిళోద్యమానికి మద్దతు చేస్తున్నారు.

ఆంధ్రలోను, అఖిల భారతావనిలోను యిక మన ఆచార్యుడు యేమిచేసెనో చూద్దాము. రంగా పెంపకానికంతా వారసులు స్త్రీలే, తల్లి, పెత్తల్లి, ముత్తవ తల్లి, అక్కయ్యలు, ఆయన్ని యిరవై యేండ్ల వరకు తీర్చి దిద్దారు. ఆందువల్ల ఆయనకు స్త్రీలంటే అత్యధిక ప్రేమ, గౌరవం, విశ్వాసం. వారికి పూర్తి స్వాతంత్ర్యము సమానహక్కులు కావాలంటాడు.

1923 లోనే ఉన్నవ దంపతులకు శారదానికేతనం నడుపుటలో యెంతో సాయపడ్డాడు. వెలమవారిలో నున్నంత లేకపోయినా కమ్మ వారిలో కూడా ఘోషా ఉన్నదని ఆంధ్రులకు తెలియని సంగతి కాదు.అందులో ధనిక సంసారాల్లో బాలికలే కాక యీడువచ్చిన పిల్లలు పరాయిగ్రామాల్లో చదువుకోవడం, వసతిగృహాల్లో వుండడం యెంతో వింతగా వుండేది. ఆచార విరుద్ధం కూడాను. అట్టి పరిస్థితుల్లో అందరూ వెనకాడుతూ ఉంటే అచార్యరంగా తన అర్ధాంగి భారతీదేవిని, తన చెల్లెళ్లను శారదా నికేతనానికి పంపి దాని ఆభివృద్ధికి తోడ్పడ్డాడు. అందులో అభ్యసించిన ఆయన అనుంగుసోదరి శ్రీమతి పుష్కరాంబ (శ్రీమతి పుష్పకుమారి) నేడు ప్రసిద్ధ చిత్రకారిణి. హరిజనులు తదితర బ్రాహ్మణీకపు ఆచారమునకు వేరుగా జీవించేవారి సాంఘిక జీవితమును చిన్నప్పటి నుంచీ ఆయన కెరుక. వారిమధ్య ప్రచారమైయున్న లాభకరంగా యున్న, పెండ్లి- విడాకులు, స్త్రీల ఆర్థిక స్వాతంత్ర్యము, సమానత్వము మీద ఆధారపడిన దాంపత్యం ఆయన్ని అధికంగా ఆకర్షించినవి, కనుకనే సాంఘికంగా, ఆర్థికంగా హరిజన స్త్రీలు తదితరులకంటే అదృష్టస్థితిలో వున్నారని 1923 లోనే వ్రాయగలిగాడు, అప్పటినుండి స్త్రీల సంస్కరణ హక్కులకు ఆయన సుముఖుడుగా వున్నాడు.

ఘోషామర్యాదలున్న భారతీదేవిని ప్రజాహిత జీవనంలో పాల్గొన ప్రోత్సహించెను. ఆమెను యూరపు తీసికొనివెళ్లి ఉన్నత విద్య చెప్పించి ఉత్తమ నాయకురాలినిగా చేసెను. 1929 లో ఆంధ్రరాష్ట్ర రైతుమహాసభలో రైతాంగ స్త్రీలు

ఘోషాపద్ధతిని మాని భర్తలతోపాటు కృషిచేయాలని ఆయన బోధించెను. ఆనాడు అది మాగాణి ప్రాంతాల వారికి యెంతో వింతగా తోచెను. వారి బోధలను ఆచరణలోపెట్టుటకు భారతీదేవి, రైతులలో రైతై సొంత సాగుచేయించు చున్నది. ఇంతే గాదు  సమస్త ఉద్యమాలలోను పాల్గొని ప్రశంస బొందుచున్నది."కజిన్సు సతీమణి (అఖిలభారత మహిళాసంఘ నిర్వాహకురాలు) భారత నారీమణులు" అనే ఆంగ్ల గ్రంథమందు భావి భారత నాయకురాండ్రల్లో భారతీదేవిని పేర్కొనెను.
భారతీదేవి అధ్యక్షురాలుగను, రాజ్యలక్ష్మి కార్యదర్శిగను, రత్తమ్మ ఆశీర్వాదాలతో ఆంధ్రరాష్ట్రమహిళా రాజకీయ శిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించెను. ఇది భారతావని కంతటిలోనూ ప్రథమప్రయత్నం.

రైతాంగవిద్యాలయంలో స్త్రీవిద్యార్థినులకు ఆయన ప్రత్యేక ప్రోత్సాహ మిస్తున్నాడు. అలా తయారైనవారిలో శ్రీమతి రాజ్యలక్మి,  కుమారి అన్నే రాజ్యం ఆంధ్రలో ఈనాడు అగ్రగాములై అలరారుచున్నారు.

1945 నవంబరులో బెజవాడలో జరిగిన ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సభ్యుల సమావేశంలో పార్లమెంటరీ కమిటీలో ఒక స్త్రీ సభ్యురాలు ఉండాలని, ఆయన సూచన చేసెను. ఇంగ్లండులో ఎన్నో షరతులతో 1918 లో ఓటు హక్కు వచ్చింది. మనకే పోరాటము లేకుండానే 1919 లో వచ్చింది.

ఆ సూచన  నిరాకరిస్తూ ఒక మహిళామణి మాకు శాసనసభలో ఆంధ్రదేశానికంతకు ఒక స్థానమేగదా మాకు సభ్యత్వము అక్కర లేదనెను. అంతట ఆచార్యుడు లేచి అలాకాదు తల్లీ! ఓటరులలో సగంమంది స్త్రీలు. "మీరెందుకు వద్దంటారు?"అనిచెప్పెను. పురుషపుంగవులు ఇది గమనించలేదు. ఇలా వుంటుంది. మనవారి మనస్తత్వం. పురుషులుప్రపంచపోకడ కనిపెట్టి స్త్రీలకు అన్నిటా అవకాశం ఇవ్వాలి.

## విద్యార్థి ఉద్యమము

*"Education is the manifestation of the perfection, already in man."* *–Swami Vivekananda.*

ప్రపంచం అంతట విద్యావిధానము ఒకేమాదిరి ఉండక వివిధరీతులుగా వుంటుంది. ఇందుకు కారణం ఏ వర్గం ప్రభుత్వంలోవుంటే దాని కనుకూలమైన విద్యా విధానం ఆయా దేశ పరిస్థితులకు అనుగుణ్యంగా కూడ వుంటుంది.

మనదేశములో ప్రతిప్రాంతములోని విద్యావిధానము అచ్చును పోసినట్లు ఒకే పద్ధతి. మనది బానిసదేశం గాన, ప్రభుత్వ సేవకు అవసరమగు విద్యే నేర్పబడుతుంది. అంటే ఆంగ్లేయులకు కావలసిన గుమాస్తాలను తయారుచేయుటే మన విశ్వ విద్యాలయాల విధానము.

వంగదేశ విభజన విద్యార్థులలో చైతన్యం కలుగజేసింది. అందులో ఆనేక విద్యార్థులు పాల్గొన్నారు. రాజకీయాల్లో పాల్గొన్న వారిని ప్రభుత్వకళాశాలల్లో తిరిగి చేర్చుకొనక పోవుటచేతను, జాతీయ విద్య ఆవశ్యకతను గుర్తించి ఆనాడు జాతీయ విద్యాలయాలు నెలకొల్పబడినవి. ఆ కాలములో నెలకొల్పబడినదే మన జాతీయ ఆంధ్ర కళాశాల. ఒకనాడు పేరు ప్రఖ్యాతులు గాంచిన ఆ కళాశాల నేడు పాడుపడి పోయింది. ఆ కోపల్లి పంతులు ఎంత కుందుచుండెనో!

జాతీయ విద్యాలయాలు ప్రారంభమగుచున్న సమయానే రాజేంద్రప్రసాదు ఆ కాలములో (1906) ఎం. ఏ. చదువుతూ విద్యార్థి వుద్యమాన్ని బీహారులో ఆరంభించి, ఆ దేశములో అధిక చైతన్యం కలిగించాడు. కాని ఆ విద్యార్థి ఉద్యమము భారతదేశం అంతటా వ్యాపించలేదు. 1920-30జాతీయ వుద్యమాలు విద్యార్థుల నాకర్షించి, వారిలో తీవ్రసంచలనము కలుగజేసి, రాజకీయ చైతన్యం కలిగించినవి. సుభాష్ బాబు, నెహ్రూ విద్యార్థి ఉద్యమానికి అండగా నిలబడ్డారు. వారు దీనిని భారతదేశమంతట వ్యాపింపజేశారు,

ఇక మన ఆచార్యరంగా విద్యార్థి ఉద్యమానికి యిచ్చిన చేయూత చెప్పెద.

1923-26 మధ్య విద్యార్థినంఘాలను స్థాపించుచు ప్రోత్సహించు చుండెను.

1927లో ఆంధ్రరాష్ట్ర విద్యార్థి సంఘానికి ఆహ్వానసంఘాధ్యక్షుడు.

1927 డిశంబరులో అఖిలభారతవిద్యార్థిసభకు ఆహ్వానసంఘ ఉపాధ్యక్షుడుగా వుండెను. ఆ ఉపన్యాసములో ఆయన ఇచ్చిన కార్య ప్రణాళికే 1940 వరకు. అ. భా. విద్యార్థి సంఘమువారు స్వతంత్రించి ఆచరించిరి. ఆయన పట్టుదలవల్లనే డాక్టరు పట్టాభిని (భోగరాజు పట్టాభి సీతారామయ్య. కాంగ్రెస్

అధ్యక్షుడు) 1937లో అధ్యక్షునిగా ఎన్నుకొనిరి. 1931-35 వరకు ఆంధ్రవిద్యార్థి సంఘాలకు సహాయపడెను.

1935-40వరకు వివిధరాష్ట్రాలలోని విద్యార్థి సభలకు పెక్కింటికి అధ్యక్షత వహించి ఆ ఉద్యమానికి నూతన కార్యక్రమము సూచించెను.

ఆంధ్రరాష్ట్రవిద్యార్థి ఉద్యమము, కాకినాడలో నామమాత్రంగా ఒక విద్యార్థి సంఘముండి దాని పేరుతో వ్యవహారం జరుగుతూవుండేది. 1934గుంటూరు కాలేజి విద్యార్థులలో కొందరు, ఆంధ్ర రైతాంగ విద్యాలయానికి వచ్చిన తర్వాత, విద్యార్థిసంఘము పెట్టవలెనని సంకల్పం కలిగింది. అది 1937సం.లో కాని పూర్తికాలేదు. 1937 లో బాటిల్ వాలా అధ్యక్షతన ప్రథమ ఆంధ్రరాష్ట్ర విద్యార్థిసభ జరిగినది. విద్యార్థుల కనీసపు కోర్కెలు తెల్పబడినవి. డిటెన్షన్ పద్దతి తొలగించాలని తీర్మానించుటేకాక, అనేక చోట్ల సమ్మెలనుకూడా జరిపారు. ఆ పద్ధతి ఆఖరుకు ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు కూడ తుదముట్టించ అంగీకరించుట విద్యార్థుల ప్రయత్నం ఫలించుటకు ప్రబలనిదర్శనము.

1938 బెజవాడలో జరిగిన ద్వితీయ ఆంధ్రరాష్ట్రీయ విద్యార్థిసభకు అధ్యక్షత వహించి అమూల్యసందేశాన్ని ఆచార్యరంగా యిచ్చెను.1939 నవంబరులో గుంటూరులోతృతీయాంధ్ర రాష్ట్రీయవిద్యార్థి సభగూడ ఆయన అధ్యక్షతనే జరిగింది. 1939 అక్టోబరు 24 న తమిళనాడు రాష్ట్రవిద్యార్ధి సభకు అధ్యక్షత వహించెను.

1945 వరకు అఖిల భారత విద్యార్థి నాయకులలో విప్లవ సత్తాలను పెంపొందించుచుండినది ఆచార్య రంగాయే. ఆ రోజులలో మంత్రివర్గాలు, జవహరు, కాంగ్రెస్ వర్కింగ్ కమిటి, విద్యార్థులలో రాజకీయ చైతన్యము, సత్తా పెంపొందించుటలో కొంత సందేహించుచుండినా ఆచార్యరంగా విద్యార్థులందరకూ సంపూర్ణ రాజకీయ స్వాతంత్ర్యం ఉండాలని కృషిచేసెను. విద్యార్థులలో అనేక విభేదాలు కలిగాయి. లెఫ్ట్ కన్సాలిడేషన్ కమిటి ఒకటి ఏర్పడింది. రంగా ఆఖరు వరకు వామపక్షాల సమాఖ్యను నిలబెట్టాలని ప్రయత్నించాడు. సామ్రాజ్య వ్యతిరేక పోరాటాన్ని సాగించుటే దీని ఆదర్శము.

కమ్యూనిష్టు వైఖరిని ఎప్పటికప్పడు తెలియజేస్తూ ఆంధ్రవిద్యార్థి ఉద్యమానికి సలహాలు, సహకారమిస్తూ సర్వదా తోడ్పడ్డాడు. విద్యార్థి సంఘాలకు ఆయనయిచ్చిన బలం, ఘనమైన సేవ చిరస్మరణీయం, విద్యార్థులలో చీలికలు

లేకుండా చేయుటకు ఎంతోపాటు పడ్డాడు. 1942 లో జైలునుంచి రాగానే కమ్యూనిష్టులు విద్యార్థి ఉద్యమాన్ని తమ పార్టీకొరకు ఉపయోగిస్తున్నారని గ్రహించి, జాతీయ విద్యార్థి సంఘాన్ని స్థాపించాలనే నినాదమిచ్చి జాతీయ విద్యార్థి సంఘానికి జీవగర్ర అయినాడు.

1942 ఆగష్టు విప్లవము నందు కమ్యూనిష్టుల కుట్ర అందరికి అర్థమైంది. కాన, ఆయన నినాదాన్ని అన్ని రాష్ట్రాల విద్యార్థులు అంగీకరించారు. దీని ఫలితమే అఖిల భారత జాతీయ విద్యార్థిసంఘం.

మద్రాసు ప్రభుత్వము జాతీయ విద్యార్థి యువజనసంఘాలను బహిష్కరించారు. రంగా అమరావతి జైలునుండి తంజావూరు జైలుకు వెళ్ళుతూ, తమ భావికర్తవ్యమడిగిన యువజనవిద్యార్థినాయకులకు విద్యార్థి, యువజన కాంగ్రెసులను ప్రారంభించమని సలహానిచ్చి ప్రోత్సహించాడు. దాని పూర్తి స్వరూపాలే ఈనాటి అఖిలభారత విద్యార్థి యువజన కాంగ్రెసు సంస్థలు.1926-30 లో జవహరు, బోసులెట్లా విద్యార్థి ఉద్యమానికి జీవగర్రగా ఉండిరో ఆలాగే ఈనాడు ఆచార్య రంగా కృషి చేస్తున్నాడు

1945 జనవరి 20, 21 బందరులో ఆంధ్రరాష్ట్ర విద్యార్థి కాంగ్రెసు కాళేశ్వరావుగారి అధ్యక్షతన జరిగింది. ఆచార్య రంగా ప్రారంభించెను.

1945 జనవరి 28 మద్రాసు నగర విద్యార్థిసభకు ఆయన అధ్యక్షత వహించాడు. 1945 జూలై 21 తారీఖున బెంగుళూరు విద్యార్థి కాంగ్రెసుకు అధ్యక్షత వహించి అమూల్య ఉపన్యాసము ఇచ్చాడు.

1945 ఆగష్టు 4 వ తారీఖున గుంటూరు జిల్లా విద్యార్థి కాంగ్రెసును ప్రారంభించాడు.

1946 ఫిబ్రవరి 23 తారీఖున కలకత్తాలో వంగరాష్ట్ర విద్యార్థి కాంగ్రెసు ద్వితీయ సమావేశానికి అధ్యక్షత వహించి కమ్యూనిష్టులవల్ల సోషలిష్టులవల్ల ముందు రాబోయే ప్రమాదాన్ని తెలుపుతూ అమూల్య హితోపదేశం చేశాడు.

విద్యార్థి కాంగ్రెసువారు విద్యార్థి నాయకులను తయారుచేయుటకై రైతుకూలీ ప్రజారాజ్య ఆశయ రాజకీయతత్వము ప్రచారము చేయుటకు పౌరసత్వకళాశాల

స్థాపించాలని పోత్సహించాడు. దానిని సెక్రికర్ రాముని మీనన్, వర్మలు 1945 లో బొంబాయిలో ఆరంభింపగా రంగాజీ దాని ప్రధానాచార్యుడుగా ప్రస్తుతి గాంచాడు.

1927 లో విద్యార్థులను గ్రామ పునరుద్ధరణకు పురికొలిపాడు. 1937 లో వారి నిరక్షరాస్యతను నిర్మూలించుటకు ప్రయత్నించాడు. 1942 జాతీయ విద్యార్థి సంఘాన్ని, 1944 జాతీయ విద్యాలయాన్ని,జాతీయ విద్యార్థి కాంగ్రెసును నిర్మాణము చేసి విద్యార్థులను జాతీయ విప్లవానికి షాక్ ట్రూపుగా తయారు చేయాలని ప్రయత్నిస్తున్నారు.

విద్యార్థులు ఈజిప్టు, ఇండోనేషియా, పాలస్తీనా మొదలగు దేశాలలో స్వాతంత్ర్య సమరములో పాల్గొని తమ సర్వస్వము అర్పించారు. ఇలా ప్రపంచములోని అన్ని దేశాలలోను స్వాతంత్ర్య సమరంలో ముందడుగు వేశారు. అలాగే నడిపించాలని ఆచార్యుని సంకల్పము. అందుచేతనే ఆయన విద్యార్థి సంఘాలకు అండగావుండి అభివృద్ధి చేస్తున్నాడు.

## హరిజనసేవ

*"అస్పృశ్యతకు స్థానమిచ్చి హిందూమతము పాపమునకు ఒడిగట్టినది. ఆది మనలను పతితులను గావించెను. దాని ఫలితముగా సామ్రాజ్యములో మనమే పంచముల మయితిమి?* – *గాంధీజీ*

ఆదిలో మానవులంతా సమానముగానే వున్నారు. ఉచ్ఛనీచ భేదాలు నాడు లేవు. అనంతరం వర్ణ భేదాలు వచ్చినవి. శూద్రులు పంచములు, ఆర్యులు కారు. వీరు ఆదిమవాసులు, ఆర్యులకు లోబడిన భారతీయులు శూద్రులయిరి. అనగా సేవకులయిరి. లోబడని వారిని ఛండాలురనిరి.

ప్రతిదేశములోను ఇతర దేశములోనుంచి వచ్చిన స్వార్థపరులు ఆదిమవాసులను అణగత్రొక్కటం, నాశనం చేయటం, ప్రపంచములో చూస్తున్నాము. ఆఫ్రికా ఆదిమవాసులను శ్వేతముఖులు ఎలా హతమారుస్తున్నది, అట్లాగే అమెరికాకు వలస వచ్చిన వారు ఆ ఆదిమవాసులను హతమారుస్తున్నారు. వర్ణభేదం, రంగుభేదం, కులభేదం, మతభేదం, వర్గభేదం, ఏదో ఒక భేదంతో ప్రపంచమంతటా నరకయాతన సాగుచునే వున్నది. రూసో ఇట్లా అన్నాడు. *Man*

*is born free but he is every where in chains మానవుడు జన్మతః స్వతంత్రుడుగానే పుట్టాడు. కాని అతడు అన్నిచోట్ల నిర్బంధాలలోనే ఉన్నాడు.*

ఆర్యులలోనే వున్నది వర్ణభేదము. ఆ వర్ణాలు మూడే అన్నాడు న్యాయశాస్త్రమును రచించిన గౌతముడు. దానికి సదృశ్యం ఆర్యులయిన బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులకు ఉపనయనాధికారం వున్నది. శూద్రులకు లేదు. తమకు లోబడిన ఆదిమవాసులచేత బానిసత్వము చేయించుకున్నారు ఆర్యులు. వారికే శూద్రులని నామమిచ్చారు. విననివారు పంచములు. అంటరానివాళ్లు. ఇంతేకాదు చెప్పరాని వాళ్ళు కూడ అయ్యారు. ఇది మన ఆధ్యాత్మిక అభివృద్ధి. మన ఆర్యనాగరికత, మన సనాతనధర్మం.

ఈ పవిత్ర కర్మభూములు పాముకు పాలు, చీమకు పంచదార పోస్తూ భూతదయ కనపరుస్తూ ప్రపంచంలో ఎక్కడా లేని అంటుదోషాన్ని నెలకొల్పుట కంటే విపరీతమేమి? విజేతలు, విజితులను పెట్టే ఆంక్ష కాదా? క్రోధము కాదా? అమెరికాలో, ఆఫ్రికాలో రంగుభేదము పాలక పాలిత భేదము, విజేత విజితభేదం, స్పష్టంగా మరొకరూపంతో నేటికి గోచరిస్తుంది. ఈ కర్మభూమిలో ఆ భేదమే మరొక రూపంతో, ఈ మతం పేరుతో, దేవుని పేరుతో జరుగుతున్నది.

ఈ అమానుష కృత్యాన్ని అరికట్టటానికి బుద్ధుడు, బసవేశ్వరుడు, రామానుజుడు, బహ్మనాయుడు, వేమన, వీరేశలింగం, బహ్మర్షి వెంకటరత్నం, మున్నగు వారెందరో కృషి చేశారు. కళారాధకుడుగా రామబహ్మం మాలపల్లి చిత్రం ద్వారా ఎంతో ప్రబోధం చేశాడు. ఇన్ని దెబ్బలు తిన్న ఈ విషసర్పం యుగకర్త, భారత భాగ్యవిధాత, బాపూజీ దెబ్బతో చచ్చింది. అస్పృశ్యతా నివారణకై మహాత్ముడుచేసిన కృషి సర్వత్రా వ్యాపించి ప్రజల హృదయాలలో మార్పు తెచ్చినది. ఆయనచే స్థాపించబడిన హరిజన సేవక సంఘం నేడు భారతదేశమంతటా వారికై అన్ని విధాల పాటుపడుచున్నది. ఒకనాడు బ్రాహ్మణుడు అనుభవించిన ప్రత్యేక గౌరవం, హక్కు, నేడు హరిజనుడు అనుభవించుట మహాత్ముని ప్రచార ప్రబోధం గాక మరెవరిది? పూనా ఒడంబడిక ద్వారా ఆ పుణ్యపురుషుడు హరిజనులకు ప్రయోజనం కలిగించుటేకాక, హిందూ మతము నుండి వారిని విడదీయ పన్నిన కుట్రను కూలతోసి మన మతానికి మహత్తర సేవ చేశాడు.

## ఆచార్యరంగా హరిజనులకై చేసిన సేవ.

ఆంధ్రజాతికి జనకుడు, ఆంధ్రదేశానికి అన్ని విధాల పాటుపడిన అమరజీవి వీరేశలింగం బోధనలవల్ల, అంటరానితనము చెడ్డదని గ్రహించి, 1919లో డాక్టరు నాయరు జీవితచరిత్ర వ్రాస్తుంటే, వారి అస్పృశ్యతా నిర్మూలనాకార్యము ఆచార్యుని హృదయాన్ని ఆకర్షించింది.

1923 లో యూరపులో ఉండగా అంటరానితనపు పైశాచిక కృత్యం తెలిసి వచ్చింది.

1923 లో స్వదేశానికి తిరిగి రాగానే, హరిజనులను, స్నేహితులుగా చూచుకొని, సహపంక్తి భోజనాలకు ప్రోత్సాహించి, తమ కుటుంబపు బావిని, వారికి తెరిచి, సంఘ బహిష్కారమును ధిక్కరించెను.

మహాత్ముని నిర్మాణ కార్యక్రమములో అస్పృశ్యతా నిర్మూలన విప్లవధోరణి అధికంగా వచ్చినది. ఆంధ్రపత్రికలో, "పంచములు" అనే శీర్షికతో అయిదు వ్యాసములు ప్రకటించెను. అందులో సాంఘికంగా హరిజనుల మధ్య, స్త్రీలకు స్వాతంత్ర్యము హెచ్చుగా నున్నదనిన్నీ పంచాయితీ పాలనము అనుభవము లో వున్నదని, వారి అంటరానితనానికి ముఖ్యకారణము వారి ఆర్ధిక దైన్యత అని, వారిని ఉద్ధరించాలంటే అస్పృశ్యతానివారణే కాక, ఆర్ధిక దైన్యతను కూడ తొలగించాలని, అందుకు ప్రాతిపదికగా వయోజన వోటింగు వారికి కలగచెయ్యాలని ప్రచారము చేసెను.

వారి ఆర్ధిక అభివృద్ధిని సత్వరంగా సాగించాలంటే, వారికి తదితరులకు కలిపి వ్యవసాయకూలి సంఘాలు పెట్టాలని నిశ్చయించెను. ఐతే ఆ సంఘాలు రైతు సంఘాలతో కలసి రైతుకూలీసమ్మేళన సహకారముల ద్వారా పరస్పర అభివృద్ధికి తోడ్పడాలనుకొనెను. ఇదే 1933 లో ప్రచురించిన హరిజననాయకుడు, అనే పుస్తకం లో కూడ ఉద్బోధించెను.

1925 లో వయోజనులకు ఓటింగుహక్కు పత్యేకముగా హరిజనులకు ఉండాలని ఒక చిన్న పుస్తకము వ్రాసి ప్రకటించెను.

డాక్టరు అనిబిసెంటుగారి కామన్ వెల్తు బిల్లులో హరిజనులకు వయోజన ఓటింగుహక్కు ఉదహరింపబడాలని ఆమెతో ఢిల్లీలో మహమ్మదాలీ ఇంట్లో చర్చించెను. మహాత్ముడు కూడ దీనిని అంగీకరించెను.

1928-29 సంయుక్త నియోజకవర్గములో హరిజనులకు కొన్ని స్థానములు రిజర్వు చేయాలని ప్రచారము చేసెను.1928-29లో వచ్చిన లేబరు రాయల్ కమీషన్ ముందు సాక్ష్యమిస్తూ వ్యవసాయకూలీల కనీసపు సాంఘిక ఆర్థిక ప్రణాళికను సూచించెను.

అదే ధోరణిలో తయారుచేయబడిన ఆయన ప్రణాళికను 1936 లో ఆంధ్ర హరిజన సంఘనాయకులకు పంపెను. అలాంటి దానినే 1938లో ఆంధ్రరాష్ట్ర రైతు సంఘం చేత అంగీకరింపజేసెను. ఆయన కరపత్రాలన్నీ, ఈనాటి కమ్యూనిస్టుపార్టీ అగు ఆనాటి సోషలిస్టుపార్టీ కూడా అంగీకరించినది.

1933లో మహాత్ముని హరిజన సేవా సంఘపు ప్రణాళికను శిరసావహించి విప్లవ మార్గాన జనవరి, ఫిబ్రవరి నెలలలో రేపల్లె తాలూకాలో 30 గ్రామాల హరిజనసేవాదళ యాత్రను సాగించెను. ఆ యాత్రలో ప్రారంభము గూడవల్లి హరిజనవాడలో జరిగినది. వేలకువేలు వివిధ కులములకు చెందిన రైతాంగముచేత ఆ దళమునకు స్వాగతము, ఆతిథ్యము, గౌరవము, కలుగునట్లు చేయకలిగెను. ఆయన చూపెట్టిన ఈ దారిని హరిజన సేవకులు నడచుటకు ఇంకా ధైర్యము పూనడము లేదు. అఖిల భారత హరిజన సేవక సంఘ ప్రధాన కార్యదర్శి థక్కర్ బాబా ఈ సేవాదళము సాధించిన సర్వకులసామరస్యము, సహపంక్తిభోజనాలు తదితర అభివృద్ధికర సాంఘిక సంస్కరణలు చూచి చకితులైరి.

1933 డిసెంబరులో మహాత్ముడు గుంటూరుజిల్లాకు అరుదెంచినపుడు, జిల్లా హరిజన సేవాసంఘానికి అధ్యక్షునిగావుండి వారి మెప్పును పొందెను. అప్పుడే నిడుబ్రోలు నుండి తాళ్లపాలెము వరకును, మహాత్ముడు నడచి ఈ డొంకను పునీత మొనర్చిరి.

1923 లోను తిరిగి 1933లోను ఇటు నిడుబ్రోలులోను, అటు దరిశి తాలూకాలోను హరిజనుల ఇండ్లు తగులబడగా వారికి అనేక విధముల సాయపడెను. ఈ సేవా కార్యముననే, ఒకసారి ఒక హరిజనుని తన మెడమీద

ఎక్కించుకొని, ఇంటి పైకి ఎక్కించి, ఆ యింటిని కాపాడెను. ఆ పని అయిపోయిన తర్వాత గాని అటుల చేసినట్లు ఆయనకు గుర్తుకు రాలేదు.

1933లో గాంధీజీ హరిజన సేవకొరకు ఉపవాసము చేయగా, మే నెలలో కృష్ణా, గుంటూరు, నెల్లూరు జిల్లాలలో ఎర్రటి ఎండలో అనేక గ్రామాలు కాలినడకను తిరిగి ప్రచారముచేసి అంటరానితనమనే పిశాచాన్ని ఎదుర్కొనెను.

1935-45 లో కేంద్రశాసన సభలో హరిజనులకు తదితర కూలీలకు వర్తించుచున్న కనీసపు శ్రామిక శాసనాల సహాయము కోరెను.

హరిజనులకు తదితర షెడ్యూలు తరగతులకు సెంట్రల్ సర్వీసుల రిజర్వుడు ఉద్యోగాలుండ వలెననెను.

కోటి రూపాయలు గ్రామ పునర్నిర్మాణ ఫండు హరిజనులకు కూడ ఉపయోగ పడాలని శాసనసభలో సిఫార్సుచేసెను.

నిమ్నజాతుల(అణగదొక్కబడిన) విద్యార్థులకు ఉచిత విద్యాసౌకర్యాలు ప్రభుత్వం కలిగించాలని విద్యార్థి సభల ద్వారా ఆందోళన చేసెను.

1934,35 రైతాంగ విద్యాలయమందు, హరిజన విద్యార్థులకు సంపూర్ణ సమానత్వము నిచ్చుచు ఉచిత భోజనము ఏర్పరచెను. ఆ విద్యాలయములో తర్ఫీదు పొందిన హరిజనులలో ఒకరు సైన్యములో కెప్టెనుగాను, మరొకరు బెలూన్ ట్రైనింగులో ఇంగ్లాండులోను ఉన్నారు. ఇద్దరు డాక్టర్లు, ఎందరో ఆయుర్వేద వైద్యులు, ఇద్దరు గుంటూరు, అనంతపురం జిల్లాలలో హరిజన నాయకులు, ఇద్దరు కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాలలో హరిజన విద్యాలయాలు, హాస్టళ్లు నడుపుతున్నారు. రైతాంగ విద్యాలయ పట్టభద్రులు 6, హరిజన హాస్టల్సును గుంటూరు, పశ్చిమ గోదావరి, కృష్ణా, అనంతపురం జిల్లాలలో నడుపుతున్నారు.

ఈ రోజువరకు ఆయన ప్రచారములో హరిజనదేవాలయ ప్రవేశము, సహపంక్తి భోజనాలను ప్రోత్సహించడమేకాక, ప్రతిచోట హరిజనులకు ఆర్థిక సౌకర్యము హెచ్చుచేయించుటకు కృషి చేస్తూ ఉండుట పరిపాటి.

నెల్లూరు జిల్లాలో "*ఒవ్వేరు*" ప్రాజెక్టు కింద 1500 యకరాలు మాగాణి హరిజనులకు సహకార పద్ధతిమీద స్వల్పఖరీదునకు ఇప్పించెను.

ఆయన తండ్రి నాగయ్యగారి జ్ఞాపకార్థము 1925 లోనే మంచినీటి బావిని హరిజనులకు తవ్వించి యిచ్చెను. రామానీడు విద్యాలయపు నిర్వాహకులలో

నౌకరగు బుచ్చినాయుడు గారు ఈ జయంతి ఉత్సవములో20 ఇండ్ల జాగాలు హరిజనులకు ఇచ్చిరి. ఆయనేకాక ఆయన అనుచర సహచరులు కూడా హరిజనుల యెడల ప్రత్యేకశద్ధ, అనురాగము చూపుచుందురు. ఆచార్య రంగా రైతాంగ సేవలోనే కాక, హరిజన సేవలోనూ అగ్రగణ్యులే.

## గ్రామ పునర్నిర్మాణము

గాంధీజీయే, ప్రప్రథమమున భారతగ్రామ పునరుద్ధరణకై నడుము బిగించాడు. అఖిలభారత చరఖా సంఘము, అఖిలభారత గ్రామపరిశ్రమల సంఘము మొదలగు సంఘములను ఏర్పాటుచేసి, విద్యావంతుల దృష్టిని గ్రామీణులపై మరల్చుటే కాక, గ్రామస్తులలో చైతన్యము కలిగించెను. ప్రజాశక్తిని గ్రామాభ్యుదయానికి ఆయన సంఘటిత పరచినట్లు ప్రభుత్వముగాని, మరో నాయకుడు గాని చేయలేదు.

కాంగ్రెసు గ్రామాలలో జరిపించుటేకాక, కాంగ్రెసు గ్రామీణజన ప్రయోజనాలకై ప్రయత్నించినట్లు మార్పులు చేసెను. కాంగ్రెసు పలుకుబడి ప్రజలలో అధికమౌతుందనే కారణంతో గవర్నమెంటు వారు గ్రామాభ్యుదయ సంఘాలు పెట్టసాగారు. అందలి ఉద్యోగులు, ఉద్యోగులు కానివారు కూడ కాంగ్రెసు పరిస్థితి తెలియని వారగుటవల్ల వారివల్ల ఏమీ కాలేదు. 1940 నుండి కేంద్రప్రభుత్వము, స్థానిక ప్రభుత్వం, గ్రామ ప్రచారక సంఘాలు, గ్రామాభివృద్ధి సంఘాలు గ్రామప్రజల జీవితప్రమాణాన్ని పెంచలేక పోయినవి. ఆరోగ్యాన్ని అభివృద్ధి పొందించలేక పోయినవి. గాంధీ ప్రణాళిక తప్ప మరొక గత్యంతరం లేదు, మహాత్మునికి తెలిసినంతగా గ్రామస్థుల అవసరాలు, గ్రామాల్లో తక్షణము చేయవలసిన పనులు మరొకరికి తెలియవనుటలో ఆతిశయోక్తి యేమీలేదు.

ఆచార్యరంగా ఆంధ్రావనిలో గ్రామ ప్రజల శ్రేయోభివృద్ధికి పాటుపడుతున్న వారిలో ప్రముఖుడు. ఆయన శాసనసభలోనేమి, యితర కార్యక్రమములలో నేమి ప్రప్రథమమున ఆయన యిచ్చే ప్రాధాన్యత గ్రామాలకే.

1. ఆచార్యరంగా పంచాయితీలు కావాలనెను. అందుకుగాను పంగులూరి నరశింహారావుగారి మంత్రిత్వముతో గుంటూరు జిల్లా లోని 960 గ్రామాలకు గాను 700 గ్రామాలలో పంచాయతీలు ఏర్పాటు చేసెను,

2. పంచాయతీదారులను ప్రోత్సాహపరచి ప్రభుత్వము నుండి 1931,35 లలో 3 లక్షల గ్రాంటు తెప్పించి, రైతుల చేత మరి మూడులక్షల పనిచేయించి 6 లక్షల విలువగల రోడ్లు, బావులు, చెరువులు, హరిజన యిండ్ల వసతులు కల్పించెను.

3. గ్రామమునుండి శిస్తు రూపేణా ప్రభుత్వానికి పోతున్న డబ్బు నుండి రైతులకు తిరిగి ఏమీ రావడము లేదని డా.కుమారప్ప, మునిస్వామి నాయుడు గార్ల వాదనలను బలపరుస్తూ, పంచాయితీలకు యివ్వబడే సెస్సును 'కాణీ నుండి అర్ధణా' వరకు వచ్చునట్లు చేసెను. అణా వరకు దానిని పెంచాలనుట ఆయన వాదన.

4. గ్రామ పంచాయితీల పెత్తనము నిర్ణయమయినప్పటివలె మెజారిటీ సిద్ధాంత ప్రకారమేకాక దానికితోడుగా ప్రాచీనగ్రామ పంచాయితీల బాలెట్ నే తోడు చేయాలనే ఆయన వాదన.

5. గ్రామాలన్నీ బస్తీలుగా మారిపోవుటకు యిష్టపడడు. గ్రామాలు మన నాగరికత, విజ్ఞాన ప్రబోధము, ఆనందదాయకములగు ఆటపాటలు, సాంఘిక, రాజకీయ, పంచాయితీ స్వరాజ్యము, ఆర్థిక స్వయం పోషకత్వము సాధించాలని ఆయన ఆలోచన.

6. ఆయన హృదయమంతా గ్రామము మీదనే లగ్నమై యుంటుంది. అందుకే చదువుకొన్న రైతుబిడ్డలంతా తదితర గామస్థులకు ఆదర్శముగా సేవ చేయాలనును. అందుకు ఆయన తదితర నాయకులవలె బస్తీలో నుండక, నిడుబ్రోలు గ్రామములోనే పొలములోనున్న డొంకదారిమాత్రమే కలిగిన గోభూమిలో ఉంటున్నాడు. ఆయన కెటుచూసిన పచ్చటిపైరులే. ఆయనకున్న దారిలో పశువుల రాకపోకలే హెచ్చుగా పరిపాటి. రైతాంగము వ్యవసాయ కార్యనిర్వహణములోయున్నపుడు, వారింటిచుట్టూ వుంటారు. ఆయన తమ్ముడు లక్ష్మీనారాయణ యమ్. ఏ. బి. యల్. కూడ నిడుబ్రోలులోనే నివసిస్తున్నారు. ఇటు శ్రీమతి భారతీదేవి అటు తమ్ములు స్వయముగా వ్యవసాయము చేసి కొంటున్నారు.

7. తదితర నాయకులంతా బస్తీలకు పేరు తెస్తూవుంటే, అటు మహాత్ముడు సేవా గ్రామాన్ని, ఇటు వీరు నిడుబ్రోలును దేశమంతటా తెలిసి వచ్చేటట్లు

చేస్తున్నారు. గ్రామాన్ని తిరిగి రాచబాటలతో రాణింపుకు తెస్తున్నారు. మరి ఏ ఇతర నాయకుని తలుచుకుంటే గ్రామజీవనము ఇలాప్రతిబింబిస్తుంది? ఈ మూడు మార్గాలు 1. గ్రామజీవనము 2. స్వంత వ్యవసాయము 3. స్త్రీలే వ్యవసాయము చేయించుకోవటము ఆదర్శప్రాయములు. ఈ మూటిద్వారా గ్రామపునరుద్ధరణకు పాటుపడుతున్నారు.

## గ్రామీణ ప్రజల వ్యవస్థల సమాఖ్య

*మన పట్టణములే హిందూదేశమని ఎవరునూ మోసపోరాదు. హిందూ దేశము 7లక్షల 50 వేల పల్లెటూళ్లలోనే జీవించుచున్నది. మన పట్టణములు ఆ పల్లెటూళ్లమీద జీవించుచున్నవి. అవి ఏవీ తమ ఐశ్వర్యాన్ని ఇతరదేశముల నుండి తెచ్చుట లేదు. – గాంధీమహాత్ముడు*

నిజం చెప్పుకోవాలంటె మీకు ఆహారమిస్తున్నవారు రైతులు. అందుచేత వారే, మీ యజమానులై వుండవలసినవారు. కాని పరిస్థితులు మరొకరీతిగ యున్నవి. పట్టణవాసులు గ్రామస్థుల రక్తాన్ని పీల్చుకు తాగుచున్నారు. మీరంతా గ్రామీణ సేవకులు కావలసిన సమయం వచ్చింది." అని ఇటీవలనే (1946-8-2 ఆంధ్రప్రభ) మరొక హెచ్చరిక మన మహాత్ముడు చేసిన సంగతి మరువరాని విషయం.

మహాత్ముని అభీష్టానుసారం రైతాంగానికి గ్రామీణ ప్రజలకు సేవ చేయుటలో ఆచార్య రంగా అధికుడనుటలో ఆతిశయోక్తిలేదు. ఆయన అహర్నిశము యేకార్యము చేయుచున్నా దీనియందే అధికశ్రద్ధ చూపుచుండుట అందరు ఎరిగిన విషయమే. 1935 లోనే ఆయన ఆలిండియా సెంట్రల్ రూరల్ రీకన్స్ ట్రక్షన్ (అఖిలభారత కేంద్రగ్రామ పునర్నిర్మాణ సంఘము) స్థాపించి, స్థానిక ప్రభుత్వములన్ని, గ్రామీణప్రజల ప్రయోజనాలకు ప్రణాళికలు ప్రకటించి పనిచేయుటకు ఏర్పాటు చేయవలసిందని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాడు.

పల్లెలను అభివృద్ధిపరచాలని కేంద్రప్రభుత్వము 1935లో గ్రాంటు ఇచ్చినప్పుడు, ఈ సంవత్సరమేగాక ప్రతి సంవత్సరము ఇవ్వాలని ఆయన సూచనను ప్రభుత్వము ఆమోదించెను. ఒక కమిటీని కూడ నియమించెను.1938-5-30 న కోయంబత్తూరులో గ్రామ సేవకులసభకు ఆయన అధ్యక్షత వహించెను.

ఆచార్యరంగాలో విశిష్టత యేమంటే ఆయన యే కార్యమును ఒంటరిగ చేయడు, తాను చేయతలచుకొన్న కార్యానికొక సంఘాన్ని స్థాపించును. అలాగే ఆయన అధ్యక్షతన 1945-3-17 తారీఖున ఢిల్లీలో గ్రామీణ ప్రజల వ్యవస్థల సమాఖ్య స్థాపింపబడెను. ఈ సంఘము ఉద్దేశము- గ్రామములందు నివసించు సామాన్యప్రజల యోగక్షేమములందు నిజమగు శ్రద్ధ కలవారినందరిని పార్టీకక్షలతో నిమిత్తము లేకుండ, కలియ దీసికొని ఒక వేదికమీదికి తెచ్చుటే.

ఈ సమాఖ్య సక్రమముగా వ్యవహరించు చున్నది. 1946-2-24 న రంగాజి నాయకత్వాన ఢిల్లీలో శరచ్చంద్రబోసు అధ్యక్షతన మహాసభ జరిగెను.

ఈ సమాఖ్య తరపున ఆచార్యరంగా సంపాదకత్వాన గ్రామప్రజలు అనే పక్ష పత్రిక 1947 మార్చినుండి ప్రకటింపబడుచున్నది.

ఈ సంఘము 1946-3-4 బడ్జెటు చర్చ సందర్భములో వక్కలు, పుగాకు. ఉప్పు మొదలగు వాటిమీద సుంకాలు రద్దుచేయాలని, నిప్పు పెట్టెలు, పంచదార మీద సుంకాలు సగానికి సగము తగ్గించాలని ఒక ప్రకటన చేసెను.

భారతదేశమంటే పల్లెటూరు- అని మహాత్ముడు చెప్పిన చొప్పున నిరంతరం పల్లెటూరి ప్రజల ప్రయోజనమునకై ఆయన పాటుపడుచున్నాడు.

## కేంద్ర శాసనసభలో రైతులకు సేవ

కేంద్రశాసన సభలో రైతాంగ బృందమును వివిధ పక్షసభ్యుల నుండి ఏర్పరచి, తద్వారా కేంద్రశాసనసభలో రైతులను గూర్చి వివిధ సమయాలలో ప్రబోధం చేశారు. ఆ రైతాంగబృంద అధ్యక్షులు 1. డాక్టరు ఖానుసాహెబు. 2.ముర్తుజాసాహెబు, 3.రంగాగారు,

- పంచదార యెక్సైజు డ్యూటీ నుండి సం. 1 కి 5 లక్షలు చెరకు పండించు రైతుల మార్కెటింగు సౌకర్యములకు గాను ప్రత్యేకింప జేసిరి,
- సెంట్రల్ ఫారెస్టు కాలేజీని తెరిపించిరి.
- వివిధ పంటలకు ప్లానింగు బాధ్యతను ప్రభుత్వము ఆంగీకరించునట్లు చేసిరి.

**వ్యవసాయ పంటలకు కనీస ధరలు నిర్ణయించాలని ఆందోళన చేసిరి**. తుదకు ప్రభుత్వము వీరి వాదనను అంగీకరించినది. యుద్ధ సమయాలలో

పంటలధరలు తదితర వస్తువుల ధరలవలెనే పెరగనివ్వాలని, లేకున్న రైతులకు చాల యిబ్బందులని వాదించి 1943వరకు జయమొందిరి. 1944 లో పంటల ధరలనిర్ణయం రైతులకు గిట్టింపుగా ఉండునట్లు సాధించ గల్గిరి. రిక్విజిషన్, ఎక్విజిషన్లలో ప్రభుత్వోద్యోగుల లంచగొండితనము, దౌర్జన్యములను తీవ్రముగా విమర్శించి, చాలవరకు తగ్గించగల్గిరి.

కమ్యూనిస్టులు ధాన్యపుధర బస్తా1కి 11-0-0 రూపాయల కంటే పెరగరాదు అంటే వీరు రూ.12 వరకూ పెంచవలెననిరి.ప్రభుత్వము రూ.11-4-0 వరకూ పెంచినది. బియ్యము తినువారికి చవకగా బియ్యం అందుటకు కోఆపరేటివ్ స్టోర్సు ద్వారా అమ్మకం జరిగి మధ్య వారి లాభములు తగ్గవలెనని వారి ప్రయత్నము వలననే కోఆపరేటివ స్టోర్స్ ల ద్వారా బియ్యము అమ్మబడుచున్నవి. యుద్ధము వచ్చిన తరువాత పత్తిపంటకు మార్కెటు పడిపోయినందున, ఆ రైతులను రక్షించుటకు కనీసధరలు నిర్ణయించి పైగా నష్టపరిహార మిచ్చుటకు అసెంబ్లీ రైతు బృందం ద్వారా సాధించారు.

వేరుశనగకు యెగుమతి పడిపోగా యిటు రైతులకు ఆ పంటను తగ్గించమని సలహానిచ్చుచు ఆటు ప్రభుత్వము యిండియాలోనే నూనె పదార్థాల ఉత్పత్తి, ఉపయోగము అభివృద్ధి చేయాలనిరి. రైతులు తమ నూనెగింజలను సరాసరిమార్కెటు చేసుకొనుటకు అఖిల భారత గ్రౌండ్ నట్ సిండికేటుకు సాయపడుచున్నారు. పొగాకు రైతులకు మార్కెటింగు సౌకర్యములు కావాలని ప్రచారము చేసిరి. రైతుల మీద పడుచున్నశిస్తులను పునర్విమర్శన చేసి తగ్గించాలని పట్టుపట్టిరి, ఆయుర్వేద పశుచికిత్సావిధానమును ప్రోత్సహించి వృద్ధిచేయాలని బలవంతపెట్టగా, ప్రభుత్వము ఒక ప్రత్యేకవిచారణ చేయించెను.

క్వెట్టా భూకంపములో నష్టపడిన రైతులకు రక్షణ చేకూర్చుటలో చాలా సాయపడిరి. అజ్మీర్, మీర్వారు రైతులను ఇస్తిమారేదార్ అనే జమిందారుల నుండి రక్షించుటకు రీ సెటిల్ మెంటు చేయించిరి.

ఉప్పు పండించు రైతులకు నెల్లూరు, విశాఖ జిల్లాలలో రైతుసంఘాలు యేర్పరచి వారికి తగిన ధరలు వచ్చునట్లు చేసిరి. ఉప్పు ఎక్సైజు

లంచగొండితనమును చాలావరకు మాన్పించిరి.రుణాలు చెల్లించలేని రైతులను జైలులో ఉంచరాదని వాదించి చాలా జయం పొందిరి.

రుణాలను గురించి మారిటోరియం కావాలని కేంద్రశాసనసభా రైతు బృందం సాయముతో అసెంబ్లీలో ప్యాసగునట్లు చేసిరి. రిజర్వుబ్యాంకు, వ్యవసాయశాఖ రైతులకు పరపతి హెచ్చు అగునట్లు చేసిరి. కేంద్ర వ్యవసాయ కళాశాలకై చాలాకృషి చేసిరి.

పంజాబులో గుర్రాలను పెంచు రైతుల రక్షణకై సాయపడిరి, అస్సాం, బెంగాలు రైతులకు వరదలు, మురుగు, మలేరియాలనుండి రక్షణకై కేంద్ర ప్రభుత్వము శ్రద్ధతీసుకోవాలనిరి. 1935-37.లలో తుంగభద్ర ప్రాజెక్టు (కర్నాటక లో ఉన్నది. రంగా గారు దీనికై విశేష కృషిసల్పారు) విషయమై కేంద్రప్రభుత్వము, మైసూరు, హైదరాబాద్ ప్రభుత్వాలతో ప్రాథమిక సంప్రదింపులు, రాజీయత్నాలు పూర్తియగునట్లు చేసిరి. భూమికోత నివారణకు ప్రప్రథమంగా భారతదేశంలో ఆందోళన చేసి, ప్రభుత్వము సహాయపడాలని వాదించిరి. పశుజాతికి అవసరమైన టీకాలు, మందు వగైరా రైతులకు ఉచితంగానో లేక చవక ధరల్లో అందచేయాలనిరి. కొబ్బరి పండించు రైతులకు కనీసధరల ఏర్పాట్లు, సిలోను నుండి రక్షణఏర్పాట్లు చేయించిరి.పోక, పొగాకు మీద ఎక్సైజు డ్యూటీ సుముఖంగా వుండేటట్లు చేయాలనిరి. ద్రవ్యోల్బణం వృద్ధి కారాదన్నారు. కార్మికులకు అస్సాం తోటల్లో పనిచేస్తున్న కూలీలకు రక్షణకల్పించిరి. బర్మా కాందిశీకుల్లో సామాన్య కూలీలను గురించి ప్రభుత్వము అశ్రద్ధ చేయుచుండగా తగిన అలవెన్సులు, కరువు పనులు, బీదలకు ఉచిత పోషణ కలిగించిరి. తిరిగి వారు బర్మాకు పోవునెడల వారి రాజకీయ, ఆర్థిక హక్కులు రక్షించబడాలని కృషిచేస్తున్నారు. సింహళ మలయా లలో ఉన్న భారతీయ కూలీలకు కనీసపు జీవనభృతిని ఏర్పాటు చేయునట్లు చేసిరి. లేబరు శాసనాలు వ్యవసాయకూలీలకు కూడా అన్వయించాలనిరి. ప్రత్యేకంగా work men's Compensation Act, payments Act వ్యవసాయకూలీలకు వర్తించాలనిరి. వెట్టిచాకిరీని ప్రభుత్యము ఆపుదల చేయించాలనిన అంతర్జాతీయ లేబరు సంఘ తీర్మానాలను ప్రభుత్వము ఆమలు పరచాలనిరి. వీరి కృషివల్ల దేశంలో వెట్టిచాకిరి ఎక్కడెక్కడ ఎంతగా తగ్గించబడినదో విచారణ రిపోర్టు

చేయబడినది. ఫ్యాక్టరీ యాక్టు 5 నుండి 20 వరకు వున్న నిబంధనలు కూలీలను పెట్టుకొంటున్న కార్ఖానాలకు కూడా వర్తించాలి అన్నారు.

కూలీల పొరపాట్లవల్ల అపాయము కలిగినప్పటికీ కూలీలకు నష్టపరిహారం చెల్లించాలనిరి. Trade disputes act కూలీలకు సమ్మె చేసే హక్కు నిరోధించరాదనిరి. Payments Of Wages Act కూలీలందరికీ వర్తించాలనిరి. Mineral Welfare Fund Committees in Mines సంఘాలకు యజమానులతో సమానముగ ప్రాతినిధ్యము వుండవలెననిరి. లేబరు సమస్యలు అన్నిటిలోనూ ప్రత్యేక శ్రద్ధ వహించు శ్రీ యన్. యం. జోషీకి అండగా వుండి 1936 వరకు శ్రీ వి. వి. గిరి నాయకత్వము కింద తోడ్పడుతూ 1937 నుండి 42 వరకూ అసెంబ్లి కాంగ్రెసు పార్టీలో లేబరు తరపున ప్రత్యేక నాయకునిగా ఉండిరి. రైల్వే లేబరు రక్షణకు పనిచేస్తూ ముఖ్యంగా క్రింది వర్గాలకు provident Fund సౌకర్యాలు ఉండాలనిరి. మోటారు పనివారలకు భవిష్యనిధి (ప్రావిడెంటు ఫండు) వుండాలనిరి. స్టీమరు కూలీల రక్షణకై పాటుపడిరి.

బిర్లా ఢిల్లీ మిల్లులో కూలీలకు నాయకుడై సమ్మెను జయప్రదంగా సాగించి, కాంగ్రెసు బిర్లా లాంటి కోటీశ్వరులకు గులాము కాదని నిరూపించిరి.

మలేరియావ్యాధి నివారణకు క్వినైను విరివిగా తగినంత మనదేశములో కేంద్రప్రభుత్వ బాధ్యతమీద తయారుచేసి, ప్రజలకు అందజేయాలనిరి. దేశాంతర వ్యాపారాభివృద్ధికి దోహదంగా ప్రభుత్వము అవసరమైన సదుపాయాలు ఒసగవలెననిరి. బర్మా ప్రయాణీకులకు, మలయా ప్రయాణీకులకు ప్రయాణ సౌకర్యాలు ఏర్పాటు చేయించిరి.

రేడియోలు గ్రామాలలో హెచ్చుగా ప్రచారము కావాలనిరి. బంగారము యిండియా నుండి విదేశాలకు ఎగుమతి కారాదన్నారు. బంగారము బదులు ధాన్యమే ఎగుమతి చేయాలన్నారు. (exchanges) గ్రామాలలో పోస్టాఫీసు సౌకర్యాలు ఏర్పాటు చేసే నిమిత్తం ప్రభుత్వము సం.కు 5 లక్షలు అదనంగా హెచ్చించునట్లు చేసిరి. కేంద్ర ఆహారసంఘమును నిర్మించుటకు సలహాలిచ్చి విజయమందిరి. ప్రథమ సంఘములో వారు ప్రధాన సభ్యులు.

విశాఖపట్టణపు హార్బరు మూయకుండునట్లు చూచిరి. ఆంధ్రదేశమునకు ప్రత్యేక రేడియోస్టేషను కొరకై చాలా యత్నించిరి. యత్నం ఫలించకపోవుట శోచనీయం. హిందూదేశ చారిత్రక శిల్పనిధులను ప్రభుత్వం జాగ్రత్త తీసుకొని కాపాడాలని హెచ్చరించిరి. నాగార్జునకొండకు రోడ్డు వేయించుటకు, మ్యూజియం కట్టించుటకు భట్టిప్రోలు, అమరావతి స్థూపాలు రక్షించుటకు వీరి ప్రయత్నము వలననే ప్రభుత్వము పూనుకొన్నది.

నెల్లూరు, గుంటూరు, మిగతా కోస్తా జిల్లాలన్నిటిలోను, రాయలసీమ లోను గాంధీ–ఇర్విన్ ఒడంబడిక ద్వారా ఉచితంగా ఉప్పు తయారుచేసుకునే అధికారము తిరిగి స్థిరపరచిరి. దీనిని గాంధీజీ ఎంతగానో మెచ్చుకొనిరి. బ్యాంకులు, ఇన్స్యూరెన్సు, పేమెంట్లు అన్నీ ప్రభుత్వపరము కావాలనిరి. దేశంలో నదులు, కాల్వలపై ప్రయాణ సౌకర్యాలు వృద్ధిచేసి, గ్రామీణులకు సౌకర్యాలేర్పర చాలని చాలా ఆందోళన చేసిరి.

బకింగ్ హామ్ కాలువ తిరిగి నెల్లూరు నుండి మద్రాసు వరకు తెరుచు కొనునట్లు చేసిరి. 1935 రాయలసీమ కరువునివారణకై ఎంతైనా పాటుపడిరి. అసెంబ్లీ భవనము మీద సభ్యుల అంగీకారముతో నిమిత్తము లేకుండా ఎగురవేయ బడుచున్న యూనియన్ జాక్ ను శ్రీ మోహన్ లాల్ సక్సేనా గారితో కలసి, పీకిపారవేసి, ధైర్యసాహసాలను చూపెట్టిరి.

చేతిపరిశ్రమల అభివృద్ధికొరకై కేంద్రప్రభుత్వముచేత విచారణ చేయించిరి. ఆర్థిక పునర్నిర్మాణ ప్లానింగులో చేతిపనులకు ప్రత్యేక ఉపసంఘాన్ని నియమించిరి. చేనేతపరిశ్రమల కొరకు వారు చేసిన తీవ్రకృషియే యీనాటికి ఒక విచారణ సంఘము, ఒక అఖిలభారత చేనేతబోర్డు ఏర్పడినవి. చేనేతవస్తువుల ధరల కంట్రోలు ఆపబడినది.

కోటిరూపాయిల గ్రామపునర్నిర్మాణ ఫండును గ్రామాల నీటివసతులకు, హరిజనోద్ధరణకు ప్రత్యేకంగా వినియోగించునట్లు మరొక సంవత్సరం కూడా యీ ఫండును పొడిగించునట్లు చూచిరి. హరిజనులు తదితర షెడ్యూల్డు తరగతులకు సెంట్రల్ సర్వీసులో రిజర్వుడు ఉద్యోగాలు వుండాలనిరి.

కొండజాతులు తదితర ఆదిమ వాసుల ప్రజారక్షణకై పనిచేస్తూ పుసులూరు కోదండరామయ్యగారి తోడ్పాటుతో ట్రైబల్ పీపుల్స్ అసోసియేషన్

నడిపిరి. Criminal tribes Act సవరించుటకు బిల్లును తయారు చేసిరి. జీవకారుణ్య నిర్మాణానికి కృషి చేసిరి. వివిధ దేశాలలో మన వ్యాపారము పెరుగుటకు ట్రేడ్ కమీషనర్లను నియమించాలనిరి.

అసెంబ్లీ పార్టీకి ప్రత్యేకంగా గణాంకవిభాగం ఏర్పాటుకు ప్రయత్నించిరి. అసెంబ్లీలో అతిప్రాముఖ్యం గల పబ్లిక్ అకౌంట్సు కమిటీలో, ప్రముఖ సభ్యునిగా 1935 నుండి చాలా పాటుపడిరి. శాస్త్రీయ సోషలిజమును శాసనసభలో ఉపన్యసించుటలోను, ప్రచారం చేయుటలోను కె.టి.షా రంగాను మాక్సెటిన్ గారితో పోల్చిరి.

## కిసాన్ కాంగ్రెస్

మొగుడిని కొట్టి మొగసాలకెక్కినట్టుగా వుంది కమ్యూనిష్టులధోరణి. వారు ఐక్య రైతు ఉద్యమాన్ని నాశనం చేసి, తమ కుట్రలతో అఖిల భారత కిసాను సభను స్వాధీనం చేసుకుని, దానిని తమ పార్టీ రాజకీయాలకు ఉపయోగపర్చుకుంటూ, ఆచార్య రంగా రైతు సంఘాన్ని చీల్చి, పోటీ సంఘాన్ని పెట్టి రైతు ఉద్యమాన్ని నాశనం చేస్తున్నాడని, రైతు సంఘం స్వతంత్రవర్గ సంస్థగా ఉండనవసరంలేదని, కాంగ్రెసుకు అనుబంధసంస్థగా ఉండాలని ఆంటున్నాడని, ఈ విధంగా అయితే వివిధ రాజకీయ పార్టీలు కాంగ్రెసు రైతుసంఘంతో కలవవు కనుక, అది రైతు ఉద్యమానికి దెబ్బని, కమ్యూనిష్టులు అసత్యప్రచారం చేస్తున్నారు. తాము పార్టీ అతీతులుగా సంచరించుతున్నట్లు ప్రచారం చేయుచున్నారు. ఇందులో యదార్థము ఇంచుక విచారిద్దాము.

కర్షకోద్యమ జన్మదాత ఆచార్య రంగా అయినప్పటికీ, ఆచార్య రంగా, స్వామి సహజానంద, ఇందులాల్ యాజ్ఞిక్ ఈ ముగ్గురు కర్షక త్రిమూర్తులని భారత దేశమున ప్రసిద్ధి చెందారు. వీరు కిసాన్ సభ మూలపురుషులు. తమ శక్తియుక్తులన్నీ దానికై ధారపోసిన కిసాను నాయకులు. అటు తర్వాత మోహనలాల్ గౌతమ మొదలగువారు వస్తారు. కిసాను సభను బలపరచిన పార్టీ కాంగ్రెసు సోషలిస్టు పార్టీ. కమ్యూనిష్టులు సహజంగా వారికి రైతులయందుండే విముఖ భావాన్నిబట్టి రైతు ఉద్యమంలోకి రాలేదు, అఖిల భారత కిసాను సభ బాగాబలపడిన తర్వాత 1936 లో కొద్దిగాను, 1937 లో విశేషంగాను వచ్చారు.

ఇది ప్రప్రథమమున అఖిలభారత కిసానుసమాఖ్యగా ఏర్పడి 1935లో మోహనలాల్ గౌతమచే, 'కిసాను కాంగ్రెసు' అను పేరు బాగా వుండునని తెచ్చిన తీర్మానము అనంతరం అందరిచే అంగీకరింపబడింది. అటు తర్వాత ఇది 1938 లో కిసాను సభ అని మార్చబడినది,

1940 వరకు అన్ని గ్రూపులు కిసాను సభలో వుండి, అనేక కార్యాలు సాధించారు. అప్పటివరకు కాంగ్రెసు సోషలిష్టులు కిసాను మజ్దూరులు (రంగా గ్రూపు), ఫార్వర్డ్ బ్లాక్, కిసాన్ మజ్దూర్ నేషనల్ ఫ్రంట్ (కమ్యూనిష్టులు) ఉన్నారు. అదివరకే గయ కిసాన్ సభలో(1939) మొట్టమొదటిసారి అంగీకరింపబడిన రైతుకూలీ రాజ్య ఆశయం, 1940 పలాసా కిసాన్ సభలో ఆమోదించబడింది. కాని కమ్యూనిష్టులు రైతుకూలీ రాజ్యనినాదం మెరుగుపూసిన బూర్జువా నినాదం అని అంటూ తమతమ నక్క జిత్తులు ఆరంభించారు. రైతు ఉద్యమంలో చేరి, రైతుల రాజకీయ వ్యక్తిత్వము ప్రకటించుకోరాదని, శ్రామిక నియంతృత్వమే ముక్తి మార్గమని, రైతు ఉద్యమాన్ని, రైతాంగ రాజకీయ వ్యక్తిత్వాన్ని అణగదొక్క ఆరంభించారు కమ్యూనిష్టులు. ఇదే రైతు ఉద్యమంలో విభేదాలకు నాంది అయింది.

1940 లో కమ్యూనిష్టులు మొట్టమొదటి దఫా, సోషలిష్టులను కిసాన్ సభ నుండి బయటకు పంపుటకు తంత్రాన్ని పన్ని, ఇతరుల సహాయాన్ని చేదుమందుకు చక్కెర పూసి ఇచ్చినట్లుగా సఫలీకృతులైనారు. అనంతరం 1941 నవంబరులో ఫార్వర్డ్ బ్లాకు వారిని పయనం చేశారు.

రైతుల యెడల కమ్యూనిష్టుల వైఖరి తెలియాలంటే ఆచార్య రంగా రచించిన 'రైతులు- కమ్యూనిష్టులు' చదవాలి. 1942 బీహారులో ఇందులాల్ యాజ్ఞిక్ అధ్యక్షతన జరిగిన అఖిలభారత కిసాన్ సభలో కమ్యూనిష్టులు ప్రజాయుద్ధ, పాకిస్తాను నినాదాలను ప్రవేశపెట్ట దలిచేటప్పటికి ఆచార్య రంగా అడ్డు తగిలాడు. అంతట రాజీ మార్గాన పోవుటకు అందరూ ఒప్పుకున్నందున వివాదాస్పద తీర్మానాలు విడిచివేయబడ్డాయి. కాని ఆ సభ అనంతరం పి.సి. జోషి తమ పార్టీ పత్రికలో రాజీకి భిన్నంగా రంగామీద విరుచుకుపడుతూ ఒక పెద్ద ప్రకటన చేశాడు.

అనంతరం ఆగస్టు తీర్మానం వల్ల కాంగ్రెసు నాయకులందరు కారాగృహంలో కలిగిన అవకాశం చూసుకొని, ఆచార్య రంగా లేని సమయాన అన్ని అంశాలమీద, అన్నిగ్రూపులవారికి, అంగీకారమౌ రాజీవిధానం, అవలంబించాలనే సాంప్ర

దాయాన్ని త్రోసివేసి, 1942 సెప్టెంబరు 24 వ తేదీన బొంబాయిలో సమావేశమైన అఖిల భారత కిసాను కౌన్సిలు– రంగా గ్రూపునుకూడ బయటకు పంపాలని, ఆంధ్రరాష్ట్ర రైతునాయకులగు లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు ప్రభృతులు రాజీనామా యివ్వక పోయినా, ఆ సమావేశానికి ఆంధ్రప్రతినిధిగా రైతు సంఘ ప్రాథమిక సభ్యుడు కూడా కాని చంద్ర రాజేశ్వరరావుని (ఆంధ్ర కమ్యూనిస్టుపార్టీ సెక్రటరీ) సభ్యునిగా తీసుకొన్నది. ఇంతేకాక జాతీయోద్యమానికి భిన్నంగాను, తమ కమ్యూనిస్టు పార్టీ పంథాకు అనుకూలంగాను తీర్మానాలు చేసింది,దీన్ని సహించలేక దక్షిణభారత జోన్ సభ్యులైన, ఆంధ్ర, తమిళ, కేరళ, మైసూరు, హైదరాబాదు మొదలగు ఆ యా రాష్ట్రసంఘాలు కిసాను సభనుండి వైదొలగి జాతీయోద్యమంలో చేరినవి. 1942 నవంబరు 7,8 తేదీలలో ఆంధ్రరాష్ట్ర రైతు కాంగ్రెసుసంఘ కార్యనిర్వాహక సంఘం కమ్యూనిస్టుల భారత కిసాను సభనుండి విడిచిపోవ తీర్మానం చేసి, విడిపోయి స్వతంత్రంగా వ్యవహరించుట కొనసాగించింది.

ఈ విధంగా సోషలిష్టులను, ఫార్వర్డు బ్లాకును, రంగా గ్రూపునుబైటికి పంపినా, ఇదుగో మాది సర్వపక్ష సభ, ఇంకా కావలిస్తే చూడండి. మా సభలో మూలపురుషులైన సహజానంద, సరస్వతీ యాజ్ఞిక్ వున్నారు. ఇదే అచ్చమైన అఖిలభారత రైతుసభ అని కమ్యూనిస్టులు కపటనాటకాలాడారు. ఆ బండారం కాస్త బైటపడింది అనంతరం. కపటం యెంత కాలం సాగుతుంది? ఆచార్య రంగా 1942లో విడిపోతే 1944 లో యాజ్ఞిక్ బయటకు వచ్చాడు. తుట్టతుదకు స్వామి సహజానంద కమ్యూనిస్టులు కిసాను సభను తమ పార్టీ ప్రయోజనాల కొరకు ఉపయోగించుకొంటూ రైతువ్యతిరేక ధోరణితో వర్తిస్తున్నారని ఒక పెద్ద స్టేటుమెంటు యిచ్చి 1945లో బైటపడ్డాడు.

కనుక కిసాను నాయకులని ప్రఖ్యాతి గాంచిన ఆచార్యరంగా, స్వామి సహజానంద, ఇందు లాల్ యాజ్ఞిక్, గౌతమ, ఆచార్య నరేంద్రదేవ్ మొదలగు వారెవరు నేడు అఖిల భారత కిసాను సభలో లేరు. ఇక ఎవరిని పెట్టుకొని వారు తమది సర్వపక్ష సభ అంటారు, నేడది అఖిలభారత కమ్యూనిష్టు పార్టీ అనుబంధ సంస్థ అయింది. అందులో కమ్యూనిస్టులు మినహా మరొకరులేరు. అయినా అది

అన్ని పక్షాలసభ అని యదార్థాన్ని మరుగుపరచి, అబద్ధాలు ఆడటానికి ప్రయత్నాలు చేస్తారు కమ్యూనిస్టులు.

వీరి మిత్రుడగు హోం మెంబరు సర్, రెజినాల్డు మాక్సువెల్, బెజవాడలో 1944 లో జరిగిన కిసాను సభను గురించి కేంద్ర శాసనసభలో మాట్లాడుతూ, ఇష్టం లేకపోయినా, అది కమ్యూనిస్టుల అదుపు ఆజ్ఞలలో ఉండే కిసాను సభ అని అంగీకరించక తప్పింది కాదు. ఇంతే కాదు, అమెరికా దేశీయుడగు ఎడ్గార్ స్నో మనదేశం వచ్చి, పి. సి. జోషిని కలుసుకొని, కమ్యూనిస్టుల చేతుల్లో నేడు కష్టజీవులు అఖిల భారత సంస్థలైన, నేషనల్ ట్రేడు యూనియన్ కౌన్సిల్, అఖిల భారత కిసాను సభ వున్నవి. వారు వాటిని సోషలిష్టుల నుండి హస్తగతం చేసుకొన్నారు" అని వారిని మెచ్చుకొంటూ రాశాడు.

14.1.1947 తేదీన కమ్యూనిస్టు పార్టీ ఆఫీసులు సోదాచేస్తూ దాని అనుబంధ సంస్థలగు స్టూడెంట్సు ఫెడరేషనుతోపాటు కిసానుసభ ఆఫీసును కూడాసోదా చేసిన సంగతితో ఈ రహస్యము బట్టబయలైనది. కలకత్తాలో కమ్యూనిస్టులతో పాటు అఖిల భారత కిసాన్ సభ కార్యదర్శి అబ్దుల్ రసూల్ కూడా అరెస్టు అయ్యాడు.

ఇతరులను బైటకు పంపి, కిసానుసభను తమ ఆనుబంధ సంస్థగా చేసుకొన్న కమ్యూనిస్టులు, ఆచార్య రంగా, కిసానోద్యమ విధ్వంసకుడని, పోటీ సంఘాలు పెట్టుతున్నాడని అనటం సాహసం, అసత్యం గాక మరేమిటి? "ఐక్యతే మన అభివృద్ధికి ఆధారం.", "ఐక్యతా ఉద్యమాన్ని నిర్మించుదాం" అంటారు కమ్యూనిస్టులు. ఎవరితో వీరి ఐక్యత? ఏ పార్టీతో కలిసి ఏమిసాధించారు వీరు? అందరిని మోసగించువారిని ఎవరు నమ్ముదురు? సోషలిష్టులు, కాంగ్రెసువారు, వీరు చేయు మోసాన్ని గ్రహించే, వారిని ఆయా సంస్థలనుండి బైటకు పంపారు. ఎంత పూసుకు తిరుగుదామనుకున్నాఈ ప్రబుద్ధులను అంబేద్కరు, జిన్నాలు ఆమడ దూరంలో వుంచుతున్నారు. ఎందుకొచ్చిన నినాదాలివి?

ఈ విధంగా అ. భా. రై. సభ నుండి విడిపోయిన తర్వాత సోషలిష్టులు, ఫార్వర్డ్ బ్లాకు వారు వేరు వేరు రైతు సభలను స్థాపించారు. టాండను, సహజానంద ప్రభృతులు అఖిల భారత రైతుసభను మరొక దాన్ని ఏర్పాటుచేయాలని ప్రయత్నాలను చేస్తూ ఆచార్యరంగాను ఆహ్వానించారు. వారు దాన్ని కాంగ్రెసు

అనుకూలమైన సంస్థగా చేయాలని సంకల్పించారు. ఆచార్యరంగా దాన్ని కాంగ్రెసుకు అండగా గాక అనుబంధ సంస్థగా చెయ్యాలని తలచాడు. అది వారంగీకరించ లేదు. అందువల్ల ఆయన దానిలో పాల్గొనలేదు. ఆచార్యరంగా ఇలా అన్నాడు "నా అనుభవాన్నిబట్టి రైతుసభ కాంగ్రెసుకి అధీనసంస్థగా ఉంటేనే మంచిదని అంటే వారు దానికి అంగీకరించక, మాది కాంగ్రెసుకు అండగా ఉంటుంది గాని అనుబంధంగా వుండటానికి వీల్లేదన్నారు. ఇదివరకు ఆఖిల భారత కిసానుసభ కాంగ్రెసుకి అండగా ఉండాలనే ఉద్దేశంతోనే స్థాపించాము, అదికమ్యూనిస్టుల చేతిలో పడింది. దీనికి అట్టి గతి పట్టకుండా ఉండగలందులకు నేను కిసాను కాంగ్రెసు స్థాపిస్తున్నానని ప్రకటించి కిసానుకాంగ్రెసును 1945 సెప్టెంబరు 26 స్థాపించాడు. కాంగ్రెసు రాజకీయ నాయకత్వమే కిసానుకాంగ్రెసు అనుసరిస్తుంది. హక్కులను గురించి పోరాటాలు, సత్యాగ్రహాలు, కాంగ్రెసు ఆజ్ఞానుసారమే జరుపుతుంది, రైతుల దైనందిన ఆర్థిక అవసరాలను తీర్చుకోవలసి ఉంటుంది. ఈ కిసాను కాంగ్రెసు ఆంధ్రాలో బలపడింది. కాని యావద్భారతంలో ఇది ఇంకా వృద్ధి కాలేదు. రాజకీయ పార్టీలు అధికమై ఆయా పార్టీల ప్రాబల్యం కొరకు రైతులను ఉపయోగించు కోవాలనే ప్రయత్నమే ఇందుకు కారణం.

21.11.1946 తేదీని కిసాను కాంగ్రెసు సభ ఆచార్యుని అధ్యక్షతన ఢిల్లీలో జరిగెను. వివిధ ప్రాంతీయులతో కూడిన వర్కింగు కమిటీ కూడ ఏర్పడింది. 1931 లో ఆంధ్రలో జస్టిస్ పార్టీ వారు రాష్ట్ర రైతు సంఘాన్ని స్వాధీనం చేసుకుంటే, ఆయన రైతు సంఘాన్ని స్థాపించి అనంతరం దాన్ని స్వాధీనం చేసుకొన్నారు.

## ప్రపంచ ఉత్పత్తిదారుల సభ

మార్క్స్, లెనిన్, స్టాలిన్ ప్రభృతులైన పాశ్చాత్య కమ్యూనిష్టు సిద్ధాంతులు ఈ ప్రపంచ ఆర్థికవ్యవస్థ యందు పీడిత ప్రజలున్నారని కనుగొన్నారు. ఆ పీడిత ప్రజలు వారి అనుభవాన్ని బట్టి పారిశ్రామిక కూలీలే అని వారు భావించారు. వారు రైతులను ఒక వర్గంగానే భావించలేదు, వారి పాశ్చాత్య అనుభవాలను బట్టి యింతేకాదు, రైతులు కూలీలుగా త్వరగా మారిపోయేవారని, మారిపోవుట అవసరమని, కనుక వారిని ప్రత్యేక వర్గముగా భావించుట అవసరము లేదనే భ్రమకు లోనైరి. అందుచే పీడిత ప్రజలంటే కూలీలే, అనగా పారిశ్రామిక కూలీలే

అనే దుర్భావమునకు లోనై, సోషలిస్టులు, కమ్యూనిస్టులు వారి కొరకే అధికంగా పాటుపడుతున్నారు.

కాని న్యాయముగా ఆలోచించినచో కార్మికులకంటే అధోగతిలో నుండిన, వ్యవసాయక ప్రజలపై ప్రపంచమంతటా అధికంగా సాగింపబడుతున్న దోపిడీ విధానాన్ని ఈనాటి వరకు పాశ్చాత్య సోషలిష్టులు, కమ్యూనిస్టులు తగినట్లు గ్రహించి, నిరసించి ఎదుర్కొనుటకు పూనుకొన లేకున్నారు

ఈ మహత్తర అన్యాయాన్ని మొట్టమొదట గుర్తించి రైతు ప్రపంచానికి బాసటగా నిలిచిన విప్లవవీరులు, సిద్ధాంత నిర్వచనాచార్యులు, చైనా జాతీయ నాయకుడు, డాక్టరు సన్యట్ సేన్, భారతదేశ భాగ్యవిధాత బాపూజీ, అటు తరువాత ఆచార్య రంగా అంటే ఆశ్చర్యపడనక్కర లేదు.

ఆయన 1945 ఏప్రిల్ 25 తారీఖున గోవాడలో, గుంటూరుజిల్లా రైతు మహాసభకు అధ్యక్షత వహించి యిచ్చిన మహోపన్యాసము నుండి ఆయన ప్రకటించిన భావాలు గమనించిన రైతులకు జరుగు అన్యాయాలు, వాటిని అరికట్టుటకు ఆయన చేసిన సూచనలు ప్రపంచానికి ఎంత ప్రయోజనకరములో ప్రస్ఫుటమగును. అందులోని ఆణిముత్యాలు చూద్దాం.

"అన్ని విధాలా, అన్ని దేశాలందు వలెనే మనదేశమందు కూడా రాజ్యాంగ పెత్తందారులయిన ప్రభుత్వాలు, పారిశ్రామిక పెత్తందారుల ప్రజల యెడల పక్షపాతముతో యున్నారు. బస్తీలు, ఫ్యాక్టరీలు, పారిశ్రామిక ప్రజలు, వ్యాపారులు, వ్యవహారికులు, అధికార ధనికవర్గముల వారికి ఆధిక్యము సంపాదించి పెట్టుచున్నారు. వారిలోనే ఒక భాగమైన పారిశ్రామిక కూలీలకు తగినంత పంచిపెట్టని మాట నిజమే. అందలి యజమాని వర్గము, కూలీవర్గముల మధ్య యీ భాగపంపిణీలలో వర్గసంబంధము కలుగుచున్న మాట వాస్తవమే. ఆ పారిశ్రామిక ప్రజల ఆంతరంగిక వర్గపోరాటమందు హెచ్చున్యాయము కూలీల వైపునే యున్నదని అందరము గుర్తించ గలుగు చున్నాము. అయినప్పటికీ పారిశ్రామిక ప్రజలద్వారా అధిక లాభాల కొరకై యీనాటి వివిధ దేశాల ప్రభుత్వాలు వ్యవసాయక గ్రామీణ ప్రజలకు ఆన్యాయము చేస్తున్నమాట, అందువల్ల పారిశ్రామిక ప్రజలందు కనీస భాగస్థులైన పారిశ్రామిక కూలీలకుగూడా పలుదేశాలలో రైతాంగము గ్రామీణుల కు అందని సౌకర్యములు, ఆనందమయ అనుభవాలు, ఆదాయములు

దక్కుచున్నమాట యెవరు కాదనగలరు. గ్రామములను అభివృద్ధిపరచుటకు బదులు, బస్తీలను బాగుపరచుట, గ్రామీణ హరిజనవాడల పునర్నిర్మాణము చేయుటకు బదులు బస్తీలలోని కూలీజనుల మురికి వాడల పునర్నిర్మాణము పైననే ప్రత్యేకశ్రద్ధ చూపుట, గ్రామీణుల నిరక్షరాస్యత పోగొట్టుటకు మారు, బస్తీ ప్రజలకు ఉన్నత విద్యాసౌకర్యములు కల్గించుట, వ్యవసాయ దారులకు సాధారణ వైద్య సౌకర్యాలు అందించుటకు బదులు, పరిశ్రమలందలి, ప్రజలకు వివిధ రోగాల చికిత్సలకై ప్రత్యేక ఆస్పతులు నిర్మించుట, యీనాటి ప్రభుత్వాల అన్యాయపు రీతికి కొన్ని తార్కాణాలు.

ఇది బస్తీలు గ్రామాల మధ్య బయలుదేరిన సమస్య కాదు, వ్యవసాయిక ప్రజలు, పారిశ్రామిక కూలీల మధ్య చెలరేగు సమస్య కాదు. ఈ వైపరీత్యమగు వ్యవస్థలను కలిగించుచున్న అసలు సమస్యయేది?

అదియే పారిశ్రామికవర్గాలు వ్యవసాయక వర్గాలను పీడించు సమస్య. పారిశ్రామికవర్గాలు రాజకీయాధికారాన్ని చేపట్టుకొని రైతాంగమును రాజకీయంగా, ఆర్థికంగా, సాంఘికంగా దీనావస్థలోకి తోసివేసి దిగదొక్కుచున్న సమస్య. పారిశ్రామిక పెత్తందారులు వ్యవసాయికజనుల అనుదిన కృషిఫలితాలను దోపిడి చేయుచున్న సమస్య.

ఈ సమస్య యేఒక్కదేశానికో సంబంధించినది కాదు. ప్రపంచమందలి అన్ని దేశాలలోనూ కొద్దిగానో, గొప్పగానో ప్రత్యక్షమగుచున్నది. ఇంగ్లండు, ఆమెరికాలోనే కాక రష్యాలాంటి కార్మిక నియంతృత్వము వున్న సోషలిష్టు రాజ్యమందు కూడా యీ సమస్య చెలరేగుచున్నది.

ఐతే యీ దోపిడిని అరికట్టుట యెట్లు? రైతాంగమంతా యేకమైతేనే కదా. రైతుకూలీలు ఒక్కటై, పారిశ్రామిక ప్రజలనుండి తమ తమ కష్టార్జిత ధాన్యాదులకు న్యాయమగు ధరలు పొందుటద్వారానే కదా! వ్యవసాయక దేశాలు, పారిశ్రామిక దేశాలు తమ వ్యవసాయక ఎగుమతులకు తగినట్టి ధరలు చెల్లించునట్లు చేయుట ద్వారానే కదా! ఈ ప్రయత్నము దేశవ్యాపితము కావాలి, ప్రపంచవ్యాపితము కావాలి. "

వివిధ జాతుల రైతు ఉద్యమాల మధ్య ఆన్యోన్యత పెంపొందించడానికి అంతర్జాతీయ సహకార ఆవశ్యకతను గుర్తిస్తూ, ప్రపంచ కిసాన్ కాంగ్రెస్ కావాలని రంగా పది సంవత్సరాలనుండి పరితపిస్తున్నాడు. 1914 నుంచి పారిశ్రామిక కార్మికులు ప్రపంచ సంస్థను యే విధంగా పెంపొందించుకున్నారో అలాగే రైతులు కూడ ప్రపంచ వ్యవస్థను నిర్మించుకోవడం అవసరమని ఆయన అభిప్రాయము.

1942 జైలులో (Colonial And Coloured Peoples' Programme For Their Freedom And Progress) రంగు జాతులు–వలస రాజ్యాలు" అనుగ్రంథం రచించుటే గాక "**ప్రపంచ ధనికవాదము, సామ్రాజ్యవాదములకు ప్రపంచ రైతాంగము సవాలు**" అనే ఉద్గ్రంథము కూడ రచించెను. దానిలో ప్రపంచ రైతాంగము, స్వతంత్రదేశాల్లో సహితము ఎలా దోపిడి చేయబడుచున్నదో నిరూపించి, ఏ ఒక్క రాజ్యాధిపత్యము కూడ శాంతిప్రదము కాదని, శ్రమజీవులందరి – అనగా రైతు కూలీ మధ్య తరగతి వర్గముల సంయుక్త రాజ్యాధికారమే సర్వజన శ్రేయోదాయకమని నిరూపిస్తూ, రైతాంగ ఆర్థికపీడను బాపుకోవాలంటే ప్రపంచ ధనికవాద సామ్రాజ్య వాదములతోపాటు, వర్గ నియంతృత్వాధికారాలను కూడ ఎదుర్కొని, ప్రపంచ రైతుకూలీ ప్రజారాజ్యాలను స్థాపించాలని నిరూపించాడు.

ఇటుల ప్రపంచ రైతు సభకై ఆయన పరిపరివిధాల పరితపించు చుండగా, లండనులో జరుగనున్న అంతర్జాతీయ పంటదారుల సమాఖ్యకు రావలసిందిగా ఆచార్య రంగాను ఆహ్వానించారు. ఆచార్య రంగా ఆ ఆహ్వానాన్ని అందుకొని ఇంగ్లాండు వెళ్ళాడు. ఈ సమావేశాన్ని ఇంగ్లాండు, వేల్సు, స్కాట్లాండు, ఉత్తర ఐర్లండు దేశాల జాతీయ రైతు సంఘాల (యూనియన్స్) వారు ఏర్పాటు చేశారు.



ఆక్స్‌ఫర్డ్‌లో సహచరులతో రంగాజీ (1921)
రంగాజీ, వి.యస్. కృష్ణ, లింగం వీరభద్రయ్య చౌదరి, వి. రామకృష్ణ

ఈ సమావేశానంతరం ఎనిమిదేళ్ళకు ప్రపంచ ఉత్పత్తిదార్ల సభ 1946 మే 21 న లండను నగరములో ఆరంభమై కొన్ని రోజులు జరిగింది. ఈ సమావేశానికి బ్రిటీషు డొమినియన్సు యూరపు, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, దక్షిణ అమెరికా మొదలగు 81 దేశాల ప్రతినిధులు వచ్చారు. భారత దేశం నుండి ఆచార్యరంగా, సర్దార్ హబిబుల్లాఖాన్ వెళ్ళారు. దీనికి నేషనల్ ఫార్మర్స్ యూనియన్ (ఇంగ్లండు) ప్రెసిడెంటు జేమ్సు టర్నరు అధ్యక్షత వహించి అతి చాకచాక్యంతో నడిపాడు.

## లండనులో జరిగిన సభ ఆశయాలు

- ప్రపంచములోని ఆహారపదార్థాల ఉత్పత్రి ప్రజల అభివృద్ధికై చేస్తూ జీవిత ప్రమాణము హెచ్చించుట.
- ప్రపంచములోని ధనపంపకము, వ్యవసాయదారులకు, ఇతరులకు, ఉచితరీతిని పంచబడుటకు కృషిచేస్తూ ఇతరులవలెనే రైతులు నిత్యజీవితంలో సుఖశాంతులు పొందుట.
- ఉత్పత్తిదారులకు సరియైన ధరలు ముట్టేటట్టు చూస్తూ అభివృద్ధికరమైన నూతన పద్ధతులతో వ్యవసాయముచేయు ఆవశ్యకత యెంతేని కలదు. రైతులు వ్యవసాయం పారిశ్రామికుల వలె లాభదృష్టితో చేయుటలేదు. ఆర్థిక మాంద్యములో వారి వలె రైతాంగము ఉత్పత్తి తగ్గించుటలేదు.

ఆచార్యరంగా తాను కిసాన్ కాంగ్రెసు ప్రతినిధిగా వచ్చానని చెప్పాడు. ప్రభుత్వం తరపున వచ్చారని వారు అంగీకరించలేదు. చివరకు ఆచార్యుని కృషివల్ల ప్రెసిడెంటు సౌజన్యమువల్ల, మనదేశీయులను ప్రతినిధులుగా గుర్తించారు,

ఆచార్య రంగా అతిచొరవగల మనిషి అని అందరు ఎరిగినదే. ఆయన సభలో చాలా ప్రధాన విషయంపై మాట్లాడి ప్రాముఖ్యము పొందాడు. ఆయన ఉపన్యాసమును అందరు హర్షించారు. భారతదేశము సభ ఖర్చులకు యివ్వవలసిన మొత్తాన్ని వారధికంగా కోరేసరికి మాది బీదదేశము మా రైతు సంఘసభ్యత్వం ఒక అణా అని గ్రహించవలసినదనే సరికి మీ యిష్టము వచ్చినంత యివ్వవలసినదని అంగీకరించారు, ఆయన ఈ సభకు నిర్వాహక సభ్యుడుగా కూడా ఎన్నుకోబడ్డాడు,

ఆయన ఉపపాదనలు అనేకం అంగీకరింపబడినవి. అవి అన్ని బీదదేశాలు, వ్యనసాయకదేశాలు అగు ఆఫ్రికా, చైనా, ఇండియా మొదలగు దేశాలకు చెందినవే. అధికంగా, సభ్యత్వరుసుము చెల్లించుటకు ఈ దేశాల ఆర్థికదశ గమనించాలని, అలా ఈ దేశాల ప్రతినిధులు ఇతర ప్రతినిధులవలె కాక వారిచే నియమింపబడిన వారు కూడ వచ్చుటకు అవకాశం యివ్వాలని, పంటలధరలు కూడ యీ దేశీయుల స్థితిగతులను బట్టి నిర్ణయింపబడాలని, హిందూదేశమునకు అవసరమైన పంటలు అధికంగా పండించాలనునవి కలవు.

సభా చర్చలలో పాల్గొని ఆయన, తూర్పుదేశాల అవసరాలకు ఆనుగుణ్యంగా వాదించాడు. వ్యవసాయము తదితర ఉత్పత్తులు, అమ్మకం కొనుగోలు అన్నీ సహకార పద్ధతిలో జరగాలని హెచ్చరించాడు.

ఆయన చర్చలకు, ప్రతిపాదనలకు, సలహాలకు అచ్చెరువొందారు. విశేషంగా అమెరికాసంయుక్తరాష్ట్రాల ప్రతినిధులు, కెనడా, ఆస్ట్రేలియా న్యూజిలాండు మొదలగు దేశాల ప్రతినిధులు, భారతదేశ వ్యవసాయమును గురించి, వారి ఆదర్శ జీవితమును గురించి మీద్వారా తెలుసుకొని మేము అమితానందం పొందామని, మీబోధలు మాకు నూతన జీవితాదర్శము కలుగచేసినవని ప్రశంసించారు.

ఆచార్యరంగా యీ సభాకార్యక్రమం తోనే తృప్తిపడక ఆయన ఆంగ్లదేశములో పున్న అయిదువారాలు (మే 6 –జూన్ 11 వరకు) విరామం లేని కార్యక్రమములలో పాల్గొని భారతదేశానికి బహువిధముల లాభకరంగా పాటుపడ్డాడు, అక్కడ ప్రముఖులగు హేరాల్డు లాస్కి, జి.డి.హెచ్. కోలును

కలుసుకున్నాడు. ఇండియా ఆహార, వ్యవసాయ సమస్యలగూర్చి బ్రిటిషు మంత్రులైన సర్. బెన్ స్మిత్తు తోను, టాం విలియమ్స్ తోను, భారతదేశానికి ఆధునిక వ్యవసాయ పరికరాలు సప్లయిచేసి వ్యవసాయాన్ని వృద్ధిచేసే విషయాలను గురించి చర్చించాడు.

భారతదేశంలో వ్యవసాయానికి సంబంధించిన సమస్యలను గురించి వ్యవసాయశాస్త్ర నిపుణులతో సంప్రదించాడు. శాస్త్రీయమైన వ్యవసాయ పద్ధతులు పరిశీలించుటకు ఇంగ్లండులోని వివిధ వ్యవసాయ ప్రదేశాలలో పర్యటించాడు. "వ్యవసాయ పరిషత్తు ప్రతినిధులు లండనులోని రాయల్ ఫారమును చూడడానికి వెళ్లినప్పుడు సార్వభౌమునికుటుంబాన్ని కలుసుకున్నారు,అప్పుడు రాజ కుటుంబానికి ఆచార్య రంగా గారికి కులాసా బాతాఖానీ నడిచింది. అన్ని మాటల్లోనూ ఆయన జైలుకబుర్లు కూడావచ్చాయి. ఆయన ఆరుసార్లు జైలుకు వెళ్ళాడని పత్రికలలో రాజకుమార్తె చదివారేమొ! జైలులో ఎలా చూసేవారని, ఎందుకు జైల్లో వేసే వారని, ఏ ఏ జైళ్లలోకి తోసేవారని...ఆయన్ని ప్రశ్నా పరంపరలతో ముంచెత్తారు. రంగా గారు మర్యాదగా జవాబులు చెపుతూండగా రాకుమార్తె నవ్వుతూ అబ్బా!అన్నిసార్లు జైలులో పడ్డారేం? చాలా భయంకర మనిషివన్నమాట' అంది,

ప్రపంచ ఉత్పత్తిదార్ల సభాప్రతినిధులకు భారతదేశములోని ప్రజలకు ఆహార ఆవశ్యకతను గురించి అధికంగా నచ్చచెప్పి, ఆహారం పంపుటకు ప్రయత్నాలు చేశాడు. వారు రైతుకూలీ ప్రజారాజ్య సిద్ధాంతాన్ని అధికంగా ప్రశ్నించారు. అదే రైతులకు ఇతరులకు కళ్యాణప్రదమని అంగీకరించాడు.

తన ప్రయాణములో సాధించిన సంగతులు మహాత్మునకు మనవిచేసి, మనదేశములో క్షామబాధనివారణకు,వ్యవసాయాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు తయారుచేసి, భారత జాతీయ మహాసభకు ఇండియాప్రభుత్వానికి అందజేశాడు.

వ్యవసాయ ఉత్పత్తిదారుల అంతర్జాతీయ మహాసభ హాలెండు దేశములోని హేగ్ నగరమందు సమావేశమైనది. ఈ సభకు ఇండియా, బర్మా, చీనా మొదలగు తూర్పు దేశాలు, మరివివిధ దేశాలనుండి 200 మంది కంటే అధికంగా కర్షక ప్రతినిధులు వచ్చారు.

ఈ సభకు లోగడ ఆచార్యరంగా చెప్పినట్లు అనధికార ప్రముఖ నాయకత్వం అంగీకరించి ఆయన ఆధ్వర్యానే ప్రతినిధి వర్గాన్ని మన ప్రభుత్వం పంపినది. ఆయన భారత శాసనసభా సభ్యుడగు వడ్లపట్ల గంగరాజు, నెల్లూరి వెంకట్రామ నాయుడు. (పాకాల) పాములపాటి బుచ్చినాయుదు మున్నగు రైతు ప్రముఖులను ప్రతినిధి వర్గంగా తీసుకొని వెళ్ళటం సంతోషప్రదం. నేటికి ఆయన ఆధ్వర్యాన భారత దేశ రైతు అంతర్జాతీయ కర్షక సభల సమానప్రతిపత్తి సంపాదించ గలిగాడంటే సంతోషింపని రైతు ఉండునా?14 మే 1947తారీఖున జేమ్స్ టర్నర్ గారి ఆధ్యక్షతన సభ ప్రారంభమైనది. ప్రపంచ కర్షక జనాభ్యుదయమునకై 11 అంశాల ప్రణాళిక నొకదానిని తయారుచేసి ఆ సభలో ఆచార్య రంగా వివరించెను.

- మిగిలిన పాటకపు జనులతోపాటు ప్రజాస్వామ్య ధర్మముల ననుసరించి సహకారముతో వ్యవహరించవలెను.
- ఆర్థిక సంపదను విస్తరింపజేయుటకై ఆహార వస్తువుల పంటలను, వస్త్రనేతకు వినియోగపడు దినుసులను అత్యధికంగా పైరుచేయవలెను.
- పంటలకు, అగ్నిప్రమాదాలకు, పశువులకు, జనుల ఆరోగ్యమునకు బీమాలు ఉండవలెను.
- వ్యవసాయ ఫలసాయములకు వెలలను, వ్యవసాయకూలీ రేట్లను ఒక స్థిరప్రమాణములో నిర్ణయింపవలెను.
- రైతాంగపు వ్యవసాయ సామర్థ్యమును వృద్ధిచేయుటకు ఆధునిక యంత్ర ప్రయోగమును వృద్ధిచేయవలెను.
- రైతులకు సహాయకారిగా నుండగల పెద్ద పెద్ద కీలక పరిశ్రమలను ప్రభుత్వమే వశపరచు కొనవలెను.
- వివిధ రాజ్యాలవారు పరస్పరంగా బహురాజ్యాలతో సరుకు పంపు అగ్రిమెంట్లు తీసుకోవాలి.
- ఒక దేశంనుంచి మరొక దేశానికి రంగు భేదం, మతభేదం లేకుండా రైతులను పంపుటకు అంతర్జాతీయ రైతాంగ సహకారము ఉండవలెను.
- వేరువేరు దేశాలలో వ్యవసాయ జలాధారములు ఉండవలెను.

- రైతుల సహకారసంఘాల ద్వారా పంటసరుకుల నుండి పలు విధాలైన యితర పదార్థాలను తయారుచేయుట వృద్ధి పొందించవలెను
- గ్రామాదులలోని ప్రజాజీవిత పద్ధతులను ఆధునికావసరములకు తగినట్లుగాను, గ్రామజీవిత విశిష్టలక్షణంగాను పునర్నిర్మాణము చేయవలెను. ప్రపంచ వ్యవసాయసభకు నియమించబడిన కమిటీకి ఆచార్యరంగా సభ్యుడుగా యెన్నుకోబడెను.

హేగ్ సభలలో ఆయన ధోరణిని చాలావరకు అంగీకరించిరి. ఆయన సందేశమునకు హర్షించిరి. ఆచార్యరంగా యీ దఫాకూడ ఆరువారాలు విదేశాలలో ఉండి అహర్నిశలు కృషిచేశాడు. ఇంగ్లాండులోని విప్లవ వైజ్ఞానిక నాయకులందరిని కలుసుకొని రైతుకూలి ప్రజారాజ్యాశయ సిద్ధాంతాలను తిరిగి చర్చించి వారందరి ఆమోదం పొందెను.

జెనివా,మాంటోలలో సాగుచున్న అంతర్జాతీయవ్యాపారసభకు వ్యాపారస్తుల సభకు వెళ్లి వారి నాయకులతో సంప్రదించి, మన దేశానికి యే ధోరణి మంచిదో ఆలోచించుకొనెను. ఫ్రాన్సులోని నాయకుల సభకు అరుగుటేకాక, అచటి విదేశాల మంత్రులతోను, లండనులోని భారతదేశపు శెక్రటరీతోను మాట్లాడి, అంతర్జాతీయ రాజ్యాంగ వ్యవహారములందు ఈనాడు భారత దేశానికి తగిన ధోరణి యేదో ఆలోచించుకొనగల్గెను.

ఆచార్యరంగా వరుసగా జరిగిన అంతర్జాతీయ వ్యవసాయసభలు మూడింటికి అరిగి, ప్రముఖ పాత్రవహించి, కర్షక లోకానికి చేయుచున్న సేవ కర్షక లోకం కొనియాడ తగియున్నది.

ప్రపంచ నాగరిక దేశాలవలె మన భూములను ఏకఖండాలుగా చేసి యంత్రోప కరణాలతో, సహకారపద్ధతిని సాగించిన నాడే మన కృషీవలులు కోలుకొనేది అని అన్న ఆయన అనుభవాన్ని ఆచరణలో పెట్టాలి.

## ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు ఆధ్వర్యం

కాంగ్రెసు 1885 సం.లో స్థాపింప బడినప్పటికీ ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘము 1918 వరకు లేనేలేదు. 1917 డిసెంబరులో అనిబిసెంటు అధ్యక్షతన జరుపబడిన కలకత్తా కాంగ్రెసులో ఆంధ్రరాష్ట్ర సమస్య చర్చకు వచ్చింది. బీసెంటు, దక్షిణదేశ రాజకీయవేత్తలు తీవ్రముగా ప్రతిఘటించారు. మహాత్ముడు కూడ

మాంటుఫర్డు సంస్కరణలు ప్రవేశపెట్టబడేవరకు యీ తీర్మానము ఆపితే బాగుండు నని అభిప్రాయ పడ్డాడు. ఆ కాలములో రాజకీయాకాశాన మధ్యందిన మార్తాండునివలె భాసిల్లుచున్న, లోకమాన్యతిలక్, నిజమైన రాష్ట్రీయ స్వయం పరిపాలనకు ముందుగా, భాషాప్రయుక్త రాష్ట్రాలు నిర్మింపబడవలెననే సిద్ధాంతము ఆమోదించుటచే, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘము ఎట్టకేలకు అంగీకరింపబడింది. దీని అనంతరమే కాంగ్రెసు భాషాప్రయుక్త రాష్ట్ర సిద్ధాంతాన్ని అంగీకరించి ఆ విధంగా రాష్ట్రవిభజన చేసింది.

1918 లోఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘము ప్రారంభింపబడింది. అంతకు 3 సంవత్సరాలకు పూర్వమే తన ప్లీడరీవృత్తిని త్యజించి ఆంధ్రదేశసేవకు అంకితమై, తన సాదృశ్యంచేతనే ఆంధ్రులకు దేశసేవ చేయనేర్పిన దేశభక్త కొండా వెంకటప్పయ్య 1918 మొదలు 1923 వరకు అధ్యక్షత వహించాడు. ఆయన మనకు అన్నిట ఆదిగురువు, అచ్చమైన గాంధిజీభక్తుడు, నిండు హృదయము ఆయనది. ఆయన జీవితం దేశసేవలోనే పండిపోవుచున్నది,

అటుతర్వాత ఆంధ్రపత్రిక ద్వారానే కాక వివిధరీతుల మనకు విద్యావికాసం కలిగించి అనేక విధాల ఆంధ్రుల అభివృద్ధికి తోడ్పడ్డ అమరనాయకుడు, విశ్వదాత దేశోద్ధారక నాగేశ్వరరావు 4 సంవత్సరములు ఆధిపత్యం వహించాడు. ఆయన నిజంగా దేశోద్ధారకుడు, విశ్వదాత కూడా. ఆయన వల్ల సహాయము పొందనివ్యక్తి, సంఘముకూడ ఆంధ్రదేశములో అరుదు.

ఆంధ్రులకు ప్రాణప్రియుడై ప్రఖ్యాతిగాంచిన ప్రజానాయకుడు ప్రకాశం 12 సంవత్సరాలు పనిచేశాడు. నటుడై, నాగరికుడై, ప్లీడరై, పురపాలక సంఘాధ్యక్షుడై, బారిస్టరై, భోగియై, పత్రికాధిపతియై, త్యాగియై, యోధుడై, ప్రజానాయకుడై, మంత్రి, ప్రధానమంత్రి అయి, దక్షిణ దేశానికి నాయకుడై, విరాజిల్లుచున్నాడు. ఆయన తన ఆస్తిని, ఆరోగ్యాన్ని ఆంధ్రదేశ శ్రేయస్సుకై అర్పించాడు. ధైర్యము ఆయన సొమ్ము, త్యాగము ఆయన విశిష్టత. పట్టుదల ఆయన ప్రత్యేకత. ప్రజాసేవ ఆయన జీవిత పరమావధి. ఆయన ఆంధ్రకేసరే. భయమెరుగని ప్రకాశం మనలను నిర్భయులుగా చేశాడు.

1937-39 వరకు ప్రకాశం గారు మంత్రియైన కాలంలో డాక్టరు పట్టాభి ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడు అయినాడు. పట్టాభి నిండు నిలువునా ఆంధ్రుడు.

ఆంధ్రరాష్ట్రనాయకులు, ఆంధ్రరాష్ట్రకాంగ్రెసు అధ్యక్షత వహించుట వారి సేవలకు తగిన గౌరవస్థానము పొందుట. ఆచార్యరంగా ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షతకై ప్రకాశంతో ఒకపరి, 1938 లో డాక్టరు పట్టాభితో మరొకమారు పోటీ చేసి పీటీ అయినాడు. 1946 లో ఆయన దానికై కృషి చేయకపోయినా అధ్యక్షుడైనాడు.

త్యాగము, కష్టసహిష్ణుత, సేవ ఆయన్ని అధికునిగా చేసినవి. ఆంధ్రనాయకులలో అధిగమించిన సేవాతత్పరత ఆచార్య రంగాలో కలదు. విధివిరామము లేకుండ 20 సంవత్సరాలు వివిధరీతుల దేశసేవ చేయుచున్న యువజన నాయకుడు రంగా. ఆయన వర్గ సంస్థలద్వారా రాజకీయ చైతన్యం కలిగించుటే కాక అనేక కార్యకర్తలను సృష్టించాడు.

ఆంధ్రరాష్ట్రములో మనకంటికి నేడు మూడే మూర్తులు ముఖ్యంగా కన్పిస్తున్నవి. ప్రకాశం, పట్టాభి, రంగా. వీరందరూ స్వయం ప్రకాశకులే. పట్టుదలకు ప్రకాశం పెట్టింది పేరు. ప్రతిభకు పట్టాభి ప్రసిద్ధుడు, సేవావ్రతంలో రంగాసిద్ధుడు. ఈ మూడుమూర్తులు కలిస్తే ఆంధ్రదేశ ప్రతిష్ట యావద్భారతమున వ్యాపించగలదు,

ఆచ్యార రంగా ఆంగ్ల దేశానికరిగిన సమయాన ఆయన అభిమానులు ఆయన అధ్యక్షతకై ప్రయత్నించారు. బెజవాడలో 1946 మే 16 తారీఖున జరిగిన ఎన్నికలో పళ్ళంరాజుకు 68 ఓట్లు రంగాకు 105 వచ్చుటచే రంగాగారు అధ్యక్షుడయ్యాడు.

నాయకత్వానికి అధికారమే వుండనక్కరలేదు. అధికారం నాయకత్వానికి కొంత అవసరమైతే కావచ్చు. ప్రకాశం, ఆచార్య రంగాలకు అధికారం లేకపోయినా వారి నాయకత్వానికి లోటువుండదు. ఆచార్యరంగా యెడ ప్రజాభిమానానికి యిది వరకు ఏ పదవి పనిచేసింది? రంగా నాయకత్వమును పల్లెప్రజల స్వాధీనము చేయవలెననే పట్టుదలతోనే ఆయన లోగడ రెండుసార్లు పోటీచేయుట జరిగింది. మహాత్ముడు కాంగ్రెసును పట్టణాలనుండి పల్లెలకు మరలించినా, పల్లెప్రజల క్షేమానికి పాటుపడమని పదేపదే పల్కుచున్నా, పల్లె ప్రజలను అధికార వంచితులను చేయాలనే పట్టణవాసుల పూర్వవాసన యింకా పోలేదు! అయినా వారి ఆశలు అడియాసలే కాని ఇక సాగవు. పల్లె పట్టులలో కావలసినంత రాజకీయ చైతన్యము వచ్చింది నేడు. కాంగ్రెసు అధికంగా రైతుసంస్థ కావాలనే మహాత్ముడు, సర్దారు

పటేలు, నెహ్రూల కోర్కె, ఆచార్య రంగా ఆందోళన చాలాకాలమునుండి ఆదే. కర్షక, కార్మికరాజ్యం కావాలనే ఆగష్టు తీర్మానంతో అది ఆరూఢమైంది. ఆచార్యరంగా అధ్యక్షతతో ఆంధ్రదేశంలో కూడ రూఢమైంది. ఆయన ఆధ్యక్షతను గురించి పత్రికలు యేమంటున్నయ్యో పరికిద్దాము. ప్రజాభిప్రాయాలకు ప్రత్యక్ష ప్రబల ప్రమాణం పత్రికలే గదా!

"ఆచార్యరంగాగారు ఎప్పడో ఈ పదవి వహించవలసినవాడు. కారణాంత రాలవల్ల అలా తోసుకొంటూ వచ్చింది. ఆయన సేవను దేశము యిప్పటికి గుర్తించినందుకు సంతసింపవలసినదే.

దాదాపు పాతికేళ్ళనుండి రంగాగారు విధివిరామము లేకుండ దేశసేవ సేయుచున్న సేవాధురీణులు, రైతుకూలీ ప్రజారాజ్యమే అతని లక్ష్యం. ఈ లక్ష్యసిద్ధికై నిరంతరము పాటుపడుతున్నాడు. జగమెరిగిన ప్రజా సేవకుడు.

దేశం కాటకానికి గురియైవుంది. ఇట్టి మహాక్లిష్ట సమయములో మనరాష్ట్రానికి ప్రధాని ప్రకాశం రావడం, రాష్ట్రానికి అధ్యక్షుడు రంగా కావటం, రాష్ట్రాన్ని ఎదుర్కొన్న ఘోర బాధలనుండి తరించటానికి శుభచిహ్నమని చెప్పాలి. రంగా గారును, ప్రకాశంగారును, ఒకరిని మించి యొకరు పాటుబడతగ్గ ఉత్సాహపరులు, కార్యశూరులు, వీరి కార్యపరతంత్రతవల్ల దేశము శాంతము, సుభిక్షము బడయుగాక యని వాంఛించు చున్నాము. (*చిత్రగుప్త* 1946 జూన్ 1)

ఎన్నికలలో ఆచార్య రంగా కేవలం తన స్వశక్తి మీద విజయం పొందలేదు అనుటలో అతిశయోక్తి లేదు. కనుక రంగావిజయం కిసాన్ విజయంగా భావించ డానికి వీలులేదు. ప్రజానాయకుడైన ప్రకాశం పంతులు గారి తరువాత ఆంధ్రదేశంలోని పల్లెల్లో సంచారం చేసి ప్రజలతో ప్రత్యక్ష సంబంధం కలిగిన కాంగ్రెసు వ్యక్తులలో ఆచార్య రంగా పేర్కొనదగిన వాడు. రైతునాయకుడైన రంగా, తనరాజకీయాలు ఒక విధంగా నిర్ణయించుకొంటే యింకను ప్రముఖస్థానాన్ని ఆక్రమించుకొన శక్తిగలవాడు. కాని ఆయన లోపమెల్లా రాజకీయ స్థిరత్వం లేకపోవటమే. స్వార్థములేని త్యాగి, కష్టజీవి, నిరంతర దేశసంచారి, కార్మిక, కర్షకుల నాయకుడు. రానున్నది ప్రజారాజ్యం అంటే కార్మిక, కర్షకుల రాజ్యమన్నమాట. ఆందుకు సూచనగా కార్మిక, కర్షక నాయకుడైన ఆచార్య రంగా కాంగ్రెసు సంఘాధ్యక్షుడవటం ఎంతయు సంతోషింపదగిన విషయం. ప్రకాశం

పంతులు, రంగాల సహకారం మీద భావి ఆంధ్రరాజకీయాభివృద్ధి ఆధారపడియున్నది." (*ఢంకా*1946 జూన్.)

అఖిలభారతకిసాన్ కాంగ్రెసు అధ్యక్షుడు, కేంద్ర శాసనసభా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి, అంతర్జాతీయకృషీవల సమావేశ ప్రతినిధి, ఆచార్య శ్రీ యన్. జి. రంగా ఆ. రా. కాం. సం. అధ్యక్షునిగా ఎన్నుకోబడటం వారికి పులగంమీద పప్పు. వారికీ పదవి కట్టబెట్టటంలో జరిగిన ప్రత్యేక ప్రచారము, ఆందోళన వారి సహజగౌరవ ప్రవృత్తిని విస్మరించినట్లు గోచరించింది. అయినను వారీ క్రొత్త పదవిని అలంకరించినందుకు మా హృదయపూర్వకాభినందనములు అర్పింపక తప్పదు. సతీమణీ సహాయుడై కాంగ్రెసు ఉద్యమంలో దిగి వారు దేశమునకు చేసిన సేవ లోకవిదితము. ఒక వైపు కమ్యూనిష్టుల సర్వకుల నిర్మూలనా ప్రచారము, ఒకప్రక్కన సమరస సామ్యవాద ప్రబోధము, మరియొక ప్రక్కన గాంధీ మహాత్ముని అహింసాసత్యయుగళిసందేశమూ త్రివేణులై ప్రవహించు నీ శుభపర్వసమయాన కాంగ్రెసు లేబరు నాయకుడైన రంగా గారు ఆంధ్రరాష్ట్ర నాయకత్వ మంగీకరించుట ముదావహము. భావినాయక శిఖామణులై వెలయగల యువజన సమూహమును, పాడిపంటలు పెంపొందించు రైతుబిడ్డలను, సంఘమున సమాన అవకాశాలను కోరు కార్మికవర్గములనూ, సమాధానపరచి పుష్టికరమైన నూతన సాంఘిక సామరస్యమునకు రంగా గారు నిర్భయముగా పాటుపడగలరని విశ్వసించు చున్నాము." *(జన్మభూమి 1946 మే 18)*

ఆచార్యరంగా ఆధ్వర్యము వహించుటకు ఆంధ్రప్రభ ఆదినుండి అఖండ ప్రచారంచేసింది.ఆంధ్రపత్రికా ప్రపంచములో తనప్రత్యేకతను ప్రకటించుకొనుచున్న కృష్ణాపత్రిక యేమన్నదో తెలుసుకొన కుతూహలం పాఠకప్రపంచానికి కలగటం సహజం. ఆ సంగతి కూడ తెలియజేస్తా.

"కార్మిక కర్షక ప్రజారాజ్యం కోసం కలలు కంటూన్న భావుక శ్రేష్ఠులు ఆచార్య రంగా గారు. భావుకతకు దీటైన కార్యోత్సాహము, వాక్ప్రసారము వారిలో వున్నాయి. అట్టి వారు ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసుకు అధ్యక్షులైనపుడు, కాంగ్రెసు ఉద్యమంలో ఏదో ఒక నవ్య చైతన్యం తొణికిసలాడకుండా ఎలావుంటుంది?'

ఆయన ఆధ్వర్యాన 1946-6-21 నిడుబ్రోలు సమావేశంలో జరిగిన ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కార్యనిర్వాహక వర్గ సభలో జరిగిన తీర్మానమును గురించి కృష్ణాపత్రిక ఇలా వ్యాఖ్యానం చేసింది. "కాలం అతివేగంగా పరుగిడుతోంది. ఆ

పరుగును అందుకోవాలనే ఉత్సాహం రంగా గారిలో వ్రేళ్లు ఊనుకుంది. రాష్ట్ర కాంగ్రెసు వ్యవహారాల్లో కూడ ఆ వుత్సాహాన్నే వారు పూరించారు. మొన్న నిడుబ్రోలు సమావేశములో వెలువడిన తీర్మాన పరంపరలకు ఇదే ముఖ్య కారణం.

ఆనాటి కొన్ని తీర్మానములు. 1. కిసాన్ మజుదూరు ప్రజారాజ్యం స్థాపించుటకై గాంధిమహాత్ముడు ఆదేశించిన విధంగాను, 1942 ఆగష్టు తీర్మానములో సూచించిన విధంగాను, అహింసాపూర్వక నిర్మాణకార్యక్రమాన్ని, యితర సేవావిధులను నిర్వర్తించుటకుగాను, గౌరవవేతనాల మీద ఒక సేవా సంఘమును యేర్పాటుచేయుట.

ఆంధ్రజిల్లాలన్నిటిలో మొత్తంమీద 590 రెవిన్యూ ఫిర్కాలు కలవు. గనుక ఒకొక ఫిర్కాకు ఒకొక కాంగ్రెసు సేవకుని నియమించుటకు సంకల్పించారు. యిందుకు సాలుకు 3లక్షల రూపాయలు ఖర్చు అగునని మదింపు వేయబడినది.

మహాత్ముని ఆశీస్సులతో కాంగ్రెసు సేవాసంఘమును స్థాపించుటతు ఆయన అదివరకే సంకల్పించి యున్నాడు. ఆ సంకల్పం యీ విధంగా సఫలమైంది. దానికి ఆంధ్రులు యెంత సాయసంపత్తి కలుగజేస్తే అంత త్వరగా పూర్తి కాగలదు. ఇలా సేవాసంఘాన్నేగాక, జాతీయవిజ్ఞానాన్ని, సాహిత్యాన్ని, కళలను పోషించడానికి జాతీయ విజ్ఞానపరిషత్తు ఒకటి స్థాపించ తలపెట్టారు. అది స్థాపించబడింది కూడ. కాంగ్రెసు కార్యక్రమాలను ప్రచారము చేస్తూ యెడనెడ జాతీయ వాఙ్మయ ప్రదర్శనాలను జరుపుచుండుటకు ఒక ప్రచురణశాఖ నెలకొల్ప సంకల్పించారు.

చిన్నతనాన కన్నతల్లి మరణించగా అపారమైన ప్రేమతో చిన్నమెత్తు మాట కూడా అనక కన్నతల్లి కంటే కడు మక్కువతో పెంచి పెద్దవాడిని చేయుటే కాక భూమాత యందు అధిక అభిమానం కలిగించిన పెద్దతల్లి మంగమ్మ పెద్ద గురువు.

రంగా చిన్నతనంలో పంతులు బాధపడలేక, బడికి దొంగ కాగా మంచి వ్యవసాయకురాలైన పెత్తల్లి మంగమ్మ 'ఈ చదువుల వల్లనే బాగు పడాలా ?' అంటూ ఆయన్ను పొలం తీసుకొని పోయి పిట్టల తోను, పచ్చికతోను, పంటలతోను, పూవులతోను పరిచయం కలిగించేది. బాల్యంలో ఆయన కంది పూవు చూసేవాడు, కందికాయ కాయించే వాడు, బంతులు గుచ్చేవాడు, పైరుల మధ్య పని చేసే వాడు, పొలాల్లో పల్టీలు కొట్టే వాడు. పచ్చ జొన్న పాలు, మొక్కజొన్న పెరుగు, తుదకు ఆ గరికపోచల మార్దవము, పుట్ట కొక్కుల అందచందాలు, తుమ్మల జిగురు, మర్రుల పొగడాలలో ఉండే గొప్ప గ్రంథాలను, ఆ సృష్టి, దేవతారాధన సరసన

పారాయణ చేసేవాడు. జొన్నచేను సువాసన, దోసపూవు అందం, బీరపాదు శృంగారం, వంగచెట్టు వగరు, మిరపల తొగరు, సజ్జల తీరు, కొతిమేర ఇంపు, బంతుల సొంపులలో గల చదువులను రైతాంగజీవితం అనే పాఠశాలలో పదేళ్ల వయసు వచ్చే వరకు అభ్యసించాడు.

రంగా బాల్యంలో బడికి పోక చదువు సంధ్యలు లేక తిరుగుచున్న రోజుల్లో ఆయన లోని తెలివితేటలను గ్రహించి, అభివృద్ధిలోనికి వచ్చే వాడని భావించి, ఆయనను నవలలు , చరిత్రలు, ప్రబంధాలు, పురాణాలు, అవీ.. ఇవీ అననేల దొరికిన ప్రతి గ్రంథము పరిచయపరచి , అమరకోశంతో పాటు ఆంధ్రపత్రిక కూడా పారాయణ చేయించాడు పంతులుగారు. జంపని ఆంజనేయులు గారు గురువుగా పుస్తకాలలోని సంగతులే కాక శివాజీ శూరత్వం, అరవిందుని వీరత్వం, బందరు వారి బజాయింపులు, కాంగ్రెసు వారి కామితార్థాల గురించి ఇంపు కలిగేటట్లు చెప్పారు.

గురువల్లా మిత్రుడు అయ్యాడు. అనంతరం అఖిల భారత ప్రయాణ ఉత్సాహం కలిగించాడు. పౌరాణిక క్షేత్రాల రహస్యాలు తెలిపాడు. ఉత్తరాది వారి విషయాలు విశదపరచాడు. ఉపన్యాసాలు చేయడానికి, వ్యాసాలు రాయడానికి ప్రోత్సహించాడు. విద్యయందు అభిమానం కలిగించి ఆంధ్రభాషలో అధిక సంపన్నునిగా చేసి, వివిధ విషయాలపట్ల జ్ఞానాన్ని విస్తృత పరచి ఆంగ్ల భాషా పఠనానికి ప్రోత్సాహమిచ్చాడు.

హైస్కూలు ఉపాధ్యాయుడు రావెల్ల వెంకయ్య ఆయనకు ప్రకృతిని ప్రేమించాలని చెప్పుటే కాక, ప్రజాభ్యుదయం కోరే వారంతా ప్రతి విషయాన్ని గురించి లెక్కల దాఖలా విచారించాలని, గోపాలకృష్ణ గోఖలే గారి గొప్పతనమంతా అందు లోనే ఉన్నదని శిష్యునికి నూరిపోసెను. ఆ గురువుగారు వేసిన పునాదుల మీదనే తన ఆర్థిక , రాజకీయ గణాంకాలను, పరిశోధనా చరిత్రను పూర్తి చేశాడు.

నాలుగో గురువు వెలగపూడి రామకృష్ణ. ఆచార్య రంగా ఆంగ్లదేశంలో విద్యార్థిగా ఉన్నపుడు ఆయనకు సంరక్షకునిగా ఉండుటే గాక, స్త్రీలను గౌరవించడం నేర్పి స్వదేశ, స్వజాతీయాభిమానం కలిగించి మార్గదర్శి అయ్యాడు. ఆంగ్ల సాహిత్యము, ఆర్థిక, రాజకీయ సూత్రాలు బోధించి, ఆయన అడుగు జాడల్లో మెలిగే టట్లు చేయగలిగాడు.

రంగాను శిష్యునిగా అభిమానించే ఆయన గురువు బేకర్ అమెరికా వెళ్లి రాజకీయశాస్త్రం చదువ దలచుకున్న రంగాను నిరుత్సాహపరచి, ఆర్థిక శాస్త్రం చదివితే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని ప్రోత్సహించారు.

రాష్ట్రములో వయోజనవిద్యా ప్రచారానికై ఒక ఉపసంఘము నియమింప బడింది. జాతీయమైన కుటీరపరిశ్రమలను, పునరుద్ధరించి పోషించే విషయంలో మంత్రివర్గానికి తగినసూచనలు చేయుటకుగాను, ఒక ఉప సంఘం నియమింపబడింది. మహిళా కాంగ్రెసును నియమించుటకు ఒక ఉపసంఘము నియమింపబడింది. ఒక స్త్రీల రాజకీయ కళాశాల నిర్మించుటకు సంకల్పించారు. పరిపాలన విషయంలో రాష్ట్రమంత్రులకు కొన్ని సలహాలు యివ్వబడినవి.

ఈ నూతన పోకడలను గురించి కృష్ణాపత్రిక యిలా ముగింపు చేసింది. "మొత్తం మీద రంగా గారి ఆధ్వర్యాన రాష్ట్రకాంగ్రెసు ఒక నూతన చైతన్యాన్ని పూరించుకొన్నమాట నిశ్చయము, యీ చైతన్యం కార్యరూపములో ఎంతవరకు ప్రకటితమౌతుందో చూడాలి." (*కృష్ణాపత్రిక* 1946. జూన్ 29 )

ఆయన గొప్ప ఆశయాలతో ప్రణాళికలు, కార్యక్రమాలు నిర్ణయిస్తాడు. ఆయన అంతా సాధించలేకపోవచ్చును. ఆయన ప్రయత్నం మాత్రం ప్రశంసార్హము. మన ఆదర్శం ఎప్పుడూ ఉన్నతంగానే వుండాలి. మనము ఆచరించలేమని మన ఆదర్శాన్ని వదలరాదు. తగ్గు స్థాయిలోకి తేరాదు. మనము గొప్ప ఆదర్శము కలిగినప్పడే అభివృద్ధి పొందగలుగుతాము, సామాన్యఆదర్శాలు సామాన్యునిగానే చేయును.

ఇంతేకాక ఆయన ఆశయాలు ప్రణాళికలు అన్నీ ఫలించకపోవడానికి కారణం, ఆయన ప్రయత్నలోపమని ఆపాదింపలేము. ఎవరూ, యే కార్యమూ ఒంటరిగా సాధించ లేరు. అందరు కాకపోయినా కొందరైనా చేదోడు వాదోడు వుంటే సఫలీకృతమౌతుంది. ఆయన అనుకున్నదంతా సాధించలేకపోవటానికి కారణమది. ఆయన పట్టుదలలో పటుత్వము లేక కాదు. దాస్యపీడితమైన మన దేశంలో, దారిద్ర్యపీడితమైన మన మాతృ భూమిలో, అసూయాగ్రస్తమైన యీ ప్రపంచములో ఎందరి బంగారుకలలు భగ్నమగుట లేదు. ఎందరి ఆశలు అడియాశలు అగుట లేదు. ఎంతెంత ప్రయత్నాలు పూర్తిఫలితాలు యివ్వకుండా పోవుటలేదు. ఆలాగే ఆచార్యరంగా విషయంలోను, అంతకంటె అధికముగా అనుకొనుట అపచారము.

లోగడ కాంగ్రెసువారి ఆదర్శాలు, చిత్తవృత్తులు, ఒకవిధంగా, ప్రజల అవసరాలు, ఆశయాలు మరోవిధంగా నడుస్తూ వుండేవి. ఆచార్య రంగా ఆధ్వర్యం వహించిన తరువాత కాంగ్రెసు వ్యవహారాలు ప్రజల అవసరాలకు ఎంత అనుగుణ్యముగా ఉన్నవో కాంగ్రెసు బులెటిన్ 1946 జులై చూస్తే స్పష్టపడుతుంది. ఆహారకమిటీలు, కంట్రోలు అమలు, కొలతలు తూనికలు, పోరంబోకులు, సాముదాయిక భూములు, ధాన్యసేకరణ, మిల్లుయజమానులు, వస్త్రసమస్య, రేషనింగులు, లంచగొండితనం, బ్లాకుమార్కెట్టు నిర్మూలన, మునగాల కాశీపట్నం రైతులు, కార్మిక సమస్య, కరువు విచారణ, సాముదాయిక జరిమానాలు, యేజన్సీ ప్రజలు, రాయలసీమ సమస్యలు, జమీందారీ విధానము రద్దు మొదలగు సమస్యలను చర్చించి యిచ్చిన సూచనలు చూస్తే ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘము ప్రజల అవసరాలపై ఎంత శ్రద్ధ తీసికొనుచున్నది చెప్పక చెప్పును.

కేవలం ప్రజల ప్రస్తుత అవసరాలకేకాక, భవిష్యత్తులో వారి అభివృద్ధికి కూడ ఆలోచన జరగకపోలేదు. ఇందుకై ఆర్థికాభివృద్ధి ప్రణాళిక నిర్మాణానికి ఒక ఉపసంఘం ఆర్థికశాఖలో అతినిపుణుడును, అనుభవజ్ఞుడును అగు శ్రీయుత వెలగపూడి రామకృష్ణ – ఐ.ఎ.యస్ (ఆంధ్రదేశం గర్వించదగ్గ ప్రముఖ వ్యాపార, వాణిజ్య వేత్త. రంగాగారికి ఇంగ్లండులో చదువులో మిక్కిలి సాయం చేసినవారు) గారి అధ్యక్షతన యేర్పడి, ఆంధ్రరాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో యేయే పరిశ్రమలను యేయేరీతిని ఆభివృద్ధిపరచ వీలగునో, విచారించి, ఆంధ్రదేశ పారిశ్రామికాభివృద్ధికి పంచవర్షప్రణాళికను తయారు చేయుటకు నిపుణులతో నియమింపబడినది. వారు చురుకుగా పనిచేయుచున్నారు. కాంగ్రెసు సంఘం ఇలాంటి ప్రయత్నాలు చేయటానికిదే ప్రథమం.

ఆంధ్రరాష్ట్ర నిర్మాణమును గురించిగూడ రాష్ట్రకాంగ్రెసు ప్రత్యేకశ్రద్ధవహించి పనిచేయుచున్న సంగతి పాఠకులకు పత్రిక ద్వారా పరిచయమే. ఇటుల స్థానికఆంధ్రుల అభివృద్ధి కొరకు పాటుబడుటతోనే తృప్తి నొందక, రాష్ట్రేతరాంధ్రుల యోగక్షేమాలు కూడ కనుగొనుటే గాక కడు శ్రద్ధతో కృషి చేస్తున్నది.

రాష్ట్రేతరాంధ్రుల స్థితిగతులను స్వయంగా తెలుసుకొని, ఆయా రాష్ట్రప్రభుత్వాల సహాయంతో, వారి ఇబ్బందులను తీర్చి, పరస్పరమైత్రి, సోదరత్వము నెలకొల్పుటకు సౌహార్ద సంఘం ఏర్పాటు చేయబడింది.

వీరు బెంగాల్, బీహార్, ఒరిస్సా రాష్ట్రాలలోని ఆంధ్ర ప్రాంతాలలో పర్యటనచేసి, వారిస్థితిగతులను విచారించి, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు తెలిపి తోడ్పడ్డారు. ఈ సంఘం వారి కృషిని రాష్ట్రేతరాంధ్ర ప్రముఖులు ప్రస్తుతించారు.

రాష్ట్రేతరాంధ్రులతో రాష్ట్రకాంగ్రెసు సన్నిహితత్వం పెంపొందించు కోవాలనే తలంపుతో, రాష్ట్రేతరాంధ్రశాఖ ఏర్పరచబడింది. ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘం, రాష్ట్రేతరాంధ్రుల విషయమై ఇలా పనిచేయటం ఇదే ప్రప్రథమం.

నైజాంలో మన ఆంధ్రులు పడు అష్టకష్టాలు అందరకు తెలిసినవే. అందుకు కూడ ఒక విచారణ సంఘం ఏర్పడి ప్రశంసాపాత్రంగా పనిచేసి అఖిలభారత సంస్థాన ప్రజామండలి కార్యదర్శి ద్వారకనాథ్ కచ్రూ గారి ప్రశంసలుగూడ పొందింది. కాంగ్రెసువారు కారాగృహములో వున్న సమయాన ప్రభుత్వోద్యోగులు ధాన్యసేకరణ విషయములో రైతులకు కలుగజేసిన ఇబ్బందులు, కంట్రోలు నినాదంతో పాటు, కమ్యూనిస్టులు రైతులను తిండిదొంగలంటూ గ్రామాలలో ప్రజావసరాలు గుర్తించకుండా ప్రభుత్వోద్యోగులు తీసుకొని పోతుంటే, అగ్నికి వాయువు తోడైనట్లు కమ్యూనిష్టులు ప్రభుత్వోద్యోగులకు తోడై రైతులను కష్టనష్టాలు పెట్టారు.

ఆచార్యరంగా జైలునుండి వచ్చిన తరువాత, నేటి వివిధ వస్తువుల ధరలను బట్టి ధాన్యపు ధరలు నిర్ణయింపబడాలని చేసిన ఆందోళన చరిత్ర ప్రసిద్ధం. నేడు ప్రజానాయకుడు ప్రకాశం ప్రధానమంత్రిత్వం స్వీకరించిన తరువాత రైతులకు ధాన్యసేకరణ విషయంలో యెట్టి కష్టనష్టములు కలుగకుండా చేయుటే కాక, రైతుల ధాన్యాలకు బోనసు యిచ్చువిధానము ఆచరణలోనికి వచ్చిన సంగతి అందరకు తెలిసినదే.మద్రాసులో కార్యవర్గసమావేశానంతరము, రాష్ట్రకాంగ్రెసు, రైతుకాంగ్రెసు, సంయుక్త యాజమాన్యమున కాంగ్రెసు మంత్రుల వద్దకు రాయబారము వెళ్లి, అనేక ప్రజాసమస్యలపై చర్చించి సూచనలు చేశారు. ఈ రాయబార ఫలితంగానే రైతుల ధాన్యాలకు బోనసు యిచ్చువిధానం అమలులోకి వచ్చిందని అందరు గమనించాలి.

మన రాజధానిలోగల ఆంధ్ర, తమిళాది భాషాప్రయుక్త రాష్ట్రకాంగ్రెసు సంఘాలు యిదివరకు విడివిడిగా ఎవరికితోచినట్లువారు వ్యవహరించేవారు. ఆచార్యరంగా అధ్వర్యం వహించిన తరువాత, రాష్ట్రసంఘాలన్నీ సంప్రదించి పనిచేసే యేర్పాటుచేశాడు. అవసరం వచ్చినపుడు ఆయా రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మద్రాసులో కలసి మంతనము చేస్తారు. మంత్రులకు సలహాలిస్తారు. ఆయన

ఆధ్వర్యంలో అధికంగా ప్రస్తుతింపతగిన విషయాల్లో ఇదొకటి. ఇటుల సర్వతో ముఖంగా ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కృషి వున్నది.



ఆచార్య రంగా ఆధ్వర్యంవహించిన తరువాత ఆంధ్రరాష్ట్ర సంఘ తీర్మానాలను గురించి కొందరు వ్యతిరేకంగా పత్రికలలో పడరాస్తున్నారు. ఆయనలో లోపాలు లేవని నేను చెప్పజాలను. మానవులలోని బలహీనతలు ఆయనలోనూ ఉన్నాయి. కాని ఈ రాసే వ్రాతల్లోని అక్రమాన్ని స్థాలీపులాక న్యాయంగా చూపెడతాం. మద్రాసు శాసన సభలో రెండు స్థానాలు ఖాళీ అయినాయి. ఈ రెండున్నూ చిత్తూరు జిల్లాలోనివే. చంద్రగిరి డివిజన్ శాసనసభ్యుడు టి.కె.టి. తాతాచారి గారి మరణం వల్ల ఏర్పడిన ఖాళీకి యన్. వి. రామానాయుడు గారిని, మదనపల్లి శాసనసభ్యుడు టి.యన్. రామకృష్ణారెడ్డిగారి మరణంవల్ల ఏర్పడిన ఖాళీకి పి.తిమ్మారెడ్డి గారిని కాంగ్రెసు అభ్యర్థులుగా రాష్ట్ర కాంగ్రెసు కార్యవర్గం ఏకగ్రీవంగా సూచించగా రాష్ట్ర కార్యవర్గ సూచనను తోసివేసి టి.కె.టి.యన్.ఆర్. తాతాచారిగారిని చంద్రగిరికి, నాదముని రెడ్డిగారిని మదనపల్లికి అభ్యర్థులుగా కేంద్ర పార్లమెంటరీబోర్డు నిర్ణయించింది. ఈ తాతాచారి గారు ఆ తాతాచారి గారి సోదరుడు. అంతకంటే అధికయోగ్యత లేనే లేదు. రాష్ట్ర కాంగ్రెసుచే సూచించబడిన వెంకటరామానాయుడు వర్కరు, జైలుకు వెళ్లిన వాడు, పల్లెటూరి వాసి, రైతు కష్టసుఖాలు స్వయంగా తెలుసు. ఇదివరకే చిత్తూరులో టి.యన్.రామకృష్ణారెడ్డి, ఆర్.డి.రామకృష్ణరాజు, టి.కె.టి. తాతాచారి, ఆర్. వెంకటరెడ్డి, కె.వరదాచారి, చిత్తూరులో నివసించే లాయర్లను పల్లెప్రజలకు ప్రతినిధిగా పార్లమెంటరీబోర్డు నియమించింది. కేంద్ర శాసనసభా సభ్యుడు అనంతశయనం గారు చిత్తూరు నివాసే. పల్లెప్రజలకు దూరమై పట్టణాలలో నివసించే లాయర్లకు ఈ పదవులు అంటగట్టుట న్యాయమో, పల్లెలలోనే పుట్టి, పల్లెప్రజలమధ్య నివసించే వారికి ఈ పదవులు యిచ్చుట న్యాయమో ఆలోచించండి. మదనపల్లి డివిజనులో మంచి వర్కరు, విద్యావంతుడు, ఆ నియోజకవర్గం లోని వారైన పి.తిమ్మారెడ్డి గారిని త్రోసివేసి మరొక నియోజకవర్గం వాడగు నాదమునిరెడ్డి గారిని నియమించుట ఏమి సబబు? ఆయన రామకృష్ణారెడ్డి గారి అన్నగారి అల్లుడు అయినంత మాత్రాన అర్హత కలిగిందా?

ఈ శాసనసభా సభ్యత్వానికి బంధుత్వమేనా అర్హతకు చూడవలసినది. ఎవరిది లోటో వేరే వివరించాలి విజ్ఞులకు! ఇట్లాగే మిగతా ఆరోపణలు ఉంటాయి. వాటన్నిటికీ సమాధానమిచ్చుట నా పని కాదు.

తాను జవహర్‌లాల్ తో కాంగ్రెసు అధ్యక్ష పదవికి పోటీ చేస్తూ ప్రభుత్వములో కాని కాంగ్రెసు వ్యవహారాలలో గాని ప్రతిదీ క్రిందినుంచి పైకి పోవాలే కాని పైనుంచి క్రిందికి రాకూడదని సూచించిన డాక్టర్ పఠాభి కేంద్ర పార్లమెంటరీ బోర్డు సభ్యుడిగా ఉన్న సమయాన ఆంధ్ర ప్రాంతంలో ఈ విధంగా జరగటం ఏమనుకోవాలి? ఆచార్య రంగా ఆధ్వర్యము వహించినతరువాత రాష్ట్రంలో ఒక నూతనత్వము వచ్చింది. అది అధికంగా ప్రజా సంస్థ అయింది, రైతులకు అనుకూల సంస్థ అయింది.

ఆచార్య రంగా ఇదివరకు అధికారవర్గంలో ఉన్నవారివల్ల తాను అనేక అక్రమాలు పొందిన విషయం మనసులో పెట్టుకొని తాను అట్టి పనులు చేయకుండా జాగ్రత్త పడాలి. ఈ అధ్యక్షత తన అధికారమునకు ఆయుధముగా ఉపయోగించక, తన సేవకు సాధనగా ఉపయోగించిన నాడే ఉత్తముడు అనబడతాడు. ఆంధ్రరాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సంబంధాల చరిత్ర అభిమానంతో ఆరంభించబడి అభిప్రాయభేదంతో అంత్యము అగుచున్నది. వీరి విషయంలో ఎలా ఉంటుందో!

"పేర్లెటు ప్రేలకుండ నిలపెట్టి పటేలు పొటేలుగా జమీం
దార్లకు, షావుకార్లకు యదార్థముతో విపరీతమైన ఖం
గార్లను బెట్టి మా తెనుఁగు గడ్డకు కాంగ్రెసు చక్రవర్తి వై
దార్లిక బాగు చేసితివి, తాతలనాటివి రంగనాయకా" – *వేదాంతకవి*



రామనీడు బిల్డింగ్స్ – నిడుబ్రోలు.

# ఆచార్య రంగా గేయాలు

-సూర్యదేవర రవికుమార్

నీవంటి నాయకుడు ఓరైతురంగా
నిజము లేనేలేదు నాసామిరంగా.

రైతుజాగృతి కొరకు రాష్ట్రవ్యాప్తమ్ముగా
రైతాంగ విద్యాలయాలు నడిపావు
ఇచ్చటి నీఉద్యమం ఇంతకింతింతయై
బహుదేశములు ప్రాకి సఫలమైనది భళా ||నీవంటి ||

చదువు సంధ్యలు లేని శ్రామికజనులెల్ల
చదువు నేర్వాలని తపన చెందావు
తగిన బడులేర్పరచి తర్ఫీదునిప్పించి
రైతు కలలకు రూపు కల్పించినావు ||నీవంటి ||

రాజకీయాలలో రైతు వేదిక కొరకు
గాంధితో చర్చించి సాధించినావు
నీకృషికి ఫలితమే నేటి కీ భరతోర్వి
తిండిగింజలు కరువు నధిగమించినదయా ||నీవంటి ||

రైతు చీకటిబ్రతుకు రవితేజమున వెలుగ
దీక్షబూనిన కర్షకాళి వైతాళికా!
లోకహితకారక! నీకు జేజేలివే
రంగనాయక! గోగినేనికుల దీపకా! ||నీవంటి ||

అఖిలభారత నేత ఆచార్యరంగా
అతనికీర్తి పతాక ఆకాశగంగ.

నిడుబ్రోలులో పుట్టినాడు– నీతి బాటను మెట్టినాడు
పెద్దపట్టము పట్టి విశ్వమంతయు చుట్టి
వెలుగుదివ్వెగ నిల్చినాడు ||అఖిల ||

ధ్యేయమొకటే హృదయమందు – దీనజనుడే కనులముందు
అతడు కన్నులు తెరచి అదురు బెదురును మరచి
హాయినందగ తపనజెందు ||అఖిల ||

నిండుకుండను బోలు గుండె–నిలువెత్తు త్యాగమై పండె
జాతిక్షేమము కొరకు జైలుజీవిగ నుండె
సవనసమిద్ధై చిరము మండె ||అఖిల ||

అర్థశాస్త్రాచార్యుడైనా – ఆంధ్రభాషా రచనలోన
అందెవేసినచేయి–అమృతవాక్సంధాయి
అజరామరపు స్ఫూర్తిదాయి ||అఖిల ||

కాకతీయుల కత్తిపదును – కర్షకోద్యమరాగ సుధను
రంగరించిన మేటి రాజకీయ ఘనాపాటి
అతని కతడే అగునుసాటి ||అఖిల ||



శ్రీమతి భారతీదేవి రంగా

## అనుబంధము

డా. నాగభైరవ ఆదినారాయణ

1947 ఆగస్టు 15 భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన రోజు. ఆసేతు హిమాచలం స్వేచ్ఛా వాయువులు పీలుస్తూ ఆనందించిన రోజు. స్వేచ్ఛా భారతావనిలో రైతుల కడగండ్లు తొలగిపోతాయని, కర్షకుల కళ్ళల్లో ఆనందాశ్రువులు తొంగిచూస్తాయని రంగా కలలుగన్నారు. ఆనాటికి ఆచార్య రంగా అఖిల భారత కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులుగా, ఆంధ్ర కాంగ్రెస్ అధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు. కేంద్ర శాసనసభ సభ్యులుగా, పార్లమెంటరీ పార్టీ కార్యదర్శిగా, ఆర్థికసంఘ సభ్యులుగా పదవులు నిర్వహిస్తున్నారు. నూతనంగా రచింపబడనున్న రాజ్యాంగంలో గ్రామ ప్రజలకు, గ్రామ పంచాయితీలకు సముచిత స్థానం ఇచ్చినప్పుడే గ్రామస్థాయి నుంచి దేశం ప్రగతిపథంలో పయనించగలదని ప్రగాఢంగా విశ్వసించారు రంగా గారు.

1948 నవంబరు 9 వ తేదీన ముసాయిదా రాజ్యాంగం గురించి రంగాగారు ఉపన్యసించారు. ప్రజాస్వామ్యంలో గ్రామ ప్రజలు తమ బాధ్యతలను సక్రమంగా, సమర్థవంతంగా నిర్వర్తించాలంటే వారికి అవసరమైన రాజకీయ వ్యవస్థలను నెలకొల్పాలి అని రాజ్యాంగకర్తలకు సూచించారు. గ్రామ పంచాయితీల పునాదులు లేకుండా ప్రజాస్వామ్యం మనుగడ సాగించలేదనీ, మహాత్మాగాంధీ ఆశించిన అధికార వికేంద్రీకరణ మాత్రమే ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మగా నిలుస్తుందని తేల్చిచెప్పారు. కేంద్రీకృత విధానాలు పాటిస్తే అది నియంతృత్వానికి, అత్యయిక పరిస్థితికి, కమ్యూనిజం బలపడడానికి దారితీస్తుందని హెచ్చరించారు.

గ్రామ పరిస్థితులు గాని, రైతాంగం గురించి తెలిసినవారు గాని రాజ్యాంగ నిర్మాణంలో పాలు పంచుకోపోకవడంతో రంగాగారి సూచనలు అడవిగాచిన వెన్నెలయ్యాయి. రాజ్యాంగ నిర్మాణం తరువాత రాజ్యాంగ నిర్ణయ సభలో మాట్లాడుతూ రంగాగారు తన అభిప్రాయాలను నిష్కర్షగా, నిర్మొహమాటంగా తెలియచేశారు. రాజ్యాంగంలో, అధికార వికేంద్రీకరణ పట్ల తన అసమ్మతిని తెలియచేస్తూ “బలమైన కేంద్ర ప్రభుత్వానికి నేను వ్యతిరేకం కాదు. అయితే హిట్లరు వంటి నాయకుడు భవిష్యత్తులో కేంద్రంలో అధికారంలోకి వస్తే అధికార కేంద్రీకరణ వల్ల రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేసే ప్రమాదం ఉంటుంది. ఆ ప్రమాదం గురించి

నేను మాట్లాడుతున్నాను. రాష్ట్ర ప్రభుత్వాలను రద్దుచేసే అధికారం కేంద్రానికి కట్టబెట్టడంలో ఔచిత్యంలేదు. ఇది దుర్వినియోగమయ్యే అవకాశాలు కనిపిస్తు న్నాయి" అని విశ్లేషించారు. ఆనాడు రంగా గారు ఊహించిన అత్యయిక పరిస్థితి అనతికాలం లోనే భారత ప్రజలు చవిచూడవలసి వచ్చింది. కేంద్రంలో అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ తమకు వ్యతిరేకంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేయడం ఎన్నోమార్లు జరిగింది. వీటిని నివారించడానికి రంగా గారు చేసిన ప్రయత్నం విఫలమయినా, రంగా గారి "ముందుచూపు" ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు.

1948 లో శాన్ ఫ్రాన్సిస్కో లో ప్రపంచ కార్మిక సదస్సు జరిగింది. భారతదేశపు ప్రతినిధిగా రంగా గారు ఆ సదస్సులో పాల్గొన్నారు. కార్మికుల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సూచనలు ఆ సదస్సులో పాల్గొన్న వివిధ దేశ ప్రతినిధుల ప్రశంసలకు పాత్రమయ్యాయి.

★★★

కాంగ్రెస్ నాయకులు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నాయకులు చాలామంది కలత చెందారు. ప్రజాసంక్షేమం కోసం తాము చేస్తున్న సూచనలను బుట్టదాఖలు చేయడాన్ని వాళ్ళు జీర్ణించుకోలేకపోయారు. కాంగ్రెస్ కు రాజీనామా చేయాలని తీర్మానించుకున్నారు. అలాంటి వాళ్ళలో ప్రముఖుడు జయప్రకాష్ నారాయణ. అయన 1948 లో కాంగ్రెస్ ను విడిచి పెట్టారు. కాంగ్రెస్ నాయకుల్లో మార్పుకోసం మరికొంతకాలం వేచిచూసిన కొంతమంది నాయకులు ఆశించిన మార్పు కాంగ్రెస్ నాయకుల్లో కనపించకపోవడంతో విసుగు చెందారు. కాంగ్రెస్ లో మార్పు అసాధ్యమని భావించి బయటకు వచ్చారు. 1951 లో ఆ విధంగా కాంగ్రెస్ ను వీడిన వారిలో ప్రముఖులు రంగా గారు, కృపలానీ గారు. రంగా గారు పార్టీ సభ్యత్వానికి, పార్టీ పదవులన్నింటికీ రాజీనామా చేశారు.

తనలాగా కాంగ్రెస్ ను విడిపోయి వచ్చిన వారందరినీ ఒకచోట చేర్చి భవిష్యత్ కార్యాచరణ కోసం కృపలానీ 1951 జూన్ లో పాట్నాలో ఒక సమావేశం ఏర్పాటు చేశారు. కొత్త పార్టీని ఏర్పాటు చేయాలని కృపలానీ ఆలోచన. రంగా గారిని కూడా కృపలానీ ఆహ్వానించారు. ముందుగా ముఖ్యులతో జరిగిన సమావేశంలో కొత్తపార్టీ ఏర్పాటు చేయాలని, దానికి "మజ్దూర్ ప్రజా పార్టీ" అని నామకరణం చేయాలని కృపలానీ తెలియచేశారు. హాలికుల పట్ల అపారమైన

అభిమానం ఉన్న రంగాగారు పార్టీ పేరుకు ‘కిసాన్’ పదం చేరిస్తే బాగుంటుందని సూచించారు. రంగా గారి అభిప్రాయాన్ని గౌరవిస్తూ "కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ" అని పార్టీ పేరును సవరించారు.

నాటి మధ్యాహ్నం కృపలానీ అధ్యక్షతన ఒక సభ జరిగింది. సుమారు ఐదువేల మంది ప్రజలు పాల్గొన్న ఆ సభలో కృపలానీ నూతన పార్టీ పేరును, ఆశయాలను ప్రకటించారు. అవన్నీ రంగా గారి అభిప్రాయాలకు దగ్గరగా ఉన్నవే. కృపలానీ మాట్లాడుతూ కాంగ్రెస్ సంస్థలోని బంధుప్రీతి, ఆశ్రితపక్షపాతం, అధికార దుర్వినియోగం గురించి దుయ్యబట్టారు. కొత్తపార్టీ కార్యక్రమాన్ని నిర్ణయించడానికి ఒక ఉపసంఘాన్ని ఏర్పాటుచేశారు. అందులో ఆంధ్రప్రాంతం నుంచి ప్రకాశం పంతులు గారికి చోటు కల్పించారు. కృపలానీ ఉపసంఘ సభ్యుల పేర్లను చదివేటప్పుడు "రంగా గారి పేరు చేర్చాలి" అంటూ సభికులు పెద్దగా అరిచారు. కార్య నిర్వాహక వర్గంలో రంగా గారికి చోటు కల్పిస్తామని కృపలానీ ప్రజలకు తెలియచేశారు. కార్యదర్శి పేరు ప్రకటించే సమయంలో కూడా సభ్యులలో చాలామంది రంగా గారి పేరు సూచించారు. " రంగా గారు పెద్దవారు. వారికి ఇవ్వవలసిన స్థానం తరువాత ఇస్తాము" అని కృపలానీ అప్పటికి ఆ విషయాన్ని దాటవేశారు. రంగా గారి పట్ల సభ్యులు ప్రదర్శించిన అభిమానం బహుశా కృపలానీ ప్రభృతులకు నచ్చకపోయి ఉండవచ్చు. అందుకే రంగా గారిని దూరంగా ఉంచడానికి ప్రయత్నం చేశారని భావించవచ్చు.

★★★

రంగా గారు కర్షకుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఆంధ్రప్రాంతంలో ఒక పార్టీని స్థాపించాలని నిర్ణయించుకున్నారు. తన అనుయాయులతో 1951 లోనే ‘కృషికార్ లోక్ పార్టీ’ పేరుతో ఒక కొత్త పార్టీని ఏర్పాటుచేశారు. రంగా గారి అభిమానులు, రంగా గారి అభిప్రాయాలను గౌరవించేవారు, ఇష్టపడేవారు పార్టీలో చేరారు. పార్టీని బలోపేతం చేయడం కోసం రంగా గారు విశేషంగా శ్రమించారు. ఆంధ్రప్రాంతమంతా పర్యటించారు. 1952 లో ఎన్నికలు జరిగాయి. రంగా గారు గుంటూరు పార్లమెంటు స్థానానికి అభ్యర్థిగా నిలబడ్డారు. కానీ ఓటమి పాలయ్యారు. అదే సందర్భంలో ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి ఎన్నికలు జరిగాయి. అప్పటికే ప్రత్యేకాంధ్ర ఉద్యమం ప్రారంభమయింది. ప్రత్యేకాంధ్ర రాష్ట్రానికి నెహ్రూ వ్యతిరేకం కావడంతో ప్రజలు కాంగ్రెస్ పార్టీని తిరస్కరించారు. రంగా గారి కృషీకార్ లోక్

పార్టీ తరపున నిలబడిన అభ్యర్థులు కొంతమంది విజయం సాధించారు. కమ్యూనిస్టులు ఎక్కువ స్థానాలు దక్కించుకున్నారు. కాంగ్రెస్, టంగుటూరి ప్రకాశం పంతులు (1946 ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా మరియు కర్నూలు రాజధానిగా 1955 లో పనిచేశారు) గారి ప్రజాపార్టీ అభ్యర్థులు కూడా పలు స్థానాల్లో విజయం పొందారు. కానీ ప్రభుత్వం నెలకొల్పడానికి అవసరమైన మెజారిటీ ఏ పార్టీకి లభించలేదు. రెండు, మూడుపార్టీలు ఏకమై ప్రభుత్వం ఏర్పాటు చేయవలసిన అగత్యం ఏర్పడింది. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని కమ్యూనిస్టులు వ్యూహం పన్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు తగిన మెజారిటీ లేకపోవడంతో, ప్రకాశం పంతులు గారిని ముఖ్యమంత్రిగా చేయాలని తలపెట్టారు. పదవీ వ్యామోహంలో ప్రకాశం గారు ఆ పన్నాగంలో పావు అయ్యారు. ఆ విషయం నెహ్రూ గారు గ్రహించారు. ఆంధ్ర, తమిళ ప్రాంతాలు కలిసి వున్న విశాల రాష్ట్రం కమ్యూనిస్టుల వశంకావడం నెహ్రూ గారికి ఇష్టం లేదు. కమ్యూనిస్టులకు రాష్ట్రాధికారం దక్కకుండా చేయడానికి ఆయన రాజాజీ గారిని ఉపయోగించు కోవాలనుకున్నాడు. అప్పటికి రాజాజీ రాష్ట్రానికి చెందిన ఏ సభలోనూ సభ్యుడుగా లేడు. ఆయనను సభానాయకునిగా చేయాలని, తద్వారా కమ్యూనిస్టుల ఆటకట్టించాలని నెహ్రూగారు ఆలోచన చేశారు.

నెహ్రూగారు తన ఆలోచనను రాజాజీకి తెలియచేశాడు. రంగాజీ సహకరిస్తే ప్రభుత్వం ఏర్పాటు చేస్తాను అన్నారు రాజాజీ. రంగాజీని మీరే ఒప్పించండి అన్నారు నెహ్రూగారు. రాజాజీ రంగా గారికి కబురు చేశారు. రంగా గారు మద్రాసు వెళ్ళి రాజాజీని కలుసుకున్నారు. విషయమంతా రాజాజీ రంగా గారికి తెలియచేశారు. మీరు సహకరిస్తే నా ప్రయత్నం ఫలిస్తుంది అన్నారు రాజాజీ.

రాజాజీ ఈ రాష్ట్రం కమ్యూనిష్టుల హస్తగతం కాకుండా చేయడమే నాకు కావలసింది. మీ ప్రయత్నంలో మా కృషీకార్ లోక్ పార్టీ సంపూర్ణంగా సహకారం అందిస్తుంది అంటూ రంగా గారు భరోసా ఇచ్చారు. మీరు నా మంత్రివర్గంలో ఉపముఖ్యమంత్రిగా చేరితే నాకు గౌరవంగా ఉంటుంది. రైతు సేవే ఊపిరిగా బ్రతికే మీకు మీ కార్యసాధనలో అధికారం అండగా నిలుస్తుంది అన్నారు రాజాజీ. క్షమించండి, నేను పదవుల కోసం మీకు తోడ్పాటు అందించడం లేదు.

కమ్యూనిస్టుల ఏకపక్ష కార్మిక నియంతృత్వాన్ని అడ్డుకోవడం కోసమే మీకు మద్దతు ఇస్తున్నా అంటూ రాజాజీ ఇస్తానన్న ఉపముఖ్యమంత్రి పదవిని తృణప్రాయంగా త్యజించారు. రాజాజీ కృషీకార్ లోక్ పార్టీ, ముస్లింలీగ్ తోడ్పాటుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఆ విధంగా రంగా కమ్యూనిస్టుల ఆశల మీద నీళ్ళు చల్లారు.

1952 లో గుంటూరు పార్లమెంట్ స్థానానికి నిలబడి ఓడిపోయినా అదే సంవత్సరం రాజ్యసభకు రంగా గారు ఎన్నికయ్యారు. ఆయన 1952 నుంచి 1956 వరకు రాజ్యసభ సభ్యుడిగా కొనసాగి అనేక విషయాలపై తమ అమూల్యమైన అభిప్రాయాలను తెలియజేశారు.పార్లమెంటులో రైతుల వాణిని వినిపించారు. 1952 నుండి ప్రత్యేకాంధ్ర ఉద్యమం ఊపందుకుంది. పొట్టి శ్రీరాములు గారు నిరసన దీక్షచేసి ఆత్మార్పణ చేసుకున్నారు. దానితో ఆంధ్రప్రదేశ్ అట్టుడికి పోయింది. తప్పని పరిస్థితుల్లో ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుచేయటానికి నెహ్రూగారు అంగీకరించారు. అనేకవివాదాలు,ఆందోళనలు, కుట్రలు, కుతంత్రాలు సాగి చివరకు కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. ఆంధ్ర ప్రాంతంలోని శాసనసభ్యులతో కొత్త శాసనసభ ఏర్పాటయింది. కాంగ్రెస్‌కు మెజారిటీలేదు. ప్రకాశంపంతులు ఇతరులతో కలిసి ప్రభుత్వం ఏర్పాటుచేసి ముఖ్యమంత్రి అయ్యారు. ప్రతిపక్షాల అవిశ్వాస తీర్మానంతో ఏడాది తిరగకుండానే ప్రకాశం గారి ప్రభుత్వం పతనమయింది. గవర్నర్ నాయకత్వంలో రాష్ట్రపతిపాలన ఏర్పడింది.

1955 లో ఆంధ్రరాష్ట్రానికి ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్, రంగాగారి కృషీకార్ లోక్ పార్టీ, ప్రకాశంపంతులు గారి ప్రజాపార్టీ ఐక్య కాంగ్రెస్ గా ఏర్పడి శాసనసభకు పోటీ చేశాయి. ఎన్నికల రణరంగంలో కమ్యూనిస్టులతో తలపడ్డారు. ఆ ఎన్నికలలో ఐక్యకాంగ్రెస్ విజయదుందుభి మ్రోగించింది. 196 సీట్లకు 147 సీట్లు దక్కాయి. బెజవాడ గోపాలరెడ్డి గారు ముఖ్యమంత్రి అయ్యారు. అధికారం అందుకోవడానికి అర్రులు సాచిన కమ్యూనిస్టులను నిలువరించడంలో రంగా గారు సఫల మయ్యారు. 1955 లో రంగా గారు కాంగ్రెస్ లో చేరారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు. 1957 లో రెండవ లోక్ సభ ఎన్నికలు వచ్చాయి. అప్పటికే కాంగ్రెస్ లో చేరిన రంగా గారు తెనాలి నుంచి లోక్‌సభకు పోటీ చేశారు. ఆంధ్రాలో అధికారాన్ని అందుకోవడానికి తమను ఆమడ దూరంలో ఉంచిన రంగా గారిని గెలవనీయకూడదని కమ్యూనిస్టులు భావించారు.

రంగా గారికి వ్యతిరేకంగా తమ పార్టీపక్షాన అభ్యర్థిని నిలబెట్టారు. అప్పటికే సహకార వ్యవసాయం అనే విషయంలో తమ అభిప్రాయాలకు విలువనివ్వని రంగా గారి మీద కాంగ్రెస్ గుర్రుగా ఉంది. రంగా గారు తెనాలిలో ఓటమి చెందితే బాగుంటుందని భావించింది. అందుకు అనుగుణంగా కాంగ్రెస్ పెద్దలు రహస్యంగా కమ్యూనిస్టు అభ్యర్థికి మద్దతు ఇచ్చారు. ఆనాటి కాంగ్రెస్ అధినాయకులు గాని, కేంద్ర రాష్ట్ర మంత్రులు గాని, తెనాలి నియోజక వర్గంలో అడుగు పెట్టలేదు, ప్రచారం చేయలేదు. గుంటూరు, విజయవాడ ప్రాంతాల్లో పర్యటించి వెళ్ళారు. కాని ప్రజలు రంగా గారి పక్షాన నిలబడ్డారు. రైతుల హక్కులను, రైతుల ఆలోచనలను పార్లమెంటులో ప్రతిబింబించడానికి రంగా గారే తగిన వ్యక్తి అని భావించారు. 27 వేల ఓట్ల మెజారిటీతో రంగా గారిని గెలిపించారు. రంగా గారు పార్లమెంటులో రైతు ప్రతినిధిగా అడుగుపెట్టారు. ఆ రోజుల్లో నెహ్రూకు ప్రభుత్వ కార్యదర్శిగా మహాలనీస్ అనే వ్యక్తి ఉండేవారు. ఆయన కమ్యూనిస్ట్ అభిమాని. ఆయన రష్యాలోని సమిష్టి సహకార వ్యవసాయం గురించి నెహ్రూ గారికి భూతద్దంలో చూపించి, అది భారతదేశంలో ప్రవేశపెట్టడం మంచిదని నిర్ణయించుకున్నారు. దానికి అనుగుణంగా పావులు కదపడం మొదలుపెట్టారు.

సమిష్టి సహకార వ్యవసాయం నిజంగా రైతులకు ప్రయోజనం కలిగించేదయితే రంగా గారు ఆమోదించేవారు. రష్యాలో అప్పటికే కమ్యూనిస్టు ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా తలపెట్టిన దుశ్చర్యలు రంగా గారి దృష్టికి వచ్చాయి. భూమిపై యాజమాన్య హక్కులను రైతుల నుంచి రష్యా ప్రభుత్వం తొలగించింది. భూమినంతా ప్రభుత్వ యాజమాన్యం క్రింద సాగుచేయవలసిందేనని నిర్ణయించింది. ఆ విధంగా సాగుచేసే వ్యవసాయానికి సమిష్టి వ్యవసాయ క్షేత్రాలు అని పేరు పెట్టింది. వ్యవసాయ క్షేత్రాలలో భూమి మీద హక్కు ఏ వ్యక్తికీ ఉండకూడదని ప్రభుత్వం చట్టం చేసింది. రైతులకు ఓటు హక్కు లేకుండా చేసిన తర్వాత ఏర్పడే ప్రభుత్వానికి ఏకపక్ష కార్మిక నియంతృత్వ ప్రభుత్వం అని పేరు పెట్టింది. ఆ విధంగా ఏర్పడిన వ్యవసాయ క్షేత్రాలలో ఆనాటి వరకు భూమికి హక్కుదారులుగా ఉన్న రైతులందరూ రోజూవారీ కూలీలుగా మారిపోయారు. అంతటితో ఆగకుండా వారందరినీ కట్టుబానిసలుగా మార్చివేశారు. అనారోగ్యంతో

పాలుమాలి పనికిరాని రైతులను తిరుగుబాటుదారులుగా ముద్రవేసి మూకుమ్మడిగా వేలకొలది రైతులను లారీలలో కుక్కి సైబీరియా అడవులకు తరలించి చిత్రవధలు చేసి చంపారు. ఈ విషయాన్ని తెలుసుకున్న రంగా గారు సమిష్టి వ్యవసాయ విధానాన్ని నెహ్రూ అభివృద్ధిదాయకమైనదిగా, విప్లవాత్మకమైనదిగా అభివర్ణించడం సహించలేకపోయారు. నెహ్రూ ఆవడి కాంగ్రెస్ సదస్సులో సమిష్టి సహకార వ్యవసాయం అనే విధానాన్ని గురించి తీర్మానం చేయించారు.

రంగాగారితో యు.ఆర్. మసానీ గారు కూడా సహకార వ్యవసాయాన్ని నిరసిస్తూ పార్లమెంట్ లో ఉపన్యసించారు. రంగా గారు ఆ సందర్భంగా పార్లమెంట్ లో ఉపన్యసిస్తూ, భారత రైతులను ఇటువంటి ప్రమాదకరమైన పద్ధతులలోకి నెట్టవద్దని రైతులఓట్లతో గెలిచిన నెహ్రూ గారు రైతులకు అన్యాయం చేయడం తప్పని హెచ్చరించారు. మనదేశంలోని రైతులు స్వతంత్రులు, స్వేచ్ఛాజీవులు. గాంధీ గారి ఆశయాలపై నమ్మకం కలిగిన వారు, హింసమీద నమ్మకం లేనివారు. ప్రభుత్వ పెత్తనాన్ని, అధికారుల లంచగొండితనాన్ని సహకార వ్యవసాయం పేరిట రైతులపై రుద్దడం అన్యాయం అంటూ రంగాగారు తన నిరసన తెలియజేసారు. పార్లమెంట్ సభ్యులలో చాలామంది రంగా గారి వాదనను బలపరిచారు. దీనితో నెహ్రూగారు రంగా గారికి కబురు చేశారు. కేంద్ర వ్యవసాయ శాఖకు మంత్రిగా ఉండవలసిందిగా, తనకు సహకారం అందించవలసిందిగా కోరారు. రంగా గారు తనకు మంత్రిపదవి వద్దని, సహకార వ్యవసాయమనే ఆలోచనను విరమిస్తే సంతోషిస్తానని తెలియజేశారు.

అదే సమయంలో వినోభాభావే 'సర్వోదయ' అనే పేరుతో రైతుల నుండి ఇచ్ఛికంగా భూమిని దానంగా స్వీకరించాలని ఒక ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ ఉద్యమానికి జయప్రకాశ్ నారాయణ కూడా మద్దతు ఇచ్చారు. దేశవ్యాప్తంగా ఈ ఉద్యమం గురించి ప్రచారం ప్రారంభమయింది. నెహ్రూగారు సర్వోదయ ఉద్యమాన్ని తన సహకార వ్యవసాయ విధానానికి ఉపయోగించు కోవాలనుకొన్నారు. వందలాది సర్వోదయ కార్యకర్తలతో పాదయాత్ర ఎల్వాల్ చేరే సమయానికి నెహ్రూ గారు ఏల్వాల్ లో వారితో కలిశారు. వినోవాభావే గాంధీజీకి ఇష్టమైన వ్యక్తి. ఆయన ప్రారంభించిన సర్వోదయ ఉద్యమం ద్వారా సమిష్టి సహకార వ్యవసాయాన్ని ప్రవేశపెడితే రంగాగారు కూడా గాంధీజీ మీద అభిమానంతో

మౌనంగా ఉంటారని తలపోశారు. **అంటే సర్వోదయ ముసుగులో రైతులను ముంచడానికి నెహ్రూ గారు సిద్ధమయ్యారు**.



ఏల్వాల్ సభలో వినోభాభావే, జయప్రకాశ్ నారాయణ, జవహర్ లాల్ నెహ్రూ ప్రసంగాల సారాంశం ఇది. ఆకాశం, నీరు, నిప్పు, వాయువు, భూమి అనేవి పంచభూతాలు. ఇవి అందరి సొత్తు. భూమి తప్ప మిగిలిన నాలుగు అంటే ఆకాశం, నీరు, నిప్పు, వాయువు ఎవరి నియంత్రణలోను ఉండడం లేదు. మానవులతో పాటు సర్వజీవకోటి స్వేచ్ఛగా అనుభవిస్తున్నారు. అలాంటప్పుడు భూమికి మాత్రం మినహాయింపు ఎందుకు ఉండాలి? ఉండకూడదు. భూమి కూడా మిగిలిన వానిలాగే అందరికీ చెందాలి. యాజమాన్యపు హక్కు తొలిగిపోవాలి.అంటే భూమి మీద హక్కు ప్రభుత్వానికి తప్ప ప్రజలకు ఉండకూడదు.

నెహ్రూగారి దురాలోచనను రంగా గారు పసిగట్టారు. అక్టోబర్ 9 వ తేదీన కృష్ణాజిల్లా కిసాన్ సభలను ఏర్పాటు చేశారు. లక్షల సంఖ్యలో హాజరయిన రైతుల నుద్దేశించి ప్రసంగిస్తూ రైతులు సమాజానికి చేస్తున్న సేవను ప్రశంసించారు. సహకార వ్యవసాయం విధానం రైతాంగ ఆర్థిక వ్యవస్థను ఎలా విచ్ఛిన్నం చేస్తుందో వివరించారు. ప్రభుత్వ విధానాలు రైతులకు ఏ విధంగా నష్టం కలిగిస్తాయో తెలియజేశారు. రైతులకు రక్షణ, సౌకర్యాలు కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని గుర్తు చేశారు. సహకార వ్యవసాయాన్ని ఎదిరించడానికి రైతులు వెన్ను చూపరని హెచ్చరించారు.

ప్రపంచంలో కుటుంబ ఆర్థిక వ్యవస్తకు మూలం భారతదేశం అయితే భారతదేశ ఆర్థిక వ్యవస్తకు మూలం వ్యవసాయదారుడు. రైతు కాయకష్టం చేస్తాడు, పొలం దున్నుతాడు, సేద్యం చేస్తాడు, ఉత్పత్తి చేస్తాడు. స్వతంత్రంగా బతకటానికి ఏ వర్గానికి చెందిన శ్రమజీవులను దోపిడీ చేయడు, చేయాలని ఆలోచించడు. రైతు ఆత్మాభిమానం కలవాడు, ఎవరి కిందా పనిచేయడు. రైతులతో పాటు కోట్లాది చేతి వృత్తుల శ్రామికులు కూడా ఇదే తరగతికి చెంది ఉంటారు.

దేశానికి అవసరమైన అధికోత్పత్తి చేసి ఈ ఆర్థిక వ్యవస్త నిలబెట్టేది రైతే. స్వల్పమైన ప్రభుత్వ సహాయంతోనే పోరంబోకు పొలాలను సాగుచేసి పండిస్తాడు. జాతి సంస్కృతిని, భాషలను కాపాడతాడు.

ఇలాంటి వ్యవస్తను ప్రభుత్వం కాపాడుకోవాలి. వ్యవసాయ పరికరాలు, సాంకేతిక వస్తువులు, ఎరువులు, గిడ్డంగులు, మొదలైన సౌకర్యాలను రైతులకు కల్పించి, హతమార్చి రైతుల జీవితాలను సహకారవ్యవసాయంలో ఇరికించి ఆ సహకార వ్యవస్త కింది బానిసలుగా మార్చకూడదు, వారి స్వేచ్ఛా స్వాతంత్రాలను ఆర్థిక హక్కులను హరించగూడదు.

భూమి గ్రామానికంతటికీ సమష్టి ఆస్తి అని సహకార కమతాల ద్వారా ఉత్పత్తి సాగాలని సర్వోదయ ఉద్యమం సాగిస్తున్నారు. ఈ విధమైన సహకార వ్యవసాయాన్ని పాటించిన దేశాలన్నీ తమ అభిప్రాయాలు తప్పు అని తెలుసుకున్నాయి. చిన్న కమతాలు గిట్టుబాటుగా ఉంటాయని, సగటు ఉత్పత్తి పెరుగుతుందని, రైతుకు ఆర్థిక స్వయం పోషకత్వం, సాంఘిక భద్రత కలుగుతుందని నేను నమ్ముతున్నాను. కోట్లాది స్వేచ్ఛాజీవుల ప్రతిపత్తిని హరించి, వారిని బానిసలుగా చేసే ప్రయత్నాన్ని గర్హిస్తున్నాను. ఇదంతా వ్యవస్తను విచ్ఛిన్నం చేయడానికి, స్వేచ్ఛను హరించడానికి, స్వతంత్ర జీవనోపాధిని వమ్ము చేయడానికి పన్నిన రాజకీయ కుట్ర. రైతుల శ్రమను, పెట్టుబడిని దోచుకోవడానికి చేస్తున్న కుట్ర.

సమిష్టి సహకార వ్యవసాయమను పేరుతో ప్రభుత్వం చేసే మోసాన్ని నిలువరించడానికి, వ్యవస్థను నిలుపుకోవడానికి మనం త్యాగాలకు సిద్ధం కావాలి. మనలను ఎవ్వరూ మోసగించలేరు. మన హక్కులను హరించలేరు. రైతాంగ వ్యవస్థ తిరుగులేనిది, ఎదురులేనిది. నేను ప్రభుత్వాన్ని ఒక్కటే కోరుతున్నా. మా కుటుంబ ఆర్థిక వ్యవస్థ జోలికి రావద్దు. దాన్ని విచ్ఛిన్నం చేయవద్దు. ఉత్పత్తి కార్యక్రమాల్లో మమ్మల్ని ఆదుకోండి, మీరు అడిగిన దానికంటే హెచ్చు ఉత్పత్తిని చూపెడతాం. జాతీయ అవసరాలను తక్కువ వ్యయంతో తీరుస్తాం.

అధిక ఆదాయం వచ్చే మార్గాలను విడిచిపెట్టి, రైతుల జోలికి వస్తే సహించేది లేదు. ఈ వ్యవస్థ నాశనం అయితే గ్రామాల్లోని జనం అంతా బస్తీలకు ఎగబడతారు.

ధాన్యానికి గిట్టుబాటు ధర ఇవ్వాలి, నష్టాలకు బీమా, శ్రమకు విలువ, వృత్తికి గౌరవం, లాభనష్టాలు లేని ప్రజాకార్యక్రమంగా వ్యవసాయాన్ని రూపొందించడం, గ్రామ ప్రజలకు, పట్టణ ప్రజలకు మధ్య జీవన ప్రమాణంలో వ్యత్యాసం తగ్గించడం, నాగరిక ప్రపంచంలో జీవించగలిగే విధంగా రైతు జీవన స్థాయిని పెంచడం ప్రభుత్వం చేయవలసిన పనులు అని గుర్తు చేస్తున్నారు.

ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా సమిష్టి సహకార వ్యవసాయాన్ని మా మీద రుద్దితే జనాభాలో సగానికి పైగా ఉన్న రైతులు, చేతి వృత్తులవారు చైతన్యంతో ముందుకు వస్తారు, ప్రభుత్వాన్ని ఎదిరిస్తారు, కూకటి వేళ్లతో వ్యతిరేక శక్తులను కూలుస్తారు.

కృష్ణాజిల్లాతో పాటు అనేక ప్రదేశాల్లో రంగా గారు సహకార వ్యవసాయాన్ని వ్యతిరేకిస్తూ ఇదే విధమైన ఉపన్యాసాలు చేశారు. ఆనాటి వార్తాపత్రికలు రంగా గారి అభిప్రాయాలను ప్రముఖంగా ప్రచురించాయి. వెంటనే వినోభాభావే మాట మారుస్తూ తనది రైతులను వత్తిడి చేసే ఉద్యమం కాదని ప్రకటన చేశాడు. నెహ్రూగారితో పాటు పంత్ రాధాకృష్ణన్ మొదలైన వారు గ్రామదాన్ రైతులకు వ్యతిరేకం కాదంటూ రంగా గారికి లేఖలు వ్రాశారు. 1957 లో బల్గేరియాలో జరిగిన సహకార కాంగ్రెస్ కు భారతదేశపు ప్రతినిధిగా రంగా గారు హాజరయ్యారు.

రంగా గారిని మచ్చిక చేసుకోవాలనే ఆలోచన నెహ్రూ గారిలో మారలేదు. 1958 మే లో రంగా గారిని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో నెహ్రూ గారు ప్రసంగిస్తూ రంగా గారు ఇక మాకు సహాయం చేస్తారు అని అన్నారు. ఆ సాయం ఏమిటో రంగా గారికి తెలుసు. రంగా గారు తన పదవి కోసం రైతుల ప్రయోజనాన్ని పణంగా పెట్టకూడదని అనుకున్నారు. రంగా గారు సెక్రటరీగా ఉన్న కాలంలో జాతీయ, అంతర్జాతీయ విషయాలల్లో నెహ్రూ గారికి సముచితమైన సలహాలను ఇచ్చేవారు.

నెహ్రూగారు సమిష్టి సహకార వ్యవసాయం గురించి ఆలోచన విరమించలేదు. 11-1-1959 లో నాగపూర్ లో కాంగ్రెస్ సదస్సు జరిగింది.ఆ సదస్సు కో ఆపరేటివ్ విధానానికి అనుకూలంగా తీర్మానం చేసింది. దీన్ని

వ్యతిరేకిస్తూ 1959, జనవరి 19 వ తేదీన రంగా గారు తన అసమ్మతిని తెలియజేశారు. మార్చి నెలలో తన కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కార్యదర్శి పదవికి రాజీనామా చేశారు. జూన్ లో కాంగ్రెస్ పార్టీలో తన సభ్యత్వానికి కూడా రాజీనామా సమర్పించారు.

★ ★ ★ ★ ★

రంగా గారు రాజీనామా చేస్తారని నెహ్రూగారు ఊహించలేదు. మసానీ, మున్షీ మొదలైన నాయకులు రంగా గారి అభిప్రాయాన్ని బలపరచడం నెహ్రూ గారికి నచ్చలేదు. ఆయన పార్లమెంట్ లో మాట్లాడుతూ రంగా గారు చాలా పార్టీలు మార్చారు అని విషయాన్ని సమర్థించుకోలేక వ్యక్తిగత విమర్శకు పూనుకున్నారు. వెంటనే రంగా గారు పార్టీ మారినా గెలువగలననే ధైర్యం నాకుంది నా గౌరవనీయ మిత్రుడు జవహర్‌లాల్ గారికి ఆ దమ్ము, ధైర్యం లేవు అని ప్రత్యుత్తరమిచ్చారు. నెహ్రూ గారు ఆ దెబ్బకు మౌనాన్ని ఆశ్రయించారు.

తాను రాజీనామా చేసినంత మాత్రాన నెహ్రూ గారు సమిష్టి సహకార వ్యవసాయ విధానాన్ని ఉప సంహరించుకోరని రంగా గారికి తెలుసు. రైతులకు అన్యాయం జరుగకుండా చూడాలంటే ఏమి చేయాలా అని ఆయన ఆలోచిస్తున్నారు. అందుకు ప్రాతిపదికగా రంగా గారి సూచనలపై రాజాజీ బెంగుళూరులో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సర్దార్ లావసింగ్, జనరాజ్ హెగ్డే మరికొందరు ప్రముఖులు ఆ సమావేశంలో పాల్గొన్నారు. రాజాజీ సభాధ్యక్షులు. బెజవాడ రామచంద్రా రెడ్డి గారు పరిచయ వాక్యాలు పలుకుతూ కాంగ్రెస్ వారి కమ్యూనిస్ట్ ధోరణిని, నాగపూర్ తీర్మానాన్ని తీవ్రంగా విమర్శించి, రైతు రక్షణ విధానాలను విడమరిచి చెప్పారు.

రాజాజీ గారు మాట్లాడుతూ కొత్త పార్టీని జాతీయ స్థాయిలో ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందని అంటూ, ప్రభుత్వం పెత్తందారీతనాన్ని, ప్లానింగ్ కమీషన్ రాజ్యాంగేతర విధానాలను, ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలపై ప్రభుత్వం చేస్తున్న దాడులను విమర్శించారు. కొత్తగా ఏర్పాటు చేయబోయే పార్టీకి నాయకునిగా రాజాజీ ఉంటే బాగుంటుందని రంగా గారు ప్రతిపాదించారు. తాను నాయకుని నడిపించే నాయకుడిగా ఉంటానని, ఆ భారాన్ని రంగా గారే మోస్తారని రాజాజీ తెలియచేశారు.

కొత్తపార్టీకి ఏ పేరు పెట్టాలి? అని సభికులు ప్రశ్నిస్తే సాయంత్రం వివేకానంద హాలులో బహిరంగ సభ జరుగుతుంది. ఆ సభకు మసానీ గారు వస్తారు. ఆ సభలో పార్టీ పేరును నిర్ణయిద్దాము అని రంగా గారు బదులు చెప్పారు. సాయంత్రం జరిగిన సభలో రాజాజీ కొత్త పార్టీకి స్వతంత్ర పార్టీ అని నామకరణం చేశారు. ఈ సభ తరువాత రాజాజీ వ్యవసాయాన్ని, కుటుంబాన్ని రక్షించుకోవాలి అని పిలుపునిచ్చారు. ఆ నినాదమే స్వతంత్ర పార్టీకి ముఖ్య కార్యక్రమం అయింది.

కొద్ది రోజుల తరువాత రాజాజీ మద్రాసులో సభ ఏర్పాటు చేశారు. ఆ సభలో స్వతంత్ర పార్టీకి అధ్యక్షులుగా ఉండవలసిందిగా రాజాజీ కోరడంతో రంగాగారు స్వతంత్ర పార్టీ పగ్గాలు చేపట్టారు. రంగా గారు అధ్యక్షులైన విషయం అన్ని పత్రికలలో, రేడియోలలో ప్రముఖంగా వచ్చింది. రాజాజీ మీద అభిమానం కలవారు, రంగాగారి అభిప్రాయాలు నచ్చినవారు, కాంగ్రెస్ అస్తవ్యస్త విధానాలను నిరసించేవారు స్వతంత్ర పార్టీలో చేరసాగారు. స్వతంత్ర పార్టీ వ్యవసాయదారుల పార్టీ అని, స్వతంత్ర వృత్తులు చేసుకునే వారి పార్టీ అని నమ్మి చిన్ని చిన్న వ్యాపారస్తులు, రైతులు, వివిధ వృత్తుల వారు స్వతంత్ర పార్టీలో సభ్యులయ్యారు. పత్రికలు రాజాజీ, రంగాజీ ఉపన్యాసాల గురించి, స్వతంత్ర పార్టీ గురించి చక్కగా స్పందించాయి. ఇది నెహ్రూ గారి కోపానికి కారణమయింది. నెహ్రూగారు మర్యాద, మన్నన పాటించకుండా స్వతంత్ర పార్టీ మహారాజుల  పార్టీ, ఇతరుల లాభాలపై ఆధారపడేది, మార్పుకు ఇష్టపడని పార్టీ అని ఆరోపణలు చేశారు.

నెహ్రూ గారి ఆరోపణలకు సమాధానమిస్తూ రంగా గారు స్వతంత్ర పార్టీకి రంగా అధ్యక్షుడు. ఆయన ఇన్నేళ్ళుగా రైతులకోసం కష్టపడుతున్న విషయం నెహ్రూ గారు మరచిపోయారా? అని ప్రశ్నించారు.

1959 లో సబర్మతీ ఆశ్రమం వద్ద స్వతంత్ర పార్టీ లాంఛనంగా ప్రారంభం అయింది. ఆగష్టు 1 వ తేదీన అధికారికంగా రంగా గారు అధ్యక్షులయ్యారు. అప్పటి నుండి ఒక పక్క పార్టీ బలోపేతానికి దేశమంతా పర్యటిస్తూనే, మరో పక్క పార్లమెంట్ సభ్యునిగా నెహ్రూగారి ప్రజా వ్యతిరేక విధానాలను ఎదిరించసాగారు.

1962 లో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ కు దీటుగా నిలబడ టానికి రంగా గారు విశేషంగా శ్రమించారు. వివిధ రాష్ట్రాల్లో పర్యటించి స్వతంత్ర పార్టీ సిద్ధాంతాలను చెప్పడంతో పాటు నెహ్రూ రైతు వ్యతిరేక విధానాలను దుయ్యబట్టారు. 1962 లో ఎన్నికలు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ నుండే గాక గుజరాత్,

కర్ణాటక మొదలైన రాష్ట్రాలలో కూడా స్వతంత్ర పార్టీ అభ్యర్థులు పోటీ చేశారు. ఆ ఎన్నికలలో స్వతంత్రపార్టీ అభ్యర్ధిగా రంగా గారు తెనాలి నుంచి పోటీ చేశారు. కానీ పరాజయం పాలయ్యారు.

రంగా గారు పార్లమెంటులో లేకపోతే రైతాంగానికి కలిగే నష్టం తెలిసిన వారు కావడంతో అనతికాలంలో చిత్తూరుకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అతిరథ మహారథులు ప్రచారంచేసినా రంగా గారే విజయం సాధించి స్వతంత్ర పార్టీ అభ్యర్ధిగా పార్లమెంటులో అడుగుపెట్టారు.

నెహ్రూగారు మాత్రం సమిష్టి సహకార వ్యవసాయాన్ని చట్టం చేయాలనే ఆలోచనను విరమించుకోలేదు. రంగా గారు కూడా దేశవ్యాప్తంగా సమిష్టి సహకార వ్యవసాయం వలన కలిగే నష్టాలను గురించి ప్రజలకు వివరించడం కూడా విరమించుకోలేదు. అనేక చోట్ల సభలు, సమావేశాలు,నిర్వహించారు. అవసరమయితే గాంధీజీ బాటలో సహాయ నిరాకరణ, శాసనోల్లంఘనం చేయడానికి నడుం బిగించారు.

అది 1963 వ సంవత్సరం మే నెల 6 వ తేదీ. పార్లమెంట్ ప్రొసీడింగ్స్ కవరును తెరిచారు రంగా గారు. అందులో 17 వ రాజ్యాంగ సవరణ బిల్లును చూచి ఆశ్చర్యపోయారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో మహోన్నత త్యాగాలు చేసిన రైతులను కుట్రతో, మోసంతో దగా చేయడానికి నెహ్రూ గారు పూనుకోవడం రంగా గారికి బాధ కలిగించింది. నిశితంగా బిల్లును పరిశీలించి నోట్సు తయారు చేసుకున్నారు. పార్లమెంటుకు వెళ్ళారు. బిల్లును ప్రవేశపెట్టే సమయంలోనే దాన్ని ప్రతిఘటించారు. పండిట్ జీ, మీరు రైతులకు ఇంతటి అన్యాయం చేయడం భావ్యమా? పార్లమెంట్ మెంబర్ల కన్నుగప్పి, మైమరిపించి, పార్లమెంటు చివరి రోజున ఇంతటి హడావుడిగా బిల్లు ప్రవేశపెట్టాలా? ఇది మీ హుందాతనానికి తగిన పనేనా? ఇప్పటికైనా ఈ బిల్లును విరమించండి అంటూ ప్రాధేయపడ్డారు. ఆ నాటికి సభ వాయిదా పడింది.

అప్పటికి లోక్ సభలో కాంగ్రెస్ కు 2/3 వంతుల మెజారిటీ ఉంది. స్వతంత్ర పార్టీకి సుమారు 50 మంది సభ్యులు మాత్రమే ఉన్నారు. స్వల్ప సంఖ్య కలిగిన పార్టీ నాయకునిగా కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించిన సవరణను ఓడించడం అసాధ్యమని అందరూ అనుకున్నారు. పార్టీలతో నిమిత్తం లేకుండా పార్లమెంట్ సభ్యులందరినీ కలిశారు, సుదీర్ఘంగా సంభాషించారు. రైతులకు జరిగే అన్యాయం

గురించి వివరించారు. ఆ సవరణే ఆమోదింపబడితే రైతు అనేవాడు ఉండదని అందరూ కూలీలుగా మారిపోతారని తెలియజెప్పాడు. రష్యాలోని సమిష్టి వ్యవసాయ క్షేత్రాలలో రైతులు ఎలా బానిసలయ్యారో ఉదాహరణలతో నిరూపించారు. రంగా గారి అభిప్రాయాలతో పెక్కుమంది సభ్యులు ఏకీభవించారు.

17 వ రాజ్యాంగ సవరణపై లోక్ సభలో చర్చ జరిగింది. రంగా గారు దాని వలన కలిగే కష్టనష్టాలను తెలియజేశారు. అలాంటి సవరణను ఆమోదిస్తే అది కాలసర్పమై రైతులను కాటువేస్తుందని హితవు చెప్పారు. ఓటింగ్ జరుగబోతుండగా వాయిస్ ఓటుతో కాక డివిజన్ తో ఓట్లు లెక్కించాలని (ప్రతి సభ్యుని తల లెక్కించే పద్ధతి) రంగా గారు పట్టుబట్టారు. ఢిల్లీలో ఉండి కూడా సభ్యులు చాలా మంది ఆ రోజు పార్లమెంటుకు రాకపోవడం, సభకు హాజరయిన సభ్యులలో కూడా కొందరు ఓటింగ్ సమయానికి బయటకు వెళ్ళడంతో సభలో తక్కువమంది సభ్యులే మిగిలారు. ఓట్లను లెక్కిస్తే సవరణ వీగిపోయింది. నెహ్రూ గారి ముఖంలో రంగులు మారాయి. ఆయనకు నోటమాట రాలేదు. రెండొంతుల మెజారిటీ తన పార్టీకి ఉండి కూడా బిల్లును గెలిపించుకోలేక పోయాననే బాధ ఆయనలో కోపాన్ని రగిలించింది. ఆయన ఆ కోపంతో పార్లమెంటు భవనంలోని తన కార్యాలయానికి వెళ్లారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సెక్రటరీని, పార్టీ విప్ లను హుటాహుటిన పిలిపించారు. లోపల ఆయన ఏమని ప్రశ్నించారో, వారేమి సమాధానం చెప్పారో, ఆయన ఏమని ఆదేశించారో తెలియదు. కాని మరునాడు తొమ్మిది గంటలకు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేయబడింది.

సమావేశానికి వచ్చిన నెహ్రూ ముఖంలో ఇంకా కోపం తాండవిస్తూనే ఉంది. ఆయన తన ఆసనంలో కూర్చోలేదు. ఎప్పటిలాగా ఫ్రెండ్స్ అని సంబోధించలేదు. గద్గద స్వరంతో పార్టీకి నాయకుడెవరు? నేనా ? రంగాజీనా? అని ప్రశ్నించారు. ఎవ్వరూ మాట్లడలేదు. మళ్లీ మళ్లీ ఉచ్ఛస్వరంతో రెట్టించి అడిగాడు. సభ్యులు భయపడిపోయారు. "మీరే, మీరే" మా నాయకులు తేరుకున్న తరువాత సభ్యులు సమాధానమిచ్చారు. అయితే నా సభలో సవరణ ఎందుకు వీగిపోయింది? అని గద్దించి అడిగారు నెహ్రూ గారు. సభ్యులు మౌనాన్ని ఆశ్రయించారు. మళ్ళీ మరొకసారి నియమావళి ననుసరించి రాజ్యాంగ సవరణ ప్రవేశపెట్టాలని చివరికి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ తీర్మానం చేసింది.

ఆ తరువాత నెహ్రూగారికి కష్టాలు ఆరంభమయ్యాయి. ఆయన ప్రతిపాదించిన పంచశీల సూత్రాలు పటాపంచలయ్యాయి. భారతదేశంపై చైనా దండెత్తి కొంత భూభాగాన్ని ఆక్రమించుకొంది. పార్టీ పై పట్టు సడలింది. ఒకప్పుడు మకుటం లేని మహారాజుగా అధికారం చెలాయించిన నెహ్రూ పై విమర్శల దాడి పెరిగింది. నెహ్రూ విధానాలు ప్రగతి సూచికలు కాదని ప్రపంచం కోడై కూసింది. పూలమ్మిన చోటనే కట్టెలమ్ముకోవలసి రావడాన్ని నెహ్రూ తట్టులేక పోయారు, క్రమ క్రమంగా ఆరోగ్యం క్షీణించింది.

1964 సంవత్సరం మొదట్లో నెహ్రూ కోరిక నెరవేర్చడానికి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ 17 వ రాజ్యాంగ సవరణను ఆమోదించింది. కమ్యూనిస్టులు మినహా మిగిలిన సభ్యులెవ్వరూ దానికి అనుగుణంగా స్పందించలేదు. ఇది జరిగిన కొద్ది కాలానికే ఒరిస్సా పర్యటనకు వెళ్ళిన నెహ్రూ గారు అనారోగ్యానికి గురయ్యారు. ఢిల్లీకి తిరిగి వచ్చి కొద్ది రోజుల్లోనే అంటే 1964 మే 27 వ తేదీన కన్నుమూశారు.



నెహ్రూకి వారసునిగా లాల్‌బహదూర్ శాస్త్రి ప్రధాని అయ్యారు. ఆయన 17 వ రాజ్యాంగ సవరణను పట్టించుకోలేదు. ఆయన ప్రధానిగా ఉన్నప్పుడే పాకిస్థాన్ భారతదేశంపై యుద్ధం ప్రకటించింది. లాల్ బహదూర్ యుద్ధ సమయంలో దేశమంతా సమైక్యంగా ఉండాలంటూ ప్రజలకు ప్రభోధించారు. జనమంతా కుల, మత, జాతి, వర్గాలకు అతీతంగా దేశం కోసం ప్రాణాలు ఇవ్వడానికి సిద్ధపడ్డారు. దేశమంతా లాల్ బహదూర్ వెనుక నిలిచింది. పాకిస్థాన్ యుద్ధంలో పరాజయం పాలయింది. దేశమంతా విజయోత్సవాలు జరిగాయి. ఢిల్లీలో జరిగిన ఒక విజయోత్సవ సభలో ప్రసంగిస్తూ లాల్ బహదూర్ 'జై జవాన్–జై కిసాన్' అనే నినాదాన్ని ఇచ్చాడు. దేశం సుఖంగా, సుభిక్షంగా ఉండాలంటే జవానులు, కిసానులు ఆనందంగా ఉండాలని వారు భావించారు. రైతుల పట్ల, వ్యవసాయం పట్ల అపారమైన సానుభూతి కలిగినవారు కావడంతో ఆయన 17 వ రాజ్యాంగ సవరణను గురించి కిమ్మన లేదు. అంతే, అది చెత్తబుట్ట పాలయింది. కానీ దురదృష్టవశాత్తు ఏడాది తిరగకముందే తాష్కెంట్ వెళ్లిన లాల్ బహదూర్ అక్కడే 11.1.1966న పరమపదించారు.

1967 లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో రంగా గారు స్వతంత్ర పార్టీ అభ్యర్థిగా చిత్తూరు నుండి పోటీ చేశారు. కానీ పరాజయం పాలయ్యారు. వారిని పార్లమెంటుకు పంపాలనే ఉద్దేశంతో శ్రీకాకుళంలో విజయం సాధించిన సర్దార్ గౌతులచ్చన్న తన లోక్ సభా సభ్యత్వానికి రాజీనామా చేశారు. వెంటనే జరిగిన ఉప ఎన్నికల్లో శ్రీకాకుళం నియోజక వర్గం నుండి రంగా గారు విజయం సాధించారు. ఆ ఎన్నికలలో స్వతంత్ర పార్టీ ప్రతిపక్షంలో నిలిచే అతి పెద్ద పార్టీగా అవతరించింది. రంగా గారు అతి పెద్ద ప్రతిపక్షానికి నాయకునిగా వ్యవహరించారు. 1966 లోనే ప్రధానమంత్రిగా ఎంపికైన ఇందిరాగాంధీ 1967 లో జరిగిన ఎన్నికలలో విజయదుందుభి మ్రోగించింది. ఆమె తన పదవీ కాలంలో ఒక్కసారిగూడా 17 వ రాజ్యాంగ సవరణ చట్టం గురించి ఆలోచించలేదు. చట్టం శాశ్వతంగా సమాధి అయింది. ఆ కారణం చేతనే రంగా గారు ఇందిరాగాంధీ పట్ల అభిమానం పెంచుకున్నారు. స్వతంత్ర పార్టీకి కొంతమంది తన అనుయాయులు దూరం కావటం పదవీ వ్యామోహంతో పార్టీలు మారటం, కొంతమంది ధనికులకు, వ్యాపారులకు అనుకూలంగా వ్యవహరించడం ఆయనకు భాధ కలిగించాయి. 1971 లో జరిగిన మధ్యంతర సార్వత్రిక ఎన్నికలలో శ్రీకాకుళం నియోజక వర్గం నుండి స్వతంత్ర పార్టీ అభ్యర్థిగా నిలబడి ఓటమి పాలయిన రంగా గారు ఆ తరువాత కాంగ్రెస్ పార్టీ లోకి మారి ఇందిరాగాంధీ నాయకత్వాన్ని ఆమోదించారు.

1977 నుండి1979 వరకు రాజ్యసభ సభ్యునిగా వ్యవహరించిన రంగా 1980,1984,1989 సంవత్సరాలలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గుంటూరు నియోజక వర్గం నుండి ఎన్నుకోబడ్డారు. 1991 లో గుంటూరు నుండి ఓటమి పాలయ్యారు.

రైతులు ఏ దేశంలో ఉన్నా ఎలా సంతోషంగా ఉండాలని రంగా గారు ఆశించారో, తన సిద్ధాంతాలను పాటించే తన శిష్యులు తెలుగుదేశంలో ఉన్నా, మరో పార్టీలో ఉన్నా ఉన్నతిని సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

పార్లమెంట్ సభ్యునిగా కొనసాగుతూనే కామన్వెల్త్ పార్లమెంటరీ మహాసభకు 1969 లో భారత ప్రతినిధి గాను, అదే సంవత్సరం గాంధీ శతజయంతి ఉత్సవాల ప్రతినిధిగా సూడాన్, ఈజిప్టు, ఫ్రాన్స్, యు.కె. దేశాల్లో పర్యటించారు. 1983 లో మిత్రరాజ్య సమితి అసెంబ్లీకి భారత ప్రతినిధివర్గ

ఉపనాయకునిగా వెళ్ళివచ్చారు. 1983 లో ఢిల్లీలో జరిగిన అలీనరాజ్యాల సభలో భారత ప్రతినిధివర్గ సభ్యులుగా పాల్గొన్నారు. 1983 లోనే ఇండియా–శ్రీలంక ఒడంబడికపై సంతకాలు చేయడానికి ప్రాతినిధ్యం వహించారు. అదే సంవత్సరం ఆఫ్ఘనిస్థాన్ వెళ్లి ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ అంత్యక్రియలలో భారత ప్రతినిధిగా పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ రంగా గారిని మిక్కిలిగా గౌరవించింది. పార్లమెంటరీ పార్టీ ఉపనాయకునిగా ఉండటానికి అవకాశం కలిగించింది. ఆయన 1980 నుండి 1990 వరకు ఆ పదవిలో కొనసాగారు.

ప్రతి జాతికి సమస్యలు ఉంటాయి, సమస్యలు పరిష్కరించడానికి మహాత్ములు ఉదయిస్తూనే ఉంటారు. భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించడానికి గాంధీ పుట్టినట్లు, దక్షిణాఫ్రికాలోని నల్ల జాతీయులకోసం నెల్సన్ మండేలా ప్రభవించినట్లు భారతదేశంలోని రైతుల సమస్యలపై పోరాటం చేయడానికి రంగా ఉద్భవించారు. జీవితమంతా రైతు పోరాటాలతో అలసిన ఆచార్యులు 95 సంవత్సరాలు పరిపూర్ణ జీవితం గడిపి 1995 జూన్ 8 వ తేదీన పరమపదించారు.

స్వర్గలోకం అంటూ ఉంటే, అక్కడ వ్యవసాయం చేసే రైతులు ఉంటే ఆ రైతులకు అన్యాయం జరుగుతూ ఉంటే రంగాగారు అక్కడ కూడా పోరాటం చేస్తూనే ఉంటారు. ఆయన జన్మ ధన్యం. ఆయనకు జన్మనిచ్చిన ఆంధ్రదేశం ధన్యం.



## రచయిత పరిచయం



## డా॥ జెక్కంపూడి సీతారామారావు

తల్లిదండ్రులు : నాగరత్నమ్మ, వెంకట సుబ్బయ్య

అర్ధాంగి : అన్నపూర్ణ

సంతానం : డా॥ జ్యోత్స్న, డా॥ శ్రీనివాస్,
డా॥ సత్యనారాయణ, డా॥ సౌజన్య

స్వగ్రామం : పసుమర్రు, చిలకలూరిపేట మండలం, గుంటూరు జిల్లా

విద్యాభ్యాసం : ఆర్.వి.యస్. సి.వి.యస్. ఉన్నత పాఠశాల, చిలకలూరిపేట,
హిందూ కళాశాల, గుంటూరు,
రంగరాయ వైద్య కళాశాల, కాకినాడ,
జాగర్లమూడి చంద్రమౌళి (న్యాయ) కళాశాల, గుంటూరు,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

సంగీత, సాహిత్య ప్రియులు, భాషాభిమాని, ఆచార్య రంగా గారి అభిమాని, ఆరాధకులు. వైద్య వృత్తిలో రజతోత్సవం జరుపుకొన్న పిదప వీడ్కోలు పలికి న్యాయరంగంలోకి ప్రవేశించి, స్నాతకోత్తర పట్టభద్రులై న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు.

రచనలు : కాకతీయ నాయకులు
కర్షకవేదం (CREED of World Peasantry)
స్వాతంత్ర్యం కోసం (Fight for Freedom)
(ఆచార్య రంగా గారి జీవిత చరిత్ర)

ప్రచురణలు : రైతు బంధు రంగా – జాస్తి వెంకట నరసయ్య,
ధూళిపాళ్ళ వేంకట సుబ్రహ్మణ్యం రచన.

## ఆచార్య రంగా
## గొర్రెపాటి వెంకట సుబ్బయ్య గారి రచన (1948) ఆధునీకరణ


యడ్లపాటి వెంకట్రావు


బి.వి. శివయ్య


డా॥ యలమంచిలి శివాజీ


కొణిజేటి రోశయ్య


సర్దార్ గౌతు లచ్చన్న


డా॥ మర్రి చెన్నారెడ్డి


ప్రగడ కోటయ్య


నందిపాటి వీరాచారి


నరిశెట్టి విజయరాజకుమార్


మన్నె చిననాగయ్య


కందుల ఓబులరెడ్డి


వడ్డే శోభనాద్రీశ్వరరావు




నెల్లూరి వెంకట
రామానాయుడు



కందిమళ్ళ బుచ్చయ్య



సుంకర సత్యనారాయణ



పి. రాజగోపాలనాయుడు



కొమ్మారెడ్డి
సత్యనారాయణమూర్తి



డా॥ బండ్లమూడి
సుబ్బారావు




ఘంటసాలలో బౌద్ధ విజ్ఞాన ప్రదర్శనశాలను నెలకొల్పిన కీ॥శే॥ వెంకట సుబ్బయ్య గారి
విగ్రహం డా॥ జెక్కంపూడి, డా॥ వెనిశెట్టి సింగారావు (21-10-2017)

## రాష్ట్ర రుణ విమోచన సభ – గన్నవరం



**ఎడమ నుంచి కుడికి :** **ముందు వరుస :** 1. నెల్లూరు వెంకట్రామానాయుడు (జమీన్ రైతు) 2. గద్దె రంగయ్య నాయుడు (సెంట్రల్ అసెంబ్లీ మెంబరు), 3. గొట్టిపాటి బ్రహ్మయ్య (రాష్ట్ర కాంగ్రెసు కార్యదర్శి), 4. ఆర్. గంగరాజు (ఎం.ఎల్.ఏ., తూర్పు గోదావరి), 5. బద్దెపూడి వెంకట నారాయణ రెడ్డి (కాళహస్తి శాసనసభ్యుడు), 6. ఎన్.జి. రంగా (అఖిలభారత కిసాన్ సభ ప్రెసిడెంటు), 7. ముక్కామల నాగభూషణం (రాష్ట్ర రైతు సంఘ సహాయ కార్యదర్శి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి, 8. కొమ్మారెడ్డి సత్యనారాయణ మూర్తి, 9. అన్నే అంజయ్య, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి, 10. కాట్రగడ్డ వెంకటనారాయణరావు.

**వెనుక వరుస :** 11. పేట బాపయ్య (జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు), 12. పెండ్యాల వెంకటేశ్వరరావు (గన్నవరం తాలూకా కాంగ్రెస్ కార్యదర్శి), 13. వెలివల సీతారామయ్య (రైతు నాయకుడు)



‘జమీన్‌రైతు’ పత్రిక రజతోత్సవ సందర్భంలో (1954)

కూర్చున్నవారు : కటికనేటి కళ్యాణరావు, రంగాజీ, నెల్లూరి వెంకట్రామానాయుడు,.

నిల్చున్నవారు : వెంకటరెడ్డి, మహానంద, రామమూర్తి, లచ్చన్న, నాగినేని వెంకయ్య, వెంకట సుబ్బానాయుడు



గొర్రెపాటి వెంకట సుబ్బయ్య